ఏప్రిల్ 2013 వెల: ₹20

తెలుగు వెలుగు

విజయనామ
సంవత్సర శుభాకాంక్షలతో...

ADMISSIONS OPEN - 2013

COURSES OFFERED

UG Programmes

- Electronics & Communication Engg.
- Electronics & Computer Engineering
- Electrical & Electronics Engineering
- Computer Science & Engineering
- Mechanical Engineering
- Civil Engineering
- Information Technology
- Mechatronics
- Agricultural Engineering
- Automobile Engineering
- Biotechnology*
- Chemical Engineering
- Textile Technology

* Bi.PC Candidates are also eligible for admission into Biotechnology Programme.

BBM + MBA

5 Year INTEGRATED COURSE

Eligibility: Intermediate with **MEC, CEC, MPC** or **Bi.PC** group with minimum **60%** aggregate

PG Programmes

School of Electronics
- Embedded Systems
- VLSI
- Communication & Signal Processing
- Digital Electronics & Communication Systems
- Data Communication & Networking

School of Electrical
- Power Electronics & Drives
- Power Systems

School of Chemical
- Chemical Engineering
- Food Processing Technology
- Petroleum Engineering

School of Computing
- Computer Science & Engg.
- Information Technology

School of Mechanical
- Machine Design
- CAD/CAM/CAE
- Thermal Engineering

School of Biotechnology
- Biotechnology & Bioprocess Engineering

School of Management MBA | **School of Computing** MCA | **Ph.D Programmes**

INNOVATIVE PROGRAMMES: **B.Tech + Civil Services | BBM + Civil Services**

B.Tech Admission Test: V-SAT 2013 - Online Test

SCHOLARSHIPS+

- **Full Fee Waiver for** Top 100 Rankers of V-SAT '13
- **50% Fee Waiver for** 101-300 Rankers of V-SAT '13
- **25% Fee Waiver for** 301-500 Rankers of V-SAT '13

\+ Applicable for 1st year only

The scholarships are also available for top rankers of EAMCET & JEE (MAINS)-2013

How to Apply

- Applications are available at selected branches of Post Offices & Branches of all Vignan Institutions in A.P.
- Download the application from the university website www.vignanuniversity.org
- By sending a DD for Rs. 800/- along with self addressed and stamped envelope.
- DD should be drawn in favour of Vignan University, payable at Guntur on any scheduled bank and sent to:Director Admissions, Vignan University, Vadlamudi, Guntur Dist.-522 213. A.P.

WHY VIGNAN

Well Qualified Faculty: With M.Tech & Ph.D qualification backed by research experience from IITs, NITs and other Premier Institutions

Focus and Flexibility: Our courses have been designed with the flexibility to meet the ever - changing demands of industry

Internships: Semester long internships with public sector as well as private sector companies

Industrial Research & Training Centre: Established in collaboration with AAS Technologies and IBM centre of excellence for training & project work.

Campus Recruitment Training: A 200 hours comprehensive campus recruitment training by qualified trainers and a 150 hours domain training in association with reputed finishing schools.

Campus Placements: Close Industry-institutions associations ensure upto 90% placement opportunities in all engineering streams. The highly professional placements department has network with a number of fortune 500 companies.

Faculty Mentors: Senior Professors from IITs / NITs as faculty mentors for each department to promote best practices in teaching / research.

Important Dates

Last date for receipt of applications **05-4-2013**

V-SAT'13 On-line Test Dates: **14-4-2013** to **20-4-2013**

For details of **V-SAT 2013** test centres / availability of applications and other information visit our website: **www.vignanuniversity.org**

Contact +91 863 2118 487/88 +91 866 6593777/888

INFORMATION CENTRES

VIJAYAWADA: 40-5-5, Opp: Hotel D.V.Manor, Behind Hotel Adhikari, Bundar Road Ph: 0866 - 6593777/6593888/6593111 Cell: 9949983666

GUNTUR : 4/7, Brodipet, Near Sindhoori Hotel Ph: 9701051280

HYDERABAD: 503, Babu Khan Estate, Basheerbagh Ph: 040-66756708

VIZAG: Vignan High School, Siripuram Junction, Opp:Andhra University, Ph: 9912333673

VIGNAN UNIVERSITY
Foundation for Science, Technology & Research
(Estd u/s 3 of UGC Act of 1956)
VADLAMUDI, GUNTUR (Dt.)

FMC/VNU/402

Lalitha
చెన్నై • మదురై • తిరుచ్చి
తయారీ ధరలో
బంగారు నగలు.
155 grams
మా తరుగు 7% - రూ. 480136
ఇతరులు 14% తరుగు - రూ. 511547
ఆదా రూ. 31411/-
తరుగు 0% నుండి 7% వరకే
మజూరీ లేదు.
కొన్ని ప్రత్యేక నగలకు మాత్రం తరుగు 8 & 9%.
ప్రదర్శనలో వేలాది డిజైన్లు.
100% BIS 916
హాల్‌మార్క్ బంగారం
102 grams
మా తరుగు 7% - రూ. 315960
ఇతరులు 14% తరుగు - రూ. 336631
ఆదా రూ. 20670/-
79 grams
మా తరుగు 7% - రూ. 244714
ఇతరులు 14% తరుగు - రూ. 260724
ఆదా రూ. 16009/-
88 grams
మా తరుగు 7% - రూ. 272593
ఇతరులు 14% తరుగు - రూ. 290426
ఆదా రూ. 17833/-
మా తరుగుతో మార్కెట్ తరుగును పోల్చి చూసుకుని ఈ ఆభరణాల ద్వారా చేసే పొదుపును తనిఖీ చేసుకోవచ్చు.
లలితా జ్యువెలరీ మార్ట్ ప్రై. లిమిటెడ్ 123, ఉస్మాన్ రోడ్, పనగల్ పార్క్, టి.నగర్, చెన్నై - 17. ఫోన్: 044-2814 1155 / 77 / 88.
180-182, సౌత్ మాసి స్ట్రీట్, మదురై-01. 0452-2330 222 / 444 / 555
www.lalithajewellery.net
బ్లాక్-5, చత్తిరం బస్ స్టాండ్, సెయింట్ జోసఫ్స్ కాలేజ్ కాంపౌండ్, బిగ్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, తిరుచ్చి-02. ఫోన్: 0431-2706555
వ్యాలెట్ కార్ పార్కింగ్

అక్షర లక్షలు...

తాతలనాటి సాహిత్యంలో రేపటి విజ్ఞానం — 10
- బి. సుబ్బరత్నం

కదనంలో రుద్రమ... కవనంలో సత్యభామ — 24
- డా॥ జె. కనకదుర్గ

సంస్కారమే సంప్రదాయం — 26
- డా॥ భానుమతి

అమీనా మస్తకం లోంచి న్యాయపుస్తకం — 30
- పి. మృత్యుంజయకుమార్

చెరిగిపోతున్న చరిత... చెదిరిపోతున్న ఘనత — 32
- ఈమని శివనాగిరెడ్డి

ఉగాది ప్రత్యేకం

ఉగాది ఊసులు — 14
- కొలనుపాక మురళీధరరావు

ఉగాది 'విజయ'ం — 58
- డా॥ అనంతలక్ష్మి

జాతికి వరం మన వైద్యం — 42
- డా॥ బి.వి.ఎ. రామారావు నాయుడు

తమిళమే... తమిళమొక్కటే! — 46
- మహ్మద్ ఆర్. హెచ్. షరీఫ్

ముఖాముఖి

ఆదమరిస్తే అమ్మభాష కనుమరుగే — 16
- తొలి తరం భాషావేత్త పేరి భాస్కరరావు హెచ్చరిక

తెలుగు వాడి జీవనాడి... కూచిపూడి!!! — 50
- నాగరాజు. వై

ఓ కథ చెబుతానర్రా వింటారా! — 64
- కల్లూరు రాఘవేంద్రరావు

మధుర మధురంబైన మాతృభాష — 68
- డా॥ ఎస్వీ సత్యనారాయణ

లెక్కల తల్లీ! లీలావతి!! — 76
- డా॥ ప్రఖ్య సత్యనారాయణశర్మ

వాడే వీడూ నాడూ నేడూ! — 84
- దేవరాజు రవి

తెలుగులో తెలుగుదనం — 94
- భట్టారం రవీంద్రబాబు

మంచి పుస్తకం

నేల నలుచెరగులా తెలుగు గుబాళింపే! — 62
- వాసిరెడ్డి నవీన్

బహుమతి పొందిన ప్రేమలేఖలు

ఏ విత్తు వేస్తే — 35

నీ జ్ఞాపకాలే లేకపోతే... — 79

కథలు

ఈ నెల కథా పారిజాతం
దుర్భర దారిద్ర్యం మాటున తప్పని సరి కోరికల ఆర్భాటాన్ని, ఆరాటాల్ని అత్యంత శక్తిమంతంగా చిత్రించిన 'శారద' కథ 'హరిశ్చంద్రుడు' — 72

కీర్తి చిత్రం — 08
- డా॥ బాలాంత్రపు శ్యామలరావు

ఈ తప్పు నాది కాదు — 20
- బి. వెంకటేశ్వర్లు

కబేళా — 38
- సింహప్రసాద్

చిన్న చెట్టుకు చిన్న గాలి — 54
- ఆనందసాయి

కొరగాని కొడుకు — 70
- పి. వి. సుజాతారాయుడు

తనదాకా వస్తేగానీ — 90
- కె. ఎల్. సూర్య

కవితలు

- గైరమ్మ లాలి పాట - 36
- అమ్మ భాష - 44
- నీ మధురస్మృతులు - 57
- శాంతి - 67
- విజయ ఉగాది - 69
- మళ్లీ ఒక దీపం - 71
- దాక్కుని ఉంటాయి - 93

ప్రత్యేక శీర్షికలు

డైట్‌సెట్‌కి దారులివిగో... — 80
- మనస్విని

'ఉపాధ్యాయ' ఉద్యోగ ప్రాప్తిరస్తు — 82
- మనూష

మరిన్ని ప్రత్యేకాలు

అష్టనాగబంధం — 45

మాటకట్టు — 75

రామోజీ ఫౌండేషన్

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1 , సంచిక : 8

ఏప్రిల్ 2013

పుటలు : 100, **వెల :** రూ. 20

ముఖచిత్రం :
బాలు, సీనియర్ ఆర్టిస్ట్, ఈనాడు.

పత్రాలంకరణ : రవిశంకర్

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగువెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999
మొబైల్: +91 800 800 1656
ఫ్యాక్సు: +91 8415 305 018

ఈమెయిల్:
teluguvelugu@ramojifoundation.org

పత్రికపై కాపీరైట్ హక్కులు రామోజీ ఫౌండేషన్‌వి. ఈ పత్రికలోని భాగాలను, పత్రికను అనుమతి లేకుండా అంతర్జాలంలో పెట్టడం లేదా మరో చోట ప్రచురించడం కానీ చట్ట వ్యతిరేకం.

Telugu Velugu
Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.
RNI No: APTEL/2012/45352

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగువెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

ప్రజల వద్దకు పాలన!

ప్రతి ఇంటా బిడ్డలు తమ తల్లిని నోరారా 'అమ్మా' అని తేటతెలుగులోనే పిలవాలని సభలు పెట్టి తీర్మానాలు చేస్తే సరిపోతుందా? మమ్మీ డాడీ సంస్కృతి చిలవలు పలవలు వేసుకుపోవడానికి తెలుగువారి ఆంగ్ల భాషానురక్తే కారణమన్న దుర్భ్రమతో ఇప్పటికీ రాష్ట్రసర్కారు స్వీయ బాధ్యతల్ని విస్మరిస్తోందా? ఈ ఏడాదిని తెలుగు భాషా సంస్కృతుల సంవత్సరంగా తిరుపతి మహాసభల్లో రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. అందులో మూడు నెలల పుణ్యకాలం ముగిసిపోయాక భాషాభిమానుల మెదళ్లను తొలిచేస్తున్న కీలక ప్రశ్నలివి.

దేశంలో మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రం తెలుగునాడే. అవిరామ పోరాటంతో ఢిల్లీ కామందుల మెడలు వంచి లక్ష్యం సాధించడమే కాదు, తక్కిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాతగా నిలిచిందీ తెలుగువాడే. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా ఫిబ్రవరి 21న మాతృభాషా దినోత్సవం నిర్వహణకు బంగ్లాదేశ్ విముక్తి పోరాటం ప్రేరకమైంది. భాష అనే బొడ్డు పేగుబంధంతో స్వాభిమాన గళమెత్తిన ఓ జాతి చైతన్యానికి బంగ్లాదేశ్ కంటే పదిహేనేళ్ల ముందే ఈ తెలుగు గడ్డ ఊపిరులూదింది. అలాంటి పోతుగడ్డమీద తెలుగు ఉనికీ మనికీ ప్రశ్నార్థకమయ్యేలా అధికారభాషా ద్రోహానికి ఒడిగట్టింది ప్రభుత్వమే. తెలుగుతల్లికి జేజేలు, తెలుగు వెల్లువకు జోహార్లు అంటూ తిరుపతి సభలో హోరెత్తించిన పెద్దలు- గ్రామస్థాయి నుంచి సచివాలయం దాకా అన్ని ప్రభుత్వశాఖల్లో అధికార భాషగా తెలుగును కచ్చితంగా అమలు చేసేలా ప్రత్యేక కార్యాచరణ ఊసెత్తితే ఒట్టు. 'భాషను బతికిస్తే మనకది బతుకునిస్తుంది' అన్న స్పృహతో అక్కడక్కడా చీకట్లను చీల్చుకుని ప్రభవిస్తున్నాయి భాషోద్యమ రవికిరణాలు!

ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తెలుగులోనే ఆధికారిక కార్యకలాపాలు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆ మధ్య నిర్ణయించారు. ప్రభుత్వ విభాగాల మధ్యే కాదు; ప్రజలతో నిత్య వ్యవహారాలు నెరపేటప్పుడూ తెలుగునే వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలనీ సంకల్పించారు. ఆ సద్భావనను సాకారంచేసి ఆదర్శంగా నిలుస్తోంది నల్లగొండ జిల్లా పాలన యంత్రాంగం. 'రౌతుకొద్దీ గుర్రం' అన్న సామెతను రుజువు చేస్తూ- జిల్లా కలెక్టరు ముక్తేశ్వరరావు చూపిన చొరవ ఫలించి జిల్లాలో పాలన వ్యవహారాలు దాదాపు 95శాతం తెలుగుబాట పట్టాయంటున్నారు. పాలనపరమైన అవాంతరాలను అధిగమిస్తూ నల్లగొండ సాధించిన విజయం తక్కిన జిల్లాలన్నింటికీ స్ఫూర్తిమంతం. 'ప్రజల వద్దకు పాలన' అంటే, ప్రజల భాషలో పాలన వ్యవహారాలు సాగించడమన్నదే అర్థం!

పరిపాలన, న్యాయవ్యవస్థ, విద్యారంగం- ఈ మూడింటా తెలుగు వెలుగులీనితే అధికారభాషగా దాని అస్తిత్వానికి ఢోకా ఉండదు. పరిపాలన రంగంలో తెలుగు వినియోగం ఆయా అధికారుల అభిరుచి, చొరవలకు పరిమితమవుతుంటే, అందుకు భిన్నంగా న్యాయవ్యవస్థ స్వయం దిద్దుబాటుకు సంకల్పించడాన్ని హర్షాతిరేకాలతో స్వాగతించాలి! 'కోర్టుల్లోనే ఏదైనా బహిరంగంగా జరుగుతుంది... అయినా పోలీసులను, నల్లకోట్లను చూసి జనం పారిపోయే పరిస్థితి ఉంది... ఆ దుస్థితి పోవాలంటే, న్యాయస్థానాల్లో వ్యవహారాలన్నీ మాతృభాషలోనే జరగాలి'- ఇదీ రాష్ట్ర న్యాయవిద్యా పరిషత్తు అధ్యక్షులు జస్టిస్ ఎన్‌వీ రమణ వ్యక్తీకరించిన నిశ్చితాభిప్రాయం. ఆంగ్లేయుల పాలనలోనూ న్యాయస్థానాల్లో వాద ప్రతివాదాలు తెలుగులోనే సాగి తీర్పులూ తెలుగులోనే వెలువడేవంటే- ఇప్పటి ధోరణి, భాషాప్రయుక్త భావనకే అవమానం. తెల్లవారి పాలనవల్ల మాతృభాష నిర్లక్ష్యానికి గురైందనడం సరికాదన్న న్యాయమూర్తి వ్యాఖ్యలు, పురిటిగడ్డపై తెలుగు పరాయీకరణ నల్లదొరల పుణ్యమేనంటున్నాయి. గతం తవ్వుకొని లాభం లేదు- తెలుగు భాషకు సమున్నత భవితకోసం కార్యాచరణ వ్యూహాలే కావాలిప్పుడు!

పదోతరగతి, ఇంటర్మీడియెట్ స్థాయిల్లో ఆంగ్లం, తెలుగుభాషలతో విద్యార్థుల కుస్తీపట్లు చూస్తే కడుపు తరుక్కుపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 6500 పాఠశాలల్లో 'సక్సెస్' పేరిట ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. తెలుగుమాధ్యమ ఉపాధ్యాయులే ఈ విద్యార్థులకూ బోధించడంతో దాదాపు 75వేలమంది 'బట్టీ' విక్రమార్కులై బేజారెత్తిపోయారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో తెలుగును ఈదలేక 2010లో 49శాతం పల్టీకొడితే, 2011లో 47శాతం, నిరుడు 46శాతం మొహం వేలాడేశారు. సంస్కృతాన్ని ఎంచుకొని ఉంటే తమకీ గతి పట్టేది కాదంటున్న విద్యార్థుల రుసరుసలు వింటే- ప్రస్తుత అవ్యవస్థ వారినెంతగా పీడిస్తున్నదో అర్థమవుతోంది. ఈ అరాచకానికి భరతవాక్యం పలకాలి.

అమ్మ ఒడిలో, చదువుకునే బడిలో, కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లో, రోజువారీ వ్యవహారాల్లో తెలుగుదనం పరిమళిస్తే- చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. అన్నాదురై చెప్పినట్లు- మాతృభాష కళ్లు అయితే, పరాయిభాష కళ్లజోడు. స్థిర సంకల్పంతో ముందడుగెయ్యాలే గాని తెలుగువాడికి ఎదురులేదు!

రామోజీరావు

తెలుగులో ఉత్తరాలు

కాలప్రవాహంలో కనుమరుగైన ఉత్తరాలను తిరిగి తెచ్చుకోవాలి. లేఖల రచనల ద్వారా భాషపై పట్టు, భావ ప్రకటనలో స్పష్టత అలవడతాయి.

– శాంతమూర్తి, హైదరాబాద్

భయం పోగొట్టింది

పరభాషల ముట్టడిలో తెలుగు వెలుగులు మసకబారిపోతున్నాయన్న భయం ఉండేది. 'తెలుగు వెలుగు' రాకతో ఆ భయం దూరమైంది. తెలుగు కోసం కృషి చేస్తున్న వారందరికీ అభినందనలు.

– తిరునగరి సురేశేఖర్, ఆదిలాబాద్

ఏది ప్రాధాన్యత?

అధికారులు, పాలకులు తెలుగుకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. చదువుకున్న వారికి కూడా తెలుగు రాయటం, చదవడం రావట్లేదు. అమ్మభాష మాట్లాడటం నామోషి అనుకునేవారు పెరుగుతున్నారు. ఈ పరిస్థితిల్లో 'తెలుగు వెలుగు'. తెలుగు గొప్పదనాన్ని తెలియజేస్తోంది.

– కోలాహలం మోహనరాజు, మిర్యాలగూడ

నాటకాలకూ స్థానం

నాటక రంగంలోని ప్రముఖ నటీనటులు, సమాజాలు, ప్రయోక్తలు, దర్శకులు, రచయితల గురించి పత్రికలో ఇవ్వాలి. ప్రతి సంచికలోనూ తెలుగు 'నాటకరంగం' శీర్షికతో వ్యాసాలు ఇవ్వాలి.

– ఇనుముల వెంకటేశ్వరరావు, పాలకొల్లు

ప్రేమికులకు వరం

అన్నీ వయసుల వారి ప్రేమలేఖలనూ ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ లేఖల పోటీ ప్రేమికులకు ఒక వరం. యువతరానికి సంబంధించిన ఆసక్తికరమైన అంశాలను ప్రచురించాలి.

– మక్కెర రమేష్‌చంద్ర, వరంగల్

శీర్షికలపై నిర్ణయం

తెలుగు వెలుగు ప్రతి సంచికలోనూ శీర్షికలు మారుతున్నాయి. వీటిపై నిర్ణయం తీసుకోవాలి. అయితే, మొత్తంగా చూస్తే సాహిత్య, సంప్రదాయ పత్రికగా వెలువడుతూ అలరిస్తోంది.

– బి.ధనవర్మరాజు, విశాఖపట్నం

కొత్తవి కావాలి

రాను రానూ పత్రిక మెరుగులు దిద్దుకుంటోంది. పది మంది చదివి, పదిలంగా దాచుకునే రీతిలో వెలువడుతోంది. ఎప్పటికప్పుడు కొత్త అంశాలను ప్రచురించాలి.

– ఘట్టమరాజు, బెంగళూరు

జానపదం

పాత జానపద కథలను, గేయాలను మళ్లీ ప్రచురించాలి. భాషను కాపాడుకుంటే సమాజానికే మేలు.

– టి.పార్వతి, మాచర్ల, గుంటూరు

ఈ సంచికలోని ప్రముఖ కవుల 'ఉగాది' కవితలను అందించింది కల్యాణశ్రీ - జంధ్యాల వేంకటరామశాస్త్రి, పాలకొల్లు, 92903 00831

పెద్దవారికేనా?

పెద్దవారికి ఆసక్తిదాయకంగా ఉంది పత్రిక. విద్యార్థులకు దీంతో అంతగా ప్రయోజనం ఉన్నట్లు కనపడటం లేదు. బాలల పత్రిక కూడా తీసుకొస్తే మీ లక్ష్యం నెరవేరుతుంది.

– కె.శేషాద్రిరావు, హైదరాబాద్

మనం తెలుగు వాళ్లమే!

మనందరి శ్వాసా తెలుగే. ఎక్కడికెళ్లినా తెలుగు వాళ్లమని గర్వంగా చెప్పుకోవాలి. రాష్ట్రం పేరును 'తెలుగునాడు'గా మార్చితే బాగుంటుంది.

– వాసుదేవ, అవనిగడ్డ, కృష్ణా

పారిజాతం

తెలుగు మాగాణిలో అంకురించి సువాసనలు వెదజల్లుతున్న పారిజాతం 'తెలుగు వెలుగు'. దినదినాభివృద్ధి చెందుతూ తెలుగుకు ఇంకెంతో మేలు చేయాలి.

– కె.కుమారస్వామి, కడప

భావి అవధానుల కోసం...

తెలుగు భాషాభివృద్ధికి పత్రిక తోడ్పాటు అభినందనీయం. అవధానం... తెలుగు వారికి దక్కిన వరం. ఈ సాహితీ ప్రక్రియను ముందు తరాలకు పరిచయం చేయాలి. దీని గురించి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అతి సరళంగా బోధించాలి.

– కె.వి.రమణారెడ్డి, హైదరాబాద్

ఆంగ్లమెందుకు?

తెలుగుకు హాని చేస్తోంది టీవీ రంగమే. ఛానళ్ల నిర్వాహకులు భాషను కాపాడే ప్రయత్నం చేయాలి. తెలుగు కార్యక్రమాలకు ఆంగ్లంలో పేరు పెట్టడం ఏం ఔచిత్యం? అసలు వారెందుకు ఆంగ్లం వాడుతున్నారు?

– బి.సుధీర్ కుమార్, హైదరాబాద్

తెలుగులోనే...

'ప్రపంచ తెలుగు మహాసభ'ల స్ఫూర్తితో మా కార్యాలయ సిబ్బంది అందరూ తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. దీనికి మా పై అధికారులూ సహకరిస్తున్నారు.

– యం.శంకర్‌నాయక్, నంద్యాల, కర్నూలు

కథలు బాగున్నాయి

సాన్నిధ్యం కథ అలౌకికానందాన్ని కలిగించింది. రచయిత్రి అలవోకగా కూర్చిన భావనల పుష్ప మాలలు, భాష్యాల మణిహారాలూ మదిని మురిపించాయి. కథలకు బొమ్మలు వేసేటప్పుడు రచయితల మూల భావాలను అర్థం చేసుకోవాలి.

– లలితారాణి, హైదరాబాద్

తెలుగు తోటలో విహారం

పత్రికను చదివినంతసేపు 'తెలుగువెన్నెల' తోటలో విహారానికెళ్లి విందుభోజనం ఆరగించినంత ఆనందంగా ఉంది. పత్రిక వర్ధిల్లాలి. తెలుగు భాషౌన్నత్యపు బావుటాను నింగికెగరేయాలి.

– వి.ఉమాదేవి, కాకినాడ

గీతమ్ విశ్వవిద్యాలయం

(Estd. u/s 3 of the UGC Act, 1956)

విశాఖపట్నం ✷ హైదరాబాద్ ✷ బెంగళూరు

భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖచే 'ఎ' కేటగిరి విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందినది మరియు జాతీయ విద్యా ప్రమాణాల పర్యవేక్షణా సంస్థ నాక్ చే 'ఎ' గ్రేడ్ విశ్వవిద్యాలయంగా ప్రకటితం అయినది.

గీతం సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్

యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్
ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ – డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్
వారి అనుమతితో నిర్వహిస్తున్న కోర్సులు

ADMISSIONS OPEN - CALENDAR YEAR BATCH 2013

- MBA* GENERAL
- MBA HRM
- MCA
- M.Sc. Biotechnology
- M A English/Economics
- M.Com.
- BA
- B.Com

* with specialisations in Finance, Marketing, Systems, Hospital Management and Operations Management

- PG Diploma in Env. & Sustainable Management
- PG Diploma in Communication Skills
- Diploma in Communicative English
- Diploma in Computer Applications

పై కోర్సులతో పాటు ఏ విధమైన ప్రాధమిక విద్యార్హతలు లేని వారి కోసం

బి.ఎ./బి.కామ్ ప్రవేశ పరీక్ష

18 సంవత్సరాలు, ఆ పైవయస్సుగల అభ్యర్థులు ఎవరైనా ఈ ప్రవేశ పరీక్షకు ధరఖాస్తు చేసుకొనవచ్చును.
ఇందులో ఉత్తీర్ణులైన వారికి బి.ఎ./బి.కామ్ లో ప్రవేశం లభిస్తుంది

'గీతం' స్టడీ సెంటర్లు మరియు పరీక్షా కేంద్రాల సమాచారానికి
హెల్ప్‌లైన్: 0891-2797 499 / 2796 499 సెల్: 77 99 66 888 3
పూర్తి వివరాలకు, దరఖాస్తు డౌన్ లోడు చేసుకొనుటకు :
www.cdl.gitam.edu



కీర్తి 'చిత్రం'

చిన్న కథ

"ఆ ఫొటో ఫ్రేమ్ చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు, శాస్త్రిగారూ!" అన్నాడు రావు.

'విజయవాడలో కొన్నానండీ. అయినా మా ఇంటికి ఎవరొచ్చినా, ఆ ఫ్రేమ్ చాలా బాగుంది అనే వాళ్లేకాని, ఆ ఫొటోను గురించి అడిగేవాళ్లు కనిపించడం లేదండీ!' అన్నాడు శాస్త్రి దెబ్బతిన్న మనస్సుతో.

"పోనీ చెప్పండి. ఆ శాలువా కప్పుకున్న వారు మీరేనా? ఆ పక్కాయనకు కూడా సన్మానం జరిగిందా? సవివరంగా చెప్పండి." అన్నాడు రావు.

'అదంతా ఓ కథ. మా పుస్తక ఆవిష్కరణ జవాబు పత్రాలు దిద్దే సమయంలో పెడితే ప్రేక్షకులకు లోటు ఉండదని హైదరాబాదులోనే జరపాలని నిశ్చయించాం. కృతి భర్త కూడా వస్తారని ధీమాగా ఉన్నాం. ఆహ్వానాలు వచ్చేశాయి. ఇక సభ ఆవిష్కరణ జరగటానికి రెండు రోజులే గడువు ఉంది. సభా నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు.'

మర్నాడు ఆవిష్కరణ సభ అనగా కృతి భర్త పని మీద బెంగళూరు వెళ్లవలసి వచ్చినట్లు, అందువల్ల కృతి స్వీకార ఉత్సవానికి రాలేక పోతున్నానని టెలిగ్రాం ఇచ్చాడు. దాంతో శాస్త్రి, మూర్తి (జంట కవులు) డీలాపడిపోయారు. ఆయన వస్తే శాలువాలు కప్పేవారు. పోనీ వాయిదా వేద్దామంటే బాగుండదు. ఓ మహాకవి అధ్యక్షుడిగా వస్తున్నాడు. ఆయన చేతులతో దుశ్శాలువాలు కప్పించుకోవడం కంటే భాగ్యం ఇంకేం కావాలి? మూర్తి లోపల దెబ్బతిన్నా పైకి గంభీరంగానే ఉన్నాడు. శాస్త్రి మాత్రం ఖిన్నుడయ్యాడు. ఏమైనా ఈ అవకాశం జారవిడుచుకోకూడదని నిశ్చయించేసుకున్నాడు.

రాత్రివేళ సభా నిర్వాహకుని దగ్గరకు వెళ్లి విషయాలన్నీ చెప్పాడు శాస్త్రి.

"కృతి భర్త రాకపోయినా సభ జరిపించేద్దాం దానికి కంగారు పడనవసరం లేదు. కానీ శాలువాలు అవీ మాత్రం మేం కొని తేలేం. మిగతా వ్యవహారాలన్నీ చక్కగా చేసుకుందాం" అన్నాడాయన.

శాస్త్రికి, మూర్తికి ఓ ఆలోచన వచ్చింది. పోనీ ఆ శాలువాలు మనమే కొనేసుకొని కప్పించేసుకుంటే బాగుంటుందేమో! కొంత పెట్టుబడి పెట్టినా, శాలువాలు తరువాత ఉపయోగపడతాయి కదా!" అని అనుకున్నారు. కానీ మనస్సు ఒప్పుకోలేదు.

ఇంతలో సభా నిర్వాహకుడు ఓ సలహా ఇచ్చాడు. పాపం! మీరు ఎంతో ఉత్సాహంగా అన్నీ సిద్ధం చేసుకున్నారు. శాలువాలు కొనడానికి మా దగ్గర వీలుగా లేదు. ఓ పనిచేస్తా, మీకు అంగీకారమైతే అన్నారు ఆయన. ఏమిటన్నట్లు చూశాడు శాస్త్రి తన జేబులోంచి డబ్బు ఖర్చవ్వని ఆలోచన ఏదైనా చెబుతాడేమోనని. "నా దగ్గర రెండు సొంత శాలువాలు ఉన్నాయి. అవి సభలో ఘనంగా మీకు మహాకవిగారి చేత కప్పించేస్తాను. సభ అయిపోయాక, సద్దుమణిగాక నా శాలువాలు నాకు మడతపెట్టి ఇచ్చేయాలి" అన్నాడు సభా నిర్వాహకుడు.

మహా ప్రసాదం అనుకున్నాడు మూర్తి. మళ్లీ ఇవ్వాలంటే మనస్కరించకపోయినా, సొంతంగా కొనకుండా పని జరిగిపోతున్నందుకు తనని తాను అభినందించుకుంటూ, సభా నిర్వాహకుడికి కృతజ్ఞతలు చెప్పాడు.

మర్నాడు సభ ప్రారంభమైంది. ఆహూతులు బాగానే వచ్చారు. మహాకవిగారు పుస్తక ఆవిష్కరణ చేసి రచయితను అభినందించారు. ఇంతలో ఫొటోలు తీయడం పూర్తయింది. సభ కాగానే నిర్వాహకులు రెండు శాలువాలనూ పట్టుకెళ్లిపోయారు. శాలువాలు సొంతం కాకపోయినా ఫొటోలో చక్కగా పడినందుకు మురిసిపోయాడు శాస్త్రి. ఫొటో ఫ్రేమ్ (ఫేమ్) అయినా మిగిలినందుకు సంతోషించాడు.

డా॥ బాలాంత్రపు శ్యామలరావు
హైదరాబాద్
98486 68861

శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

అభివృద్ధి పథంలో నెల్లూరు నగరపాలక సంస్థ

శ్రీ బి.శ్రీధర్ గారు
జిల్లా కలెక్టరు

కార్పొరేషన్ సాధారణ నిధుల నుండి :

● రూ. 17.58 కోట్లతో రహదారుల నిర్మాణం
● రూ. 5.97 కోట్లతో డ్రైన్ల నిర్మాణం ● రూ. 135 లక్షలతో పైపులైన్ల నిర్మాణం.
● రూ. 11.00 కోట్లతో సిసి రోడ్లు మరియు డ్రైన్ల నిర్మాణం ● రూ. 11.45 కోట్లతో రోడ్లు మరియు డ్రైన్లను నిర్మించుటకు టెండర్లు పిలువబడినవి. ● రూ. 28.00 లక్షలతో గవర్నమెంట్ హాస్పిటల్ నుండి కరెంటు ఆఫీసు సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయబడినది. ● రూ. 19.00 లక్షలతో గాంధీనగర్ రిజర్వాయర్ నుండి ఆటోనగర్ వరకు పైపులైను.

12వ ఆర్థిక సంఘ నిధులతో..

● రూ. 996.00 లక్షలతో పనులు పూర్తి చేయడం జరిగినది.

13వ ఆర్థిక సంఘ నిధులతో..

2010-11 సంవత్సరమునకు చేపట్టిన పనులు :
● మురికి కాలువలు నిర్మాణమునకు ● మంచి నీటి సరఫరా పైపులైన్లు వేయుటకు క్రొత్త మోటర్లను కొనుగోలు చేయుటకు ● సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయుట రూ. 338.80 లక్షలు.

2011 – 12 సంవత్సరమునకు చేపట్టిన పనులు :

● మురికి కాలువలు నిర్మాణమునకు ● మంచి నీటి సరఫరా పైపులైన్లు వేయుటకు క్రొత్త మోటర్లను కొనుగోలు చేయుటకు ● సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయుట
● జనరేటర్ కొనుగోలు చేయుటకు రూ. 509.05 లక్షలు.

2012–13 సంవత్సరమునకు చేపట్టిన పనులు :

● మురికి కాలువలు నిర్మాణమునకు ● మంచి నీటి సరఫరా పైపులైన్లు వేయుటకు క్రొత్త మోటర్లను కొనుగోలు చేయుటకు ● సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయుట.
● జనరేటర్ కొనుగోలు చేయుటకు రూ. 756.00 లక్షలు.

ఎ.యస్.సి. గ్రాంటు 09–10 :

● 165 లక్షలతో హెడ్ వాటర్ వర్క్సు నుండి పొదలకూరు రోడ్డు
● ఇ.యల్.యస్.ఆర్. వరకు 300... పైపు లైన్లు.

ఎ.యస్.సి.గ్రాంటు 10–11 :

● 185 లక్షలతో 625 కె.వి.ఎ. కెపాసిటి జనరేటర్స్‌ను హెడ్ వాటర్ వర్క్సు వద్ద ఏర్పాటు చేయుట మరియు ట్యాంకర్స్ ద్వారా మంచి నీటి సరఫరా చేయుటకు
● కార్పొరేషన్ ఆఫీసు నూతన భవన నిర్మాణం రూ. 1,000 లక్షలతో
● జాతీయ రహదారులతో నెల్లూరు నగరమును అనుసంధానం చేయు లింకురోడ్డు నిర్మాణం రూ. 1847.56 లక్షలతో 8 రోడ్లు చేపట్టి పూర్తి చేయుట జరిగింది.
● రూ. 125 లక్షలతో డైకస్ రోడ్డులోని చేపల మార్కెట్ ఆధునీకికరణ చేయటం జరిగినది.
● నెల్లూరు లైలా తుఫాన్ వలన దెబ్బతిన్న రోడ్లు, డ్రైన్లు మరియు పైపులను పూర్తి నిర్మాణము చేయుటకు రూ. 619.00 లక్షలతో పనులు పూర్తి చేయుట జరిగినది.
● రూ. 55.00 లక్షలతో డైకస్ రోడ్డులోని చేపల మార్కెట్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణము పూర్తి చేయడం జరిగింది. ● రూ. 13.50 లక్షలతో వెంగళరావునగర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణము పూర్తి చేయడం జరిగినది.
● రూ. 55.00 లక్షలతో ఎ.సి.మార్కెట్ చిన్నబజారు మొదటి అంతస్తు నిర్మాణము పూర్తి చేయడం జరిగినది. ● రూ. 57.00 లక్షలతో స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడం జరిగినది.

సిటిజన్ రీసోర్స్ సెంటర్స్ :

● రూ. 35.00 లక్షలతో వెంగళరావునగర్ రుత్విక్ లే అవుట్ ముత్యాలపాలెం బంగాలతోట నందు సిటిజన్ రిసోర్స్ సెంటర్ నిర్మాణము పూర్తి చేయడం జరిగినది.

టి.యస్.ఆర్.ఆంజనేయులు,
కమిషనరు

నెల్లూరు నగర పాలక సంస్థ మరియు సిబ్బంది

ఏప్రిల్ సంచికలు మార్కెట్లో ఉన్నాయ్!

మగాడి నుంచి పొందే సుఖం అనుభవానికి వచ్చాక కూడా ఆ సుఖాన్నిచ్చే మగజాతిపైన ఎందుకు జుగుప్సను పెంచుకుంది కామాక్షి? 35 ఏళ్ళనాటి విపుల కథ తకజి శివశంకర్ పిళ్లై పెళ్ళికాని పిల్లలో చదివి తెలుసుకోండి!

✦ మల్లాది తెలుగు కథ **పాపి**
✦ కన్నడ కథ **తొలిప్రేమ**
✦ సింహాళీకథ **ఒకభర్త**
✦ ఆఫ్రికా కథ **సంఘర్షణ**
✦ కథకులఫైల్‌లో నార్ల చిరంజీవి **కర్రా - చెప్పులు**

వెరశి- 18 కథల సమాహారంగా మీ ముందుకు వచ్చింది ఏప్రిల్ విపుల

విపుల

త్రిబుల్ ధమాకా

ఊరి అభివృద్ధికోసం కంకణం కట్టుకున్న ఆ పట్నపు యువకుడి అసలు ఆంతర్యం ఏమిటి? లక్ష్యం కోసం జీవి తాన్నే పణంగాపెట్టిన అతడు అనుకున్నది సాధించాడా? డా. ఎం. శ్రీలత నవల **సస్యశ్యామలం** చదవండి!

✦ విదేశాల్లో ఉండే కొడుకు వచ్చినవేళ కలిగే కన్నవారి హృదయ స్పందనలకు అక్షరరూపం జాస్తి రమాదేవి పెద్దకథ **అమెరికా అబ్బాయి**

✦ దేవుడిలా గౌరవించిన తండ్రినే ద్వేషించే స్థితికి ఆ కొడుకు ఎందుకు దిగజారాడు? ఓ కొడుకు అంతరంగావిష్కరణ ఎ.బి.ఎస్. తెలుగుకథ **నాన్న!**

చతుర

సాలు చందా
రూ.120 /-
మాత్రమే

చందా ఆన్‌లైన్ బుకింగ్‌కు డబ్బు పంపినవారు
నేరుగా చందా చెల్లించాలనుకున్నవారు దిగువ చిరునామాలో సంప్రదించండి.
మేనేజర్, వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ హైదరాబాద్-82 ఫోన్ : 040 23318181 Ext: 6441
email : vipula.chatura@eenadu.net - vipula.chatura@gmail.com

తాతలనాటి సాహిత్యంలో రేపటి విజ్ఞానం

నేను ఊహను!
కళ్లు చూడలేని దాన్ని చూడగలను
చెవులు వినలేని వాటిని వినగలను
హృదయం స్పందించని చోట
స్పందించగలను
నేను ఊహను!

'జ్ఞానం కంటే ఊహే అతి ముఖ్యమైంది. జ్ఞానానికి పరిమితి ఉంటుంది. కానీ... ఊహ ప్రపంచాన్ని చుట్టిరాగలదు. అలాగే, తర్కం. అది అ నుంచి అః వరకే తీసుకెళ్లగలదు. కానీ ఊహ ఎక్కడికైనా తీసుకుపోతుంది. నూతనావిష్కరణలకు మూలం ఊహే'నన్నది విఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ భావన.

మానవ మనస్సు ఓ మాయామృగం. ప్రకృతిలో కనిపించే వాటన్నింటిపై ఆశపడుతుంది. ఆ ఆశలను జ్ఞానఖడ్గంతో ఖండించినప్పుడే మనిషి ఎదుగుతాడంటాడు మన వేమన. ఖండించడమంటే... అణగదొక్కమని కాదు. ఆశను నెరవేర్చుకోడానికి తగిన జ్ఞానాన్ని సముపార్జించుకోమని. మరి ఆ జ్ఞానం ఎలా లభ్యమవుతుంది అంటే పరిశోధనలతో! పక్షిలాగా ఆకాశంలో ఎగరాలనిపించిందనుకోండి... అది ఆశ. గురుత్వాకర్షణ శక్తికి లోబడి మాత్రమే వసుధపై విహరించగలిగే మనిషి... వినీలాకాశంలో విహంగం అవ్వాలంటే తనకు ఓ వాహనం కావాలి. మన ప్రాచీనులకు వచ్చిన ఈ ఊహ నుంచి పుట్టిందే విమానం (పుష్పక విమానమని మన సాహిత్యంలో ఒకటి ఉంది. అలాగే, భరద్వాజుని 'వైమానికశాస్త్రం' అనే గ్రంథం గురించి తెలిసిందే) ఇక్కడ ప్రధానమైంది... అసలు ఆ ఊహే లేకుంటే నేటితరం విమానాలు రూపొందేవా? అంటే, ఐన్‌స్టీన్ చెప్పినట్లు కొత్త అవిష్కరణలు జరగాలంటే... ముందు వాటి సంభావ్యతను లేశ మాత్రంగానైనా ఊహించగలగాలి. అప్పుడే విజ్ఞానం వృద్ధి చెందుతుంది. ఈ కోణంలో మన సాహిత్యాన్ని పరిశీలిస్తే... ప్రస్తుతం మనం వింటున్న అనేకానేక శాస్త్రవిషయాలు, ఆధునిక సౌకర్యాల ప్రస్తావనలెన్నో కనిపిస్తాయి. ఇంకా అలాంటివి ఏమున్నాయో శోధిస్తే ఏ అద్భుతాలను మన సాహిత్యం పొదువుకుందో తేటతెల్లమవుతుంది. మరెన్నో ఆవిష్కరణలకు దారి చూపుతుంది.

ద్వాపరయుగం నాటి కథతో పదిహేనో శతాబ్దం నాటి పోతన రాసిన భాగవతం చతుర్థ స్కంధంలో అంగుడు అనే రాజు, అతని కుమారుడు వేనుడి కథ ఉంటుంది. ఈ వేనుడు అతిక్రూరుడు. సింహాసనం ఎక్కింది మొదలు సజ్జన హింస చేస్తూనే ఉన్నాడు. దాంతో లోకానికి హాని కలుగుతుందని భావించిన ఋషులు అతన్ని అంతమొందించారు. అయితే... రాజు లేకపోవడం రాజ్యానికి క్షేమకరం కాదు కాబట్టి... వేనుని ఊరువు(తొడభాగం)ను మధించారు. రాక్షసుడు పుట్టాడు. వాణ్ని వెళ్లగొట్టి, ఈసారి వేనుడి బాహువులను మధించారు. నారాయణ అంశతో పృథువు, లక్ష్మీదేవి అంశతో అర్చి జన్మించారు. పృథువును రాజుగా చేశారు.

ఈ కథలో గమనించాల్సింది... ఒక మనిషి శరీర భాగాల నుంచి మరో ప్రాణికి ప్రాణం పోయడమన్న ప్రక్రియ. ఇది ఇప్పటి 'క్లోనింగే' కదా. అలాగే, ఒక శరీరభాగం నుంచి కొత్త శరీరభాగాన్ని సృష్టించడానికి నేడు పరిశోధనలు సాగుతున్నాయి. కొన్ని అవయవాల విషయంలో ఇప్పటికే ఈ 'సృష్టి' సాధ్యమైంది. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స తెలిసిందే కదా!

భాగవతంలోనిదే మరో ఉదంతం. తన చెల్లెలు దేవకికి పుట్టబోయే ఎనిమిదో శిశువు తనను సంహరిస్తాడనే భయం కంసుడిది. దాంతో సోదరిని, బావ వసుదేవుణ్ని చెరసాలలో బంధించాడు. వారి ఆరుగురు బిడ్డల్ని చంపేశాడు. అయితే.. దేవకి ఏడో గర్భంలో ఉన్నది ఆదిశేషుని అవతారం కావడంతో, దాన్ని రక్షించేందుకు సిద్ధమయ్యాడు శ్రీమహావిష్ణువు. వసుదేవుని మొదటి భార్య రోహిణి, అప్పుడప్పుడు కారాగారానికి వస్తూ, తన భర్తను కలుసుకుంటూ ఉండేది. శ్రీమహావిష్ణువు

యోగమాయను పిలిచి, దేవకి సప్తమ గర్భాన్ని రోహిణికి మార్చాలని ఆదేశించాడు. యోగమాయ ఆ ప్రకారమే చేసింది. అలా రోహిణికి జన్మించిన శిశువే బలరాముడు.

గర్భిణికి ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలిగితే... ఆమె గర్భంలో ఉన్న పిండాన్ని మరో మహిళ గర్భంలో ప్రవేశపెట్టి, పిండాన్ని రక్షించవచ్చన్న ఆలోచన అప్పటి వారిలో ఉందన్న మాట. కానీ ఇప్పటికీ ఈ పరిజ్ఞానం రాలేదు. ఈరోజుల్లో, 'అద్దెగర్భం' అన్న మాటను తరచూ వింటున్నాం. వైద్యపరమైన సమస్యలతో సొంతగా బిడ్డకు జన్మనివ్వలేని అతివలు ఈ పద్ధతిపై ఆధారపడుతున్నారు. ఆమె అండాన్ని, తన భర్త శుక్రకణాన్ని కలిపి వేరే స్త్రీ గర్భాశయంలో ప్రవేశపెట్టడమే 'అద్దెగర్భం'. భాగవతకారుడు దీని కన్నా మరింత ముందుకు వెళ్లినట్లు లేదూ?

మహాభారతంలో 'సామాన్య శాస్త్రం'

ధృతరాష్ట్ర, పాండు రాజుల జన్మ వృత్తాంతాన్ని పరిశీలిస్తే 'వీర్యదాత', 'వీర్యనిధి' గుర్తుకురావూ! అలాగే, సుయోధన సహిత ధృతరాష్ట్ర సంతానం ఊపిరిపోసుకున్న తీరు 'టెస్ట్‌ట్యూబ్ శిశువు'ల్ని జ్ఞప్తికి తేదూ!

కుంతీదేవికి ప్రసవం జరగడంతో, గాంధారి చాలా అసూయకు లోనైంది. బాధతో తన గర్భాన్ని చేతులతో మోదుకుంది. దాంతో గర్భం విచ్ఛిన్నమై పిండం బయటపడింది. ఆ పరిస్థితిని చూసిన వ్యాస మహర్షి విచ్ఛిన్నమైన ఆ పిండ భాగాల్ని తనకు తెలిసిన విజ్ఞానంతో 101 కుండల్లో పెట్టించాడు. ఆ కుండల్లోనే కౌరవులు, వారి చెల్లెలు "దుస్సల" తయారయ్యారు. గర్భస్రావమైనప్పుడు పిండం చనిపోకుండా, దానిని మరో గర్భంలోకి మార్చి రక్షించుకోవడమన్న ఆలోచన అద్భుతం కదా!

'టెస్ట్‌ట్యూబ్' విధానంలో... స్త్రీ అండం, పురుషుని శుక్రకణం తీసుకుని నాళికలో కలుపుతారు. ఫలదీకరణం తర్వాత ఆ పిండాల్ని స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. తదుపరి ప్రక్రియంతా సాధారణమే. అంటే, టెస్ట్‌ట్యూబ్ విధానంలో ఫలదీకరణం చెందిన పిండం ఎదగాలంటే మహిళ గర్భాశయం తప్పనిసరి. భారతంలో వ్యాసుడు మాత్రం పిండ భాగాలను తిరిగి గర్భాశయంలోకి ప్రవేశపెట్టకుండా విడిగా కుండల్లో ఉంచాడు. దీన్ని బట్టి చూస్తే, ఆయన ఆలోచన నేటి ఆచరణ కన్నా ఎంత

అత్యుత్తమ ఆఫర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రతి భారతీయునికి బ్యాంకర్

గృహ ఋణాలు
@ ప్రతి సం॥ 9.95%*

సంతోషమైన రోజులు తిరిగి వచ్చినాయి

ఇఎంఐ ₹/లక్షకు/నెల

ఋణ వ్యవధి (సం॥)	₹30 లక్షల వరకు @ ప్రతి సం॥ 9.95%	₹30 లక్షలకు మించి @ ప్రతి సం॥ 10.10%
30	874	885
25	905	916
20	962	972
15	1,072	1,081

త్వరపడండి!! సమీపంలో ఉన్న బ్రాంచిని సంప్రదించండి

*వడ్డీ రేటు బ్యాంక్ యొక్క బేస్ రేటుతో ముడిపడివుంటుంది. షరతులు వర్తిస్తాయి.
వివరాలకు www.sbi.co.inకి లాగాన్ అవ్వండి లేదా 1800 425 3800కి (టోల్ ఫ్రీ)
1800 11 22 11 (టోల్ ఫ్రీ ఎమ్‌టిఎన్‌ఎల్/బిఎస్‌ఎన్‌ఎల్/080 26599990) లేదా customercare.homeloans@sbi.co.inకి ఈమెయిల్ చేయండి

ముందుగా ఉన్నట్టు!

గంగావతరణం

పూర్వం సగరుడు అనే చక్రవర్తి రాజ్యంలో వర్షాలు పడక కరవు ఏర్పడింది. ప్రజలు నానా ఇక్కట్లకు గురయ్యారు. వారి బాధలను తీర్చడానికి సగరుడు అశ్వమేధయాగాన్ని సంకల్పించాడు. యాగంలో భాగంగా వదిలిన అశ్వం వెంట సగరుని అరవై వేల మంది కుమారులు వెళ్లారు. అకస్మాత్తుగా గుర్రం మాయమైంది. ఇంద్రుడే దానిని దొంగిలించి పాతాళంలో దాచేశాడని అన్నారు కొందరు. భూమిని తవ్వుకుంటూ వెళ్లసాగారు సగర పుత్రులు. చాలా లోతుకు వెళ్లాక కపిల మహాముని తపస్సు చేస్తూ కనిపించాడు. పక్కనే అశ్వం ఉంది. ఆయనే దాన్ని అక్కడ దాచేశాడని భావించి సగర పుత్రులు కోపంతో ఆయనపై దాడి చేశారు. తపోభంగమైన కపిల ముని కళ్ల నుంచి వెలువడ్డ అగ్ని జ్వాలల్లో అరవై వేలమందీ కాలి బూడిదైపోయారు. ఇది తెలిసి సగరుడు చాలా విచారించాడు. కుమారులందరికి పుణ్యలోకాలు ప్రాప్తించాలంటే ఏం చేయాలని ఋషులను సలహా అడిగాడు. దివిలోని గంగను భువికి దింపి బూడిద రాశుల మీదుగా పారించాలని చెప్పారు వారు.

గంగను తమ రాజ్యానికి తీసుకురావడానికి సగరుడు తమ మనుమడైన అంశుమంతుని పంపించాడు. అంశుమంతుడు హిమాలయాలకు వెళ్లి తన జీవిత పర్యంతం తపస్సు చేశాడు. గంగ ప్రత్యక్షం కాలేదు. ఆయన మరణించగానే అతని కుమారుడు దిలీపుడు వెళ్లాడు. ఫలితం లేదు. ఆ తర్వాత అతని పుత్రుడు భగీరథుడు వెళ్లాడు. అతని తపస్సుకు మెచ్చి గంగ ప్రత్యక్షమయ్యింది. కానీ ధారాపాతంగా ధరామండలంపైకి దిగేటప్పుడు తన తాకిడికి తట్టుకోవడానికి శివుడు తన శిరస్సును కాయాలనే షరతు పెట్టింది. భగీరథుడు మళ్లీ తపస్సు చేసి ఈశ్వరుణ్ని ప్రసన్నం చేసుకున్నాడు. హోరున ఆకాశం నుంచి దిగుతూ, హిమాలయాల్లో నిలుచున్న ముక్కంటి మేనిపై నుంచి జాలువారుతూ నేలను తాకిన గంగమ్మ నదిగా ప్రవహించసాగింది.

భగీరథుడు ముందు నడుస్తూ ఉంటే, వెనుక గంగ ఉరకలెత్తుతూ వస్తుంటుంది. దారిలో జహ్నుడనే ఋషి ఆశ్రమం మీదుగా ప్రవహించింది. ఆ ఋషి కోపించి గంగను పట్టి మింగాడు. తర్వాత భగీరథుడి ప్రార్థన మన్నించి, జలరాశిని చెవి ద్వారా విడిచాడు. చివరకు నదిని తన రాజ్యానికి తీసుకువచ్చిన భగీరథుడు తన తాతల చితాభస్మరాశులపై ప్రవహింపజేశాడు.

అంతరార్థం

అశ్వమేధ యాగం అంటే - అశ్వాన్ని దేశాల వెంట విడవడం, ఎవరైనా దాన్ని బంధిస్తే వారితో యుద్ధం చేసి విడిపించడం, ఆఖరున అశ్వాన్ని బలిచేసి యాగాన్ని పూర్తి చేయడం. అందరికీ తెలిసిన

'ఎవరు వారు వచ్చేరు?
పూల తేరుపై/ క్రొత్త కారు
క్రొత్త కారు/ చైత్రరథంలోన
శ్యామపత్రపథంపైన/ ఎవరా
వచ్చేది? / అది ఉగాది
అది ఉగాది!/ కుసుమ
లతా పతాక!/ కోయిల
బాకా! వహ్వా
ఎన్నాళ్లకు రాక!'

– దేవులపల్లి కృష్ణశాస్త్రి

విషయమిదే. కాని 'అశ్వం' అంటే గుర్రం, రంగు, నీరు అంటూ అనేక నానార్థాలున్నాయి. ఈ కోణంలో చూస్తే గంగావతరణం పూర్తిగా కొత్తగా కనిపిస్తుంది. అశ్వం అనే నీటి కోసం చేసే యాగమే 'అశ్వమేధం'. ఈ యాగం కోసం సర్వ శుభలక్షణాలున్న అశ్వాన్ని స్వేచ్ఛగా వదులుతారు. దాని వెనుక సైన్యం వెళ్తుంది. ఆ గుర్రాన్ని చూడగానే 'ఓహో ఈ గుర్రం కలవారి రాజ్యంలో కరువు వచ్చింద'ని పరదేశ రాజులు గుర్తించి తమ వంతు సహాయంగా సంపదలు పంపిస్తారు. ఆ ధనంతో భూగర్భ జలాలను వెలికి తీయడం, నదులు, కాలువలను దారి మళ్లించడం, చెరువులు, నూతులు తవ్వించడం వంటివి చేస్తారు. ఇక్కడ యాగం అంటే ప్రయోగం. యజ్ఞవాటిక అంటే ప్రయోగశాల. ఋషులంటే శాస్త్రవేత్తలు. ఇప్పుడు రసాయన చర్యలతో కృత్రిమ వర్షాలు కురిపిస్తున్నారు కదా! అలాంటిదే ఈ యాగం అనుకోవచ్చు.

ఆ గుర్రాన్ని (నీటిని) వెలికి తీయడానికి సగర పుత్రులు 60 వేలమంది బయలుదేరారు. ఒక వ్యక్తికి అరవైవేలమంది సంతానం సంభవమేనా? అంటే వారంతా సగరుడి కన్నబిడ్డలు కారనే భావించాలి. సగరుడు తన ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకునేవాడని దీని భావం. అశ్వాన్ని (నీటిని) బయటికి తెచ్చే ప్రయత్నంలో లోతుకు తవ్వసాగారు. చాలా లోతుకు వెళ్లాక అక్కడ కపిల మహాముని తపస్సు చేస్తూ కనిపించాడు. ఋషులు కొండల్లోనో, అడవుల్లోనో తపస్సు చేసుకుంటారు, కానీ ఈయన భూమికి అంత లోపల ఎలా తపస్సు చేస్తాడు? కపిలుడు అంటే నిజంగా ఋషి కాదు. కపిలము అంటే - ఋషి, విష్ణువు, బొగ్గు అనే అర్థాలున్నాయి! ఇక్కడ కపిలుడు అంటే 'బొగ్గు'. అంటే ఈ అరవై వేలమంది కార్మికులు భూమిని తవ్వుతుంటే నీరు రాకుండా బొగ్గు గని తగిలిందన్నమాట. బొగ్గు పొరలను తవ్వేస్తే వాటి మాటున జలం ఉండొచ్చని ఊహించి ఉంటారు. అందుకే కపిలుడే అశ్వాన్ని బంధించినట్లుగా సాహిత్యకారులు చమత్కరించి ఉంటారు.

సగర పుత్రులు ఆయుధాలతో కపిలుడిపై దాడి చేయడమంటే... బొగ్గు పొరలను తవ్వడమే. ఆ తవ్వకంలో పొరలకు రెండు రంధ్రాలు పడ్డాయి. అదే కపిలుడు కోపంతో కళ్లు తెరవడం. ఆ రంధ్రాల నుంచి చెప్పలేని వేగంతో భారీగా సహజవాయువు తన్నుకొచ్చింది. వారి ఆయుధాల దెబ్బల రాపిడికి పుట్టిన నిప్పు రవ్వలకు అది అంటుకుంది. అంతే! దారుణమైన మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. వాటినే కపిల మహర్షి కళ్ల నుంచి మంటలు రేగాయని అభివర్ణించారు. ఆ జ్వాలల్లో 60 వేల మంది కాలిబూడిదయ్యారు. ఇదంతా విశ్లేషించి చూస్తే, అప్పుడు వచ్చిన మంటలు ఒక పెద్ద 'బ్లోఅవుట్'గా అర్థం చేసుకోవచ్చు. తూర్పుగోదావరి జిల్లా పాశర్లపూడిలో 1994లో జరిగిన బ్లోఅవుట్, దాన్ని ఆర్పడానికి దేశవిదేశీ మేధావులు చేసిన కృషి తెలిసిందే. దీన్నిబట్టి ఆలోచిస్తే గనుల తవ్వకం,

సహజవాయువు అన్వేషణ, బ్లోఅవుట్ల గురించి మన ప్రాచీనులకు కచ్చితంగా తెలుసని, అలాంటి ఒక ప్రమాదంలో వేలాదిమంది మరణించారని అర్థమవుతోంది.

మళ్లీ సగరుని కాలానికి వస్తే... ఈ 'బ్లోఅవుట్' తర్వాత, ఆ ప్రాంతంలో నీరు దొరకదని ఋషులు గ్రహించారు. ప్రయత్నాలను ఆపేశారు. అయితే... వారిలో ఒకరు ఒక ఉపాయం చెప్పారు. హిమాలయాలపై కురిసిన వర్షాలు, ఎండకు మంచు కరిగి ప్రవహించే మంచినీరు వృథాగా పోతున్నాయని.. ఆ నీటిని ఎవరైనా ఒక వైపునకు మళ్లిస్తే నదిగా రూపొందుతుందన్నది వారి సలహా. అప్పుడు దానిని సగర రాజ్యం గుండా ప్రవహింపజేస్తే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నది సూచన. ఈ విషయాన్నే పురాణ పరిభాషలో చెప్పేందుకు.. తపస్సు చేసి గంగను భువికి తేవడమని రాశారు. తపస్సుతో అన్నీ లభిస్తాయనుకుంటే, మరణించిన 60 వేల మందిని బతికించమనవచ్చు కదా? కష్టపడి తపస్సు చేసి గంగను కిందకు దింపి, తమ రాజ్యం వరకు తేవడమెందుకు? అంటే, వారు చేసిన తపస్సు ముక్కు మూసుకుని చేసింది కాదు. అక్కడ వృథాగా పోతున్న నీటిని నదిగా మలచి వారి రాజ్యానికి మళ్లించే పథకం రూపొందించడం కావచ్చు. అంశుమంతుడు హిమాలయాలకు వెళ్లింది దీనికే. కొండలు, లోయల గుండా నదిని మళ్లించడం చాలా కష్టం. అయినా జీవితకాలమంతా దానికోసం కష్టపడ్డాడు. తర్వాత ఆ బాధ్యతను దిలీపుడు చేపట్టాడు. అతని ఆయువూ తీరింది. దాంతో భగీరథుడు వెళ్లి 'జలయజ్ఞాన్ని' ఒక కొలిక్కి తీసుకువచ్చాడు. నిజంగా చెప్పాలంటే వీరు ముగ్గురూ మంచి ఇంజనీర్లు అన్నమాట.

మనం జహ్నుడనే ఋషి గురించి చెప్పుకున్నాం కదా! అతను మనిషీ కాదు, ఋషీ కాదు. మరి గంగను మింగటం, విడవటం ఏంటి? గంగ ప్రవాహ మార్గాన్ని తప్పుకుంటూ పోతుంటే ఒక కొండ అడ్డువచ్చింది కాబోలు. ఆ కొండ పేరే జహ్నుడని సాహిత్యకారులు చెప్పి ఉంటారు. కొండ చుట్టూ తిప్పి గంగను తీసుకెళ్లడం కష్టంగా భావించిన భగీరథుడు.. ఆ కొండకు ఈవల వైపున పెద్ద రంధ్రం చేయించాడు. సొరంగం మాదిరిగా కొండ అంతర్భాగాన్ని తొలచుకుంటూ ఆవలి భాగానికి నదిని ప్రవహింపజేశాడు. సొరంగంలోకి గంగ ప్రవేశించడమే జాహ్నవుడు గంగను మింగడం, కొండ నుంచి గంగ బయటకు రావటమే చెవి ద్వారా విడవటంలోని అంతరార్థం కావచ్చు. కొండల మధ్య నుంచి వెళ్లే రహదారి, రైలు, నదీ మార్గాలను చూస్తూనే ఉన్నాం. గంగావతరణ కథను సూక్ష్మంగా శోధిస్తే మన ప్రాచీన విజ్ఞానం ఎంత గొప్పదో అర్థమవుతుంది.

విజ్ఞానశాస్త్రం మొత్తం విదేశీయుల సొత్తు అన్న అపోహతో మన సాహిత్యంలోని విజ్ఞానం గురించి మనం ఆలోచించట్లేదు. ఇప్పటికైనా దీన్ని సరిదిద్దుకోవాలి. మన వాఙ్మయ విజ్ఞానం, నేటి పరిజ్ఞానాన్ని ఇంకా పరిపుష్టం చేయడానికి ఉపయోగపడుతుంది. మన శాస్త్రవేత్తలు, మనం ఈ విషయాన్ని ఎంత తొందరగా గమనిస్తే మన దేశానికి అంత మేలు.

బి.సుబ్బరత్నం
తెలుగు అధ్యాపకురాలు,
యర్రగొండ పాలెం, ప్రకాశం జిల్లా, 99517 91266.

ఉగాది ఊసులు

తెలుగు వారి తొలి పండుగ ఉగాది. ఈ ఉగాది 'యుగాది' అనే సంస్కృత పదానికి వికృతం. యుగానికి ఆది కాబట్టి యుగాది అయింది. ఉగస్య ఆదిః ఉగాదిః

ఇప్పుడు జరుగుతున్న కలియుగానికి ఆది... ప్రమాదినామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి. దాదాపు అయిదు వేల ఏళ్ల నాటి ఆ రోజు శుక్రవారం. సూర్యగ్రహణం, అమావాస్య. అర్ధరాత్రి అష్టగ్రహ కూటమి మేషరాశి ప్రారంభ బిందువులో కలిసిన ఆ కాలమే మన పంచాంగానికి మూలం. ఆనాడే శ్రీకృష్ణ నిర్యాణం జరిగింది. శ్రీ మహావిష్ణువు మత్స్యావతారాన్ని ఎత్తి చైత్ర శుద్ధ పాడ్యమి నాడే సోమకాసురుని సంహరించి వేదాలను రక్షించాడని, అందుకే ఆ రోజు పండుగను జరుపుకుంటున్నట్లు మరో గాథ కూడా ఉంది.

ఉగాది నాడు బ్రహ్మ ముహూర్తంలో (ఉదయం 4.30 నుంచి 5.30 గంటల్లోపు) నిద్ర లేచి అభ్యంగన స్నానం చేయాలి. అంటే, నువ్వుల నూనెతో శరీరాన్ని చక్కగా మర్దించుకుని, గోరువెచ్చని నీటితో 'గంగేచయమునేచైవ.. కృష్ణా, కావేరి, తుంగభద్రా పవిత్ర నదీస్నానం కుర్యాత్' అనుకుంటూ స్నానమాచరించాలి. కుంకుమ తిలకధారణ చేసుకోవాలి. నూతన వస్త్రాలను ధరించాలి. శక్తిని బట్టి ఫల, పుష్ప, దీప, ధూప, నైవేద్యాలతో భగవంతుణ్ని ప్రార్థించాలి. 'నింబకుసుమ భక్షణం' అంటే వేపపూత పచ్చడిని తీసుకోవాలి.

"శతా యుర్వజ్రదేహాయం సర్వ సంపత్కరాయి
సర్వారిష్ట వినాశాయ నింబకుసుమ భక్షణం"

షడ్రుచుల సమ్మేళనం తెలుగు భాష. సమష్టి భావాల సమాగమం తెలుగు సంస్కృతి. ఆరు రుచుల్లోని అంతరార్థాన్ని జీవితానికి అన్వయించుకుని, షడ్గుణాలకు అతీతంగా తోటి వారితో కలిసి నడవమని ఉద్బోధించేది తెలుగు ఉగాది. మన వారసత్వం ఘనం. మన సంప్రదాయం సమున్నతం.

అచ్చతెలుగు సామెతల్లో ఆరు రుచులు

చక్కర పందిట్లో తేనె వాన కురిసినట్లు...
ఉప్పు తిన్న ప్రాణం ఊరుకోదు...
అల్లం అంటే నాకు తెలీదా బెల్లంలా **పుల్ల**గా ఉంటుదన్నాడట...
కంట్లో **కారం** కొట్టినట్లు...
తినగ తినగ **వేము** తియ్యగనుండు...
పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లు...

వేపపూత రెమ్మలు, లేత మామిడి ముక్కలు, అశోక వృక్షం చిగుళ్ళ, కొత్తబెల్లం, కొత్త చింతపండు పులుసు, చెరుకు ముక్కలు, జీలకర్ర, పటికబెల్లం, ఉప్పు, శనగలు, పాలు ఇంకా కొబ్బరి ముక్కలను కలిపి తయారు చేసేదే ఉగాది పచ్చడి. దీన్ని మనం తీసుకోవడమే కాకుండా బంధుమిత్రులకు కూడా పంచిపెడితే సంవత్సర శుభఫలం అందరికీ కలుగుంది. ఈ పచ్చడిని తినడం వల్ల శరీరానికి మేలు జరుగుతుందని ఆయుర్వేదం చెబుతోంది. పండుగ వచ్చే సమయానికి రుతువుల్లో మార్పులు చేర్పులకనుగుణంగా మన శరీరానికి అనారోగ్యం కలిగే అవకాశాలుంటాయి. ఉగాది పచ్చడి దాన్ని కొంత వరకూ నివారిస్తుంది.

"త్వామష్టశోకేనరాభీష్ట మధుమాస సమర్భవ
నిభావిశోకే సంతస్తాం మామశోకం సదాకురు"

జీవితంలో శోకాలతో బాధపడుతున్న నేను... ఓ అశోక కలికమా! నిన్ను సేవిస్తున్నాను. వసంత మాసంలో చిగురించే అశోకమా.. నన్ను శోక విముక్తుణ్ని చేయి.. అని అర్థం. అశోకం అంటే శోకాన్ని నివారించేది.

ఉగాది పచ్చడిని తీసుకున్నాక పెద్దల ఆశీర్వచనం పొంది, పంచాంగ శ్రవణం చేయాలి. సంవత్సరపు శుభాశుభాలు తెలిపేది పంచాంగం. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ ఫలితాలను తెలుసుకోవడమే పంచాంగ శ్రవణం. ఇందులో తిథితో సంపద, వారంతో ఆయుష్షు, నక్షత్రంతో పాపపరిహారం, యోగంతో వ్యాధి నివారణం, కరణంతో కార్యానుకూలం సిద్ధిస్తాయి. పూర్వం, సాయంకాలం దేవాలయ ప్రాంగణంలో పురోహితులు, జ్యోతిష్యుల ద్వారా పంచాంగ శ్రవణం చేసేవారు. వర్షం, కాలపరిస్థితి, ఆదాయ వ్యయాలు తదితర వివరాలను తెలుసుకోవడం ద్వారా మన జీవితాలను సమర్థవంతంగా సాగించుకోవచ్చు. దీపావళి పండుగతో వ్యాపారస్థులు కొత్త పద్దుల పుస్తకాలను ఆరంభిస్తారు. రైతులు, ఇతర వృత్తుల వారు ఉగాది నుంచి తమ లెక్కలు చూసుకుంటూ ఆశలకు పునాది వేసుకుంటారు. తెలుగునాట తెలుగుదనం తరిగిపోతున్న తరుణంలో మన తొలి పండుగ గొప్పతనాన్ని గుర్తు చేసుకోవడం అవసరం. మనవైన ఆచార వ్యవహారాలు, సంస్కృతిని కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడే... వసుధపై తెలుగు జాతి అస్తిత్వం కొనసాగుతుంది.

కొలనుపాక మురళీధరరావు
రామగిరి, నల్లగొండ
92471 59203

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం.

ఇంద్ర కీలాద్రి, విజయవాడ.
ఫోన్: 0866-2423600, 2425744

శ్రీ దేవి ఖడ్గమాలార్చన

అత్యంత మహిమోపేతమైన శ్రీ దేవీఖడ్గమాలార్చన ద్వారా విశేష ఫలాలను పొందవచ్చునని అత్యంత రహస్యమయిన ఈ స్తోత్రాన్ని హయగ్రీవుడు పూర్వం అగస్త్యునికి ఉపదేశించినట్లు పురాణోక్తి. వామకేశశ్వర తంత్రంలో ఉమామహేశ్వర సంవాద రూపంలో దేవీ ఖడ్గమాల అనే స్తోత్రమున్నది. అది శ్రీ చక్రంలోని నవావరణలను బహుధా వివరిస్తున్నది.

అంతటి మహిమ కల్గిన శ్రీ దేవి ఖడ్గమాలార్చన పూజను మొట్టమొదటిసారిగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో లోకకళ్యాణార్థం ప్రవేశ పెట్టారు. (2009 మార్చి 6 నుండి ప్రారంభం)

వేదవేదాంత వనవాసిని అయిన శ్రీ దుర్గమ్మ మూల స్వరూపం వద్ద తెల్లవారుఝామున 4 గంటల నుండి అమ్మ సన్నిధి అంతరాలయంనందు దంపతులచే 'శ్రీ దేవీ ఖడ్గమాలార్చన' పూజ జరిపించబడుతుంది.

పూజ రుసుము రూ. 5,116/-లు మాత్రమే.

'శ్రీ దేవి ఖడ్గమాలార్చన' తో సమస్త గ్రహ దోషాలు తొలగి కార్య విజయం సాధించి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తుల తూగుతారని వేద పురాణాలలో చెప్పబడింది.

<u>నియమ నిబంధనలు:</u> ❖ పూజ జరిపించుకొనదలచిన భక్తులు ముందుగా టిక్కెట్టు రిజర్వు చేసుకొనవలెను. ❖ రోజుకు ఆరు టిక్కెట్లు మాత్రమే పరిమితం (టిక్కెట్టు సీరియల్ నెంబరు ప్రకారం పూజలో కూర్చోవలెను). ❖ హిందూ సాంప్రదాయం ప్రకారం పురుషులు పంచె ధోవతి, స్త్రీలు చీర ధరించి రావలెను. ❖ అర్చన ఉదయం 4 గంటలకు ప్రారంభించబడుతుంది. 10 ని॥ల ముందుగా హాజరు కావలెను. ❖ భక్తుల రద్దీ దృష్ట్యా కాని, ఇబ్బందికర పరిస్థితులలో కాని, విశేషపర్వదినాలలో గాని అర్చనను వాయిదా వేయుటకు దేవస్థానము వారికి అధికారము కలదు. ❖ పూజ సామాగ్రి దేవస్థానము వారిచే సమకూర్చబడును. ❖ పూజ జరిపించుకొన్న దంపతులకు ఈ దిగువ పేర్కొన్నవి ఉచితముగా ఇవ్వబడును. (పూజ రుసుము చెల్లించిన వారు లేక వారి తరుపున స్వయముగా పాల్గొను భక్తులకు మాత్రమే ఇవ్వబడును. తపాల ద్వారా బట్వాడా చేయబడదు) 1) పంచె, కండువా 2) చీర, జాకెట్టు 3) స్పెషల్ లడ్డు ప్రసాదము 500 గ్రా. 4) అమ్మవారి కుంకుమ 5) అమ్మవారి లామినేషన్ ఫోటో 6) శ్రీ అమ్మవారి డాలరు. ❖ పూజకు హాజరు కాని యెడల మీరు పరోక్షముగా పూజ జరుపబడును. (ఈ పూజకు సంబంధించిన పూజా ప్రసాదం 3 రోజులలోపు మీరు పంపిన వ్యక్తులకు మాత్రమే అందజేయబడును) పూజ తేదీని మార్పు చేయుటకు అవకాశము లేదు మరియు టిక్కెట్టు రుసుము వాపస్ ఇవ్వబడదు. ❖ పూర్తి వివరములకు దేవస్థానము సమాచార కేంద్రంలో సంప్రదించగలరు. ఫోన్ నెంబర్లు: 0866-2423600, 2425744

సదా శ్రీ అమ్మవారి సేవలో: **కె. ప్రభాకర శ్రీనివాస్**, స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

ఆదమరిస్తే అమ్మ భాష కనుమరుగే

పేరి భాస్కరరావు... భాషాశాస్త్ర రంగంలో అపూర్వ పరిశోధనలు చేసిన, చేస్తున్న తెలుగు ఆచార్యులు. ద్రవిడ, ఇండో - ఆర్యన్, ఇండో - ఇరానీయన్, టిబెటో - బర్మన్, ఆస్ట్రో - ఏషియాటిక్ వర్గాలకు చెందిన వివిధ భాషలపై చేసిన అధ్యయనాలతో అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్న వ్యక్తి. వివిధ అంశాలపై ఇప్పటి వరకూ 53 పరిశోధన పత్రాలను ప్రచురించిన భాషా శ్రామికుడు. తెలుగుకు సాంకేతిక సొబగులు అద్దడానికి అహరహం శ్రమిస్తున్న అమ్మభాషా ప్రేమికుడు. హైదరాబాద్‌లోని లాంగ్వేజ్ టెక్నాలజీస్ రీసెర్చ్ సెంటర్‌లో ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్, టోక్యో విశ్వవిద్యాలయం (జపాన్)లో ప్రొఫెసర్ ఎమిరిటస్ ఆయన. తెలుగు పరిస్థితి, దాని సాంకేతిక అభివృద్ధి తదితర అంశాలపై 'తెలుగు వెలుగు'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

తె.వె.: తెలుగు పరిస్థితి నానాటికీ ఆందోళనకరమవుతోంది. తెలుగు చదివే విద్యార్థులు తగ్గుతున్నారు. మీరేమంటారు?

పేరి: నిజమే. భాష లేకుంటే మనం లేం. అడగకుండానే మనకు అన్నీ ఇచ్చిన అమ్మ ఈ భాష. జవసత్వాలిచ్చి మనల్ని ఇంతవాళ్లను చేసిన అమ్మ ఇప్పుడు ఇబ్బందుల్లో ఉంది. అమ్మ ఏనాడూ నాకిది కావాలని అడగదు. ఆమె సమస్యలను మనమే అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలి. పిల్లలుగా అది మన బాధ్యత. ప్రపంచీకరణ నేపథ్యంలో మిగిలిన భాషల ప్రభావం మాతృభాషపై పడుతుంది. అది సహజం కూడా. ఈ ప్రభావాలను తట్టుకుని మన భాష స్వచ్ఛతను కాపాడుకోవడమే అతిపెద్ద సవాలు. ఉదాహరణకు స్వీయ భాష పరిరక్షణకు జపనీయులు అనుసరించే పద్ధతులు ఆశ్చర్యం కలిగిస్తాయి. జపాన్‌లో మీకు ఏదైనా పని కావాలంటే కేవలం జపనీస్ భాషలోనే మాట్లాడాలి, అందులోనే రాయాలి. జపాన్‌లోని టోక్యో విశ్వవిద్యాలయంలో 18 ఏళ్లపాటు దక్షిణాసియా భాషల విభాగంలో ఆచార్యుడిగా పనిచేశా. వారికి తమ భాష అంటే మహాప్రేమ. మిగతా భాషల్లోంచి పదాలను తీసుకోవడానికి వారు విముఖులు కాదు. వారు కంజి, కథగన, హిరగన అనే మూడు పద్ధతుల్లో భాషా వ్యవహారం సాగిస్తారు. కంజి, హిరగనలో వారు స్వచ్ఛమైన, అన్యదేశ్యాల పాలబడని జపనీస్ భాషను రాసుకుంటారు. పై దేశ్యాలనుంచి వచ్చిన పదాలతో కూడిన జపనీస్ భాషను మాత్రం కథగనలో రాస్తారు. నా పేరు కూడా వారు కథగనలోనే రాసేవారు. భాష స్వచ్ఛతను కాపాడుకోవడం కోసమే ఇదంతా. జపాన్ పాలన వ్యవస్థను చూస్తే... ప్రాధాన్యక్రమంలో ప్రధాని, ఆర్థిక మంత్రి, ఆ తర్వాత విద్యామంత్రి ఉంటారు. విద్యామంత్రి ప్రాథమిక బాధ్యత... జపనీస్ భాషలోనే విద్యావిధానం కొనసాగేటట్లు చర్యలు తీసుకోవడం. ఆ దేశ పౌరసత్వం తీసుకునేవాళ్లు మొట్టమొదట తమ పేరు జపనీస్‌లోకి మార్చుకోవాలి. ఈ చైతన్యవంతమైన కృషి వల్లే వారి భాష అద్భుతంగా విరాజిల్లుతోంది. మనం స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అంశమిది.

ఆధునిక అవసరాలకు తెలుగు అనుగుణంగా లేదు కాబట్టే- అరువు పదాలు వచ్చి చేరుతున్నాయన్నది వాదన...?

తెలుగులో పద సంపదకు కొదవేలేదు. ఆంగ్లభాషలో కనిపించే ఏ కొత్త పదానికైనా, భావనకైనా అచ్చమైన తెలుగు పదాన్ని సృష్టించుకోగల శక్తి మన సొంతం. దేశ్య, తత్సమ, తద్భవాల మేళవంతో ఎలాంటి కొత్త అవసరాలకైనా తెలుగును సృష్టించుకోగల సత్తా మనకుంది. కావలసిందల్లా చిత్తశుద్ధి, సృజనాత్మక శక్తి. ఆంగ్లంలో లేని అనేక భావనలు తెలుగులో ఉన్నాయి. రంగులు, చుట్టరికాలు వంటి వాటిని పరిశీలిస్తే ఆంగ్లంలోలేని వైవిధ్య భావనలెన్నో మన భాషలో కనిపిస్తాయి. 'కజిన్' పేరిట ఆంగ్లంలో రంగూ, రుచి లేని ఓ భావన ఉంది. మనకో... పెద్దమ్మ కొడుకు, చిన్నమ్మ కొడుకు, మేనమామ కొడుకు, మేనబావ, మేనత్త కూతురు ఇలా... బంధాల్లోకి అనంత ప్రస్థానం. ఒక జాతి సంస్కృతిని తెలుసుకోవాలంటే



భాషను చూడాలంటారు. సంబంధ వాచకాలు, రంగులు, రుచులు, గౌరవ వాచకాలు మన భాషలో ఉన్నన్ని ఆంగ్లంలో ఎక్కడివి?

తెలుగులోకి వచ్చిన వస్తున్న అన్యదేశ్యాలను అలా వదిలేయాల్సిందేనా?

వాడుక పేరిట అలాంటి పదాల విషయంలో ఏమరుపాటు తగదు. కొన్ని సార్లు కొత్తదనం కోసమన్నట్లుగా (ఫ్యాషన్) ఇతర భాషా పదాలను తీసుకొస్తున్నాం. ప్రసారమాధ్యమాల్లో ముఖ్యంగా టీవీల్లో ప్రసారమయ్యే కార్యక్రమాల్లో భాషను ఈ తరహాలో కిందామీదా చేస్తున్నారు. సమాజంపై నేరుగా ప్రభావం చూపే మాధ్యమాలు కొంచెం స్పృహ, మరి కొంచెం బాధ్యతతో వ్యవహరించాలి. ఈ చైతన్యం తమిళం, మళయాళం, మరాఠీ, బెంగాలీ ఛానళ్లలో బాగా కనిపిస్తుంటుంది. శుద్ధంగా మాట్లాడటం ఎంత ముఖ్యమో... శుద్ధంగా రాయడమూ అంతే కీలకం. 'ఆ పోనీలే' అన్నట్లుగా రాతలో తప్పుడు ప్రయోగాలను వదిలివేస్తూ వెళితే అది క్రమంగా మన భాషనే దెబ్బకొడుతుంది.

నవతరానికి భాషపై అనురక్తి కలిగించడంలో మాండలికాల పాత్ర ఏంటి?

ప్రతి భాషకూ రకరకాల మాండలికాలుంటాయి. దేనికది విశిష్టమైనదే. ఏదీ తక్కువా ఎక్కువా కాదు. ఒకవైపు ప్రమాణ భాష రూపాన్ని కొనసాగిస్తూనే... మరోవైపు మాండలిక విభిన్నతలను పరిరక్షించుకోవడం తప్పనిసరి. చిన్నప్పటినుంచీ పిల్లలకు భాషపట్ల స్పృహను కలిగించడం ద్వారానే ఇది సాధ్యం. తెలుగులో ఇప్పటికే మనవాళ్లు చాలా కృషి చేశారు. సాధారణ ప్రజలకు తెలియని ఎన్నో పరిశోధనలు తెలుగులో చాలా జరిగాయి. వ్యుత్పత్తి పదకోశం పేరిట మన భాషలోని అన్ని పదాల వ్యుత్పత్తిని వివరిస్తూ లకంసాని చక్రధరరావు ఆధ్వర్యంలో పన్నెండు 'సంపుటాల' సవివర గ్రంథరాజాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం వెలువరించింది. భద్రిరాజు కృష్ణమూర్తి, తూమాటి దొణప్పగార్ల కృషికి ఇది కొనసాగింపు. సూర్యరాయాంధ్ర నిఘంటువు, భద్రిరాజు కృష్ణమూర్తిగారి మాండలిక పదకోశం, జి.ఎన్.రెడ్డిగారి పర్యాయపదకోశం వంటివి అద్భుత విజ్ఞానభాండాగారాలు. వీటన్నింటినీ పిల్లలకు పరిచయం చేయాలి. తెలుగులోని భాషా సుసంపన్నతను, సౌష్ఠవాన్ని వారికి వివరించి చెప్పాలి. మనమెవరికీ తీసిపోమన్న స్పృహను వారికి కలిగించాలి. పిల్లలకు భాషా బోధనను ఆసక్తికరంగా చేయాలి. ఏయే పదానికి, ఎన్ని మాండలికాల్లో, ఎన్నిరకాల అర్థాలున్నాయో వివరిస్తూ రంజింపజేసే ఉదాహరణలతో వివరించాలి. అప్పుడే భాషపట్ల మమకారం పెరుగుతుంది. అన్ని మాండలికాలూ సమానమే అన్న విషయాన్ని స్పష్టంగా బోధపరచాలి. ఒక్కో పదం ఒక్కో చరిత్రకు, సంస్కృతికి సంకేతం. పదాల వ్యుత్పత్తినీ, పుట్టుపూర్వోత్తరాలనూ ఆసక్తిగొలిపేలా పిల్లలకు వివరిస్తే- భవిష్యత్తులో అంతటా భాషాభిమానులే ఉంటారు. అందుకు సాంకేతిక విజ్ఞానం సాయాన్నీ తీసుకోవాలి.



భాషా పరిరక్షణలో సాంకేతికత పాత్ర?

నాలుగైదు దశాబ్దాల కిందట మాండలికాలకు సంబంధించిన అవగాహన మనకు అంతగా ఉండేది కాదు. సమాచార సాంకేతిక సదుపాయాలు ఇనుమడించిన తర్వాత భిన్న ప్రాంతాల్లోని మాండలికాలతో పరిచయం పెరిగింది. టీవీలు, కంప్యూటర్లు విస్తరించడంతో ఈ అవగాహన మరింత లోతుగా వేళ్లూనుకుంది. సాంకేతికతను ఉపయోగించి మనకున్న విస్తృత భాషా సంపత్తిని భద్రపరుచుకోవచ్చు. విభిన్న మాండలికాలు, సాహిత్యం, భాషా విశేషాలను పొందుపరచి దేశ విదేశాల్లోని తెలుగువారి దరికి చేర్చడం సాంకేతిక విజ్ఞానంతోనే సాధ్యమవుతుంది. తెలుగులోని మౌలికాంశాలన్నింటినీ గుదిగుచ్చి బ్రహ్మాండమైన భాషా భాండాగారంగా తీర్చిదిద్ది ముందుతరాల వారికి అందజేసే ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్య ఉమామహేశ్వరరావు వంటి వారు ఆ కార్యక్రమంలో ఇప్పటివరకూ విశేష కృషి చేశారు. వ్యాకరణ భేదాలు, మాండలికాలతో కూడిన తెలుగు భాషా సంపదను ఒక చోటికి సమకూర్చే ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. ఈ అపార సంపదను సాంకేతిక విజ్ఞానంతో సమన్వయం చేసే ప్రక్రియ ఇప్పుడు కొనసాగుతోంది. ప్రధానంగా మాండలికాలకు కీలక ప్రాధాన్యం ఇస్తూ ఈ ప్రక్రియ ముందుకు సాగుతోంది. భాషను పరిపుష్టం చేసే మహాయజ్ఞమిది. మాండలికాలతో పాటు ఉచ్చారణాపరమైన వివరాలనూ సాంకేతిక సమాచార నిధి (డాటాబేస్)లో పొందుపరిచే ప్రయత్నం జరుగుతోంది. ఏ ప్రాంతంలో ఏ పదాన్ని ఎలా పలుకుతారన్న విషయాన్ని స్వరబద్ధం చేసి నిక్షిప్తపరచవచ్చు. మనది విలక్షణమైన 'పలుకు'బడి. చిన్నపాటి తేడాలనూ ఉచ్చారణలో కనబరచగల సత్తా మన సొంతం. అందుకే పూర్వం 'ఆంధ్ర, ద్రావిడ భాషానాం' అన్నారు. ద్రావిడభాషలతో పోలిస్తే తెలుగుకు కొంత ప్రత్యేక అస్తిత్వం ఉందన్న గ్రహింపు మొదటినుంచీ ఉంది. మనం ఆర్యభాషల పదాలనూ స్వీకరించాం. ఈ విశిష్టతను దేశదేశాల్లోని తెలుగువాళ్లందరికీ తెలియపరచడం మన కర్తవ్యం. మాండలికాలు, ఉచ్చారణ వివరాలు సమకాలీన అంశాలు. భాషకు సంబంధించిన చరిత్ర మరో ముఖ్య అంశం. ఏ భాష సౌష్ఠవాన్నికైనా సాహిత్యం దర్పణం పడుతుంది. సుదీర్ఘ భాషా ప్రయాణంలో సాహిత్య ప్రస్థానం తీరును సాంకేతికత సాయంతో తెలుగువారందరికీ అందించే ప్రక్రియ మధ్యలో ఉంది. దానితోపాటు లిపి పరిణామానికి సంబంధించిన వివరాలూ పొందుపరచే కార్యక్రమం మరింత ముఖ్యమైంది. క్రమానుగతంగా ప్రతి యాభై ఏళ్లకోసారి లిపిపరంగా వస్తున్న మార్పులను 'డాటాబేస్'లో నిక్షిప్తం చేసే ప్రయత్నమూ జరుగుతోంది. మిగిలిన భాషీయులు తమ భాషల గురించి గొప్పగా చెప్పుకొంటుంటారు. మా భాష సమున్నతమైనదని మనమూ అంటుంటాం. అందుకు తగిన సాక్ష్యాలను మాత్రం చూపించం. తెలుగు భాషా పరిణామాన్ని, ఔన్నత్యాన్ని ససాక్ష్యంగా ముందు తరాలకు అందజేసేందుకు ఈ 'డాటాబేస్' ఉపకరిస్తుంది.

భాష ఆధునికీకరణలో ఇతరులతో పోలిస్తే?

భారతీయ భాషల్లో కంప్యూటరీకరణపరంగా బెంగాలీ, తమిళ్, మలయాళం, హిందీ చాలా ముందున్నాయి. భాషాపరమైన అంశాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్లలోకి ఎక్కించడం (అప్‌లోడ్), ముఖ్యంగా 'టెక్నాలజీ'ని ఉపయో

గించి భాషను స్థిరీకరించుకునే విషయంలో వారు చాలా దూరమే ప్రయాణించారు. 'యూనికోడ్'లో భాషకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్నీ వీరు సరిచేసుకుంటూ ఉంటారు. అంతర్జాలంలోనూ భాష గురించి లోతైన చర్చలు జరిపే బృందాలు ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలోనే కనిపిస్తాయి. జనాభాపరంగా తెలుగువాళ్ల సంఖ్య మిగిలినవారితో పోలిస్తే చాలా ఎక్కువే. కానీ, భాషను పదిలపరచుకోవాలన్న స్పృహ మాత్రం తక్కువ. ఇప్పుడిప్పుడే ఆ చైతన్యం పెరుగుతోంది. భాషా కంప్యూటరీకరణపరంగా బాగా వెనకబడే ఉన్నప్పటికీ - ఇప్పటివరకూ జరిగిన కృషి తక్కువేమీ కాదు. మాండలిక పదకోశం, వ్యుత్పత్తి పదకోశం వంటి అనేక కీలకాంశాలను ఇంకా 'డాటాబేస్'లో చేర్చాల్సి ఉంది. మామూలు నిఘంటువుకు, కంప్యూటర్ అవసరాలకు తగినట్లు రూపొందించే నిఘంటువుకు చాలా తేడా ఉంది. లింగపరమైన తేడాలు సహా అనేకానేక సూక్ష్మ అంశాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దాలి.

తెలుగు కంప్యూటరీకరణలో సవాళ్లేమిటి?

మన సాహితీ భాండాగారాన్ని శుద్ధంగా 'యునికోడ్'లోకి చేర్చేందుకు భాషావేత్తలందరూ చాలా కష్టపడాలి. ఉదాహరణకు పోతన పద్యం 'ఎవ్వనిచేజనియించు జగమెవ్వనిలోపలయుండు....' ఎవరికైనా పూర్తిగా గుర్తుకు రాలేదనుకోండి. ప్రపంచంలో ఎవ్వరైనా ఎక్కడనుంచైనా ఆ పద్యంలోని ఏ ఒక్క పదాన్ని 'అన్వేషణ' (సర్చ్)లోకి వెళ్లి టైప్ చేసినా మొత్తం పద్యం తెరపై ప్రత్యక్షం కావాలి. భాషావేత్తల ఓపికకు, నిబద్ధతకు ఇది ఓ పరీక్ష. విజ్ఞానఖనులకు మన వద్ద ఎలాంటి లోటూ లేదు. మహాభారతానికి సంబంధించే మనకు రకరకాల ప్రతులున్నాయి. పాఠకులకు వాటిలోని వైవిధ్యాన్ని, విలక్షణతను తెలియజెప్పగల రీతిలో కంప్యూటరీకరణ జరగాలి. అందుకు వందలమంది భాషావేత్తల కృషి తప్పనిసరి. దానితోపాటు విస్తృత ప్రణాళిక ప్రకారం పనిచేసే నియంత్రిత కేంద్రీయ విభాగం చాలా అవసరం. తెలుగు ప్రాచీన భాషా కాదా అన్న చర్చను గతంలో ఇతర భాషల వారు లేవనెత్తారు. నిజానికి మన భాష ప్రాచీనతను ప్రశ్నించే హక్కు మరెవ్వరికీ లేదు. ప్రాచీనతను నిరూపించడానికి తగిన ఆధారాలను అప్పటికప్పుడు చూపించగల పరిస్థితిలో మనం లేం కాబట్టి - వారికి అలా ప్రశ్నించే ధైర్యం వచ్చింది. శతాబ్దాల వారీగా కావ్యాలు, శాసనాలను, బొమ్మలతో సహా కంప్యూటరీకరిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవు. అరక్షణం ఆలస్యం చేయకుండా అడిగినవాళ్లందరికీ కంప్యూటర్‌లో ససాక్ష్యంగా మన భాషా విస్తృతిని ప్రదర్శించే వీలుంటుంది. తమిళులు, బెంగాలీలు ఇప్పటికే 'యూనికోడ్'ద్వారా సాంకేతిక వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసేసుకున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పరిశోధనలతో వారు భాషా సేద్యం సాగిస్తూనే ఉన్నారు.

భాషావేత్తల తక్షణ కర్తవ్యమేమిటి?

తెలుగు లోతుపాతులు తెలిసిన భాషావేత్తల సంఖ్యను మనం పెంచుకోవాలి. భాష లక్షణాలేమిటి, ఏ పదాన్ని ఎలా ఉపయోగించాలి అన్న శాస్త్రీయ అవగాహన ఉన్న వారి సహకారంతోనే 'భాషా కంప్యూటరీకరణ' సాధ్యమవుతుంది. అరసున్నా ఎప్పుడు ఉపయోగించాలి, ఎలా వాడాలి అన్న తరహా స్పృహ కలిగి ఉండటం వేరు... అవసరమైన ప్రతి చోటా దాన్ని కచ్చితంగా వాడి తీరాల్సిందేనన్న మొండి కట్టుబాటును అందరి నెత్తినా రుద్దడం వేరు. ప్రధానంగా కావలసింది అలాంటి స్పృహ కలిగిన భాషావేత్తలు. భాషకు సంబంధించిన సమస్త విషయాలనూ కంప్యూటర్లో గుదిగుచ్చడమంటే- అందులోకి జ్ఞానాన్ని జొప్పించడమే. అందుకు కావలసింది ఆ ప్రక్రియ చేపట్టినవారికి తగినంత జ్ఞానం ఉండటం. తెలుగు నేర్పే పండితులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కినప్పుడే నూతన మార్పులకు అనుగుణంగా భాషను మెరుగుపరచుకోవడం సాధ్యం. 'మా తాతలు నేతులు తాగారు...' అని చెప్పుకోవడం వరకే పరిమితం కాకుండా ఆ నేతులేమిటో ముందు తరాలవారికి చూపించగల పరిస్థితి రావాలి.

వృత్తిపరంగా తెలుగు భాషావేత్తలకు ఉన్న అవకాశాలేంటి?

భాషకు ప్రాణాలు వ్యాకరణం, సాహిత్యం. శతాబ్దాలుగా భాషలో సాంకేతికంగా వస్తున్న మార్పులను ప్రతిఫలించే సృజనాత్మకరూపమే సాహిత్యం. అందులో ప్రక్రియలను శాస్త్రీయంగా విశ్లేషించడం వ్యాకరణ, ఉచ్చారణ పండితుల బాధ్యత. భాషా పండితులకు అవకాశాలు ఆశావహమనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే, భాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే కంప్యూటరీకరణ ప్రక్రియ మరికొన్ని దశాబ్దాలపాటు కొనసాగబోతోంది. వివిధ విశ్వవిద్యాలయాలతోపాటు ప్రభుత్వాలూ ఆ అవసరాన్ని గుర్తిస్తున్న నేపథ్యంలో చెప్పుకోదగిన స్థాయిలో అవకాశాలున్నాయి. ఒక భాషమీద గట్టిపట్టు సంపాదించినవారికి మరో భాష లోతుపాతులు సులభంగా బోధపడతాయి. దేశంలో ఇరవై రకాల పద్ధతుల్లో ఆంగ్లాన్ని ఉచ్చరిస్తున్నారు. మరాఠీ వ్యక్తులు ఒకరకంగా, తెలుగువారు మరోరకంగా మాట్లాడతారు. బహుళజాతి కంపెనీలు ఇప్పుడు ఈ తేడాలకు అనుగుణంగా యంత్రాలను తీర్చిదిద్దుకుంటున్నాయి. ఉదాహరణకు 'ఏటీఎం' యంత్రాల్లో తెలుగువారి ఉచ్చారణకు అనుగుణంగానే కంప్యూటర్ల

ద్వారా ఆంగ్లాన్ని వినిపించే ఆలోచనలూ ఉన్నాయి. భాషావేత్తలకు ఇలాంటి చోట్ల పుష్కలంగా అవకాశాలున్నాయి. కంప్యూటరీకరణ రూపంలో ఆధునిక రంగాల్లోనూ, వ్యాకరణాన్ని సరైన పద్ధతుల్లో నేర్చుకున్నవారికి బోధన రంగంలోనూ అవకాశాలు దండిగానే ఉన్నాయి.

తెలుగు వ్యాకరణ బోధనను ఆసక్తికరంగా మార్చాలంటే?

వ్యాకరణం రాసే క్రమంలోనే విద్యార్థులకోసం రూపొందించే వ్యాకరణం వేరేగా ఉండాలి. 'డుమువులు' ప్రథమావిభక్తి అని పిల్లలతో భట్టీయం వేయిస్తే అది వారికి గుర్తుంటుందేమోగానీ పూర్తి అవగాహనకు రాదు. లింగభేదాలను విడమరచి బోధించి ఉదాహరణ సహితంగా చెబితే తప్ప ఇలాంటివి ఎక్కడం కష్టం. అరటిపండు ఒలిచిపెట్టినట్లుగా వ్యాకరణం సరళంగా చెప్పగల, రాయగల భాషావేత్తలు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక కృషి చేయాలి. వ్యాకరణమంటే భయం పోతే భాష పునాదులు విద్యార్థికి సులభంగా బోధపడతాయి. కేంద్రీయ నియంత్రిత సంస్థను ఏర్పాటు చేసి అందులో భాషాబోధన, భాషా విజ్ఞానబోధన, సాహితీ బోధన, కంప్యూటరీకరణ, విజ్ఞాన భాండాగార తయారీ, కొత్త అవసరాలకు అనుగుణంగా భాషను నవీకరించడం వంటి వివిధ విభాగాలను ఏర్పాటు చేయాలి. పాతికేళ్ల పక్కా ప్రణాళికను ఏర్పాటు చేసుకుని శాస్త్రీయంగా కృషి చేస్తే తప్ప అమ్మభాషను అందరికీ నిర్దిష్టంగా నేర్పించడం సాధ్యమయ్యే పనికాదు.

మన భాష సంపూర్ణ రూపాన్ని కాపాడుకోవడంలో ఎందుకీ నిర్లిప్తత?

అక్కడక్కడా కొంత నిర్లిప్తత ఉంది. బెంగాలీ, తమిళ భాషలు కొత్తతరం సవాళ్లకు అనుగుణంగా ఇంత అభివృద్ధి చెందాయంటే దానికి కారణం- వారికి భాషపట్ల ఉన్న ఉద్వేగమే. మనకూ వారికీ తేడా ఇదొక్కటే. భాషాసంస్కృతులపట్ల మమకారం పెరగాలి. ఉద్వేగభరితమైన అనుబంధం నెలకొనాలి. మన గొప్పతనం మనకు తెలిస్తే తప్ప అది సాధ్యం కాదు. అది మళ్లీ భాషావేత్తలు, విశ్వవిద్యాలయాలతోపాటు ప్రభుత్వ కృషి వల్లనే సాధ్యం. ఇప్పుడు భాషను కాపాడుకోవాల్సింది- ఉద్వేగం... ఉద్యమం!

మరో పాతికేళ్లలో మన భాషా ప్రస్థానం ఎలా ఉండబోతోందని మీ అంచనా?

భాషకు సంబంధించి సంధి దశలో ఉన్నాం. ఇప్పటికైనా మేలుకోకపోతే పరిస్థితి చేయి దాటిపోవడం ఖాయం. పద సంపదను, సాహితీ సౌబగులను, వ్యాకరణ పారిజాతాలను పరిరక్షించుకోకపోతే వాటి అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది. ప్రామాణీకరణ విషయాన్ని పక్కనపెడితే... తక్షణం భాషా స్థిరీకరణ చేసుకోవాలి. భాషారూపాన్ని ఉన్నది ఉన్నట్లుగా కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలి. వారసత్వ సంపదగా వస్తున్న వ్యాకరణం, ఉచ్చారణ, సాహిత్య సంపదను ఒక చోట చేర్చడం మన ప్రథమ బాధ్యత. ఈ కృషి ఇప్పటివరకూ అంతంతమాత్రంగానే జరిగింది. రాతప్రతుల్లోనో, అక్కడక్కడా గ్రంథాలయాల్లోనో మాత్రమే ఈ సంపదంతా నిక్షిప్తమై ఉంది. యావత్ తెలుగు సంపదను కంప్యూటరీకరిస్తేనే భాషను స్థిరీకరించుకున్న వాళ్లమవుతాం.

భాషా వ్యాసంగంలోకి అడుగుపెడుతున్న వారికి మీ సూచనలు?

భాషా బోధకులుగానీ, పరిశోధకులుగానీ ఎవరైనా రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతానికి చెందిన వారే. ఎవరికి వారు తమ ప్రాంతాలకు చెందిన మాండలిక స్వరూపాలను నిర్దిష్టంగా సేకరించి భద్రపరచాలి. ఆ తర్వాత పక్కనే ఉన్న ప్రాంతాలకు సంబంధించిన ఒకటో, రెండో మాండలికాలను నేర్చుకుని - తులనాత్మక అధ్యయనం చేయాలి. మాండలికాల మధ్య ఉన్న భేదాలు, సారూప్యతలేంటో వివరించాలి. భాషావేత్తలందరూ తమ స్థానిక మాండలికాలను నిక్షిప్తం చేయడం, ఇరుగు పొరుగు మాండలికాలతో పోల్చి వివరించడం చేస్తే తెలుగుకు అంతకుమించిన మేలు లేదు. ఇంట గెలిచి రచ్చ గెలవడమంటే ఇదే! తెలుగు భాషా చరిత్రను స్థూలంగా అధ్యయనం చేసి అవగాహన ఏర్పరచుకోవాలి. పిల్లలకు సరళంగా భాషను నేర్పించడం చాలా అవసరం. పిట్టకథలు, నవ్వించే సామెతలను ఏర్చి కూర్చి పాఠ్యాంశాలను ఆసక్తికరంగా మలచడం- భాషాబోధకులు తప్పనిసరిగా దృష్టిపెట్టాల్సిన అంశం. పిల్లలను గాబరా పెట్టకుండా వ్యాకరణాన్ని వారికి ఒంటబట్టించే మార్గాలు వెదకాలి. 'కచటతపలు' అన్న మాట వింటేనే పిల్లలు బెంబేలెత్తకుండా అవి పచ్చడిబద్దలంత రుచికరమైనవన్న భావన కలిగించాలి. ఆ ఒడుపును భాషావేత్తలు ఎంత త్వరగా పట్టుకుంటే అంత మంచిది. ఈ సందర్భంలో, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వారు తమ 'ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం' ద్వారా ప్రాచీన పద్యకావ్యాలకు 'పాఠకమిత్ర' వ్యాఖ్యానాలను వాడుకనుడిలో ముద్రితరూపంలోనూ అందించడానికి శ్రీకారం చుట్టడం ముదావహం.

ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి
హైదరాబాద్, 90007 89635

ఈ తప్పు నాది కాదు

నాకప్పుడు పదకొండేండ్లు. చానా తుంటరోణ్ణి. బడికి ఎగనామం పెట్టి, జతగాళ్లతో కలిసి ఆడుకోనికి వెళ్లేవోణ్ణి. మా ఇంటి వెనకాలే ఆకాశం అంటుకు నేంత ఎత్తుకొండల వరుస ఉంది. అందరం ఆ కొండల్లోకి వెళ్లేవోళ్లం. వర్షాలు పడినపుడు అక్కడక్కడ జలపాతాలు పడుతుంటాయి. ఆ జలపాతాల్లో నానుతూ, కేరింతలు కొడుతూ ఆనందించేటోళ్లం.

ఆ కొండలు సీతాఫలం పండ్లకు పెట్టింది పేరు. కొండల నిండా సీతాఫలం చెట్లతో ఆకు పచ్చరంగుతో ఆ కొండవరస పచ్చ దుప్పటి కప్పినట్లుంది. చూసే దానికి అందంగా కనిపిస్తోంది. సీతాఫలం పండేకాలంలో ఆ కొండల్ని వేలం పాటల్లో దక్కించుకున్నోళ్లు ఎప్పుడూ కాపలా ఉంటారు. దొంగతనంగా వచ్చి కాయలన్నీ తెంపుకొని పోతారని.

మేమంతా కలిసి వాళ్లకండ్ల పడకుండా చాటుమాటుగా పోయి కాయల్ని పీక్కొచ్చేవాళ్లం. ఒకొక్కసారి వాళ్ల కంట్లో పడి తిట్లు తినేవోళ్లం. మా ఊరు రాయదుర్గం, అనంతపురం జిల్లాలో ఉంది. మా ఊర్లో పావురాల పందాలు జోరుగా సాగుతాయి. ఆ ఆటంటే ఎగిరి గంతేసినంత సంబరం. ఈ మోజులో పడి చదువు అశ్రద్ధ చేస్తున్నానని ఎన్నో సార్లు ఇంట్లో చావుదెబ్బలు కొట్టేవోళ్లు.

ఆ దినం బేస్తవారం (గురువారం). మా ఊరి సంత. మాయమ్మ సంతలోకి పోవాలని బిరిబీరిన (త్వరత్వరగా) జొన్నముద్ద, ఉలవల ఊర్బిండి (చట్నీ) చేసిపెట్టి సంతకి పోయింది.

పోయేటప్పుడు "రే తిని బడికి పో, పోకుంటే నా చేతుల్లో చచ్చినావే" అని హెచ్చరించి చెప్పి పోయింది. అమ్మ మాటంటే మాకు లెక్కలేదు. వినీ విననట్లు తలూపి ఇంట్లోకి పరిగెత్తా. మట్టికుండ మూకటి (మూత) తీసి సత్తుకంచంలో ముద్ద పెట్టుకున్నాను. ముద్దంత ఉలవల ఊర్బిండి ఏస్కోని రొవ, రొవంత ముద్దలేసుకొని ఊర్బిండిలో పొర్లించుకొని, పొర్లించుకొని తింటున్నాను. ఊర్బిండి చానా కమ్మగుందని. అంతలో నా జతగాడు పురుషోత్ముడు వచ్చినాడు.

"తిందాం రా!" అన్నాను నేను.

వాడు నా కంచెం దిక్కుచూసి

"ముద్దకంటే ఊర్బిండే బాగుంది కదరా" అన్నాడు. (పిట్ట కొంచెం కూత ఘనం అన్న నానుడికి సారూప్యం)

"బాగుంది తిందువురా" అన్నాను.

"వొద్దు ఇప్పుడే తినొచ్చినాను గాని మన కోట్లో వాళ్లకి, వేరే గేరోళ్లకి పావురాల పందెం ఉంది. బిరీన పోదారం రాలే అన్నాడు.

పావురాల పందాలు అంటే చెవి కోసుకునే నేను గబగబమని సంగటిని మూడు తుత్తుల్లో (ముద్దల్లో) తిని "పోదాం రా" అన్నాను. అతడంటే నాకు గౌరవం కాబట్టి 'లే' ఉపయోగించను.

మా గేర్లో వాళ్లకి, అవతలి గేర్లో వాళ్లకి పందెమంటే చానా రసవత్తరంగా ఉంటుంది. ఎప్పుడూ మా గేర్లో పావురమే గెలిపిస్తుంటుంది. చానా దుడ్లు పందెం కడ్తారు. ఈ సారి ఎవరు గెలుస్తారోనని నాకు చానా ఎదారు (భయం)గా ఉంది. అట్లనే పందాల దగ్గరికి పోతున్నాము.

పావురాల పందాలు ఆడేవోళ్లు, పావురాల్ని సాకటానికి మూడు గజాల వెడల్పు, నాలుగు గజాల పొడవు అటు ఇటుగా ఉన్న చెక్కపెట్టెను తయారు చేపిస్తారు. ఆ పెట్టెల్లో అడ్డంగా నిలువుగా చెక్కల్ని చక్కగా పెట్టి చిన్న, చిన్న గూళ్ళు తయారు చేస్తారు. దానికి రెండు సన్న వాకిళ్ళు బిగిస్తారు. ఆ గూళ్లల్లో పావురాల్ని ఉంచి సమయానికి గింజలు, నీళ్లు పెట్టి ఎంతో జాగ్రత్తగా సాకుతారు.

ఈ పందానికి ఎప్పుడూ దూరాన్ని దృష్టిలో పెట్టుకుంటారు. ఇవతల పావురాల గూడుకు, ప్రత్యర్థి పావురాల గూడుకు రెండు మైళ్ల అంతకన్నా తక్కువ కాని, ఎక్కువ కాని పెట్టుకుంటారు. అవతలి వాళ్లు, ఇవతలి

వాళ్లు తమ పావురాల్ని తెచ్చుకుంటారు. సాధ్యమైనంత వరకు గుడ్లు పొదిగిన పావురాల్ని, గుడ్లు పెట్టే పావురాల్ని ఈ పందాలకు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. పిల్లల తల్లైతే బిడ్డలు ఏం తిన్నారో, లేదో ఎట్లున్నారో అన్న ఎదారుతో బీరీన గూటికి చేర్కోవాలన్న ఆత్రంతో ఉంటాయి. గుడ్లు పెట్టే పావురాలు కూడా ఇంతే ఆత్రంతో ఉంటాయి. ఎంత దూరం నుంచి వదిలినా క్షణాల్లో వచ్చి వాలిపోతాయి.

ఈ ఆటంతా పావురాల రాక మీద ఆధారపడి ఉంటుంది. ఎవరి పావురం బీరీన గూటికి చేరుకుంటుందో వాళ్లదే గెలుపు. ప్రత్యర్థులిద్దరూ తెచ్చిన పావురాల్ని పెద్దోళ్ల సమక్షంలోకి తీసుకొని పోతారు. ఆ పెద్దమనిషి వేర్వేరు రంగులు కలిగిన దళసరిగల చిన్న దారాల్ని ప్రత్యర్థులకు ఇస్తాడు. ఆ దారాల్ని పావురాళ్ళ కాళ్ళకి గుర్తుగా కట్టుతారు.

తర్వాత ఆ పావురాల్ని ఎత్తైన కొండమీదికి తీసుకొని పోతారు. ఇద్దరూ కొండ శిఖరంపై నిలబడ్తారు. వాళ్ళు అక్కడున్నట్లు దాదాపుగా ఇవతల గూడు వాళ్లకు, అవతల గూడు వాళ్లకూ కనిపించేటట్లుగా ఆ కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటారు. కనపడని చానా మంది మిద్దెలు, చెట్లు ఎక్కి చూస్తుంటారు.

కొండపైనుంచి పావురాల్ని విడిచిపెట్టే ముందు తమ వెంట తీసుకుపోయిన ఓ వస్త్రాన్ని సూచనగా ఊపి ఇద్దరూ కలిసి పావురాల్ని ఒకే సమయంలో గాల్లోకి ఎగరవేస్తారు. అంతలో అవతలి గూడువాళ్లు, ఇవతల గూడు వాళ్లు అప్రమత్తమై ఉంటారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకొని ఉంటారు.

ఇరువర్గాల వారికి సమాంతర రేఖ ఒకటి రోడ్డుపై అడ్డంగా గీస్తారు. పావురాల బోను మొదలుకొని సరిహద్దు రేఖకు కొంచెం దూరంలో ముగ్గురు, నలుగురు దూరాన్ని బట్టి, మూడు, నాలుగొందల అడుగుల వరకు ఒకొక్కరు చొప్పున పరుగు వీరులు నిలబడతారు. ఒక్కరైతే అంత దూరం ఆయాసంతో పరుగెత్తలేరని ఈ ఏర్పాటు.

కొండ పైనుంచి పావురం వదలగానే అది వచ్చి తమ, తమ బోనుల్లో వాలిపోతాయి. ఆ వెంటనే ఆ పావురాన్ని అందిపుచ్చుకొని ఒడుపుగా పట్టుకొని పరుగుతీయాలి. అలా పరుగులేయటానికి సిద్ధంగా ఒకరు అక్కడ ఉంటారు.

అతడి రాక కోసం కొన్ని వందల అడుగుల దూరంలో ఇంకొకరు. అతడి చేతిలోంచి పావురాన్ని అందుకొని పరుగులేయటానికి సిద్ధంగా ఉంటాడు. ఇలా ఒకరి చేతుల్లోంచి ఇంకొకరు పరుగుపెట్టానే మార్చుకుంటూ గీత దాటాలి. ముందుగా ఎవరు గీత దాటితే వాళ్లు గెలిచినట్లు. గెలుపోటములు అయిపోయాక పావురాళ్ళ కాళ్ళకి కట్టిన రంగుదారాన్ని విప్పి మార్చుకుంటారు. అంతటితో పందెం ముగుస్తుంది. గెలిచిన వాళ్ళు పందెం డబ్బు తీసుకుంటారు.

ఈ దినం పందేనికి మాగేర్లో పావురాలు సాకే తిప్పన్నకు, ప్రత్యర్థి పాపన్నకు మధ్య పోటీ. తిప్పన్న పావురం ఎన్నో పోటీల్లో పాల్గొనింది. ఎప్పుడూ ఓడిపోలేదు. ఆ పావురం అంటే తిప్పన్నకు పంచ ప్రాణాలు. తిప్పన్నకే కాదు మాక్కూడా. ఈ దినం మా పావురమే గెలుస్తుందని అందరిలోనూ ధీమా. మేం పందెం కట్టకపోయినా ఆ పావురం గెలవాలని మనసారా కోరుకుంటున్నాం.

మేము పోయేసరికి రోడ్లలో జనం గుంపులు, గుంపులుగా గూడి ఉన్నారు. ఏది గెలుస్తుందోనని చర్చించుకుంటున్నారు. పందాలు ఎక్కువ మొత్తంలో జోరుగా సాగుతున్నాయి. వెదురు దబ్బలతో తయారు చేసిన, చిన్న మూత గల బుట్టలో అవతలివాళ్లు పావురాన్ని తీసుకొని వచ్చారు.

తిప్పన్న కూడా అలాంటి బుట్టలోనే పావురం తీసుకొని వచ్చాడు. బుట్టలోంచి పావురాల్ని బయటకు తీశారు. పెద్దలు ఇద్దరికీ రంగు దారాలిచ్చారు. ఇద్దరూ దారాలు మార్చుకొని పావురాళ్లకి కట్టారు.

ఇద్దరూ సంకేతాలిచ్చి ఒకేసారి పావురాల్ని వదలాలని జాగ్రత్తలు చెప్పి వాళ్ల మనుషుల్ని పంపారు. ఆ ఇద్దరూ కొండవైపు నడక సాగించారు.

తిప్పన్న ఈ సారి ఎక్కువ మొత్తంలోనే పందెం కాశాడు. తను లారీ డ్రైవరు. వారంలో నాలుగు రోజులు పనికి వెళ్తాడు. మూడు రోజులూ పావురాల పందమే. తన వృత్తిలో సంపాదించుకున్న డబ్బు కన్నా ప్రవృత్తి పావురాల పందెంలో సంపాదిస్తున్న డబ్బే ఎక్కువ. ఈ సారి కూలి డబ్బులే కాకుండా పెండ్లాం బంగారు కమ్మలు, ముక్కెర, వెండి కడియాలు అన్నీ అమ్మేసి పందెం కాశాడు. నా పావురమే గెలుస్తుందన్న ధీమాతో ఉన్నాడు.

సాయంత్రం నాలుగ్గంటలు కావస్తోంది. పావురాళ్లతో వెళ్లిన వాళ్లు కొండ అంచుకు దగ్గరలో ఉన్నారు. కిందినుంచి చూస్తున్న వాళ్లకి ఆకారాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇంకా కొండపైకి చేరుకోలేదే! అని ఆతృతతో ఎదురు చూస్తున్నారు. వాళ్లు కొండపైకి చేరుకున్నారు. అందరిలోనూ ఉత్సాహం రెట్టింపైంది. కొంచెం సేపటికి కొండ కొనాన నిలబడినట్లు కనిపించింది. చూస్తున్న వాళ్లందరిలోనూ కలకలం రేగింది.

కనబడని వాళ్లు "ఏమాంద్రా యాడుండారలే" అని పక్కోళ్లని అడుగు తున్నారు ఎంతో ఆసక్తిగా.

పక్కోళ్లు "ఆడ" అని చూపుతున్నారు.

కొండ మీదున్న వాళ్లు భుజమ్మీది కండువాను చేతుల్లోకి తీసుకున్నారు. అది కొందరు గమనించారు. పక్కోళ్లతో అంటున్నారు... "లే...లే...' చేతుల్లోకి కండువాలు తీసుకున్నారలే. ఇంక పావురాన్ని ఇడుస్తారు" అని.

అందర్లోనూ ఒకటే ఎదారు, ఉత్కంఠ. ఇంక పందెం కాసినోళ్ల హడావుడి చెప్పనక్కర్లేదు. వాళ్లిద్దరూ కండువాలు ఒకేసారి ఊపుతున్నారు. అందరూ గుడ్లప్పగించి ఉత్సాహంగా చూస్తున్నారు.

పావురాల్ని చేతుల్లోంచి తీసుకొని ఇద్దరూ ఒకేసారి వదిలారు. చూస్తున్న వాళ్లు అది గమనించి 'లే! పావురాలు ఇడిసిపెట్టినార్రా" చెట్లు, మిద్దెలెక్కినవాళ్లు ఆత్రంగా దిగుతూ పావురాల గూటికి చేరుకుంటున్నారు.

ఆ రెండు పావురాలు గాలిలో రెక్కలు టపటపమని కొట్టుకుంటూ తమ గమ్యస్థానానికి వెళ్లసాగాయి. గూడు దగ్గర తమ పావురం కోసం ఎదురుచూస్తున్న వాళ్లు, దాన్ని ఇంకా త్వరగా రప్పించటానికి గింజలు వేస్తూ, తోటి పావురాలను గాల్లోకి ఎగరవేస్తున్నారు. పాపన్న పావురం



విమానంలా దూసుకెళ్తోంది. తిప్పన్న పావురం దాన్ని వేగాన్ని అందుకోలేకపోతోంది. గూటికి తొందరగా చేరుకోవాలని రెక్కలు కొడుతూనే ఉంది. కానీ వేగం పుంజుకోలేక పోతోంది. దాని మనసులో దిగులు.

తన పిల్లలు పొద్దుననగా ఆహారం తీసుకున్నారు. మరి మాపటేళ కావస్తోంది. ఏం తిన్నారో, ఏం లేదో, కొంచెం సేపు నేను కనబడక పోతే చానా చానా బాధపడుతూ నా కోసం ఎదురు చూస్తుంటాయి. తోటి పావురాలు ఈర్ష్యతో తన పసికూనలని పొడిచి, పొడిచి పెడ్తాయి. దానికి తోడు ఇంకొకరి భయం పట్టుకుంది.

మా గూడు పక్కనే ఇల్లొకటుంది. ఆ ఇంట్లో ఓ కుక్కుంది. మమ్మల్ని చూస్తే చాలు ఎప్పుడెప్పుడు అమాంతం నోట కరచుకుందామా అని ఎదురు చూస్తుంటుంది. ఆ దొంగ కుక్క. చానా సార్లు పిల్లల్ని పట్టుకోనికి వచ్చినప్పుడు నేను దాన్ని ఎదిరించి ముక్కుతో పొడిచి పొడిచి పెట్టి వెనక్కి పంపించాను. ఇప్పుడు నేను లేను. ఇదే అదును చూసుకొని ఆ దొంగ కుక్క నా పిల్లల్ని యాడ నోట కరచుకొని పోతుందేమోనని ఆందోళన చెందుతూ, బలమంతా రెక్కల్లోకి తెచ్చుకొని ఆయాస పడుతూ రెక్కలను జోరుగా ఆడిస్తూ వస్తోంది కానీ ముందుకు సాగడం లేదు పయనం.

తిప్పన్న మనసులో ఒకటే ఆలోచన. ఆందోళన, ఉత్కంఠ "దీనెమ్మ దీనికేమైంది ఈ దినం? ఆడ వదలగానే ఈడ వాలిపోయేది. ఇంతసేపైనా రాలేదు. అవతలి పావురం ఈ పాటికి తన గూడు దగ్గరికి పోయి ఉంటుంది అని నిరాశ, నిస్పృహలకు లోనయ్యాడు.

ఇంకా ఆశచావక పావురాన్ని రప్పించటానికి తన పిల్లల్ని గాలిలోకి ఎగరవేస్తూ 'హ....హ....హ....” అంటూ గట్టిగా పిలుస్తున్నాడు.

అంత దూరం నుంచే తన పిల్లల్ని పసిగట్టింది పావురం. పిల్లల్ని అలా గాలిలో ఎగరవేసినందుకు దానికి చాలా బాధేసింది. ఇంకా రెక్కలు సరిగా విప్పని ఆ కూనలు ఎక్కడ కిందపడి తలలు పగిలి చస్తాయో! తొందరగా పోయి వాటిని గాల్లోనే కాళ్లతో పట్టుకొని గూడులోకి చేర్చాలని విశ్వప్రయత్నం చేస్తోంది కలత చెందుతూనే.

అప్పుడే ప్రత్యర్థి పావురం తన గూటికి వెళ్లిపోయిందని తెలిసేసరికి తిప్పన్న కోపం నసాలానికి ఎక్కింది. గావుకేకలు పెడుతూ పిలుస్తూనే ఉన్నాడు. కొద్దిసేపటికి ఆ పావురం అలసిపోయి రెక్కలునెప్పి పుట్టి నిదానంగా గూట్లోకి చేరుకుంది.

'ప్రత్యర్థి గీత దాటాడు. అవతలి వాళ్లు గెలిచారు' అని ఎవరో అంటున్నారు. ఆ మాట విన్న తిప్పన్న ఓటమి భరించలేక ఆగ్రహోదగ్రుడైనాడు. ఉన్మాదిలా ఊగి పోతున్నాడు. కళ్లు నిప్పుకణాల్లా ఎర్రబడ్డాయి. విచక్షణా జ్ఞానం కోల్పోయినాడు. గూట్లో పావురాన్ని ఆవేశంగా పిడికిలి బిగించి పట్టుకున్నాడు. అంత గాఢమైన స్పర్శను ఎప్పుడూ తను చూడలేదు. ఏదో ప్రమాదం ఉందని ఊహించింది. అతడి పిడికిలి మరింత బిగుసుకుంది. చేతిలో నల్లిలా నలిగిపోతోంది. నన్నేమో చేస్తాడని నిర్ణయించుకొని ఘోషించింది ఆ పావురం.

అయ్యా! నన్నేం చేయకు. నేను పిల్లల తల్లిని నీ బిడ్డలాంటి దాన్ని. నీ బిడ్డను చేతులారా నువ్వే చంపుకొంటావా? నా బిడ్డలు నీకు మనమడు, మనుమరాలి లాంటి వారు కదా! వాల్లెవరు చూస్తారు, నన్నేం చేయొద్దు అర్థిస్తున్నట్లుగా ఉంది.

తిప్పన్న చేయి గాల్లోకి లేచింది.

"అయ్యా... అయ్యా! ఆ పసిపిట్టల మొహం చూసి రొవంత కనికరించయ్యా, కరుణ చూపయ్యా. మా జాతి మీద మీకెందుకయ్య ఇంత పగ. మేమేం చేసినాం. నన్ను రక్షించయ్యా"

కసాయి తిప్పన్నకు కరుణ, జాలి కలగలేదు. అసలు ఆలోచించే స్థితిలో లేడు. నన్ను కాపాడమని, రక్షించమని, తన మొర ఆలకించమని అడుక్కుంటున్నట్లుంది. కిచ్.... కిచ్....మని ధ్వనితో ఏడుస్తున్నట్లుగా ఉంది. అదేం పట్టని తిప్పన్న బలంగా, విసురుగా బండకేసి కొట్టాడు పావురాన్ని. 'కిచ్..'మన్న శబ్దంతో ఊపిరి ఆగిపోయింది. దాని శరీరం ఛిద్రమైపోయింది. అది చూసి మిగతా పావురాలు అరుస్తూ గాల్లోకి ఎగరసాగాయి. బాధను, సానుభూతిని వ్యక్తం చేస్తూ.

రెండు పసిపిట్టలు తమ అమ్మ శవం దగ్గరకు చేరి చుట్టూ తిరుగుతూ ముక్కులతో ముద్దు, ముద్దుగా పొడిచి 'లే..మ్మా' అంటూ లేపుతున్నట్లున్నాయి. పాపం వాటికేం తెలుసు వాళ్లమ్మను హత్య చేశారని. ఆ దృశ్యం చూస్తున్న కొందరి హృదయాలు ద్రవించికుపోయాయి.

తిప్పన్నకు కోపం చల్లారలేదు. కసిగా ఆ పావురాన్ని తిడుతూనే ఉన్నాడు. 'దీనెమ్మ, దీనెక్క ఇది గెలుస్తుందని ఎంతో నమ్మకంగా నూర్లు, నూర్లు పందెం కట్టినాను. ఇట్లా సోలి (ఓడి) పోతుందని తెలుసుంటే పందెం కట్టేటోన్ని కాదు. అని బూతులు తిట్టుకుంటూ సారా అంగడి దిక్కుకు నడుస్తున్నాడు.

సారా అంగడి నిండా జనంతో కోలాహలంగా ఉంది. గెలిచి నోళ్లు సంతోషంగా మాట్లాడుకుంటూ సారా

తాగుతున్నారు. తిప్పన్న రాగానే అందరూ గమ్మునయ్యారు. ఏం మాట్లాడితే ఏం గలాటా జరుగుతుందోనని. అప్పుడే మబ్బులు ఆకాశం నిండా పరుచుకున్నాయి. తిప్పన్న పీకల్దాకా తాగినాడు. తూలుతూ, వదరుతూ ఇంటి ముఖం పట్టాడు.

ఇంట్లో పెండ్లాము 'బువ్వ తినని పిలిస్తే' సోలిన బాధతో ఆమెపైనా రంకెలేసినాడు.

"నీ యాల్ది నాకేమొద్దు పో" అని నులకమంచంపై దభీమని పడిపోయి మత్తుగా నిద్రలోకి జారుకున్నాడు.

"అయ్యా... అయ్యా! నేను నీ బిడ్డ పావురాన్ని. ఏం తప్పు చేసినానని మరణశిక్ష విధించినావయ్యా. నీకేం అన్యాయం చేసినానని నా బిడ్డలను అనాథల్ని చేసినావు. గెలుపోటములు ప్రతి జీవికీ తప్పవయ్యా. గెలిస్తే సంబరాలు చేసుకుంటారు. సోలిపోతే చేతగాని వాళ్లని నిందిస్తారు.

జీవితంలో నువ్వెప్పుడూ సోలి పోలేదా? ఎన్నో సార్లు సోలిపోయి ఉంటావు. ఒకే ఒక్కసారి సోలిపోయానని నన్ను హత్య చేశావు. ఆ మధ్యన నువ్వు మోటారు సైకిల్ పందెంలో ఓడిపోలేదా? అప్పుడు నువ్వెందుకు ఆత్మహత్య చేసుకోలేదు. బలహీనులైన మాపైనా మీ ప్రతాపం? గెలుపు, ఓటమి... రెంటినీ సమానంగా తీసుకున్నవాడే అసలైన క్రీడాకారుడు.

అయ్యా! జరిగిందేదో జరిగిపోయింది. హాయిగా, స్వేచ్ఛగా ఆకాశంలో తిరుగుతూ ఆడుతూ, పాడుతూ ఆనందిస్తూ జీవితాన్ని సాగదీస్తున్న మమ్మల్ని మీ కబంధ హస్తాల్లో బందీ చేసి చిత్రహింసలు పెడుతున్నారు. అనవసరంగా నా ప్రాణాన్ని గాలిలో కలిపేశావు. ఇక నా సంగతి వదిలేయ్.

'అయ్యా! దయచేసి చెబుతున్నా, నా పిల్లలకి ఈ గతి పట్టించకు. నా పిల్లల జోలికి పోవద్దు. పందాల పావురాలుగా మార్చొద్దు. వాటి ప్రాణాలు తియ్యొద్దు. వాటిని వదిలెయ్. స్వేచ్ఛగా, హాయిగా వాటి బతుకు అవి బతుకుతాయి. అంతేకానీ మా బతుకులతో మాత్రం ఆడుకోవద్దయ్యా! నీకు దండం పెడ్తా. నా పిల్లల్ని ఆ చెర నుంచి విముక్తుల్ని చేయి.

అన్నట్టు అయ్యా! నేను సోలిపోవటానికి కారణం నేను కాదయ్యా! మీ ప్రత్యర్థుల్లో ఎవడో అర్ధరాత్రి దొంగతనంగా వచ్చి, నన్ను పట్టుకొని నా రెండు రెక్కల్లో బలమైన నాలుగు ఈకల్ని నిర్దాక్షిణ్యంగా కోసేశాడు. అందుకే సోలి పోయాను. రెక్కలు కత్తిరించినప్పుడు నా బాధ వర్ణనాతీతం. అయ్యా! ఈ తప్పు నాది కాదు. మీ మనుషులదే.

మీ మనుషులు చేసిన తప్పుకు నేను ప్రాణాలు పణంగా పెట్టినాను. ఇకనుంచైనా మీ మనుషులు మేల్కొనండి. మా జాతిని, ఇతర జాతుల్ని వేధించకండి, చంపకండి. కాపాడండి, సంరక్షించండి. ఇదే నా విలాపం, విన్నపం."

పొద్దున సమయం తిప్పన్న నిద్రలేచాడు. నులక మంచం పైనుంచి బద్ధకంగా ఆవులిస్తూ ఒళ్లు విరుస్తూ రాత్రి తాగిన మత్తును విదుల్చుకొంటూ పైకి లేచినాడు. మంచమ్మీదే కూర్చొని బీడీ వెలిగించి దమ్ము లాగాడు. రాత్రి కల గుర్తొచ్చింది. కలలో తన పావురం ఆవేదనతో విలపించిన విషయాలన్నీ సినిమా రీళ్లలా గిర్రున తిరగసాగాయి. అంతే! మనసు నీరు కారిపోయింది. తెలీకుండానే తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా కళ్లు చెమర్చాయి. ఆ బాధను తట్టుకోలేకపోయాడు. పావురాల బోను దగ్గరికి వెళ్లి చూశాడు. బోను వెనకాల పావురం ఈకలు కనిపించాయి. ఆవేదనతో కన్నీళ్లు కార్చాడు. మనసున్న మనిషిగా ఆలోచించాడు. ప్రత్యర్థిపై పగ పెంచుకోలేదు. బోయవాడు క్రౌంచ పక్షిని వధించి ఆ తర్వాత చింతాక్రాంతుడై వాల్మీకిగా మారినట్లు, తిప్పన్న పశ్చాత్తాపంతో మనిషిగా మారి, బోనులోని పక్షులన్నింటినీ గాల్లోకి వదిలాడు. అవి ఆకాశంలోకి స్వేచ్ఛగా ఎగిరిపోసాగాయి.

బి.వెంకటేశ్వర్లు
కొడిగెనహళ్ళి, అనంతపురం
99637 76763

"గున్న మావి మీద
కుహూ/ కుహూ రాగాలు
కొసరి కొసరి కూయు కోకిలమ్మ!/
మల్లెపూలు విచ్చి మలిసంజ
కెంజాయ/ కమ్మ తెమ్మెరలను
కౌగిలింప../ సకల సృష్టి యెల్ల ఒక
బృహద్గ్రంథమ్ము!/
హృదయమున్నవారు
చదువవచ్చు!/ ఎట్టి
నవలగాని ఎట్టి
నాటకమైన/
మించలేదు - ఈ ప్రపంచమును!" -

– నండూరి రామకృష్ణమాచార్య

BANK-CLERKS & POs
LIC - AAOS / ADOS
SSC (Staff Selection Commission)
BATCHES ARE IN PROGRESS

Sreedhar's
CCE Key to SuCCEss
COLLEGE FOR COMPETITIVE EXAMS
Suryaraopet, VIJAYAWADA - 2.
Ph. 2438383, 2441177, 9392668899
www.sreedharscce.com

కదనంలో రుద్రమ...
కవనంలో సత్యభామ

రాణీ రుద్రమదేవి...
  కాకతీయ మహాసామ్రాజ్యభార ధారిణి.
శాత్రవ భయంకర నిత్య రుద్ర రూపిణి.

సత్యభామ...
  వీర శృంగార రసదేవత.

కాకతీయ సామ్రాజ్ఞిని స్ఫూర్తిగా తీసుకునే మన కవులు సత్యభామను వీర భామినిగా చిత్రించి ఉండొచ్చు. అందుకే తెలుగు సత్యభామలో రుద్రమ భుజశక్తి కనిపిస్తుంది. రుద్రమదేవి యుద్ధకౌశలానికి స్పందించిన నాటి కావ్యకర్తలు తమ కావ్యాల్లోని సత్యభామ పాత్రతో యుద్ధం చేయించారు. 13వ శతాబ్దికి పూర్వమున్న సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో సత్యభామ ఎక్కడా యుద్ధం చేసినట్లు కనిపించదు.

మహిళా పరాక్రమశక్తికి ప్రతీక రుద్రమదేవి. తెలుగు వారి మహారాణి. ప్రపంచ చరిత్రలో ఎన్నో యుద్ధవిజయాలు సాధించిన పరిపాలిక. చరిత్రలో ఆమెకు ఇంచుమించు సమకాలీనురాలైన రజియా సుల్తానా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించినా యుద్ధాల్లో విజయాలను సాధించలేకపోయింది. ఎక్కువ రోజులు పరిపాలించలేకపోయింది. మహిళలు యుద్ధాల్లో పాల్గొని విజయాలు సాధించటం అరుదైన విషయం. కదనరంగంలో కాళికలా విజృంభించే రుద్రమదేవి వీరత్వాన్ని చూసో, వినో ఆ కాలపు కవులు ఎర్రన, నాచన సోమన తమ సృజనల్లోని సత్యభామతో ఆయుధం పట్టించారు. తదనంతర కాలంలో పోతన కూడా తన భాగవతంలో సత్యభామను వీరనారిగా వర్ణించారు.

ఎక్కడెక్కడైతే రాణి రుద్రమదేవి యుద్ధాలు చేసి విజయాలను సాధించిందో.. ఆయా ప్రాంతపు కవులు ఆమె యుద్ధనైపుణ్యాన్ని చూసి ఉంటారు. అందుకే తమ కావ్యాల్లోని సత్యభామ పాత్రను వీరరసాత్మకంగా మలచగలిగారు. రుద్రమదేవి కళింగ గాంగులను, నెల్లూరు చోడులను, పాండ్యులు, యాదవులను జయించి ఆయా ప్రాంతాలను స్వాధీన పరుచుకుంది. దీని స్ఫూర్తిగానే కాబోలు... నెల్లూరు సమీపంలోని అద్దంకికి చెందిన ఎర్రన తన హరివంశ ఉత్తర భాగంలోని నరకాసురవధ ఘట్టంలో సత్యభామ చేసిన యుద్ధాన్ని ఇలా వివరించారు...

  వీరం బాడు దనంబు నొందెననగా
విక్రాంతి శాతిత్వల
  క్ష్మేరేఖంబచరించె నాగధృతి
యక్షీణకృతాంజెందెనా
  ధీరోదాత్త పతిప్రియ చరణభక్తి ప్రౌఢ
                    యాతన్విదా
  బ్రారంభించె మహారణక్రియకు నా
ప్రత్యర్థి లోనుక్కునన్

అంబదేవుడు అనే వాడు కడప, చిత్తూరు మండలాల్లో రుద్రమ అధికారాన్ని ధిక్కరిస్తాడు. నెల్లూరులోనూ తిరుగుబాటు చేయిస్తాడు. దాంతో కడప ప్రాంతమైన త్రిపురాంతకంలో అంబదేవుడిపై కాకతీయ సామ్రాజ్ఞి యుద్ధం చేసి అతని పీచమణిచింది. దీన్ని చూసే కడపవాసియైన నాచన సోమన తన ఉత్తర హరివంశంలో సత్యభామ చేత యుద్ధం చేయించి ఉంటారు. ఆ రణఘట్టంలో సత్యభామను శృంగార వీర రసస్ఫోరకంగా వర్ణించారు...

  ఊచనకట్టు వంపని పయోరుహలోచన
మింట మంటలన్
  బూచిన బాణజాలమున పూర్వ
సుపర్వపురాణ గర్వమున్
  వేచిన చందమున్ విపుల

వీరరసంబున నాత్మచిత్తముం
దోచిన చందముందెలియ దోచిన
నచ్చరలిచ్చమెచ్చరే!

రుద్రమదేవి... ఓరుగల్లును ఆక్రమించిన యాదవరాజు మహాదేవుణ్ని దేవగిరి వరకు తరిమికొట్టినట్లు చరిత్ర చెబుతోంది. ఈ రణస్ఫూర్తిని... పోతన (ఓరుగల్లుకు దగ్గరలో బమ్మెర వాసి) తన భాగవతంలోని దశమ స్కంధంలో 'మహాపరాక్రమంతో, వీరాలోక దుర్లోకయై తావేగన్ సుగుణంబు జేసె ధనువుం దన్వంగి, దైత్యాంగనా గ్రీవాసంఘము నిర్ఘుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్' అంటూ సత్యభామకు ఆపాదించి ఉండొచ్చు. 'వీర శృంగార భయరౌద్ర విస్మయములు గలిసి భామిని' అన్నట్లుగా యుద్ధం చేసినట్లు వర్ణించారు. భాగవతంలో సత్య, నరకాసురవర్గమైన రాక్షసులను సంహరిస్తుంది. నరకుడితో యుద్ధం చేయదు. విష్ణుభక్తుడైన పోతన అలా రాయలేదు.

పూర్వ సంస్కృత సాహిత్యంలో సత్యభామ కృష్ణునితో యుద్ధభూమికి వెళ్లినట్లు మాత్రమే ఉంది. తెలుగు 'హరివంశ'ల్లో నరకాసురునితో యుద్ధంలో కృష్ణుడు గాయపడితే సత్య సపర్యలు చేస్తుంది. తర్వాత కృష్ణుని అనుమతితో నరకాసురుడిపై యుద్ధం చేస్తుంది. తన బాణాలతో నరకుణ్ని చావు అంచుల వరకు తీసుకెళ్తుంది. అయితే... పితృస్వామ్య వ్యవస్థ ప్రతినిధులైన తెలుగు కవులు, నరకాసుర వధ ఘట్టంలో అంతిమ విజయాన్ని కృష్ణుడికే కట్టబెట్టారు.

నాచన సోమన 'హరివంశం'లో.. నిశుంభుడు విసిరిన గద ధాటికి కృష్ణుడు గాయపడతాడు. దాంతో పెద్ద గదను నిశుంభుడిపైకి విసురుతుంది సత్య. దెబ్బకు నిశుంభుడు తీవ్రగాయాలపాలవుతాడు. భూమిపై పడి హాహాకారాలు చేస్తుంటాడు. ఆ లోపల కృష్ణుడు లేచి అతన్ని చంపుతాడు. ఇక్కడా అంతిమ విజయం కృష్ణునికే దక్కుతుంది.

నరకాసురునితో సత్య యుద్ధం చేస్తున్నప్పుడు కృష్ణుడు ఓ గమ్మత్తు చేస్తాడు. నరకుడు సత్య చేతిలో పూర్తిగా చావకుండా చేస్తాడు. సత్యకు రుక్మిణిని గుర్తుకుతెచ్చి యుద్ధ విముఖురాలిని చేస్తాడు. విల్లును తాను చేతిలోకి తీసుకుంటాడు. అంతవరకు సత్యను గెలవలేనని డీలా పడిపోయిన నరకుడికి అప్పుడు ధైర్యం వస్తుంది. ఉత్సాహంతో యుద్ధం చేస్తాడు. ఆ తర్వాత కృష్ణుడి చక్రాయుధం ధాటికి మరణిస్తాడు. ఇక్కడ కూడా కృష్ణుణ్నే విజేతను చేశారు.

సత్య 'ఆత్మశక్తితో' వీరావేశంతో నరకాసురుడితో పోరాడిందని కవులు చెప్పటాన్ని విశేషంగా భావించాలి. నరకాసుర బాధితులైన మునుల మొరతో పాటు ఇంద్రసింహాసనాన్ని కాపాడే ఉద్దేశంతో కృష్ణుడు నరకుడికి ఎదురువెళ్తాడు. రాజకీయ, సామాజిక విషయమిది. కానీ సత్యభామ ఆత్మచిత్తమంతా నరకుడు చెరబట్టిన మునికన్యలు, రాజకన్యల సంరక్షణపైనే ఉంది. మహిళల రక్షణే ధ్యేయంగా పోరాడటం వల్లే ఆమె.. నరకుణ్ని పడగొట్టగలిగింది. నరకాసుర వధానంతరం ద్వారకలో జయజయ ధ్వానాలతో విజయహారతి పట్టించుకున్న కృష్ణుడు సత్యభామ యుద్ధ నైపుణ్యాన్ని చెప్పడు. రుద్రమదేవి సమరస్ఫూర్తిని ఆనాటి తెలుగు కవులు ప్రశంసించలేకపోయారన్నది దీంతో అర్థమవుతోంది. సత్యభామ పతి అనుమతితో పతిప్రియచరణగా, పతివ్రతగానే పోరు సాగించినట్లుగా వర్ణించటం పితృస్వామ సంస్కృతీ లక్షణంగా భావించవచ్చు.

రుద్రమ తదనంతర కాల కవి, ఓరుగల్లుకు సమీప గ్రామమైన పిల్లలమర్రికి చెందిన పినవీరభద్రుడు తన జైమినీ భారతంలో అమూలకమైన ప్రమీల పాత్రను సృష్టించాడు. ఆ పాత్రకు, అర్జునుడి మధ్య రణం జరిపిస్తాడు. ఎక్కడా అపజయమెరగని పార్థుడు ప్రమీలను మాత్రం గెలవలేకపోయినట్లుగా చిత్రించాడు. రుద్రమదేవి పరాక్రమానికి సాహిత్య పట్టం కట్టడానికే పినవీరభద్రుడు ప్రమీలకు ప్రాణం పోసి ఉండొచ్చు.

కవి హృదయాలను ఇంతగా స్పందింపజేసిన రుద్రమదేవి వీరత్వం... నేటి ఆధునిక మహిళలకు ఆదర్శం కావాలి.

డా॥ జె.కనకదుర్గ
గుంటూరు
94911 40299

సంస్కారమే సంప్రదాయం

తను వలచిన దావలచును
తను వలవక యున్ననెనడు తావలవ డిలన్
మనం ఇతరులను ప్రేమిస్తేనే వారు మనల్ని ప్రేమిస్తారు. వేమన చెప్పిన ఈ మాట బంగారు మూట. సమష్టి భావనకు దూరమైన సంఘ జీవనం నరకంతో సమానం. 'నీవనినను... నేననినను' అని వాదులాడుకునే కన్నా 'మనం' అనుకున్నప్పుడు ఈ లోకమే స్వర్గతుల్యమవుతుంది. మన మధ్య ఈ ఐకమత్యాన్ని ప్రోది చేసేవే పండుగలు. వాటి అంతరార్థాన్ని తెలుసుకుని ఆచరిస్తే మన వ్యక్తిత్వం వికసిస్తుంది.

మెతుకు కనిపిస్తే కాకి తన తోటి కాకులను పిలుస్తుంది. కోతి ఒంటరిగా ఎక్కడికీ వెళ్లదు. చక్కెర చిరునామాను చీమ తన సమూహానికి చెప్పి తీరుతుంది. వీటన్నింటి కన్నా ఉత్తమ జన్మగా భావించే మనిషి మాత్రం సంపదను ఒంటరిగా అనుభవించాలని అనుకుంటున్నాడు. మనిషికి సంస్కారం అవసరం. నిరాకారంగా ఉన్న రాతిని ఉలిదెబ్బలతో సంస్కరించి రామునిగా చేస్తేనే నిత్య పూజలు జరుగుతాయి. అలాగే, మనిషిని మనీషిగా మార్చినప్పుడే సంఘ జీవితం సుఖప్రదమవుతుంది. అలా మార్చే శక్తి మన సంస్కృతికి ఉంది. పండుగల పేరుతో మన పూర్వీకులు ఒక ప్రణాళికను ఏర్పాటు చేశారు. ఏ పండుగలను ఎందుకు చేసుకోవాలో, ఎలా చేసుకుంటే మానవుడు మాధవుడు అవుతాడో వివరించారు. ఆ లక్ష్యార్థం తెలియజేయడానికి కొన్ని పౌరాణిక గాథలు జోడించి మనకు గుర్తుచేశారు.

పండుగలు, పబ్బాలు అంటూ ఉంటాం. పండుగలంటే ఉత్సవాలని తెలుసు. మరి పబ్బాలు? 'ఫలం' అనే సంస్కృత పదానికి తెలుగులో 'పండు' అని అర్థం. గ, వు అనే ప్రత్యయాలు చేరి పండుగ, పండువుగా రూపాంతరం చెందాయి. ధర్మశాస్త్రాల్లో వీటినే పర్వాలని, ఉత్సవాలని పిలుస్తారు. 'పర్వ శబ్ద భవమే' పబ్బం. పర్వాన్ని విధి-నిషేధాలతో చేయలేనప్పుడు 'పబ్బం'గా గడిపే ఆచారాలు జనవ్యవహారంలో ఉంది. బుద్ధి జీవియైన మనిషి తన మేధోసంపత్తితో ఒక సమాజాన్ని నిర్మించుకున్నాడు. ఆ సమాజాన్ని సుసంపన్నంగా ఉంచేందుకు నియమాలు ఏర్పాటు చేసుకున్నాడు. అలా పూర్వీకులు ఆచరించి భావితరాలకు అందించినవే ఆచారాలు అయ్యాయి.

ఆనంద పరవశాల 'ఆమని'

చైత్రమాసంలో ఉగాది, శ్రీరామనవమి, హనుమజ్జయంతి పండుగలు వస్తాయి. ఉగాది పచ్చడి షడ్రుచుల్లో చేదు కూడా ఒకటి. జీవితం సుఖదుఃఖాల సమ్మిళితమనే భావన ఇందులో ఉంది. చైత్ర, వైశాఖాలు వసంత రుతువు. నిన్నటి దాకా మోడుగా మారి, ఎండిన చెట్లన్నీ చిగురిస్తాయి. మరణమంటే మరో జన్మకు సంకల్పం. మనలోనున్న సూక్ష్మ శరీరం మళ్లీ కొత్త చిగుళ్లు వేయటానికి వెళ్తుంది. ఆ జిజ్ఞాసను మానవునిలో కలిగిస్తుంది ఈ ఆమని. తాటకి తమస్సును చంపి, అహల్య రజస్సును మార్చి, సీత సత్వగుణాన్ని చేపట్టాడు రాముడు. త్రిగుణాతీతుడు కావాలంటే సత్వాన్ని కూడా వదలాలి అందుకే సీతా పరిత్యాగం. ఆయా పండుగల్లో సేవించాల్సిన ఆహార పానీయాల్లో కూడా శాస్త్రీయ దృక్పథం ఉంది. ఎండవేడిమి అధికమవ్వడం వల్ల పానకం, వడపప్పు వంటి శీతల పదార్థాలు తినే పద్ధతి కూడా మన పెద్దలు నేర్పారు. హిరణ్యకశిపుడు ఎంత ప్రయత్నించినా ప్రహ్లాదుని హరి భక్తి మాన్పలేకపోయాడు. ఇచ్ఛా, అనిచ్ఛ, పరేచ్ఛ అనే ప్రారబ్ధకర్మలు మనిషిని తమ ఆధీనంలోనికి తీసుకుని నడిపిస్తాయి. మనం పాత్రధారులమే. సూత్రధారి మరొకడున్నాడని తెలుసుకోవాలి.



మనోక్షేత్రంలో భక్తి బీజం

జ్యేష్ఠమాసంలో ఏరువాక పున్నమి. పవిత్రమైన హృదయ క్షేత్రాన్ని శుద్ధి చేసుకోవాలి. పాళీ, ప్రాకృత సాహిత్యంలో ఏరువాక పున్నమిని 'వప్పమంగళ దివస'మంటారు. మనది వ్యవసాయ దేశం. నాగలి గొర్రుకు పూజలు చేసి, ఎద్దులను కడిగి, కొమ్ములకు రంగులు వేసి దుక్కి దున్నేవారు. పూర్వకాలంలో రాజు కూడా ఆ రోజు దుక్కి దున్నేవాడట. నాగలి పూజ వివరాలు 'గాథాసప్తశతి'లోనూ ఉన్నాయి. 'హృదయ క్షేత్రాన్ని చదును చేసుకుని భక్తి బీజాన్ని నాటుకోవటానికి సాధకుడు సిద్ధంగా ఉండాల'న్న అంతరార్థం ఇందులో ఉంది. ఆషాఢంలో గురు పూర్ణిమ జరుపుకుంటాం. 'యదనుగ్రహమాత్రేణ శోకమోహా

వినశ్యతి' సంసార చక్రంలో జనన మరణాలే దుఃఖ హేతువులు. మానవుడు అన్నిటికంటే మరణానికే ఎక్కువ భయపడతాడు. ఆ మరణ భయాన్ని పోగొట్టగలవాడు గురువే. సద్గురువును వెదకి జ్ఞాన బీజాన్ని మనలో ప్రతిష్ఠాపన చేయించుకునే పండుగ గురుపూర్ణిమ.



బంధాన్ని కలిపే రక్ష

శ్రావణమాసంలో 'త్వం' పదార్థ 'తత్' విచారణ ద్వారా 'అసి' ఐక్యతను సాధించే బోధను శ్రవణం చేయాలి. మైత్రేయికి యజ్ఞవల్క్యుడు 'ఆత్మావారే ద్రష్టవ్యో శ్రోతవ్యో మంతవ్యో' అని చెప్పిందీ విషయాన్నే. శ్రవణం చేసిన దాన్ని మనన నిదిధ్యాసలుగా మార్చేది భాద్రపదం. విన్న విషయాలను భద్రపరుచుకోవాలి. పూర్ణిమ నాడు రక్షాబంధనం చేసిన వారిని... తర్వాత ఏడాది పాటు కాపాడుతుందని శుక్రాచార్యుడు బలితో అన్నాడు. ఇదే విధంగా ఇంద్రునికి శచీదేవి కూడా కట్టింది.

విఘ్నాలు తీర్చే గణపతి

'వాగీశాద్యస్సుమనసః సర్వార్థానాముపక్రమే యంనత్వా కృత కృత్యాసుః' అని ఆర్యోక్తి. బ్రహ్మతో సహా సమస్త దేవతలు ఏ పని తల పెట్టినా వినాయకుని పూజించకపోతే కృతకృత్యులు కాలేరట. శైవులైనా, ద్వైతులైనా, అద్వైతులైనా, వైష్ణవులైనా వినాయకుని పూజించనిదే ఏ పని ఆరంభించరు. 'గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనా'మని ఋగ్వేదమే ఘోషిస్తుంది. వినాయకుడంటే వినయం చేసేవాడు. 'వినయ'మంటే శిక్ష. అందరినీ సన్మార్గంలో నడిపేవాడు గణపతి. ప్రమథ గణాలకు అధిపతి. మన దేహేంద్రియాది గణాలకు మన జీవుడే అధిపతి. 'కామేశ్వరముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరా' అని లలితా నామాల్లో ఒకటి. అమ్మవారు కామేశ్వరుని ముఖాన్ని చూస్తూ మనల్ని కల్పించిందట. పార్వతి నలుగుపిండితో గణపతి బొమ్మను తయారుచేసి ప్రాణం పోసిందనటమిదే. "మహాగణేశ నిర్భిన్న విఘ్నయంత్ర ప్రహర్షితా" ఈ గణేశుని శ్రీ గణేశుని చేయాలి. 'శ్రీం' అనే బీజాక్షరానికి మోక్షమని అర్థం. పంచదశిలో ఉన్న 15 బీజాక్షరాలు జగత్తుకు ప్రాపంచిక సుఖాలకు కామ్య కర్మలకు సంబంధించినవి. 'శ్రీం' అనే షోడశాక్షరి 'నిత్యా షోడశికా రూప శ్రీకంఠార్ధ శరీరిణీ' ఆమె నిత్య. సచ్చిద్రూపంగా సత్‌తో అర్ధ శరీరంగా కలిసిపోయి ఉంది. సత్వరజస్తమో గుణాలే అసలు గుణాలు. ఇవే నిర్గుణమైన జీవ చైతన్యానికి అడ్డు తగిలి ఫలసిద్ధి లేకుండా చేస్తున్నాయి. దేవతలు సత్వానికి, మానవులు రజస్సుకు, రాక్షసులు తమస్సుకు లోనైనవారు. వాటి బారి నుంచి తప్పించుకోవాలంటే ఒక మహాశక్తిని ఆశ్రయించాలి. మనలో సాత్విక గుణాలున్న వారే దేవతలు. రాజసిక, తామసిక గుణాలున్న మానవులం, రాక్షసులం మనమే. మనమే శక్తిని ఆరాధించాలి. శక్తి అమూర్తం. కాబట్టి మానవుడు దానికొక రూపకల్పన చేశాడు. ఏనుగు తల, తొండం, చేతిలో కుడుము, ఏకదంతం వీటన్నిటికీ సంకేతార్థాలు వేరుగా ఉంటాయి. మొదటిది తన స్వరూపం నిర్వికల్పం. సవికల్పం తన విభూతి. అది సామాన్యం. ఇది విశేషం. చతుర్భుజం అంటే ధర్మ జ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాలనే నాలిగింటిని ప్రసాదించగల తత్వం. సర్వ విఘ్నాలు తొలగటానికి గురుమూర్తియైన శ్రీ గణపతిని సేవించి మనం కూడా మహా గణేశులమవ్వాలి.

పాపాల్లో కొన్ని...

కాయిక పాపాలు

1. ఎవరికీ ఇవ్వకుండా తనకు తానే తీసుకోవడం.
2. ఇతరులను మానసికంగా గాని, శారీరకంగా గాని హింసించడం.
3. పరులను దోషదృష్టితో చూడడం. కాంక్షించడం.

వాచికమైన పాపాలు

1. వాక్పారుష్యం. (పరుషంగా మాట్లాడటం)
2. అనృతం. (అబద్ధం)
3. చాడీలు చెప్పడం
4. డాంబికాలు పలకడం

మానసిక పాపాలు

1. పరద్రవ్యాన్ని ఆశించడం
2. ఇతరులకు అపకారం కలగాలనుకోవటం
3. స్వధర్మాన్ని విడిచిపెట్టడం

పాపాలు హరించే దసరా

పది విధాలైన పాపాలను హరించేది దసరా. మానవుణ్ని గుణాతీతుని చేయగలదిది. దైవీ సంపదకు, ఆసురీ సంపదకు కలిగే అంతర్యుద్ధాన్ని గమనిస్తూ సాక్షిగా ఉంటూ గుణాతీత స్థితికి చేరుకోవలసిందీ పండుగలోనే. మొదటి మూడు రోజులు కాళి ఉపాసన, తర్వాత మూడు రోజులు లక్ష్మీ ఉపాసన, చివరి మూడు రోజులు సరస్వతీ ఉపాసన. నలుపు - తమస్సు, ఎరుపు - రజస్సు, తెలుపు - సత్త్వం. పదో రోజు పారువేట నెపంతో శ్మశానానికెళ్లి శమీ(జమ్మి చెట్టు) ప్రదక్షిణం చేసి...

శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనం
అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియ దర్శనమ్

అని శత్రునాశనం చేసుకుంటారు. కామక్రోధాది అరిషడ్వర్గాలే అంతఃశత్రువులు. రోజుకొకటి చొప్పున 'ధృతి, క్షమ, దమ, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం, ధీః, విద్య, సత్యం, అక్రోధం' అనే పదింటిని అలవరచుకోవాలి. జీవితంలో ఎన్నో దసరా పండుగలు చేసుకున్నాం. కానీ ఒకటీ ఆచరించలేకపోయాం.

వెలుగు నింపే దీపావళి

ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి. దీపం వెలుగునిస్తుంది. బాహ్య ప్రపంచాన్నంతా చూడగలిగినా అసలైన చీకటి మనలోని అజ్ఞానమే. జీవుడు నరుడైతే వాడికున్న అజ్ఞానం నరకుడు. వాడు అసురుడు. ప్రాగ్జ్యోతిషపురాన్ని పాలించేవాడు. ప్రాక్ అంటే ప్రాచీన (పురాతన). పురాతనం నుంచి మనలో ఆత్మచైతన్య జ్యోతి ప్రకాశిస్తూనే ఉన్నది. అయినా గుర్తించలేని అజ్ఞానం. జీవులమైన మనకు జీవత్వంతో అనేక జన్మలు ఎత్తడమే ప్రాగ్జ్యోతిష్యాన్ని పాలించటమంటే. చైతన్య జ్యోతులమై కూడా పంచభూత సంపర్కంతో పార్థివ శరీరాన్ని తెచ్చుకుని దాంతో తాదాత్మ్యం పొందాం. మహా విష్ణువు వరాహావతార మెత్తినపుడు భూదేవితో సమాగమమై నరకుణ్ని కన్నాడనే సంకేతార్థం. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః' పరమాత్మ మనల్ని తన అంశగానే చెప్పాడు. మన మీ పార్థివ శరీరం కానేకాం. నరకుడు దేవతలను బాధించాడంటే మనలో జీవభావం ప్రబలిన కొద్దీ సత్వగుణం నశిస్తుంది. కాఠిన్యం అధికమౌతుంది. వాడు అదితి కుండలాలను అపహరించాడట. అదితి అంటే పూర్ణమైంది. దేశ కాలాలతో విభజించ వీలుకానిది. అది ఆకాశమే. ఆకాశానికున్న కుండలాలు సూర్యచంద్రులు. వాటి ప్రతీకలు మనలో ప్రాణం (సూర్యుడు), మనస్సు (చంద్రుడు). కుడి ముక్కులో పీల్చేగాలి సూర్యనాడి గుండా వెళ్లి వేడి పుట్టిస్తుందని, ఎడమ ముక్కులో నుంచి పీల్చేగాలి చంద్రనాడి గుండా వెళ్లి శీతలం చేస్తుందని, వీటి మధ్యలో సుషుమ్న నుంచి కుండలిని ఊర్ధ్వంగా ప్రయాణం చేస్తుందని పతంజలి చెప్పారు. మనస్సును, ప్రాణాన్ని జీవుడు తన అధీనంలోకి తెచ్చుకుని పరమాత్మను తెలుసుకునే మార్గాన్ని తనకు తానే నిరోధించుకుంటున్నాడు..

మోక్షద్వారం 'మార్గశీర్షం'

మార్గశిర మాసంలో సాధకుడు ఆరోహణ క్రమంలో ప్రయాణం సాగించాలి. 'మాసానాం మార్గశీర్షోహం' గీతాచార్యుడు మాసాల్లో తానే మార్గశీర్షమని చెప్పాడు. ఈ నెలలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఉత్తర ద్వారాలు తెరచి నట్టు వాకిట్లో ముగ్గులు వేస్తారు. దక్షిణ దిక్పాలకుడు యమధర్మరాజు. యమపట్నానికి నాలుగు దిక్కుల్లో సింహద్వారాలు ఉంటాయి. మరణానంతరం జీవుడు యమపురికి పోతాడు. తూర్పు, దక్షిణ, పడమర ద్వారాల్లో నుంచి జీవుడు యమపట్నానికి వెళ్తే అక్కడ యమధర్మరాజు భయంకరంగా కనిపిస్తాడట. నేరం చేసిన వానికి పోలీసులెలా కనిపిస్తారో అలా. జీవుడి ఆఖరి శ్వాస నోరు, ముక్కు, కళ్ళలోంచి వెళితే తూర్పు ద్వారమని. చెవుల్లోంచి పశ్చిమ ద్వారమని. మల, మూత్ర ద్వారాలను దక్షిణ ద్వారమంటారు. బ్రహ్మజ్ఞానికి భృకుటి నుంచి, బ్రహ్మరంధ్రం ద్వారా ప్రాణోత్క్రమణ జరిగితే అది ఉత్తర ద్వారమని అంటారు. అజ్ఞానం తొలగించుకుని తాను ఆత్మస్వరూపుడనని గ్రహించినవాడు ఉత్తర ద్వారం నుంచి యమపట్నంలో ప్రవేశిస్తాడు. అతనికి యమధర్మరాజు ప్రసన్నుడై దర్శమిస్తాడు.

మనలో సం'క్రాంతి'

పుష్య మాసంలో సంక్రాంతి వస్తుంది. ఈ కాలంలో ఉత్తరద్వారాలు తెరుచుకుంటాయి. ఏ శుభకార్యమైనా ఉత్తరాయణంలోనే చేస్తారు. ముఖ్యంగా ఉపనయనానికి ఉత్తరాయణంలోనే ముహూర్తం పెడతారు. మరోవైపు... పంట చేతికి వచ్చి ఆరోగ్యం చక్కబడుతుంది. దక్షిణాయనమంతా చలి వర్షాలు ఎక్కువ. రోగాలకు నిలయం. సూర్యుడికి దూరంగా భూమి వెళ్తుంది. కాబట్టి ఉష్ణానికి, వెలుగుకు నోచుకోదు ప్రాణికోటి. వేడి, వెలుగు జీవ లక్షణం. చల్లదనం (శైత్యం) జడ లక్షణం. మన శరీరం లోపల వెలుగుల తేజస్సుండాలి. వేడి ఉన్నంత వరకే జీవితం. చల్లారితే మరణమే. సూర్యరశ్మి ఉత్తరం వైపు మొగ్గు చూపుతుంది. పగటి పొద్దు ఎక్కువ ఉంటుంది. సూర్యరశ్మి లేకపోతే జీవితమే

"విరియ గాచిన పండ్ల బరువుచే వంగిర
సాలమ్ము వొలిచె చూలాలు వోలె;
కోకిల జిగి గొంతు కోలెత్తి ప్రలపించె
వనవీథి భార్యా ప్రవాసి వోలె;
పరులకై పువుబువు తిరిగి తేనియబొట్టు
లుగ గూర్చె భృంగమ్ము లోభివోలె;
తొలచి కొబ్బరి మొవ్వ గొలనిక్కి యుడుతహో
లారుచి నోమరగెగలాలి వోలె;
బ్రతికి చెడినవాని చిదుగు గుండియ వోలె
నేల యెండ బగిలి నెఱియలు పడె;
ఒకట జూపి - మఱియు నొకట గొట్టు సురియ
కాడు వోలె - నుఱియ గాలి వీచె!!



– కవిసమ్రాట్
విశ్వనాథ సత్యనారాయణ

లేదు. సూర్యతాపం కలగకపోతే భూమి చీలదు. వర్షాలు రావు. పంటలు పండవు. రాబోయే అన్ని ఋతువులకు ఈ ప్రకృతే ఆధారమవుతుంది. సూర్యుడు మానవుడి బుద్ధికీ, జ్ఞానానికి ప్రతీక. సూర్యోదయంతో మన మూల తలంపు (అహంవృత్తి) మేల్కొంటుంది. మానవుని బుద్ధి వికసించేది సూర్యోదయంతోనే. సూర్యాస్తమయంతో అస్తమిస్తుంది. ఉదయం తేజస్సు, అస్తమయం తమస్సు. 'తమసోమా జ్యోతిర్గమయ'. చీకటి నుంచి వెలుగులోకి ప్రయాణం చేయాలి.

భోగి మంట వేసినట్లుగా మనలోని దుష్ట సంస్కారాలను జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి. ఈ ఆధ్యాత్మిక దృష్టి లోపించి భోగిమంట నెపంతో ఇంటి ముందు మంట వేస్తారు. నిరుపయోగమైన వస్తువులను మండించటం మంచిదైనా దుష్ట సంస్కారాలు మండించటం ఇంకా మంచిది. శరీరాన్ని రాబోయే ఉష్ణోగ్రతకు సమాయత్తం చేయటానికి వాతహరమైన గుమ్మడి, సజ్జలు, నూనె, నువ్వులు తింటారు. ఆ రోజు ఇల్లాలు పాలు పొంగించి పొంగలి వండి సూర్యభగవానుడికి నైవేద్యం చేస్తుంది. 'భోగి' పోగు, పొంగ అనే మాటల నుంచి వచ్చి సంస్కృతీకరించిన తెలుగు మాట అయి ఉండొచ్చు.

మూడో రోజు కనుమ. పశువుల పండుగ చేస్తారు. 'లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు' అన్న విశ్వజనీన భావన మనకే కాదు పశువులకు కూడా 'సంక్రాంతి నుంచి సంకెళ్లకు విముక్తి' అన్న నానుడి ప్రకారం.. సాధకుడు అప్పటి వరకు జీవభావంతో దేహమనే బంధంలో చిక్కుకుని, ఆనాటి నుంచి విముక్తిని సంపాదించుకుంటాడు.

జాగృతపరిచే 'శివరాత్రి'

మాఘమాసం అంటే మా+అఘ= పాపం లేనిది. మనస్సు దేహేంద్రియాలు చేసే కర్మలతో ఆత్మకు సంబంధం లేదని నిర్ణయించే నెల. నాటకంలో వేషం వేసిన వాడు ఆ పాత్ర చేసే పనులు, మాట్లాడిన మాటల వల్ల పాప పుణ్యాలెలా పొందడో దేహాత్మ భావాన్ని వదిలిన తనకు కర్మ సంబంధం లేదని తెలుసుకుంటాడు జీవుడు. తనలో నిద్రాణంగా ఉన్న శివున్ని మేల్కొలిపే రోజే శివరాత్రి.

రంగుల జీవితంలో 'హోళి'

ఫాల్గుణంలో హోళి వస్తుంది. కామదహనం చేసే పండుగ. ధర్మబద్ధమైన సంతానం కన్న తర్వాత కామదహనం చేయాలని కుటుంబ నియంత్రణ పాటించడం నేర్పారు మన పెద్దలు. పరమాత్మ అనుభూతి కలిగిన వాణ్ని కామాలు బాధించవు. కామదహనం చేసి వసంతపూర్ణిమ చేయాలి. అంటే బ్రహ్మచారిగా ఉండి కోరికలు జయించిన తర్వాత వివాహమాడాలి. గృహస్థాశ్రమ స్వీకారం ఎన్నో ధర్మకార్యాలు చేయటానికి ఉద్దేశించింది. కామదహనమైన తరువాత మధు మాసం, మాధవ మాసం వస్తాయి. అవి పెళ్లిళ్లకు శ్రేష్ఠమంటారు.

వ్యక్తి సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించే పెద్దలు పండుగలను ఏర్పరిచారు. మన అజ్ఞానంతో వాటిని దుర్వినియోగం చేస్తున్నాం. 'హ్యాపీ పొంగల్' అని అన్య భాషలో ఒక మాట అనేసి ఊరుకుంటున్నాం.. నిష్కామ కర్మాచరణంతో చిత్తశుద్ధి ఏర్పడినప్పుడే జ్ఞానోదయం కలుగుతుంది.

అష్ట గురువులు

1. బోధ గురువులు:	శాస్త్రాన్ని యథాతథంగా చెప్పేవారు.
2. వేదగురువులు:	వేదార్థంతో భగవంతుని వైపు దృష్టి మరల్చేవారు.
3. నిషిద్ధ గురువులు:	కామ్యకర్మలను మాత్రమే బోధించి ఇహసంపదలను వృద్ధి చేసేవారు.
4. కామ్యగురువులు:	పుణ్యకార్యాలు ద్వారా పుణ్యసంపాదన చేయించే వారు.
5. వాచక గురువు:	యోగతత్త్వాన్ని బోధించి ఆత్మతత్త్వాన్ని అనుభవింపజేసే వారు.
6. సూచక గురువు:	శమాది షట్కసంపత్తిని బోధించి ఇంద్రియ నిగ్రహం కలిగించే వారు.
7. కారణ గురువు:	జీవబ్రహ్మలకు ఐక్యతను బోధించే వారు.
8. విహిత గురువు:	సందేహాలను తీర్చి చిత్తశుద్ధి కలిగించి, ఆత్మయే సత్యమని దృఢమైన బోధ చేసే వారు.

డా॥ భానుమతి
విశ్రాంత తెలుగు
అధ్యాపకురాలు, కర్నూలు
93476 49261

అమీనా మస్తకం లోంచి న్యాయపుస్తకం

న్యాయస్థానాల తీర్పుల అమలు విధానంపై వచ్చిన నాలుగు వందల పుటల పుస్తకం ఇప్పటికి నాలుగు ముద్రణలకు వెళ్లింది. అందులో ఆశ్చర్యమేముంది? అలాంటి పుస్తకాలెన్నో ఉన్నాయి కదా అనుకుంటున్నారా... అక్కడే ఉంది ఆ పొత్తం ప్రత్యేకత. ఆంగ్లం రాజ్యమేలే న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలను అచ్చమైన అమ్మభాషలో వివరిస్తూ వెలువడిన గ్రంథరాజమది. పదోతరగతి వరకూ మాత్రమే చదువుకున్న ఒక సాధారణ ఉద్యోగి తన మూడు దశాబ్దాల వృత్తి జీవితపు అనుభవసారంతో... తేటతెలుగులో సృజించిన రచన ఇది.

భారతీయులందరికీ సమానత్వపు హక్కు ఉందని రాజ్యాంగం ఘోషిస్తోంది. అంటే, ఏ విషయంలోనైనా ఈ దేశ పౌరులందరూ సమానులనే కదా! చట్టపరంగా వారు అందుకునే సేవలన్నింటిలో 'సమానత్వం' పరిఢవిల్లాలనే కదా!

వాస్తవంలో పరిస్థితి భిన్నం. న్యాయసేవల విషయంలో భాషాపరమైన అసమానత్వం రాజ్యమేలుతోంది. ఆంగ్లం తెలిసిన వారు మాత్రమే 'న్యాయాన్ని' అర్థం చేసుకోగలుగుతున్నారు. ఎందుకీ పరిస్థితి అంటే... మళ్లీ రాజ్యాంగమే కారణం. ఆర్టికల్ 348 ప్రకారం భారత అత్యున్నత న్యాయస్థానం, రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలకూ ఆంగ్లాన్నే వినియోగించాలి. ఇది తప్పనిసరి. పదహారు వందలకు పైగా భాషలకు ఆలవాలమైన దేశంలో ఓ విదేశీ భాషకు రాజ్యాంగపరంగా దక్కిన అగ్రాసనమిది. ఈ ఆర్టికల్‌ను రద్దు చేయాలని స్వామి అగ్నివేష్ లాంటి సామాజిక ఉద్యమకారులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు... 'యథారాజా తథాప్రజా' చందంగా కింది స్థాయి న్యాయస్థానాల్లో కూడా ఆంగ్లమే అమలవుతోంది. ఫలితంగా, మాతృభాష మాత్రమే తెలిసిన సగటు భారతీయుడికి న్యాయస్థానాల కార్యకలాపాలు కొరుకునపడట్లేదు. వ్యాజ్యాలపై జరిగే వాదనల్లో అతను భాగస్వామి కాలేకపోతున్నాడు. తీర్పుల లోతులను అవగాహన చేసుకోలేకపోతున్నాడు. న్యాయవాది చెబితే తప్ప ఆ ఉత్తర్వుల

సారాంశం అతనికి బోధపడట్లేదు. చివరికి గెలిచినా, ఓడినా... అంతా అయోమయమే.

రాజమండ్రికి చెందిన పోలుబోతు బాబూరావు మనస్సులో ఇవే ఆలోచనలు సుడిగుండాలయ్యేవి. 37 ఏళ్ల పాటు కోర్టు అమీనాగా పనిచేసిన సమయంలో సామాన్యుడి వెతలను (న్యాయవ్యవస్థలో అన్యభాష వినియోగం వల్ల) ఆయన చాలా దగ్గరగా చూశారు. వారికి సాయపడటానికి తన వంతు ప్రయత్నం చేయాలనుకున్నారు. కొందరు పెద్దల సూచనలూ ఆయనకు మార్గనిర్దేశం చేశాయి. దాంతో 'అనుభవం నేర్పిన పాఠాల'తో 'డిక్రీలు - అమలు విధానం' అన్న పుస్తక రచన ప్రారంభించారు. నాలుగేళ్ల పాటు శ్రమించి దాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ పుస్తకానికెంతో గిరాకీ. సామాన్యులు, కోర్టు గుమాస్తాలు, జూనియర్ న్యాయవాదులకైతే అది ఎంతో ప్రీతిపాత్రం.

మధ్యతరగతి కుటుంబానికి చెందిన బాబూరావు ఎస్సెస్సెల్సీ వరకు చదివారు. కుటుంబ పోషణకు 1959 నుంచి అనేక ఉద్యోగాలు చేశారు. 1964లో కోర్టు అమీనాగా చేరారు. 2001లో స్పెషల్‌గ్రేడ్ అమీనాగా పదవీ విరమణ చేశారు. (ప్రస్తుతం అమీనా వ్యవస్థ లేదు. వీరిని ఇప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్స్ ఆఫ్ సివిల్ వర్క్ అని పిలుస్తున్నారు) బాబూరావు తన కర్తవ్య నిర్వహణలో భాగంగా... న్యాయమూర్తుల తీర్పులను అమలు చేసే వారు. ఆస్తుల జప్తు, వారెంట్ల అందజేత తదితర విధులను నిర్వర్తించే వారు. ఇలా క్షేత్రస్థాయిలో పని చేసే సమయంలో, ప్రజలకు న్యాయస్థానాల తీర్పులు, డిక్రీలపైనా సరైన అవగాహన లేదన్న విషయాన్ని గమనించారు. కేవలం న్యాయస్థానాలపై గౌరవంతోనే తీర్పులను, డిక్రీలను ప్రజలు ఆమోది



స్తున్నారని గుర్తించారు. ఇలాంటి పరిస్థితి వల్ల సామాన్యులు నష్టపోతున్నారన్న భావన ఆయన మనస్సులో నాటుకుపోయింది. 'అటాచ్‌మెంట్ అనగానే జప్తు అని మాత్రమే అనుకుంటాం. కానీ, దానికి ఎన్నో ఉపార్థాలు ఉన్నాయి. ఇలాంటి వాటిని తెలుసుకోకపోతే మనకే నష్టం' అని చెప్పే బాబూరావు... సామాన్యులకు ఆ అవగాహన కలిగించాలని నిర్ణయించుకున్నారు. అయితే, కారణాంతరాల వల్ల ఆయన సంకల్పం చాలాకాలం కార్య రూపం దాల్చలేదు. ఉద్యోగ విరమణ సమయంలో రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తనకు జరిగిన సన్మానం... కొత్త ఆలోచనకు బీజం వేసింది. ఆ సభకు వచ్చిన న్యాయమూర్తులు - అమీనా అనుభవాలతో సామాన్యులకు ఉపయోగపడేలా ఓ పుస్తకాన్ని రాయమని సలహా ఇచ్చారు. దాన్ని స్వీకరించిన బాబూరావు... భారతీయ శిక్షాస్మృతిలోని సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ)ని తెలుగులోకి తేవడానికి ఉద్యుక్తులయ్యారు. రాజమండ్రిలోని ఎస్‌కేవీటీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్న తన కుమారుడు సంజీవరావు సహకారంతో రచనను పూర్తి చేశారు.

ఆంగ్లంలో ఉన్న విషయాన్ని యథాతథ అనువాదం చేయలేదు. భావాన్ని తీసుకుని... చక్కటి తెలుగులో రాశారు. అయితే, న్యాయ పరిభాషలోని కొన్ని ఆంగ్ల పదాలు ఇప్పటికే అందరికీ చేరిపోయాయన్న ఉద్దేశంతో వాటిని అలాగే వాడారు. సామాన్యులకు అర్థం కాని ఆంగ్ల పదాలను మాత్రం తెలుగు చేశారు. (ఉదా: ప్లెయింటిఫ్ - పరిహారం కోసం దావా వేసిన వ్యక్తి, బైండోవర్ - బద్ధుణ్ని చేయు, జడ్జిమెంట్ డెటార్ - తీర్పు రుణగ్రస్తుడు, ప్రొసీడింగ్స్ - విధేయకాలు) న్యాయస్థానాల్లో వినియోగించే సంక్షిప్త పదాలను కూడా వివరించారు. (ఉదాహరణ: సీసీఏ - వర్గీకరణ, నియంత్రణ, అప్పీలు; డీఎన్ఆర్ - ప్రతివాది సిద్ధంగా లేరు; ఆర్పీ - వసూలు నిమిత్తం అర్జీ)

న్యాయవ్యవస్థలో సామాన్యులతో ఎక్కువగా ముడిపడి ఉండేది సీపీసీ. సరిహద్దు తగాదాల నుంచి ఆస్తుల గొడవల వరకూ దేన్ని పరిష్కరించాలన్నా ఇదే ప్రామాణికం. 1908లో అమల్లోకి వచ్చిన దీన్ని... పెండ్యాల సత్యనారాయణ (హైదరాబాద్), వడ్లమాని వెంకటరమణ, వడ్లమాని నాగేశ్వరశర్మ (కాకినాడ) తెలుగులోకి అనువదించారు. ఈ సీపీసీలో 'కోర్టు డిక్రీలు అమలు' అనేది ఒక భాగం. ఇది క్లిష్టమైనది.. సామాన్య ప్రజలకు అవసరమైనది. అయితే, గతంలో సీపీసీని తెలుగులోకి అనువదించిన వారు దీనిపై తప్ప పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో బాబూరావు రచన అనివార్యమైంది. డిక్రీ అంటే ఏమిటి? దాన్ని ఎలా అమలు చేయాలి? చర, స్థిరాస్తుల జప్తు, అరెస్టులకు సంబంధించిన నియమ నిబంధనలు... ఇంకా ఎన్నో అంశాలను ఆయన అచ్చతెలుగులో పొందుపర్చారు. సీపీసీ సెక్షన్లు, తీర్పులను కూడా తెలుగులో రాశారు. అలాగే, నోటరీ పూర్తి వివరాలు, భూముల కొనుగోళ్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారుల హక్కుల చట్టాన్ని వినియోగించుకునే పద్ధతి... ఇలా సామాన్యులకు ఉపయోగపడే ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో గుదిగుచ్చారు.

పొత్తం విడుదలయ్యాక బాబూరావు ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. న్యాయమూర్తుల నుంచి కోర్టు గుమాస్తాల వరకూ అందరూ ఆయన్ను అభినందించిన వారే. 'పుస్తకంలోని తెలుగు వాక్యాల్లో స్పష్టత ఉంది. సులువుగా అర్థమవుతాయి. బాబూరావు చిత్తశుద్ధి, అవిశ్రాంత కృషి, అకుంఠిత దీక్షలు ఈ పుస్తకంలో కనిపిస్తున్నా'యని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డా॥ మాడభూషి శ్రీధర్ ప్రశంసించారు. సీపీసీపై తన ప్రయత్నం విజయవంతమవడంతో... క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను కూడా తెలుగులోకి తీసుకురావడానికి సంసిద్ధులవుతున్నారు బాబూరావు.

అమ్మభాష సంజీవం

ఇంటర్మీడియట్ వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న ఓ విద్యార్థి... భవిష్యత్తులో తెలుగు అధ్యాపకుడు అవగలడా? అమ్మభాషపై అభిమానం ఉంటే అది సాధ్యమేనని నిరూపించారు సంజీవరావు. తండ్రి బాబూరావు మాటలతో తెలుగు వైపు అడుగులు వేశారాయన. ప్రస్తుతం మాతృభాషా బోధన చేస్తూనే... తెలుగును వెలిగించుకోవడానికి తన వంతు కృషి చేస్తున్నారు. భాషాపండితుల సమస్యలపై 1994 నుంచే సంజీవరావు పోరాడుతున్నారు. వారికి జరుగుతున్న అన్యాయాలపై ఎప్పటికప్పుడు ఎలుగెత్తుతున్నారు. పరిపాలనలో తెలుగు అమలుపై చైతన్యం రేకెత్తించడానికి వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కందుకూరి వర్ధమాన సమాజాన్ని స్థాపించి తెలుగుపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పునుకొల్లు మృత్యుంజయకుమార్,
రాజమండ్రి, 99590 21828

చెరిగిపోతున్న చరిత.. చెదిరిపోతున్న ఘనత

కోటగుమ్మాలు కదులుతున్నాయి. ఆకాశగోపురాలు నేలమట్టమవుతున్నాయి. బౌద్ధ, జైన మందిరాలు మట్టిగొట్టుకుపోతున్నాయి. తెలుగు జాతి గురుతులన్నీ చెరిగిపోతున్నాయి. పిచ్చిమొక్కలు, బండరాళ్లు, మట్టిదిబ్బలే మన వారసత్వ చిహ్నాలు కాబోతున్నాయి. కళ్లు తెరిచి కాపుగాయకుంటే... కాలం పంచిన సంపదంతా కాలం చేసేస్తుంది.

గతాన్ని మర్చిపోయిన వాడికి భవిష్యత్తు ఉండదు. చరిత్రను చిన్నచూపు చూసే వాడికి వర్తమానంలో విలువ దక్కదు. ఏ జాతి తన మూలాలను గుర్తుపెట్టుకుంటుందో, అస్తిత్వ చిహ్నాలను నిలుపుకుంటుందో... కాలగమనంలో ఆ జాతే నిలబడుతుంది. సమున్నతంగా ఎదుగుతుంది. ఇలా ఎదిగే అవకాశాన్ని చేజేతులా దూరం చేసుకుంటున్నారు తెలుగు వారు.

ముందు తరాల వారు అందించింది, ఇప్పటి తరం అందుకునేది, రేపటి తరం అందుకోబోయేది వారసత్వం. వరుసగా వచ్చేదే వారసత్వం. ఇది రెండు రకాలు. కనిపించే వారసత్వం. కనిపించని వారసత్వం. ప్రాకృతిక వనరులు, వాటి సౌందర్యం, కొండకోనలు, వాగులు, వంకల నుంచి ఎడారుల వరకూ 'కనిపించే' వర్గంలోకి వస్తాయి. వీటితో పాటు చారిత్రక స్థలాలు, కట్టడాలు, కళాఖండాలు కూడా ఈ కోవలోవే. ఇక కనిపించని వారసత్వమంటే పాడితేనే వినిపించే పాట, ఆడితేనే కనిపించే ఆట, ప్రదర్శిస్తేనే గానీ చూడలేని నాటకం, నృత్యం, ఇంద్రజాలం పండుగలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు లాంటివి.

ప్రపంచ మానవులంతా ఒక్కటేనన్న భావనతో ప్రతి దేశం, ప్రతి ప్రాంతంలోని ఈ రెండు రకాల వారసత్వాలను పరిరక్షించుకోవడానికి 1972 నుంచి

ప్రయత్నిస్తోంది యునెస్కో. జాతీయ, అంతర్జాతీయ సంపదలుగా గుర్తించిన వారసత్వ ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రజలకు గుర్తుచేస్తోంది. ప్రాంతీయంగా చారిత్రక ప్రాధాన్యతగల స్థలాలు, కట్టడాలు, కళాఖండాలను రాష్ట్ర పురావస్తు శాఖ, జాతీయ స్థాయిలో ప్రాధాన్యతగల వాటిని కేంద్ర పురావస్తు శాఖ, అంతర్జాతీయ స్థాయి గల వాటిని యునెస్కో ఆధ్వర్యంలోని ప్రపంచ వారసత్వ కేంద్రం పరిరక్షిస్తున్నాయి. గత కాలపు వారసత్వ వైభవ, ప్రాభవాలను ముందు తరాలకు అందిస్తున్నాయి. వీటితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు కొన్ని ప్రముఖమైన కట్టడాలను దత్తత తీసుకొని వారసత్వ పరిరక్షణలో పాలు పంచుకొంటున్నాయి.

సెప్టెంబర్ 2012 నాటికి 157 దేశాల్లో 745 సాంస్కృతిక, 188 ప్రాకృతిక, 29 రెండూ కలిసిన వారసత్వ స్థలాలు, కట్టడాలను యునెస్కో గుర్తించింది. మన దేశం నుంచి ఈ జాబితాలో 28 ఉన్నాయి. అయితే, దురదృష్టవశాత్తూ మన రాష్ట్రం నుంచి ఒక్కటి కూడా ఇందులో లేదు. కేంద్ర పురావస్తు శాఖ దేశంలో 3600 చారిత్రక స్థలాలు కట్టడాలను రక్షిత స్థలాలు, కట్టడాలుగా ప్రకటించింది. మన రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల ఆధ్వర్యంలో 135, 665 చారిత్రక స్థలాలు, కట్టడాలు ఉన్నాయి. ఇంకా హైదరాబాదు మహానగరపాలక ఆధ్వర్యంలో దాదాపు 200 వరకూ చారిత్రక ప్రాధాన్యత గల కట్టడాలు పరిరక్షణలో ఉన్నాయి.

రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో... శిలాయుగపు చిత్రాలున్న గుహలు, కొండ చెరియలు, కొత్త రాతి యుగం, రాగి - రాతియుగం, ఇనుప యుగం, తొలి, మధ్య యుగాలకు చెందిన ఆనవాళ్లను భద్రపరచుకున్న ప్రదేశాలు ఉన్నాయి. బౌద్ధ, జైన, బ్రాహ్మణ మతపరమైన గుహలు, కట్టడాలు, కోటలు, ఇస్లామిక్ కట్టడాలు, రాజ ప్రాసాదాలు అదనం. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రాజెక్టులు కట్టినప్పుడు, రహదారులు నిర్మించినప్పుడు ఎన్నో చారిత్రక స్థలాలు, కట్టడాలు రూపం కోల్పోతున్నాయి. అయినా ప్రభుత్వం అంటీ ముట్టనట్లే ఉంటోంది పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు కొన్ని సందర్భాల్లో మాత్రమే.. నీటి ముంపు ప్రాంతాల్లోని కట్టడాలను ఎగువకు తరలించారు. చాలా సందర్భాల్లో అలానే వదిలేశారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, మొదలైన జలాశయాల్లో ముంపునకు గురైన కట్టడాలను ఎగువకు తరలించి పునర్నిర్మించారు. ఇచ్చంపల్లి, పులిచింతల, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని చారిత్రక స్థలాలు, కట్టడాలను గుర్తించారు గాని వాటి పరిరక్షణకు శ్రద్ధ చూపించిన జాడల్లేవు. వరంగల్ జిల్లాలో దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా భారీ సొరంగం తవ్వాలని గతంలో నిర్ణయించారు. దీని వల్ల ఎనిమిది వందల ఏళ్ల చరిత్ర గల రామప్ప దేవాలయం కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం తలెత్తినా వెనక్కి తగ్గలేదు. ప్రజా సంఘాలు, స్థానికులు, పత్రికలు ఎలుగెత్తడంతో పాలకులు సొరంగ నిర్మాణాన్ని ఆపారు. ఇదీ వారసత్వ సంపదలకు దక్కుతున్న గౌరవం!

మరోవైపు, ఆక్రమణలు, గుప్తనిధుల కోసం తవ్వకాలు, గనుల గుత్తేదారుల స్వార్థం... ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు చేటు చేస్తున్నాయి. అనంతపురం జిల్లాలోని పెనుగొండ కోట, హైదరాబాద్‌లోని గోల్కొండ తదితర ప్రసిద్ధ ప్రదేశాల్లో ఆక్రమణలకు కొదవే లేదు. రాయదుర్గం, రత్నగిరి, గుత్తి కోటలు గుప్తనిధుల అన్వేషకుల గునపం దెబ్బలకు కూలిపోతున్నాయి. రక్షిత కట్టడాలను నాశనం చేసిన, ఆక్రమించుకున్న వారికి రెండేళ్ల కారాగార శిక్ష అని ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాల చట్టం (కేంద్రం) స్పష్టం చేస్తోంది. రాష్ట్ర పురావస్తు చట్టం ప్రకారం... అలాంటి వారికి మూడు నెలల శిక్ష ఖాయం. ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఈ చట్టాల కింద తీసుకున్న చర్యలు దాదాపు శూన్యం.

రాష్ట్ర పురావస్తు శాఖాధికారుల మాటలను పట్టించుకుంటున్న వారే లేరు. తిరుమలలోని వేయికాళ్ల మండపాన్ని కూల్చొద్దంటూ వారు లేఖ రాసినా ఉపయోగం లేకపోయింది. తితిదే చేపట్టిన 'ఆనంద నిలయం... అనంత స్వర్ణమయం' వల్ల ప్రాకారాలపై ఉన్న ప్రాచీన శాసనాలు దెబ్బతింటాయని వారు ఎప్పుడో చెప్పారు. అయినా, ఆలకించిన వారు లేరు. మరోవైపు... రాష్ట్రంలోని ఇతర చారిత్రక కట్టడాల రక్షణకు తగిన చర్యలు తీసుకోవడానికి సిబ్బంది కొరత, నిధుల లేమి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు అంటున్నారు. అవి కుంటిసాకులు మాత్రమే. 12, 13 ఆర్థిక సంఘాల కింద దాదాపు రూ.140 కోట్ల నిధులు వచ్చాయి. వాటిని కట్టడాల పరిరక్షణకు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దుస్థితిలో పురావస్తు శాఖ ఉంది. ఉన్న స్థలాలు, కట్టడాలను ఆలనాపాలనా చూసే సత్తా లేని శాఖ, ఇటీవల దాదాపు 150 కొత్త స్థలాలను, కట్టడాలను పరిరక్షించడానికి జీవోలను తెప్పించి చేతులు దులుపుకుంది.

చారిత్రక ఆనవాళ్లంటే ప్రభుత్వ యంత్రాంగాలకు ఎంత ప్రేమో చెప్పడానికి ఒక ఉదాహరణ... హైదరాబాద్‌లోని ప్రసిద్ధ నవాబ్ మకర్రబ్ దేవిడీ ఉంది. ఇందులో పరిశ్రమల శాఖ కార్యాలయం నడుస్తోంది. అయితే, భవనం పాతదయిపోయిందని, పడగొట్టేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు పరిశ్రమల శాఖాధికారులు. చారిత్రక స్మృతిని మట్టిపాలు చేయడానికి ప్రయత్నించారు. అయితే చివరి నిమిషంలో పురావస్తు శాఖ జోక్యం చేసుకోవడంతో ప్రమాదం తప్పింది. రాజధాని నగరంలోనే ఉన్న కుతుబ్‌షాహీ సమాధులు, హయత్‌బక్షీ బేగం మసీదు ప్రాంతాల్లో ఆక్రమణలు హద్దులు దాటాయి. వీటిని తొలగించాలని హైదరాబాద్ మహా నగరపాలక సంస్థకు పురావస్తు శాఖ ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదు. మరోవైపు... పేరుకు ఏటా వారసత్వ దినోత్సవాన్ని (ఏప్రిల్ 18) నిర్వహిస్తున్నారు కానీ దాని స్ఫూర్తిని మాత్రం అందిపుచ్చుకోవడం లేదు.

కొండను తొలిచి అద్భుతంగా మలచిన గాంధారి కోట, రోజుకొక గోడ చొప్పున పడిపోతున్న కాలాస్ కోట, ఇప్పటికే కనిపించకుండా పోయిన ద్రాక్షారామంలో డచ్ వారి సమాధులు, రూపుకోల్పోతున్న రాజమండ్రిలోని సర్ ఆర్థర్ కాటన్ కుమార్తె సమాధి, కంకర రాళ్లకు బలైపోయిన విజయవాడ దగ్గరి సీతానగరం కొండ మీదున్న బౌద్ధ గుహ, కనుమరుగైన హైదరాబాదులోని మీరాలం చెరువు కింది ఇనుప యుగపు సమాధులు, నేడో రేపో పడిపోటానికి సిద్ధంగా ఉన్న కరీంనగర్ జిల్లా మంధనిలోని గౌతమేశ్వర దేవాలయం, సిరిసిల్ల దగ్గరి అనంతగిరి కోట, ఆనవాళ్లే లేకుండా పోయిన కోటి లింగాల కోట, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని క్రీ.శ. 7-8 శతాబ్దాల నాటి ఇటుకరాతి జైన దేవాలయం... అన్నీ ప్రమాదపుటంచుల్లో ఉన్నవే. తక్షణ పరిరక్షణ చర్యలు చేపట్టకపోతే విలువైన చారిత్రక సంపద చేజారిపోవడం తథ్యం.

ప్రపంచంలోని ఏ దేశంలోనైనా పురాతన వస్తువు/ శాసనం బయటపడితే ఎంతో అపురూపంగా చూసుకుంటారు. దానిపై వెంటనే పరిశోధన చేసి చరిత్రను తవ్వితీస్తారు. మన దగ్గర ఆ పరిస్థితి లేదు. మెదక్ జిల్లాలోని మారేపల్లిలో కల్యాణీ చాళుక్యుల కాలం నాటిదని భావిస్తున్న శాసనమొకటి బయటపడింది. దాన్ని గుర్తించిన స్థానికులు, కలెక్టర్ ద్వారా రాష్ట్ర పురావస్తు శాఖ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత ఆరేళ్లకు గానీ, దానిపై క్షేత్రస్థాయి పరిశోధన జరగలేదు.

ఇదంతా ఒక ఎత్తైతే, చారిత్రక ప్రముఖులు, రచయితలు, వాగ్గేయకారులు, సంఘసంస్కర్తల గృహాలు కూడా పరిరక్షణకు నోచుకోకపోవటం తెలుగు జాతి దురదృష్టం. రాజమండ్రిలోని కందుకూరి వీరేశలింగం - రాజ్యలక్ష్మి, సర్ ఆర్థర్ కాటన్‌ల నివాసాలు, మదనపల్లిలోని జిడ్డుకృష్ణమూర్తి ఇల్లు లాంటి కొన్నింటిని మాత్రమే పరిరక్షించగలిగాం. తెలుగు సంస్కృతిలో భాగమైన సంగీతం, సాహిత్య రంగాలకు జీవితాలను ధార పోసిన మహనీయుల నివాసాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించకపోవటమంటే వారసత్వ పరిరక్షణోద్యమానికి తూట్లు పొడవటమే. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని కంచర్లగోపన్న (రామదాసు) ఇల్లు, నెల్లూరు - కడపజిల్లా ప్రాంతంలో కవయిత్రి మొల్ల, విజయనగరంలోని గురజాడ అప్పారావు గృహాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ తరహా నిర్లక్ష్యమే జాతి ప్రభను మసకబారిస్తోంది. తెలుగు ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నిస్తే తప్ప పరిస్థితిలో మార్పు వచ్చే సూచనలు కనపడట్లేదు.



ఈమని శివనాగిరెడ్డి
స్థపతి, హైదరాబాద్
98485 98446

ప్రేమ లేఖల పోటీలో
రూ.1116 గెలుచుకున్న లేఖ

ఏ విత్తు వేస్తే...

ప్రియమైన అన్నయ్యకు,

అన్నయ్యా! ఆ దేవుడెలా ఉంటాడని ఎవరైనా అడిగితే, మా అన్నలా ఉంటాడని చెబుతా. నిజంగానే అన్నయ్యా! నాకు గురువై చదువు నేర్పావు. నాన్నగారు చనిపోయిన తరువాత తండ్రిస్థానంలో నిలిచి నాకు పెళ్లి చేశావు. అంతటితో నీ బాధ్యత తీరిపోయిందని అనుకోలేదు. నా నలుగురు పిల్లలూ నీ ఇంట్లోనే ఊపిరి పోసుకున్నారు. ఇద్దరు పిల్లల దాకా ఎవరైనా పుట్టింటికి వెళ్తారు. కానీ నేను మాత్రం నాలుగుసార్లు మీ ఇంటికే వచ్చాను. నాకు ఇక్కడైతే జరగదని, నువ్వు ఏడో నెలలోనే వచ్చి తీసుకెళ్లే వాడివి. అన్నయ్యా! నాకు ఏ కష్టమూ కలగకుండా ఆదుకుంటూనే ఉన్నావు. అందరికీ బాల్యం ఎంతో తియ్యగా ఉంటే, మనకి మాత్రం ఎప్పుడూ కష్టాలతోనే గడిచింది కదా! సరైన బట్టలు, కడుపు నిండా తిండి, చదవడానికి పుస్తకాలు లేక మనం చాలా బాధలు పడ్డాం. కానీ, ఎందుకో అన్నయ్యా! ఆ రోజులే బాగున్నాయనిపిస్తుంది. నేను రెండు, నువ్వు ఆరో తరగతి చదువుతున్నప్పుడు, ఇద్దరం కలిసే బడికెళ్లేవాళ్లం. బజారుకెళ్లినా ఒకరి భుజాల మీదొకరం చేతులేసుకుని కలిసే వెళ్లేవాళ్లం.

ఒక రోజు బజార్లో ఒక కాణీ దొరికింది గుర్తుందా? అన్నయ్యా! "ఈ కాన్లు, పరకలు, అణాలు ఎలా వస్తాయి, చెప్పవా?" అంటూ అమాయకంగా అడిగాను, "పిచ్చిమొద్దూ! ఎక్కణ్నుంచి వస్తున్నాయేమిటే చెట్లకి కాస్తాయి తెలుసా! ఏ నాణెం చెట్టు వేస్తే ఆ నాణెం చెట్టు మొలుస్తుంది తెలుసా! అప్పుడు ఎవరికి కావాల్సినవి వాళ్లు కోసుకోవచ్చు. అయితే అన్నయ్యా! ఈ కాణీని భూమిలో పాతుదామా! అంటూ దొరికిన కాణీని చూపించాను. సరే అన్నావు. వెంటనే కాణీని భూమిలో పాతి గ్లాసుడు నీళ్లు చిలకరించాం. పది రోజులకు అక్కడ ఒక పిచ్చిమొక్క లేచింది. దాన్నే నువ్వు కాణీల చెట్టు అన్నావు. ఎన్నాళ్లైనా కాన్లు మాత్రం కాయలేదు. రోజూ బడి నుంచి రాగానే నాకు ఆంగ్లం, లెక్కలు చెప్పే వాడివి. నేను పైతరగతిలో కష్టపడకూడదని ముందే నాకు భిన్నాలు, కసాగు, గసాభాలు నేర్పించావు. అప్పుడు చెప్పిన లెక్కలు ఇప్పుడు నా పిల్లలకి చెబుతున్నాను. ఆ రోజుల్లో ప్రతి తరగతిలో నాకు లెక్కల్లో మొదటిస్థానం వచ్చేదంటే అది నువ్వు వేసిన పునాదే.

అన్నయ్యా! తలచుకుంటే ఎన్నెన్నో తీపిగుర్తులు.

రైలొస్తుంటే రైలు పట్టాల మీద చిల్లు కాణి పెట్టేవాళ్లం, అదెళ్లగానే చిల్లుకాణి అప్పచ్చిలా సాగి ఉండేది! అదో సరదా. అన్నయ్యా! నీ జాబు చేరి పదిహేను రోజులయ్యింది. వెంటనే జవాబు రాయలేకపోయాను క్షమించు. ఇంట్లో ఏవో చికాకులు. అందుకే మనసు బాగోలేదు.

అన్నయ్యా! నీకో తమాషా చెప్పనా! నీ ఉత్తరానికి నేను జాబు రాయాలి. కానీ, నీ ఉత్తరం అంది వారమవుతున్నా నేను జాబు రాయలేదు సరికదా! మళ్లీ నీ జాబు కోసం ఎదురు చూస్తున్నాను. బాగుంది కదా! నీ దగ్గర్నుంచి జాబు వచ్చిన రోజు నాకు పండగే. ముందర గబగబా చదివేస్తాను. పనంతా అయ్యాక తీరిగ్గా, తాపీగా మళ్లీ చదువుకుంటాను. అది చదువుతున్నప్పుడు నాకు కళ్లమ్మట నీళ్లు వచ్చేస్తాయి, ఆనందంతో. నేను నీకు జాబు రాస్తున్నప్పుడు కూడా కన్నీళ్లొస్తాయి. మీ అందరికీ దూరంగా ఉంటున్నానన్న బాధకు ఆనవాళ్లవి. ఇక ఉంటా అన్నయ్యా! చాలా పెద్దజాబు రాశాను కదా! ఓపిగ్గా చదివి, వదినకి కూడా వినిపించు. పిల్లలందరికీ ఆశీస్సులు.

ఓ అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం

జన్మజన్మలకు నీ చెల్లెలిగానే ఉండాలని కోరుతూ నీ జవాబు కోసం ఎదురు చూస్తూ..

నీ చెల్లెలు...
సుబ్బులు, విశాఖ



గైరమ్మ లాలి పాట

లాలీలాలమ్మ లాలీ లాలమ్మ లాలీ లాలమ్మ లాలి
రండమ్మా పాడుదమా గైరమ్మాకీ లాలీ ॥లాలీ॥
శ్రీవిద్యా, శ్రీలక్ష్మి, శ్రీదేవి,
ప్రతిరూపం సిరులిచ్చే గైరమ్మా పదమే పాడరమ్మా ॥లాలీ॥
కోయిలా గొంతూలో- కోటి రాగాలు
రాగాలే పలకండీ గైరమ్మా పలుకూ ॥లాలీ॥
తూరుపునా ఉదయించే ఎర్రాని సూరీడు
సూరూని వేడికి - సంద్రాలే వేడెక్కి ॥లాలీ॥
నైరూతీ పవనాలూ - నల్లామబ్బులూ
నల్లా మబ్బులుతోనూ - నాట్యమాడేను ॥లాలీ॥



మెరిసిందీ ఒకమెరుపూ - నల్లామబ్బులలోనా
ఉరిమిందీ ఒకఉరుమూ ఉడువీథిలోనా ॥లాలీ॥
వీచిందీ చలగాలి - జగమంతా కదిలిందీ
కురిసిందీ ఒకవానా కుండలతోపోసింది ॥లాలీ॥
విరిసాయీ నవ్వూలూ రైతన్నా మోమూనా
మెరిసాయీ కన్నూలూ కూలీపేదోళ్లకి ॥లాలీ॥
కదిలారూ కలిసారూ - రైతోళ్లు కూలోళ్లూ
పొలమూలో వితనాలూ చల్లారు స్వర్ణాలు ॥లాలీ॥
శ్రావణా మాసానా సాలూసాలుదున్ని
నాటారు వరినారు నళినాక్షులంతాను ॥లాలీ॥
తూరుపు వానాలూ జల్లూజల్లులు కురిసే
పడమటి వానాలూ పలుమార్లుకురిసేనూ ॥లాలీ॥
ఆవానా ఈ వానా బంగారు జడివానా
వానలకే వరిచేళ్లు గర్భాలేధరియించి ॥లాలీ॥
నీదయకే వదిలాము మా చేనూ మాబతుకూ
కరుణించి కాపాడూ మాతల్లీ గైరమ్మా ॥లాలీ॥
ఆశ్వయుజమాసానా శ్రీగౌరీపున్నామీ
శ్రీగౌరి పున్నమికి నీపూజా చేశాము ॥లాలీ॥
హిమగిరిలోయల్లో హిమబిందువుల వానా
బిందెలతో తేరమ్మా హిమనందినీ పూజాకు ॥లాలీ॥
త్రివేణీ సంగమమూ త్రిలోక సంబరమూ
తీర్థాలే తేరమ్మా శ్రీదేవి పూజకు ॥లాలీ॥
కృష్ణాగోదారీలో వంశధార నదిలోని
నీళ్లన్నీ తేరమ్మా గైరమ్మా పూజకు ॥లాలీ॥
మూడు సంద్రాల్లోని పవిత్రజలమూలు
పట్టండీ కలశాలు - గైరమ్మాపూజాకు ॥లాలీ॥
పాతాళాగంగమ్మా పరుగెత్తిరావమ్మా
పావానాగుణరాశి గైరమ్మా పూజకూ ॥లాలీ॥
కోనసీమ కొబ్బరికాయల్లో నీళ్లు
కడవలతో తేరమ్మా గైరమ్మా పూజకు ॥లాలీ॥
శ్రీగౌరీ వనమూలో శ్రీశైలామడవుల్లో
దొరికేనా శ్రీగంధం గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పసిడీ ఛాయపసుపూ కాశ్మీరకుంకుమ
కన్యాలంతతేరమ్మా గైరమ్మా పూజకు ॥లాలీ॥
కంచిపట్టు చీరాలు మంచి రంగురవికేలు
ఎంచి ఎంచి తేరమ్మా గైరమ్మా పూజకు ॥లాలీ॥
విరజాజితోటాలో జాజీపువ్వులవానా
పువ్వూలుతేరమ్మా గైరమ్మా పూజాకు ॥లాలీ॥
మరుమల్లే తోటాలో మల్లెపూవులవానా
పూవులు తేరమ్మా గైరమ్మా పూజాకు ॥లాలీ॥
సంపెంగా పువ్వూలు సొంపుగాపూచే
సంపెంగ పువ్వూలు గైరమ్మా పూజాకు ॥లాలీ॥
కోనేరూ కొలనూలో కలువాపువ్వులుపూచే
కలువాపూవులు తేరే గైరమ్మా పూజకూ ॥లాలీ॥
నాగూలా వనమూలో నాగమల్లెలుపూచే
పూవులే తేరమ్మా గైరమ్మా పూజకు ॥లాలీ॥

అందాలాతోటాలో మందారాలుపూచే
మందారాలు తేరమ్మా గైరమ్మా పూజకూ ॥లాలీ॥
రాజావారి తోటాలో గులాబీలు పూచే
గులాబీలు తేరమ్మా గైరమ్మా పూజకూ ॥లాలీ॥
రామారాయకొండల్లో కొండామల్లెలుపూచే
కొండామల్లెలుతేరే గైరమ్మా పూజాకు ॥లాలీ॥
బంగారు వనమూలో బంతీపూలు పూచే
బంతీపూలదండాలు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
సాగారా తీరానా సన్నాజాజులవానా
సన్నాజాజీమాలలే గైరమ్మా తల్లికి ॥లాలీ॥
చెంగప్పతోటలో చామంతీపూలు
చేమంతీపూలందం గైరమ్మా తల్లికి ॥లాలీ॥
మేరూ పర్వతమంతా మేలిమీబంగారం
బంగారం గొలుసులే గైరమ్మా తల్లికి ॥లాలీ॥
నీలగిరి కొండలపై నీలాలవానా
నీలాల మెరుపులూ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
గోవర్ధన గిరిపైనా గోమేధికాలు
గోమేధికాలన్నీ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
మహేంద్రాగిరిపైన మాణిక్యాలవానా
మాణిక్యాలమెరుపులు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
హిందూసముద్రములో ముత్యాలావానా
ముత్యాల హారాలు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పశ్చిమ సంద్రాన పగడాలావానా
పగడాలా హారాలు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
బంగాళాఖాతములో వజ్రాలావానా
వజ్రాలా ఆసనమూ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
మహానదిమధ్యనా మరకతాలవాన
మరకతాల మాలలే గైరమ్మా తల్లికి ॥లాలీ॥
కావేరీ నదిలోనా కెంపూల వానా
కెంపూల వెలగూలు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పున్నామీ వెలుగులో పుష్యరాగాలు
పుష్యరాగమెరుపులూ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
నర్మదానదిలోనా నల్లాపూసలవానా
పూసాలాహారాలు గైరమ్మా తల్లికి ॥లాలీ॥
సువర్ణాపురమూలో సుందరానగరిలో
సువర్ణాగాజులూ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
మేలిమీ బంగారం ఉంగరాలుచేసి
వేళ్లకీతొడగండి గైరమ్మా తల్లికీ ॥లాలీ॥
వెండికొండాపైనా వెలుగురేఖాలు
గైరమ్మా తల్లీకి కాళ్లగజ్జేలు ॥లాలీ॥
బంగారు కిరీటం నవరత్నాల మెరుపూలూ
శిరమూనా ఉంచండీ గైరమ్మా తల్లికీ ॥లాలీ॥
నవరత్నాల కాంతూలూ నడుమువడ్డాణామూ
నగలసౌందర్యమూ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పసిడీ భూముల్లోనా పనసపండ్లూ కాసే
పనసాపళ్లఫలహారం గైరమ్మా తల్లికి ॥లాలీ॥

మేలైనాభూముల్లో మేలిమామిడిపండ్లు
మామిడీ పండ్లన్నీ గైరమ్మా తల్లికి ॥లాలీ॥
కోనసీమభూముల్లో కొబ్బరీలు కాసే
కొబ్బరీ ప్రసాదం గైరమ్మా తల్లికి ॥లాలీ॥
ఉద్యానావనములో అరటిపండ్లుకాసే
అరటిపండ్ల ప్రసాదం గైరమ్మా తల్లిక ॥లాలీ॥
శ్రీనగరా భూముల్లో సీమారేగుపండ్లు
సీమారేగుఫలహారం శ్రీగౌరీతల్లికి ॥లాలీ॥
భాగ్యానగరం భూముల్లో ద్రాక్షాపళ్లతోట
ద్రాక్షాపళ్లఫలహారం గైరమ్మా తల్లికి ॥లాలీ॥
కైలాసాగిరిమీద కర్జూరాలతోట
కర్జూరాల ఫలహారం అమ్మాగైరమ్మాకు ॥లాలీ॥
చెట్టూ చెట్టూకి తిరిగి చిలకాపక్షుల్లారా
జామాపళ్లు తేరమ్మా గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పూవుపువ్వుకి తిరిగి తేనెటీగల్లారా
తేనియలే తేరమ్మా గైరమ్మా తల్లికి ॥లాలీ॥
ఆకాశా వీధుల్లో హంసాపక్షుల్లారా
అమృతమే తేరమ్మా గైరమ్మా తల్లికి ॥లాలీ॥
పాలపాయసమంతా పళ్లెరాల్లోవేసి
పల్లెరాలు తేరమ్మా గైరమ్మా తల్లికి ॥లాలీ॥
జున్నూ పల్లేరాలు వెన్నకలశాలు
కన్నెలారా తేరండి గైరమ్మా తల్లికి ॥లాలీ॥
నెయ్యీ దీపాలు నిండూ గైరమ్మాకు
సాంబ్రాణీ ధూపామూ తల్లీ గైరమ్మ ॥లాలీ॥
పాలాసముద్రాన పవళించే విష్ణువూ
పావనీగైరమ్మా పూజాకు రావా ॥లాలీ॥
వెండికొండ శిఖరానా వెలిసేటి పరమేశా
పావనీ గైరమ్మా పూజాకు రావా ॥లాలీ॥
బ్రహ్మాండాలు సృష్టించే బ్రహ్మదేముడా
పావనీగైరమ్మా పూజాకు రావా ॥లాలీ॥

పెద్దింటి శశిధరవర్మ
కాశీబుగ్గ, శ్రీకాకుళం
99598 89425

“ప్రపంచంలో నాలాంటి ఆస్తిపరులు అతి తక్కువ మంది ఉంటారు”... ఈ మాటల్ని ముప్పై నలభై ఏళ్లలో ఎన్ని వందల సార్లు చెప్పి ఉంటానో లెక్కలేదు. నిజంగానే నా ఇంట తరగని గని ఉంది. విజ్ఞాన దాహార్తిని తీర్చే నీటి చెలమ ఉంది. గురజాడ నుంచి రంగనాయకమ్మ దాకా... అంతేనా? ఎందరో తెలుగు, ఇతర భారతీయ రచయితలు మా ఇంట కొలువై ఉన్నారు.

ఇక రామాయణ భారత, భాగవతాలు, భగవద్గీతలు వ్యాఖ్యాన సహిత వేదాలు పురాణ గ్రంథాలు ఎన్నెన్నో ఉన్నాయి. తొమ్మిది వందల పైచిలుకు ఉంటాయి.

మా బడి గోడ మీద ‘చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఓ మంచి పుస్తకం కొనుక్కో’ అని ఉండేది. అది నా మీద గాఢముద్ర వేసింది. ఆకర్షించిన ప్రతి పుస్తకం కొనటం, చదవటం, అట్టవేసి భద్ర పరచటం అలవాటుగా మారింది. చిక్కులూ చికాకులూ వచ్చినా భరించరాని బాధ కలిగినా సంతోషమొచ్చినా పుస్తకం తీసుకుని ‘మరో ప్రపంచం’లోకి వెళ్లిపోయే వాడ్ని.

పుస్తకమంటే రెండు అట్టలూ, మధ్య కాగితాలూ, వేల అక్షరాలూ కాదు. మౌన గురువు. ఆప్తమిత్రుడు. దిక్సూచి!

వయస్సుతో సంబంధం లేకుండా పుస్తకాలు ప్రతి దశలోనూ నన్ను ఊరడించాయి. లాలించాయి. సేదదీర్చాయి. వెన్ను తట్టాయి. పునరాలోచింపజేశాయి. ఆహ్లాద పరిచాయి. అపూర్వ జ్ఞానాన్ని దోసిళ్లతో తాగించాయి.

నేను మూడేళ్లకోసారి బదిలీల మీద తిరగాల్సొచ్చేది. అప్పుడు మా సామాన్లలో మూడొంతులు అట్ట పెట్టెలే ఉండేవి. పుస్తకాలని చెబితే కూలీలు ఎంత ఆశ్చర్యపోయేవారో! ఏ మాట కామాటే చెప్పాలి. నా భార్య ఎన్నడూ ఇల్లంతా పరుచుకునున్న పుస్తకాల్ని తక్కువ చేసి మాట్లాడలేదు. ఒక్కనాడూ విసుక్కోలేదు. ప్రతీనెలా అంతో ఇంతో వాటి కోసం ఖర్చు పెడుతున్నందుకు పల్లెత్తుమాట అన్లేదు. ప్రేమించడమంటే ప్రేమించిన వారి అభిరుచుల్నీ ప్రేమించడమే కదా!

నేను పనిచేసిన ప్రతిచోటా ఇంటి చుట్టు పక్కల వారికి పుస్తక పఠనం అలవాటు చేసేవాడ్ని. వయస్సుని బట్టి చక్కని పుస్తకాలు ఎన్నిక చేసిచ్చేవాడ్ని. ఎందరో యువకవులూ రచయితలూ అరుదైన గ్రంథాల కోసం మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చేవారంటే అతిశయోక్తి కాదు. వాటిని జాగ్రత్తగా వెనక్కి తీసుకునే బాధ్యత నా శ్రీమతి స్వీకరించేది. వాటిని కన్న బిడ్డల్లా కాపు కాచేది. అంత అపురూపంగా చూసుకున్న అపూర్వ సంపద భవిష్యత్తు ఇప్పుడు ప్రమాదంలో పడింది!

తొమ్మిదేళ్ల క్రితం పదవీ విరమణ చేయగానే మా స్వస్థలం నర్సాపురంలో గోదావరి ఒడ్డున ఇల్లు కట్టుకుని

స్థిరపడిపోయాను. ఇహ బదిలీల బెడద లేదు కదా పుస్తకాలింక భద్రంగా ఉంటాయనెంతో సంతోషించాను. అంతేకాదు. గ్రంథాల కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశాను. అద్దాల బీరువాలూ, పాఠకులు కూర్చుని చదువుకోడానికి వీలుగా రెండు బెంచీలూ చేయించాను.

"మీ ఇల్లే ఓ గ్రంథాలయం" అనేవారు మిత్రులు.

"మీరు రచయితలు కాబోలు!" అనేవారు కొందరు.

"కాదండీ. కేవలం పుస్తక ప్రియుడ్ని" అని కించిత్తు గర్వంగానే జవాబిచ్చేవాడ్ని.



కొందరు మెచ్చుకునేవారు. మరికొందరు అపనమ్మకంగా చూసేవారు. 'రచయిత కాబోయినవాడు కాబోలు!' అని నవ్వుకున్న వాళ్లూ ఉన్నారు.

'ఏ మాత్రం సంపాదించా వేంటి' అని బంధువులడిగితే మహామహుల సాహిత్య నిధిని చూపించేవాడ్ని.

చిత్రమేంటంటే మా పిల్లలూ పుస్తకాల మధ్య పెరిగిన వాళ్లే. వాళ్లు జ్ఞాన సముద్రాన్ని ఔపోశన పడితే బావుణ్ణని ఆశపడ్డాను. సంస్కరింపబడతారని ఆశించాను. ప్చ్. 'తర్వాత తీరిగ్గా చదువుతాంలే. ఇంట్లో ఉండేవే కదా ఎక్కడికి పోతాయి!' అనే వారు. చెప్పి చెప్పి 'వాళ్లే తెలుసుకుంటార'ని వదిలేశా.

ఇప్పుడు వాళ్లతోనే చిక్కు - కాదు ముప్పొచ్చి పడింది!

ఈ మధ్యే మా ఆవిడ కాలం చేసింది. అమెరికాలో ఉండే పెద్దబ్బాయీ, కోడలూ, విజయవాడలో ఉంటోన్న చిన్నబ్బాయి కోడలూ, హైదరాబాద్‌లో ఉంటున్న కూతురూ అల్లుడూ... మనమళ్లూ వచ్చారు.

కర్మకాండలయ్యాక ఆస్తిపాస్తులు పంచేసుకుంటామన్నారు. 'ఇప్పుడేం తొందర్రా' అంటే విన్లేదు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆస్తుల విలువ పెద్దగా పెరగవు పట్నాల్లో అయితే మహావేగంగా పెరుగుతాయంటూ ఏదేదో చెప్పుకొచ్చారు.

"అయితే నా పుస్తకాల ఆస్తినీ పంచుకోండి. వాటిని చక్కగా చూస్తే చాలు నేనెక్కడో అక్కడ పింఛను డబ్బుల్తో నిశ్చింతగా గడిపేస్తాను" అన్నాను.

పెదవి విరిచేశారంతా.

"పుస్తకాలని కన్నబిడ్డల్లా చూసుకో. అంతేతప్ప మాతో సమానంగా వాటికీ ఆస్తి పంచిస్తానని మాత్రం అనకు" అన్నాడు నవ్వుతూ చిన్నోడు.

ఆ నవ్వు తేలుకొండెలా అన్పించింది.

"అదే పెద్ద ఆస్తిరా. ఏంటనుకున్నారో"

"మీకో నమస్కారం వాటికి రెండు నమస్కారాలు"

"వాటిని పంచుకోరా?" జీర గొంతుతో ప్రశ్నించాను.

"మనిషికి 48 కిలోలకు మించి అమెరికా పట్టుకెళ్లలేం" అన్నాడు పెద్దవాడు.

"మా పిల్లలకు తెలుగు చదవటమే రాదు" అంది కోడలు గొప్పగా!

"నువ్వు నవలలు చదువుతావు కదా, అవైనా తీసుకెళ్లు తల్లీ" అన్నాను.

"ఈ - బుక్స్ చదువుతున్నాను. ప్రింటు బుక్స్ ఎప్పుడో మానేశాను" అందామె.

కూతురేమో "అవి పెట్టుకోడానికి మా ఫ్లాట్‌లో జాగా లేదు. నువ్వు డబ్బు సర్దితే పెద్దిల్లు కొనుక్కొని వీటిని తీసుకెళ్తాం" అంది. "కొడుకులకేమో ఇల్లూ స్థలాలూ మాకేమో పనికిరాని పుస్తకాలా!" అన్నాడు అల్లుడు నిరసనగా చూస్తూ.

చిన్నకొడుకు "ఈ రోజుల్లో ఇవి చదివే ఓపికా తీరికా ఎవరికున్నాయి నాన్నా. పిల్లల చేత బడిలో ఇచ్చిన రాతపని (హోంవర్కు) చేయించేసరికి తల ప్రాణం తోకకొస్తోంది!" అన్నాడు.

"మరి ఈ అపురూప గ్రంథాలని ఏం చేద్దామంటారు?"

నా స్వర తీవ్రతకి ఉలిక్కిపడ్డారు. ఆ పైన నవ్వేరు.

"ఇదేదో పద్మనాభస్వామి అపూర్వ నిధి అయినట్టు మాట్లాడతావేంటి నాన్నా. పాత పేపర్లవాడికి అమ్మేద్దాం" అన్నాడు చిన్నాడు.

"ఒరే ఒరే ఏం మాటల్రా అవీ. మహా రచయితల పుస్తకాలని చిత్తు కాగితాల్లా అమ్ముతావా? నా కంఠంలో ప్రాణం ఉండగా కుదరదు"

"మరేం చెయ్యమంటారో మీరే చెప్పరాదూ" విసుక్కున్నాడు పెద్ద కొడుకు.

"గ్రంథాల ఆస్తి సంగతి తేలే వరకూ ఆస్తి పంపకాల్లేవు" అంటూ తెగేసి చెప్పేను.

"మా మెడకి మిమ్మల్నే ఓ పెద్ద డోలులా తగిలిస్తున్నారు. మీతోబాటు ఈ పుస్తకాల్నీ ఎక్కడ మోయగలం!" చేతులు తిప్పింది చిన్న కోడలు.

వాళ్లంటే అసహ్యం కలిగింది. పుస్తకాల గదిలోకెళ్లి కూర్చున్నాను. తపస్సు చేసుకుంటున్న ఋషుల్లా ఉన్నాయి. వాటి వంక వేదనగా చూస్తూండిపోయాను. అవతల హాల్లో పిల్లలు నా మాటలు, ఆస్తి పంపకాలు, నన్ను ఒప్పించడం గురించీ తర్జన భర్జన గర్జనలు పడుతున్నారు. ఇక వీళ్లతో లాభం లేదన్చెప్పి తిన్నగా శాఖా గ్రంథాలయానికెళ్లాను. నా పుస్తక భాండాగారాన్ని దానమిస్తానని గ్రంథాలయ అధికారితో చెప్పాను.

"అలా తీసుకోడానికి నిబంధనలు ఒప్పుకోవు. ఎలాగో తీసుకున్నా పెట్టుకోడానికి స్థలమూ, అల్మారాలూ లేవు!" అన్నాడతను. నిస్సహాయంగా వెనుదిరిగాను.

"పాత పుస్తకాల గురించి గొడవెందుకు నాన్నా. ఎవరోకరికి ఇచ్చెయ్యొచ్చులే" అన్నాడు పెద్దబ్బాయి.

"ఎంతో ముచ్చట పడి కట్టుకున్న

ఇంటిని అమ్మేస్తున్నారు, ఆస్తులు పంచేసుకుంటున్నారు. నేను అడ్డు చెప్పలేదు. కానీ పుస్తకాలకో చక్కని ఆధారం దొరికే వరకూ నేనెక్కడుంటే అక్కడ నాతోబాటు అవి ఉండాల్సిందే. దీనికి ఒప్పుకుంటేనే పంపకాలు" అని పట్టుపట్టాను.

మొదటికే మోసం వస్తుందనుకున్నాడు కాబోలు, "సరే నాన్నా. కారు కొనేదాకా మా షెడ్డు ఖాళీయే కదా. అందులో పెట్టుకుందువుగాన్లే" అన్నాడు చిన్నకొడుకు.

గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయింది. కారు షెడ్డే నా గ్రంథాలయం, నా నివాసం అయిపోయింది.

అది లోతట్టు ప్రాంతం. ఇంకా అభివృద్ధి కాలేదు. ఎక్కడికెళ్లాలన్నా చాలా దూరం నడవాలి. అక్కడో ఇల్లు ఇక్కడో ఇల్లు ఉన్నాయి. ఎవరూ స్నేహితులు కాలేదు. నాతో నా గ్రంథ మిత్రబృందం ఉంది గనుక ఒంటరితనం దరి చేరలేదు. షెడ్డు ముందు కాసిన్ని కుర్చీలు వేశాను. చుట్టుపక్కల వారందరికీ నా పుస్తకాలు చదువుకోవచ్చని చెప్పాను. సాయంకాలాలు ఒకరిద్దరు వృద్ధులూ నలుగురైదుగురు పిల్లలూ వచ్చి చదువుకోవటం మొదలెట్టారు. నాకెంతో ఆనందంగా ఉంది. కోడలికెంచేతో నచ్చలేదు. కొడుక్కేదో చెబుతోంది. ముఖం చిట్లిస్తున్నాడీ మధ్య!

"ఒరే అబ్బాయ్. నా స్నేహితుడొకడు ఈ బెజవాళ్లోనే ఉంటున్నాడ్రా. ఇంటికి వస్తానంటున్నాడు. ఏమని చెబితే తేలిగ్గా తెలుస్తుంది"

"కబేళా రోడ్డు అని చెబితే సరి"

తుళ్లిపడ్డాను. "కబేళా?"

"అంత ఆశ్చర్యపోతున్నావేంటి నాన్నా. ఆ పైన ఉందిలే..."

"అంటే పశువుల్ని చంపే...!"

"ఆ. అదే. పనికిరాని జంతువుల్ని కబేళాకి తోలక ఏం చేస్తారు చెప్పు!"

మనస్సు చేదై, మాటల్రాక కూలబడ్డా. కబేళాకి వెళ్లే దార్లో కాపురముండటం...! అవాళ నిద్ర పట్టలేదు. పిచ్చి ఆలోచనలు మెదడుని కొరుక్కు తినసాగాయి. నావంటూ ఈ గ్రంథాలు తప్ప వీళ్లు విలువిచ్చే ఆస్తిపాస్తుల్లేవిప్పుడు నా దగ్గర. ఖర్మకాలి పింఛను ఆగిపోతే నన్నూ కబేళాకి...!

లేచి కూర్చుని భగవద్గీత పట్టుకున్నా. అర గంట తర్వాత ప్రశాంత చిత్తంతో నిద్ర పోయాను. మిత్రుడొచ్చాడు. ఇద్దరం కొన్నేళ్లపాటు రాజమండ్రిలో కలిసి పనిచేశాం. అప్పటి ఆఫీసు విషయాలూ ఇప్పుడు మారిన రాజమండ్రి.. ఇంకా ఏవో కబుర్లూ కలబోసుకున్నాం.

"పుస్తక సేకరణ కొనసాగిస్తున్నారా"

"పుట్టుకతో వచ్చిన బుద్ధి కదా...!" అని నవ్వుతూ కారు షెడ్‌లోని నా దేవాలయాన్ని చూపించాను.

అతడి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "ఎంత శ్రద్ధగా చూసుకుంటున్నారూ!" అన్నాడు.

ఏ పుస్తకాన్ని ఎప్పుడు, ఎక్కడ కొన్నదీ, ఎలా కొన్నదీ, ఎన్నిసార్లు చదివిందీ, ఎందరేమని మెచ్చుకున్నదీ ఏకరువు పెట్టా. పురుగూ పుట్ర పట్టకుండా ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నదీ వివరించా.

"నన్నడిగితే ప్రతి ఇంటా ఓ గ్రంథాలయం ఉండాలి. అందుకు నాందిగా పెళ్లిళ్లలో పుస్తకాలే బహూకరించాలి. జీవితాన్ని నడిపించేవీ నిలబెట్టేవీ ధన్యం చేసేవీ పుస్తకాలే" అన్నాను ఉద్వేగ్నుడ్నై.

"ఇది చాలా ఖరీదైన అలవాటు. ఇవాళ రేపు పుస్తకాలు చాలా ఖరీదైపోయాయి. మెల్లగా తెలుగు పుస్తకాలు మన జీవితాల్లోంచే మాయమైపోతాయి."

నా గుండెల్ని ఉక్కుహస్తాలతో పిండినట్టన్పించింది. గిలగిల్లాడాను.

"అలాగంటావేంటి. క్షరం లేనిది కదా అక్షరం. సరస్వతీ నమస్తుభ్యం అని చదువు మొదలెట్టిన మనం అలా మాట్లాడటం బావోలేదు"

"నేటి జనానికి ఇంగ్లీషు తప్ప తెలుగక్కర్లేదు. పోటీ పరీక్షలవి తప్ప ఇంకో పుస్తకం అక్కర్లేదు. అయినా ఎవరైనా ఎన్నని కొనగలరే - డబ్బు మూటలు ఉండొద్దూ!"

"అవి చూపే ప్రభావాన్ని బట్టి లెక్కకడితే చాలా చౌక అని చెప్పాలి. గ్రంథ పఠనం మనిషిని చైతన్యపరుస్తుంది. మెదడుకి పదును పెడుతుంది. అలసట తీరుస్తుంది. ఊహాప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. పుస్తకాలు చదివే వారికి ఆలోచనా శక్తి అధికంగా ఉంటుంది. అయిన వారి మీద ఆత్మీయాభిమానాలు ఎక్కువగా ఉంటాయి. ఊహాశక్తీ పెరుగుతుంది. కొత్తకొత్తవి కనుక్కోవాలి, పరిశోధించాలి అన్న జిజ్ఞాస కలుగుతుంది. ఇహ పుస్తకాలు చదివే వారెవరూ తొందరగా చెడుదార్లు తొక్కరు. ఇది మంచా చెడా, నీతి పనా, అవినీతి పనా అని ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు..."

నా మాటలు చాదస్తంగా తోచాయి కాబోలు ఇహ వెళ్తానంటూ లేచాడు.

"ఎప్పుడూ ఆ పుస్తకాల రంధే! బజారుకెళ్లి నాలుగు కాయగూరలు తెద్దామన్న ఆలోచనే లేదు మనిషికి!" ఇల్లు చిమ్ముతూ బిగ్గరగా అంది కోడలు.

పలుకే బంగారం



బి.రాధ,
సికింద్రాబాద్

మనం చేసే ప్రతి పనిని చిన్నారికి అమ్మభాషలో వివరించి చెబితే చాలు... తనకు చక్కటి భాష అలవడుతుంది. మా పాపతో నేనెప్పుడూ తెలుగులోనే మాట్లాడతా. వంట చేస్తున్నప్పుడు, ఏదైనా రాస్తున్నప్పుడు, దుకాణానికి వెళ్లినప్పుడు.. నేను ఏయే పనులు చేస్తున్నానో పాపకు అర్థం అయ్యేలా చెప్పేదాన్ని. కథలు చెప్పడం, తిరిగి తన చేత చెప్పించడం, తెలుగు చలనచిత్రాలకు తీసుకెళ్లటం, పాటలు పాడి వినిపించడం, తన చేత పాడించడం చేస్తుండేదాన్ని. అప్పుడప్పుడు తను ఆడుకునే ఆటల గురించి నాకు చెప్పమని అడిగే దాన్ని.. ఉచ్చరణ స్పష్టంగా ఉండేందుకు ప్రతి పదాన్ని పలికించేదాన్ని. ప్రతి మాటకు అర్థం విడమర్చి మరీ చెప్పేదాన్ని. మాతృభాష నేర్పించేటప్పుడు వ్యాకరణం గురించి పట్టించుకోకూడదు, చిన్నచిన్న పద్యాలు, పాటలు నేర్పించాలి. పిల్లలు మాట్లాడేటప్పుడు ఏమైనా తప్పులు వస్తే ఎగతాళి చేయకూడదు. కోప్పడకూడదు. సహనంతో సరిదిద్దాలి.

నా మొహం ఎర్రబడింది. "వీడ్ని సాగనంపి వచ్చి వెళ్తాన్లే"

"ఈయనకే కాదు ఈయన పుస్తకాలకీ చాకిరీ చెయ్యలేక చస్తున్నాను. ఊళ్లో బోల్డు వృద్ధాశ్రమాలున్నాయి. అక్కడ చావొచ్చుగా!"

అవి నాకు మామూలే అయినా మిత్రుడి ముందు జీర్ణించుకోలేకపోయాను. మిత్రుడి వెనుకే గబగబా అడుగులేశాను.

సందు మలుపు తిరిగేక ఏమనిపించిందో గాని "మేం బదరీనాథ్, కేదారనాథ్ యాత్ర కెళ్తున్నాం. నువ్వూ రాకూడదూ ఆటవిడుపుగా ఉంటుంది" అన్నాడు.

మనస్సులో ఆనందతరంగం ఎగిసిపడింది.

"ఎప్పట్నుంచో హిమాలయాల్ని దగ్గర్నుంచి చూడాలనెంతో కోరిగ్గా ఉంది. మీతో వస్తాను. పింఛను డబ్బు ఉందిలే..."

పుస్తకాలని భద్రంగా చూడమనీ రోజూ షెడ్డు చిమ్మమనీ ఇంకెన్నో జాగ్రత్తలు చెప్పి వాటి బాధ్యత చిన్నకొడుక్కీ కోడలికీ అప్పగించి ఉత్తరదేశ యాత్రకి బయల్దేరాను.

మా బృందంలోనే ఉన్న చురుకైన యువకుడు వేణు మా విజయవాడ వాడేనని తెలిసి పొంగిపోయా. ప్రతి దానికీ ముందుంటూ మా ముసలోళ్లకే ఇబ్బందీ లేకుండా, రాకుండా శ్రద్ధ తీసుకుంటున్నాడు.

అతడి గురించడిగాను. ఏదో బ్యాంకులో పనట. విజయవాడ నానుకొని కంకిపాడు రోడ్డులో కొత్తగా ఏర్పడిన ఓ కాలనీ సంక్షేమ సంఘానికి కార్యదర్శంట. అందర్నీ కలుపుకుని ప్రతి ఇంటి ముందూ మొక్కలు నాటిస్తున్నాననీ చెత్తకుండీలు పెట్టి చెత్తని ఒక్కచోటే వేయిస్తున్నాననీ చెప్పుకొచ్చాడు.

"ఒక గ్రంథాలయం ఏర్పాటు చెయ్యాలనుకున్నాను గాని సరైన స్పందన రాలేదండీ" అన్నాడు బాధగా నిట్టూరిస్తూ.

ఆ మాటలు నా చెవులకు అమృతపు సొనల్లా సోకాయి. ఎగిరి గంతేశాను.

"నా పుస్తకాలిస్తాను. తొమ్మిదొందల దాకా ఉన్నాయి. కథలూ కవిత్వమూ నవలలూ పురాణ గాథలూ వేదాలూ అన్ని రకాల గ్రంథాలూ ఉన్నాయి. నలభై ఏళ్ల నుంచీ సేకరించినవి. మంచి స్థితిలో ఉన్నాయి. వాటిని సంరక్షిస్తూ నలుగురికీ విజ్ఞానాన్ని పంచితే చాలు. అవసరమైతే బీరువాలకి కొంత ధనసాయమూ చేస్తాను..."

నా ఆర్తి అర్థమైంది కాబోలు... "మీ ఉత్సాహం నాకు కొత్త బలాన్నిస్తోంది. మా ఇంటి ముందు గదిని గ్రంథాలయానికి కేటాయించేస్తా. తిరిగెళ్లగానే గ్రంథాలయానికి శ్రీకారం చుడదాం..." అన్నాడు.

పరమానంద పడిపోయాను. నా కళ్ల నుంచి ఆనంద బాష్పాలు ధారలు కట్టాయి. హిమాలయ సౌందర్యం కన్నా అతడి సేవాదృక్పథం నన్ను అమితంగా ఆకర్షించింది! 'నువ్వేనయ్యా నాకు నిజమైన వారసుడివి' అని గుండెలకు హత్తుకున్నాను.

రైల్లో తిరిగి వస్తోంటే విజయవాడని వరద నీరు ముంచెత్తిందని ఎవరో చెప్పేరు.

వేణు సెల్‌ఫోన్ తీసుకుని ఆదుర్దా పడుతూ ఇంటికి ఫోన్ చేశాను. చిన్న కోడలు ఎత్తింది. "అంతా బావున్నారా? పుస్తకాలు బాగున్నాయా?"

"మనవలెలా ఉన్నారోనన్న ఆత్రం లేదు కాని పుస్తకాల కోసం కలవరిస్తున్నారా? హవ్వ! ఎవరైనా వింటే నోట్లో వూస్తారు! ఎప్పుడూ వాటి గోలే. మీరు పోయినప్పుడు వాటినీ మీతోనే తగలేస్తాం లెండి" నిరసనగా చెప్పి పెట్టేసింది.

హతాశుడ్నయ్యాను. నా ఉద్దేశం అది కాదని చెప్పాలని మళ్లీ మళ్లీ ప్రయత్నించాను గాని కోడలు ఫోనెత్తలేదు.

"మీ ప్రాంతం బాగా మునిగి పోయిందిట..." తన బంధువుల్ని అడిగి కనుక్కుని చెప్పేడు వేణు.

మనస్సుండబట్టలేక అబ్బాయికి ఫోన్ చేశాను. "అంతా బాగానే ఉన్నాం నాన్నా. ఇంటికి తాళం వేసి విలువైనవి తీసుకుని పటమటలో మా తోడల్లుడింటికి వెళ్తున్నాం"

"నా పుస్తకాలు?"

"నిక్షేపంలా ఉంటాయిలే" వ్యంగ్యం!

మరి తర్కించలేకపోయాను. గుండెల్లో అశుభ స్వరాలు మోగుతున్నాయి. రైలు దిగటం ఆలస్యం ఆటోలో తిన్నగా ఇంటి కెళ్లాను. కారు గ్యారేజ్ సగం ఎత్తు వరకూ నీళ్లు! గుండెలు బాదుకుంటూ నీటికడ్డం పడ్డాను. ఎవరో వచ్చి వెనక్కి లాక్కొచ్చారు. సర్వం కోల్పోయినట్టుగా ఉంది. ఒంట్లోంచి జీవపదార్థాన్ని తోడేసినట్టుగా ఉంది. గుండె చెరువయ్యింది! దుఃఖం వెల్లువెత్తింది! ఇంకో రెండ్రోజులగ్గాని నీరు తీయలేదు. ఆ వెంటనే బురదకడ్డంపడి వెళ్లి గ్యారేజ్ డోర్ తెరిచాను. బురదమట్టిలో సమాధి అయిపోయాయి నా అపురూప గ్రంథాలు. పిచ్చిగా తవ్వి తీశాను. ఎన్నో ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకున్న విజ్ఞాన ఖని...!

కన్నీటిసంద్రం చెలియలి కట్టదాటింది. వాటి పక్కన జీవచ్ఛవంలా కూలబడ్డాను. మున్సిపాలిటీ ట్రాక్టర్లొచ్చాయి. వరదకి కొట్టుకొచ్చిన చెత్తనీ, కుళ్లి పాడైపోయిన వస్తువుల్నీ వాటిల్లోకి ఎక్కిస్తున్నారు. మా అబ్బాయి మట్టిపాలైన నా పుస్తకాల్నీ ఎక్కించాడు.

పిచ్చిగా అరుస్తూ ఏడుస్తోంటే "మా అత్తగారు పోయినప్పుడు కూడా ఈయన ఇంతగా రోదించ లేదు. పండుటాకు రాలక తప్పదని వేదాంతం వల్లించారు. ఇప్పుడేమో పీడ విరగడయ్యిందని సంతోషించక పాత పుస్తకాల కోసం గుండెలు బాదుకుంటున్నారు. ఎంత పిచ్చి మనిషో చూడండి!" ఎవర్తోనో అంటోంది కోడలు.

"నోర్ముయ్". దుఃఖోద్వృతితో ఊగిపోతూ గర్జించాను.

ట్రాక్టర్ కదిలింది. దానిలో కబేళాకి తీసుకెళ్తోన్న మూగజీవాల్లా నా పుస్తకాలు...! గుండెలు వేనవేల వక్కలవుతోంటే గుండె పట్టుకుని కుప్పకూలిపోయాను!



..దట్టమయిన మంచుపడిన
చీకట్లో
అలాగే వెతుక్కుంటున్నాను
నన్ను నేను నాలో నీలో గతంలో
మనని మనం పోగొట్టుకున్న దినం
మహాలయ అమావాస్య
ప్రతి ఉగాదికీ
మెరుస్తూ
పిలుస్తుంది ఆశావేశ్య

– దేవరకొండ
బాలగంగాధర తిలక్

సింహప్రసాద్
హైదరాబాద్
98490 61668

జాతికి వరం
మన వైద్యం

ప్రకృతిని ప్రేమించే వారికి ప్రకృతిమాతే అన్నీ సమకూరుస్తుంది. ఆహారం నుంచి ఔషధాల వరకూ అన్నింటినీ అందజేస్తుంది. ముఖ్యంగా మొక్కలు అక్షయపాత్రలు. ఏ మొక్కలో ఏ ఔషధగుణముందో తెలుసుకునే నేర్పు ఉంటే చాలు... మొండి వ్యాధులెన్నింటికో పగ్గాలు వేయవచ్చు. అనాదిగా తెలుగు వారికి ఆ ప్రతిభ వారసత్వంగా అబ్బుతోంది.

జబ్బు మబ్బై వ్యాపిస్తే, సూర్య కాంతిలా దాన్ని పటాపంచలు చేసేది మందు. మాను నుంచి ఏర్పడిందే మందు. మనిషి కంటే మొక్కలు ప్రాచీనమైనవి. మొక్కల ఉత్పన్నాల నుంచి ఆహారాన్ని, మందునూ సేకరించే పద్ధతి... మానవ జాతంత ప్రాచీనమైన విషయం. వేలాది సంవత్సరాలుగా యత్న దోష పద్ధతిలో మొక్కల నుంచి ఈ రెండింటినీ గుర్తించి గ్రహిస్తున్నాడు మనిషి. ఆ క్రమంలో అతను పొందిన అనుభవసారమే వృక్ష విజ్ఞానంగా పరిణమించింది. ఈ అనుభవాల్ని తోటి మనుషులతో పంచుకోవాలనే తీవ్రమైన కాంక్షే భాషా సృజనకు దారితీసింది. ఇలా ఏర్పరుచుకున్న భాషలో తమ జ్ఞానాన్ని తర్వాతి తరాలకు మౌఖికంగా అందించే వారు ప్రాచీనులు. పూర్వ జ్ఞానానికి వర్తమాన అనుభవాలను జోడించుకుని జ్ఞానాభివృద్ధిని చేసుకునే వారు వారసులు.. ఇలా జ్ఞానాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూనే ఒక వైపు ప్రకృతి శక్తులతోనూ, మరోవైపు భౌతిక శక్తులతోనూ సంఘర్షిస్తూ జీవనం సాగిస్తూ వచ్చారు.

తర్వాత దశలో, తమకు వాంఛనీయమైన లక్షణాలున్న మొక్కల న్నింటినీ ఒకే చోట పెంపొందించు కోవాలనే మానవ తృష్ణే వ్యవసాయ సమాజమేర్పడడానికి దారి తీసింది. వ్యవసాయం చేయడానికి అనువైన ఖాళీ నేలలు నదీ తీరాల్లోనే ఉన్నాయి, మిగిలిన నేలంతా సాంద్రమైన అడవితోనే విస్తరించి ఉండేది. అడవిని కూల్చి నేలను బహిరంగపరచగల పనిముట్లు ఆనాటి మనిషి దగ్గర లేవు. ఈ కారణంగానే, ప్రఖ్యాత ప్రపంచ నాగరికతలన్నీ వ్యవసాయంతో ఆరంభమై, నదీ తీరాల్లోనే వెలిశాయి.

అయితే, ఇలాంటి మైదాన ప్రాంతాల్లో వైద్యానికి అవసరమయ్యే మందు మొక్కలు లభించవు. ఉదాహరణకు ఆ జన సమూహాల్లో ఎవరికైనా విష సర్పం కాటువేస్తే... విషాన్ని విరిచే గుణమున్న మొక్క తమ పరిసరాల్లో దొరక్కపోవడాన్ని అప్పటి మనుషులు గమనించారు. పాము కాటుకు గురైన వ్యక్తి తమ కళ్ల ముందే మరణించడాన్నీ చూశారు. అంతే కాకుండా అడవిలోని మొక్కల నుంచి తాము తయారు చేసుకున్న పచ్చిమందు స్వల్పకాలంలో పాడైపోతోందన్న విషయమూ వారికి అవగతమైంది. ఈ మందు జీవన కాలపరిమితిని పెంచి, ఎక్కువ కాలం దాచినా చెడిపోకుండా ఉండే మందును తయారు చేసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగించారు, ఈ క్రమంలోనే ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆయుర్వేద, చైనీస్, టిబ్, యునాని, హోమియో వంటి వైద్య విధానాలు రూపొందాయి. ఈ వైద్య విధానాలన్నింటికీ మూలమైన ఔషధ ఉత్పన్నాలను తయారు చేయగల సామర్థ్యం ఒక్క వృక్ష జాతికి మాత్రమే ఉంది.

వైవిధ్యభరితమైన భౌగోళిక పరిస్థితులకు ఆలవాలం భారత దేశం. విభిన్న నేలలు, చిక్కటి అడవులు, ఎత్తైన పర్వత శ్రేణులు... మన ప్రకృతి మనోహరం. ఉరకలు పరుగులతో ప్రవహించే వాగులు, వాటిని గర్భీకరించుకొని నిదానంగా నడకలు సాగించే

మహానదులు, హిమాలయ శిఖరాల నుంచి పొంగి పొరలే హిమానీ నదాలూ భారతావనిని మహా జీవ వైవిధ్య, సాంస్కృతిక వైవిధ్య దేశంగా ప్రతిష్ఠించాయి.

భూగోళ వైశాల్యంలో 2.4 శాతం మాత్రమే విస్తరించిన ఈ నేలపై ప్రపంచంలోని 80 శాతం జీవజాతులు ఆవాసముంటున్నాయి. 480000 జాతుల ప్రపంచ వృక్ష సంపదలో భారత దేశ వాటా 48000. వీటిలో 2040 వృక్ష జాతులు మన రాష్ట్రంలో విస్తరించిన తూర్పు కనుమలు, దక్కన్ పీఠభూమిలో లభ్యమౌతున్నాయి. ప్రపంచ దేశాల ఔషధ మొక్కల సగటు 12 శాతం అయితే, మన దేశంలో 20. అంతే కాదు, భారతీయ ఔషధ మొక్కలకు జగత్సంబంధ లక్షణాలున్నాయి. అంటే ఉదాహరణకు కొరియన్ జన్ సింగ్‌లో ఉన్న రసాయనిక సమ్మేళనాలన్నీ

సహ్యాద్రి అడవుల్లో దొరికే ట్రైకోపస్ జిలానికస్‌లో లభ్యమౌతాయి. ప్రపంచంలో బ్రెజిల్ అట్లాంటిక్ తరువాత అత్యధిక సంఖ్యలో ఔషధ మొక్కలు భారత్‌లోనే ఉన్నాయి.

ఈ వృక్ష సంపద నుంచి లభ్యమయ్యే ముడి వనరులన్నీ అనేక రకాల రుగ్మతల నుంచి మనిషిని కాపాడేవే. ఒక వైపు మానవ జాతి సాధించిన వైజ్ఞానిక ప్రగతి, దాని పర్యవసానంగా సాగుతున్న విధ్వంసం వల్ల పర్యావరణ సమతుల్యతపై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. దీని కారణంగా కొన్ని ఉత్పరివర్తిత విషక్రిములు పుట్టుకొస్తున్నాయి. వాటి నుంచి కొన్ని రకాల కేన్సర్, హెచ్.ఐ.వి ఎయిడ్స్ వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయి. రసాయనిక సంశ్లేషిత ఔషధాల వినియోగ ఫలితంగా శరీరధర్మంలో వస్తున్న తీవ్రమైన మార్పులు... మధుమేహం, ఉబ్బసం, కీళ్ల నొప్పులు, గుండె సంబంధ సమస్యలూ, పార్కిన్‌సన్, ఆల్జిమర్స్ వంటి వ్యాధులను వ్యాపింపజేస్తున్నాయి. వీటిని నివారించడంలో ఆధునిక వైద్యవిధానం తీవ్రంగా విఫలమవుతోంది. ఫలితంగా మానవ జాతి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయాలుగా... సాంప్రదాయ వైద్య విధానాలను గుర్తించి ప్రోత్సహిస్తోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. గిరిజన తెగలలో ఇంకా వాడుకలో ఉన్న ప్రత్యామ్నాయ ఔషధ మొక్కల సమాచారాన్ని సేకరించే పరిశోధనలకూ ఊతమిస్తోంది.

ఇటీవల మన దేశంలో జాతీయ స్థాయిలో జరిపిన అధ్యయనాల ప్రకారం.. గిరిజనులు 7500 మొక్కల్ని వైద్య చికిత్సా విధానాల కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. 1995వ సంవత్సరం వరకూ అన్ని వైద్య విధానాల్లోనూ 2100 ఔషధ మొక్కలు మాత్రమే వినియోగంలో ఉండేవి. దీన్ని బట్టి ఇంతవరకూ వాడుకలో లేని 5400 ఔషధ మొక్కలు వైద్యంలోకి వచ్చాయన్న మాట. వాటి విలువల్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్ధరించుకుని నిత్య జీవిత వైద్యంలో ఉపయోగించుకోవాలి.

తెలుగు వైద్యం గురించి చూద్దాం. మానవ శరీరంలో ఏర్పడే అన్ని భౌతిక క్రియాత్మక రుగ్మతల నుంచి ఉపశమనం పొందడానికి/ నయం చేసుకోవడానికి తెలుగు జాతి ఉపయోగించే చికిత్సా పద్ధతిగా దీన్ని అర్థం చేసుకోవాలి. అల్లోపతీ వైద్య విధానానికి ప్రత్యామ్నాయంగా ఇది ఉపకరిస్తుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. తెలుగు వైద్యం కూడా గిరిజన వైద్యంలాగే ప్రధానంగా ఏకమూలికా వినియోగంగా ఉంటుంది.

తెలుగు ప్రజలు వారి ప్రాంతీయ మాండలికాల్లో మాట్లాడుకునేంత సులభంగా తమ పరిసరాల్లో దొరికే మొక్కల నుంచి, ఇంట్లో వాడే ఆహార దినుసులు, సుగంధ ద్రవ్యాల నుంచి మందుల్ని తయారు చేసుకోగలరు. 'తల్లి చెయ్యని మేలు ఉల్లి చేస్తుంది', 'మందు లేని వ్యాధికి పెన్నేరు మందు', 'పొన్నగంటి పోయిన కళ్లిచ్చు' వంటి సామెతలు ఈ వైద్య సౌలభ్యాన్ని నిర్ధరిస్తాయి. వివిధ రుగ్మతల నుంచి ఉపశమనం కలిగించే కొన్ని తెలుగు వైద్య పద్ధతులివి...

- పిప్పళ్ల చూర్ణం బెల్లం, శొంఠిపొడి బెల్లం, కాల్చిన కరక్కాయ పెచ్చుల పొడి బెల్లం... వీటిలో ఏ ఒక్క దాన్నైనా గోళీకాయ ప్రమాణంలో వారం రోజుల పాటు, మూడు పూటలా తీసుకుంటే అజీర్ణ వ్యాధి తగ్గుతుంది..
- లేత జామ ఆకుల కషాయం, వేప బెరడు కషాయం లేదా సమూలంగా తీసిన విష్ణు క్రాంతి మొక్కల కషాయాల్లో ఏదో ఒకదాన్ని అర గ్లాసు చొప్పున మూడు రోజుల పాటు మూడు పూటలా తాగితే నీళ్ల విరోచనాలు ఆగిపోతాయి.
- సమపాళ్లలో తీసుకున్న ఉత్తరేణి తమలపాకుల కషాయం, నేలవేము వసకొమ్ము పొడి కషాయం లేదా తిప్పతీగ వసకొమ్ము పొడి కషాయాల్లో... ఏదో ఒక దానిని మూడు రోజుల పాటు మూడు పూటలా సేవిస్తే అన్ని రకాల జ్వరాల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- అరగ్లాసుడు పలుచని పాలలో చిటికెడు మిరియాల పొడి, చిటికెడు పసుపుగుండ కలిపి కషాయం తయారు చేసుకోవాలి. దీన్ని మూడు రోజుల పాటు మూడు పూటలా సేవిస్తూనే కాల్చిన కరక్కాయ పెచ్చుల్ని బుగ్గకింద పెట్టుకు చప్పరిస్తూ ఉంటే జలుబు, దగ్గుల బాధ తీరుతుంది.
- అడవి ఉల్లి (urgeniaindiba), 10 మిరియం గింజల్ని 50 గ్రాముల నేతిలో వేసి ముద్ద చేయాలి. ఇందులో 3వ భాగాన్ని పాము కరిచిన వెంటనే తినిపించి, మిగిలిన దాన్ని 2 భాగాలు చేసి 8 గంటల వ్యవధిలో మరో రెండు సార్లు తినిపిస్తే విషం విరిగిపోతుంది. ధాతకే (wood fordia fruticosa) కాండ బెరడునూ చామలి నార (helictre sisora) కాండ బెరడునూ సమతూకంలో తీసుకుని ముద్ద చేసి అర గ్లాసుడు నీటిలో కలిపి పాము కరిచిన వెంటనే తాగిస్తే ఫలితముంటుంది. గిల్లపివ్వ (Entada rheedii) విత్తనం బీజ కవచాన్ని తొలగించి ముద్దచేసి, గ్లాసు నీటిలో

బాగా కలిపి పాము కాటేసిన వెంటనే తాగించినా, కాటేసిన చోట లేపనంగా రాసినా ప్రమాదం తప్పుతుంది.

- లేత ఆముదపు ఆకులను ముద్ద చేసి, చిటికెడు పసుపుగుండను కలిపాలి. దీన్ని మూడు చెంచాల పెరుగుతో శనగ గింజ ప్రమాణంలో రోజుకొకసారి (పొద్దున్నే) చొప్పున 7 రోజులు సేవిస్తే పచ్చకామెర్ల నుంచి బయటపడొచ్చు. నేల ఉసిరి (phyllanthus amarus) మొత్తం మొక్కను తీసుకొని ముద్ద చేయాలి. అందులో 20 గ్రాముల ముద్దను 3 చెంచాల పెరుగుతో కలిపి ఉదయం, సాయంత్రం చొప్పు 7 రోజుల పాటు తీసుకున్నా కూడా ఫలితం ఉంటుంది.
- ఏగిస (pterocarpous marsupium) కాండ బెరడును ఆరబెట్టి పొడి చెయ్యాలి. 50 గ్రాముల పొడిని 5 గ్లాసుల నీటిలో వేసి అరగ్లాసు నీళ్లు మిగిలేంత వరకూ మరిగించాలి. అలా వచ్చిన కషాయాన్ని ఉదయం సాయంత్రం పూటల్లో 30 రోజుల పాటు తీసుకుంటే మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు. నల్లతీగ (khnocarpus frutescence) ఆకు రసాన్ని రెండు చెంచాల వంతున 20 రోజుల పాటు ఉదయం సాయంత్రం తాగినా, రెండు చెంచాల తిప్పతీగ (tinsoporacoedifolia) రసాన్ని ఒక చెంచాడు తేనెతో కలిపి నెల రోజులు (ఉదయం) తీసుకున్నా మధుమేహం తగ్గుతుంది.
- చెంచాడు పాతాళ గరిడి (ravvolfia serpentina) వేరు పొడిని 3 రోజుల పాటు (ఉదయం, సాయంత్రం పూటల్లో) తీసుకుంటే అధిక రక్తపోటు నుంచి పూర్తి ఉపశమనం లభిస్తుంది. చెంచాడు తెల్లమద్ది (terminaliaarivna) కాండ బెరడు చూర్ణాన్ని గ్లాసుడు పాలలో కలుపుకుని 30 రోజుల పాటు (రాత్రి పూట) తాగినా ఇదే ఫలితం కలుగుతుంది.

అద్భుతమైన తెలుగు వైద్యంలో ఇలాంటి పద్ధతులెన్నో ఉన్నాయి. మనిషిని కుంగదీసే అత్యధిక వ్యాధులను ఇవి సమర్థంగా నివారిస్తాయి. అయితే అక్షర రూపంలోకి మారింది కొంత జ్ఞానమే. వ్యవహారికంలో మరెంతో ఉంది. మనదైన ఆ విజ్ఞానమంతా భాషతోనూ, సంస్కృతితోనూ ముడిపడి ఉంది. ఆ జ్ఞానసంపదను ప్రోది చేయాలి. అవసరమైన వాటికి ఆధునిక పరికరాలను, శాస్త్రాలనూ ఉపయోగించి నిగ్గుదేల్చాలి. ఈ వైద్య విధానాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందజేయడమే మన బాధ్యత.

డా॥ బి.వి.ఎ.రామారావు నాయుడు
జానపద వృక్ష శాస్త్రవేత్త
శ్రీకాకుళం, 08942 220478

అమ్మభాష

అమ్మ లేక జగతి అడుగిడు సాధ్యమా?
అమ్మ లెందరున్న అమ్మ సాటె
అమ్మ అన్న మాట అమృతపు జల్లురా
అమ్మ లేని బ్రతుకు కర్థమేది?

అమ్మ భాష బ్రతుకు కర్థంబు నేర్పించు
అమ్మ భాష కంటె అధిక మేది?
గౌరవంబు గూర్చి, ఘనతను కలిగించు
తెలుగు నీదు రూపు, దిద్ది తీర్చు

తెలుగు భాషయన్న తీపికి గుర్తురా
అర్థమే తెలియని అర్భకుండ
అక్షరంబునిచ్చు అర్థంబు నిచ్చురా
తెలుగు నేర్చి నీవు వెలుగు ధరణి!

జన పదంబులోన జనన మందిన భాష
దీప్తి కలిగినట్టి దివ్య భాష
రాజ కవుల చేత రాజ్యమేలిన భాష
రాజసమ్మొలికెడి రాష్ట్రభాష

ఆంగ్ల భాష యన్న అధిక ఆదరమేల?
ఆంధ్ర భాష యన్న అలుసు యేల?
అమ్మ భాష లేక అస్థిత్వ మేదిరా?
అమ్మ భాష నేర్చి అలరవోయి

ఆంగ్ల విద్యె బ్రతుకు, అన్న భ్రమను వీడు
తెలుగు భాష తీపి తెలియ వోయి
ఆంధ్రుడన్న మాట కర్థంబు నీవుగా
అందలంబు నెక్కి అందగించు.

తెలుగు పలుకు, చదువు తెలుగు, వ్రాయు తెలుగు
అమ్మ, అత్త, అన్న, అవ్వ, బువ్వ
మాటలన్ని మనవె మరచుట భావ్యమా?
దీక్ష బూను తెలుగు రక్ష కొఱకు

విశ్వమంత వెలుగు విజ్ఞాన మందించు
తెలుగు భాష నీది తెలియ వోయి
తెలుగు సభలు చేసి తెలుగు వాడిని జూపి
తెలుగు భాష సాటి తెలుగె యనుచు
తెలుగు తల్లిని సేవించు తెలుగువాడ
తెలుగు భాషను ప్రేమించు తెలుగువాడ
తెలుగు విహరింప తిరువీధి తీరులందు
తెలుగు తేజము ప్రకటించు తెలుగువాడ

- అడిదం శారద,
విశాఖపట్నం, 93911 70423

అష్టనాగబంధం



ఎనిమిది నాగుల్లో ఒకే పద్యముంది. ప్రతి నాగునూ తల నుంచి మొదలుపెట్టి తోక వరకు చదవాలి. మీరు కనిపెట్టిన పద్యం సరైందో కాదో తెలియాలంటే 98వ పేజీలో చూడండి.

గంగవరపు జయరామారావు
విశ్రాంత తెలుగు పండితుడు
మార్టూరు, ప్రకాశం జిల్లా.
94937 33305

ఎనక్కు తమిళ్ తెరియాదు (నాకు తమిళం తెలియదు)...

ఆ రాష్ట్రంలో పుట్టిన వారెవరూ ఈ మాటను అనరు. కనీసం ఉచ్చరించడానికి కూడా ఇష్టపడరు.

ఎనక్కు పురియవిల్లై. ఉంగళక్కు ఆంగిలం తెరియుమా? (నాకు అర్థం కాలేదు. మీకు ఆంగ్లం వచ్చా?)

ఆ రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా వెళ్లి మాతృభాషలో మాట్లాడితే... ఏ అధికారి కూడా పై ప్రశ్న అడగరు. ఆఖరికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఇలా అడగటానికి సాహసించరు.

ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా... ఆ రాష్ట్రమేదో! తమిళనాడు. భాషాభిమానానికి నికార్సైన చిరునామా.

తమిళమే.. తమిళమొక్కటే!

ఇతరులకు దురభిమానంలా అనిపించవచ్చు కానీ, తమిళులకు మాత్రం తమ భాషంటే అవ్యాజమైన ప్రేమ. మాతృభాషను మాతృమూర్తితో సమానంగా చూసుకుంటారు వారు. ఆ భావోద్వేగమే తమిళాన్ని ఉచ్ఛస్థితిలోకి తీసుకువెళ్తోంది. సాహిత్య పరంగా, సాంకేతికంగా అద్భుత అభివృద్ధి వైపు నడిపిస్తోంది. పాలకుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తమిళాన్నే శ్వాసిస్తారు. భాష కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. రాజకీయ నాయకులైతే తమ అమ్మభాష కోసం తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి మరీ పని చేస్తారు.

దేశ స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాన్ని రెండు దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్‌ను 1967లో డీఎంకే కూకటివేళ్లతో సహా పెకలించిందంటే... ప్రధాన కారణం మాతృభాషే. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్... రాష్ట్రంపై హిందీని బలవంతంగా రుద్దుతోందని ప్రజల్లో ఏర్పడ్డ భావనే డీఎంకేను అధికారంలోకి తెచ్చింది. మాతృభాష పరిరక్షణకు ఉద్యమాలు చేయటం ద్వారానే అప్పట్లో సీఎన్. అన్నాదురై ముఖ్యమంత్రి అయ్యారు. తమిళంపై విశేష పట్టున్న ఆయన తన ప్రసంగాల్లో 'మాతృభాష కళ్లు లాంటిది, పరాయిభాష కళ్లజోడు లాంటిద'ని చెప్పేవారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని మార్చి మార్చి పాలిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తమ పాలనలో తమిళానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాయి. 2001 - 2006 వరకు అధికారంలో ఉన్న జయలలిత నేతృత్వంలోని అన్నాడీఎంకే... తమిళానికి ప్రాచీనభాష హోదాను సంపాదించింది. 2006 - 2011లో ముఖ్యమంత్రిగా ఉన్న కరుణానిధి (డీఎంకే)... 2010లో కోయంబత్తూరులో రూ.750 కోట్లతో తొలి ప్రపంచ తమిళ మహాసభలను అద్భుతంగా నిర్వహించారు.

తమిళ భాషకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను తెలుసుకోవాలంటే... భాషాభివృద్ధికి చేస్తున్న ఖర్చును గమనిస్తే చాలు. ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన నాటి నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ ద్వారా ఏటా రాష్ట్రానికి రూ. 20 కోట్లు వస్తున్నాయి. వీటితో విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక తమిళ విభాగాలను నెలకొల్పటం, ప్రాచీన తమిళభాష సాహిత్యంపై పరిశోధనలు, తమిళ గ్రంథాలను ఇతర ప్రపంచ భాషల్లోకి అనువాదం, అంతర్జాలంలో తమిళ వినియోగాన్ని పెంచటం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. మెరీనా తీరం వద్ద సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ (సీఐఎస్‌టీ)ను సైతం ప్రభుత్వం ఈ నిధులతోనే నెలకొల్పింది. కేంద్ర నిధులకు తోడు ఏటా రాష్ట్ర ప్రభుత్వం సరాసరిగా రూ. 5 కోట్ల వరకు తమిళంపై వెచ్చిస్తోంది.

రాష్ట్ర పాలనా వ్యవహారాల్లో ఎక్కువగా తమిళమే కనిపిస్తుంది. జిల్లాస్థాయిలోనే కాదు ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలోనూ వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పంపే 'నోట్ ఫైళ్లు' తమిళంలోనే ఉండాలన్న నిబంధన ఉంది. ఆంగ్లంలో పంపిన నోట్‌ఫైళ్లను ముఖ్యమంత్రి కార్యాలయం

ఫొటో సౌజన్యం గాయత్రి సెంథిల్‌రాజన్

తిప్పి పంపిన దాఖలాలు గతంలో కోకొల్లలు. తమిళనాడులో ఉన్న మొత్తం ఐఏఎస్ అధికారుల్లో 60 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు. అయినా, ప్రభుత్వం తమిళానికి ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకుని, రాష్ట్రానికి వచ్చిన వెంటనే తమిళాన్ని నేర్చుకుంటారు. అలాగే తమిళనాడులో జిల్లా కోర్టుల స్థాయి వరకు వాదనలు తమిళంలోనే జరుగుతాయి. ఉత్తర్వులు కూడా తమిళంలోనే వెలువడుతున్నాయి.

నిర్బంధ తమిళం

ప్రభుత్వ పాఠశాలల్లో తమిళం తప్ప మరే భాష కనిపించకూడదన్న లక్ష్యంగా గత డీఎంకే ప్రభుత్వం 'నిర్బంధ తమిళ' చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. తమిళేతరులు వారి మాతృభాషలో చదువుకోకుండా ఈ చట్టం అడ్డుపడుతోంది. చెన్నై మొత్తం జనాభాలో తమిళులు, తమిళేతరులు దాదాపు సమానం. ఇక్కడ తెలుగువారు 35 శాతం, ఉర్దూ, కన్నడం, మలయాళం, గుజరాతీ, ఇతర భాషలకు చెందిన వారు 10-15 శాతం వరకు ఉన్నారు. ఈ చట్టంతో వాళ్లంతా తమ మాతృభాషలో చదువుకునే అవకాశాన్ని కోల్పోయారు. దీనికి వ్యతిరేకంగా ఆయా భాషా సంఘాలు ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

వారే ర్యాంకర్లు

తమిళ విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎంజీఆర్ ప్రత్యేక నిబంధనను అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం... పదోతరగతి, ప్లస్‌టూ (ఇంటర్)లో 'స్టేట్ ర్యాంకర్లు'గా తమిళాన్ని ప్రథమ భాషగా తీసుకున్న విద్యార్థులనే గుర్తిస్తారు. ఉదాహరణకు తెలుగు మీడియంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థికి రాష్ట్రంలో అందరికంటే అత్యధిక మార్కులు వచ్చినా... ఆ విద్యార్థిని ప్రభుత్వం ర్యాంకర్‌గా గుర్తించదు. ఇటీవలే వెలువడిన పన్నెండో తరగతి ఫలితాల్లో ఈ విషయం స్పష్టమైంది. తమిళం ప్రథమ భాషగా చదివిన నామక్కల్ ప్రాంత విద్యార్థిని సుస్మిత 1200 మార్కులకు 1189 సాధించింది. స్టేట్‌ర్యాంక్ హోదాను దక్కించుకుంది. కానీ తన కంటే ఒక మార్కు ఎక్కువ (1190) సాధించిన విద్యార్థిని పవిత్రకు మాత్రం ప్రభుత్వం ఆ హోదా ఇవ్వలేదు. దీనికి ఒకే ఒక కారణం... ఆమె సంస్కృతాన్ని ప్రథమభాషగా తీసుకుంది. ర్యాంకర్‌గా గుర్తింపు పొందిన విద్యార్థి రాష్ట్రంలో తనకు నచ్చిన విశ్వవిద్యాలయంలో ఉచితంగా చదువుకోవచ్చు. అంతే కాదు, ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉపకార వేతనమూ అందుతుంది.

తమిళంలో ఇంజినీరింగ్

మన రాష్ట్రంలో మాతృభాషలో విద్యాభ్యాసం... ఇంటర్ వరకే పరిమితం. డిగ్రీ స్థాయిలో ఉన్నా, బీఏ లాంటి సాధారణ కోర్సుల్లోనే సాధ్యం. తప్పితే వృత్తివిద్యా కోర్సుల్లో అంతా ఆంగ్లమే. అయితే, తమిళనాడు ఈ పద్ధతికి చరమగీతం పాడింది. తొలిసారిగా ఇంజినీరింగ్‌ను తమిళ మాధ్యమంలోనూ ప్రవేశపెట్టింది. 2010 - 2011 విద్యా సంవత్సరం నుంచి తమిళ మాధ్యమంలో ఇంజినీరింగ్ విద్య అందుబాటులోకి తెచ్చింది. దీనికోసం బీఈ (సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్) ఆంగ్ల పుస్తకాలను తమిళంలోకి అనువదించారు. తొలి ఏడాదిలో ఈ కోర్సు రాష్ట్రవ్యాప్తంగా 15 ఇంజినీరింగ్ కళాశాలల్లోనే ఉండేది. విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన రావటంతో కళాశాలల సంఖ్యను ఏటా పెంచుతున్నారు. ఆంగ్ల భయంతో ఇంజినీరింగ్ తీసుకోలేని విద్యార్థులు ఈ కోర్సులపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు... ఎంబీబీఎస్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, యానిమల్ హస్బెండ్రీ) కోర్సులనూ తమిళ మాధ్యమంలో అందించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

ఉద్యోగాల్లో వాటా

ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయన్న భావన విద్యార్థుల్లో నానాటికి బలపడుతోంది. దీన్ని తగ్గించేందుకు తమిళనాడు ప్రభుత్వం ఓ ఆలోచన చేసింది. ఒకటో తరగతి నుంచి తమిళ మాధ్యమంలో అభ్యసిం

చిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యమిస్తామని ప్రకటించింది. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం భర్తీచేసే అన్ని ఉద్యోగాల్లో... తప్పనిసరిగా 20 శాతం వాటిని తమిళ మాధ్యమంలో చదువుకున్న వారికే కేటాయిస్తారు. 20 శాతం కోటా దాటిన తర్వాత కూడా ప్రథమ ప్రాధాన్యత తమిళ మాధ్యమ విద్యార్థులకే. దీనికి సంబంధించి 2010లో కరుణానిధి ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది. ఈ కోటాను 20 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని ఇతర రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. గత రెండేళ్లుగా అమల్లో ఉన్న ఈ విధానంతో... ఇప్పటికే తమిళ మాధ్యమంలో పూర్తిచేసుకున్న వేలమంది పట్టభద్రులు ప్రభుత్వ కొలువులను సాధించారు. ప్రభుత్వ నిర్ణయం అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాలు, నగరాల్లోనూ తమిళ మాధ్యమంలో చదివే విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఇటీవలే ఓ అధ్యయనంలో తేలింది.

పరిశోధకులకు ప్రోత్సాహకాలు

భాషకు సంబంధించి ఎన్ని పరిశోధనలు చేసినా తక్కువే. ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం బయటపడుతూనే ఉంటుంది. భాషా పరిశోధనల విషయంలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు చాలా ముందుంది. తమిళ సాహిత్యం, భాషకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేసే విద్యార్థులకు విశ్వవిద్యాలయాలు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. తమిళ సాహిత్యంపై పీహెచ్‌డీ పరిశోధనలకు రూ.లక్ష నగదు బహుమతిని అందజేస్తున్నారు. కంప్యూటర్ వినియోగం కోసం మేలైన తమిళ సాఫ్ట్‌వేర్‌లను కనుగొన్న ఐటీ నిపుణులకూ ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తోంది. అలాగే. తమిళాన్ని నేర్పించేందుకు అత్యంత సులభమైన పద్ధతులను కనుగొనే నిపుణులనూ ప్రత్యేక బహుమతులతో సత్కరిస్తోంది.

విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక శాఖలు

తమిళనాడులోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక తమిళ శాఖలు ఉన్నాయి. కొత్తగా పుట్టుకొచ్చే ఆంగ్ల పదాలకు తమిళ పదాలను గుర్తించటం, తమిళ గ్రంథాలను, తమిళ సాహిత్యాన్ని స్వదేశీ, విదేశీ భాషల్లోకి అనువదించటం తదితరాలు... ఈ శాఖలు చేపడుతున్న కీలక కార్యక్రమాలు. తమిళంలో తొలి భాషా గ్రంథం 'తొల్కాప్పియం'. దీనిని తెలుగుతో పాటు దేశంలోని అన్ని భాషల్లోకి అనువదించారు. దీనిని ఇతర దేశాల వారికీ పరిచయం చేయాలని భావించి చైనీస్, జపానీస్ భాషల్లోకి తీసుకెళ్లారు. మరిన్ని విదేశీ భాషల్లోకి అనువదించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రపంచ తమిళ సంగమం

అన్ని విశ్వవిద్యాలయాల్లోని తమిళ భాషా విభాగాలకు ఉమ్మడి వేదికగా మధురైలో 'ప్రపంచ తమిళ సంగమం' పేరిట ఓ భవనం నిర్మించాలన్నది అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ కల. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (1982) నిర్మాణాన్ని చేపట్టాలని భావించినా... కారణాంతరాల వల్ల సాధ్యం కాలేదు. అయితే, ప్రస్తుత అన్నాడీఎంకే ప్రభుత్వం దీని కోసం కంకణం కట్టుకుంది. 14.5 ఎకరాల్లో భవనాన్ని నిర్మించడానికి రూ.25 కోట్లు కేటాయించింది. ఈ 'ప్రపంచ తమిళ సంగమం' ద్వారా భాషా పరిశోధనలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

అమ్మభాషంటే అభిమానమున్న ప్రజలు, వారికి మద్దతు ఇచ్చే పాలకులు కలిస్తే... భాషాపరంగా ఎన్ని అద్భుతాలు జరుగుతాయనడానికి ఉదాహరణ తమిళనాడు. ఎవరేమనుకున్నా సరే, మా భాష మాకు ముఖ్యం అనే తమిళుల మొండితనమే ఆ భాషకు శ్రీరామరక్ష.

మహ్మద్ ఆర్.హెచ్.షరీఫ్
చెన్నై, 093821 83511

అక్షరాలు వణుకుతున్నాయట!

అ ఆ స్పందన



ఓ చలికాలపు ఉదయాన్నే మా ఆరేళ్ల బాబుని కూర్చోబెట్టుకుని అక్షరాలు రాయిస్తున్నా. వంకరటింకరగా రాస్తున్నాడు. ఏంట్రా ఈ రాత అంటే, 'అక్షరాలకూ చలి పుడుతోందమ్మా... వణుకుతున్నాయందుకే' అని బదులిచ్చాడు. నవ్వాగ లేదు. ఆ వయస్సులో ఎంత హాస్య చతురతో చూడండి. తెలుగు పలుకులపై వాడికి పట్టుంది కాబట్టే అలా చెప్పగలిగాడు. 'ఏనుగు ఏనుగు నల్లన' లాంటి పాటలతో మా పిల్లలిద్దరికీ చిన్నప్పుడే తెలుగులోని రుచిని చవిచూపించా. స్నానం చేయిస్తున్నప్పుడు, బట్టలు వేస్తున్నప్పుడు, గోరుముద్దలు పెడుతున్నప్పుడు, నిద్రపుచ్చేటప్పుడు... ఎప్పుడు వీలైతే అప్పుడు అక్షరాల నుంచి సుభాషితాల వరకూ అన్నింటినీ చెబుతూ పిల్లల చేత పలికించే దాన్ని. పెద్దబాలశిక్షను చూడటం అలవాటు చేశా. కొత్త పదాలు నేర్పించడానికి అభ్యాసాలను ఇచ్చే దాన్ని. 'త', 'జ' లాంటి వాటిని తొలి, తుది అక్షరాలుగా తీసుకుని పదాలను రాయమని చెప్పేదాన్ని. 'సీత - తల, సరోజ - జడ' ఇలా రాసే వారు. బొమ్మల కథల పుస్తకాలను చదివించే దాన్ని. అలా అలా తెలుగు లో ధారాళంగా మాట్లాడగలిగే, చక్కగా రాయగలిగే నైపుణ్యాన్ని సాధించారు పిల్లలు. పదోతరగతి (ఐసీఎస్సీ సిలబస్) తెలుగు పరీక్షలో 94, 90 శాతాలను తెచ్చుకున్నారు. అప్పుడు నా ఆనందం అంతా ఇంతా కాదు. ఒక్క మాట... మా పాప పేరు కళ్యాణ తేజస్వి, బాబు కళ్యాణ యశస్వి.

- మొంద్రేటి నళినీకుమారి, విశాఖపట్నం

జంతికలే అక్షరాలు

అ..ఆ.. స్పందన

పాదస్పర్శం క్షమస్వమే... అని భూమాతను వేడుకుని దినచర్యలను ప్రారంభించే నేను... నా పిల్లలకు కూడా ఇదే సంస్కృతిని నేర్పించాను. పూజ చేస్తూ నేను 'శుక్లాంబరధరం' అని పాడుతుంటే... పిల్లలిద్దరూ గొంతు కలిపేవారు. అన్నం తినిపించేటప్పుడు, పడుకోబెట్టే ముందు రామాయణ, భారతాల్లోని నీతిని కథలుగా చెప్పేదాన్ని. పొడుపు కథలను చెబుతూ తెలుగుపై మమకారం పెంచా. హోంవర్కు చక్కగా తొందరగా పూర్తి చేస్తే మంచి కథ చెబుతానంటే చటుక్కున పూర్తి చేసేసేవాళ్లు. తర్వాత చందమామను చూపిస్తూ కథ చెప్పేదాన్ని. నీతి పద్యాలను పాడుతూ వాళ్లతోనూ పాడించే దాన్ని. అక్షరాలు, అంకెలపై ఆసక్తి పెంచడానికి 'అ', 'ఆ', '1', '2' ఆకారాల్లో జంతికలను తయారు చేసి చూపించే దాన్ని. పెదబాబు శశాంక్ నాలుగేళ్ల వయస్సులోనే అల్లూరి సీతారామరాజుగా వేదికెక్కి '...నా ప్రతి రక్తం బొట్టు నుంచి...' అని సంభాషణలు చెప్పి వీక్షకుల మన్ననలను అందుకున్నాడు. చిన్నాడు శరత్‌చంద్ర అయితే కథలు రాస్తాడు. పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. చిన్నతనంలోనే మా చిన్నారులకంటూ ఓ ప్రత్యేకత వచ్చిందంటే అది తెలుగు చలువే.

- నామని సుజనాదేవి, కాజీపేట, వరంగల్

నా తెలుగుభాష

• షడ్జమ రాగాన, షట్పదమ్ములు పాడు
మాధుర్య గీతమే మన తెలుంగు
ప్రాభాత వేళల పచ్చని పైర్లపై
ప్రసరించు వాయువే పసిమి తెలుగు
తూర్పుదిశాంగన్ మార్పుగా భాసించు
అరుణోదయమ్మది అచ్చ తెనుగు.
రాకానిశావేళ రంజిల్ల చేసెడు
చంద్రకాంతుల సౌరు, జాను తెలుగు.

పుడమి తల్లిని స్పృశియింప, పులకరించి
కోటి సొబగుల భాసించు, కూనలమ్మ
పద్య గద్యాలు పదముల్లై పరుగులిడును.
జిలుగు వెలుగుల మార్గాన, తెలుగు వెలుగు.

• కచ్ఛపీ నాదాన గమకాలు పలికించు.
వాణి వాక్కుల నుంచి, వచ్చె తెలుగు.
మహతీనినాదమ్ము మాధుర్యమున్‌నింప,
నవనీతమైనది నా తెలుంగు,
ఆదిపరాశక్తి హస్తాన యున్నట్టి,
ఇక్షు చాపరసము, ఇలను తెలుగు.
కన్నయ్య చేతిలో వెన్నముద్దయు తెల్గు
వేణుగానామృత వీచి తెలుగు.

దేవకల్పతరువు, దివికేగు శుభవేళ
జారిపడిన ఫలము, జగతి తెలుగు
సంస్కృతంబు జనని, సంస్కార మందీయ,
వేల వత్సరాల వెలుగె తెలుగు.

• పద్యము భాషా సతికిని
హృద్యమ్ముగు హారమౌను, హారతులిడుచున్,
పద్యము ప్రియనైవేద్యము
పద్యమ్మే గానయోగ్య భాషను గూర్చున్.

• అమ్మ యనెడి పిలుపు, అమృత భావననింపు
డెంద మందు మిగుల బంధమగును
మమ్మి యనెడి మాట
మమకారమున్‌ద్రుంచు
నమ్మ నాదు మాట, వమ్ము కాదు.

• నాన్న యనుచు పిలువ,
నవనీతమున్నింపు
కన్నవారి మదికి, మన్ననొసగు
డాడీ యనుచు పిలువ డాంబికమౌనురా,
తేనె యూట తెలుగు, తెలుసుకొనుము.

• ఋషివంటి నన్నయ, రుచిరార్థసూక్తుల
ప్రారంభమైనట్టి పద్య కవిత
తిక్కన ఎఱ్ఱన తేజసపోయంగ
పరిఢవిల్లిననాటి పద్య కవిత
పోతన్న శ్రీనాధ పోషితమైనట్టి
భక్తి శృంగారాల భవ్య కవిత
సాహితీ సమరాల సార్వభౌముని మ్రోల
పరిణమించినది ప్రబంధ కవిత

ఎందరెందరో కవులకు డెందమందు,
సందడించిన మాధుర్య సారమిదియె,
క్రమ కవితల భాసించు, కావ్యధనము
వేయి కిరణాలు దీపించె, విశ్వమూర్తి.

- జి.గాయత్రిదేవి,
తెలుగు పండితులు
విశాఖపట్నం, 98858 71464

తెలుగువాడి జీవనాడి..

కూచిపూడి!!

నాట్య జగతిపై తెలుగువాడి 'ముద్ర'... కూచిపూడి. అద్భుత ఆహార్యం... విశిష్ట వాచికాభినయం... కూచిపూడి సొంతం. కృష్ణాతీరంలో ప్రభవించి... అచ్చతెలుగు సంప్రదాయంలో వికసించి... ఖండఖండాంతరాల్లో జయకేతనం ఎగురవేసిన ఘన చరిత కూచిపూడి నృత్యానిది. ఆనాటి సిద్ధేంద్రుడి నుంచి నిన్నటి వెంపటి చినసత్యం వరకూ ఎందరో మహానుభావుల కేళికా విన్యాసాలతో పరిపుష్టమై... భారతీయ శాస్త్రీయ నృత్యాలకే తలమానికమై... దేశ విదేశాల్లోని అసంఖ్యాక అభిమానుల ఆదరణను అందుకుంటున్న అచ్చతెలుగు కళారూపమిది.

చక్కెర తేనెల ఊట, మధురామృతాల తోట... మన తెలుగు. నవరస నాట్య దీపిక.. మన కూచిపూడి. ఈ రెండింటిది అవినాభావ బంధం. ఆరువందల ఏళ్ల కిందట సిద్ధేంద్రుడు సృజించిన 'భామాకలాపం'లో భాష, భావం జోడు గుర్రాలై కదం తొక్కుతాయి. 'భామనే... సత్యభామనే' అంటూ తన గురించి చెప్పుకునే సిద్ధేంద్రుడి సత్యభామ... 'ఇంతినే చామంతినే మరుదంతినే విరిబంతినే' అంటూ హొయలు పోతుంది. పదహారు వేల మంది కోమలులందరిలోనూ తానే భామనని సగర్వంగా ప్రకటించుకుంటుంది. అభినయానికి, నర్తనానికి వంద శాతం అవకాశం కల్పించే అక్షరాల సమ్మేళనం... భామాకలాపం. ఇదొక్కటే కాదు... కూచిపూడి కళాకారులు అభినయించే నాట్యరూపాల్లో అత్యధికం అచ్చతెలుగుకు పట్టం కట్టినవే.





కూచిపూడి కళాకారుల నయనాలు అభినయాన్ని పలికిస్తే... కర చరణాల విన్యాసాలు భావ ప్రకటనలను వ్యక్తం చేస్తాయి. సాధారణ భావాల నుంచి నెమలి నాట్యం, పూల మకరందాన్ని గ్రోలే భ్రమర విన్యాసం, కడలి కెరటాల పదనిసలు,. మలయ మారుతం, మేఘాల షికారు, వాన జోరు, పిడుగుల హోరు, మగువ సౌందర్యం, సౌకుమార్యం లాంటి అనేకానేక అపరూప దృశ్యాలను... కేవలం చేతివేళ్లను కదిలిస్తూ, శిల్ప సదృశ్యమైన భంగిమలతో కళ్లకు కట్టడమే కూచిపూడి ప్రత్యేకత. కూచిపూడి హస్తముద్రలు అపూర్వం. ప్రకృతి నుంచి, సామాజిక



నేపథ్యం నుంచి, నిత్య జీవితం నుంచి గ్రహించిన అనేక భావాలను అతి సుకుమారంగా వ్యక్తం చేస్తాయి అవి. ఒక్క చేతితో అభినయించే 28 అసంయుక్త హస్తముద్రలు, రెండు చేతులతో చేసే 13 సంయుక్త హస్తముద్రలు... కూచిపూడి సొంతం. నిజానికి భరతుడి నాట్య శాస్త్రం లోని 67 హస్తముద్రలనూ కూచిపూడి అభినయించగలదు. అలాగే, చతుర్విధ ప్రక్రియల్నీ, రీతుల్ని పూర్తిగా అన్వయించుకున్న ఏకైక నృత్యమిది. అలంకార శాస్త్రంలోని దశ రూపకాలను, ఉప రూపకాలను కూడా పూర్తిస్థాయిలో ప్రదర్శించగల నేర్పు కూచిపూడి కళాకారులది.

సామాన్యుని జీవన చిత్రాన్ని ప్రతిబింబించినప్పుడే కవిత్వమైనా, కళలైనా సార్థకమయ్యేది. ఈ కొలమానాన్ని అందుకోవడంలో కూచిపూడిది ఎప్పుడూ అగ్రస్థానమే. దేవాలయాలకు, రాజాస్థానాలకు మాత్రమే పరిమితం కాని కళ ఇది. ప్రజా సమస్యల్ని నర్మగర్భితంగా అభినయిస్తూ మహారాజుల దృష్టికి తీసుకెళ్లి - వాటి పరిష్కారానికి కృషి చేసే సామాజిక బాధ్యతను శతాబ్దాల కిందటే భుజానికెత్తుకుంది కూచిపూడి.

ఆనాడు శిస్తుల వసూలు పేరిట... రాయలసీమలోని సిద్దవటం గ్రామంలో కరవు బారిన పడ్డ కుటుంబాల్లోని స్త్రీలపై రాజ ప్రతినిధి సమ్మెట గురవరాజు క్రూరమైన అత్యాచారాలు చేసేవాడు. కేళిక రూపంలో శ్రీకృష్ణదేవరాయల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, అకృత్యాలకు అడ్డుకట్ట వేయించారు నాటి కూచిపూడి భాగవతులు. ఆనాటి నుంచి నేటి వరకూ ఎన్నో సామాజిక సమస్యలపై పదం కలుపుతూ కదం తొక్కుతూ పురోగమిస్తూనే ఉంది. విశ్వకవి రవీంద్రుడి 'చండాలిక'ను అభినయించి అంటరానితనంపై విల్లు ఎక్కుపెట్టింది. భ్రూణ హత్యలపై 'నాతిచర', స్త్రీల సమస్యలకు అద్దం పట్టే 'విజయోస్తు తే నారీ', అన్నదాతల ఆక్రందనల

కూచిపూడి అ, ఆ, లు!!

అంకురారోపణ: 600 ఏళ్ల కిందట.

ఆవిర్భావం: కృష్ణాజిల్లా కూచిపూడిలో.

ఆద్యుడు: సిద్ధేంద్రయోగి.

ఆలంబన: భరతుని నాట్యశాస్త్రం.

అంకాలు: వీధినాటకాలు, యక్ష గానాలు, కలాపాలు

ఆకర్షణ: ఆంగికం - ఆహార్యం - వాచికం - సాత్వికాల అభినయ విన్యాసం.

అపూర్వం: మూడుసార్లు అంతర్జాతీయ సమ్మేళనాలను నిర్వహించుకోగలగడం.

అజరామరాలు: హరిశ్చంద్ర, భక్తప్రహ్లాద, ఉషా పరిణయం, విప్రనారాయణ, శ్రీనివాస కల్యాణం, నర్తనశాల, చండాలిక తదితర నృత్య ప్రదర్శనలు.

అగ్రగణ్యులు: వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, వెంపటి వెంకటనారాయణ, చింతా వెంకటరామయ్య, తాడేపల్లి పేరయ్య, మాధవయ్య హరి, వేదాంతం రాఘవయ్య, భాగవతుల రామలింగశాస్త్రి, వేదాంతం వెంకటాచలపతి శాస్త్రి, వెంపటి పెదసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి చినసత్యం, మహంకాళి సత్యనారాయణ శర్మ తదితరులు.

కూచిపూడి సిగలో కలికితురాయిలు

1502 కూచిపూడి భాగవతుల తొలి ప్రదర్శన.

1678 కూచిపూడి బ్రాహ్మణులకు అగ్రహారాన్ని బహూకరించిన తానీషా.

1952 వేదాంతం పార్వతీశం కృషితో సిద్ధేంద్ర కళాక్షేత్ర స్థాపన

1953 'క్షీరసాగర మథనం' నృత్య నాటకం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి.

1954 వేదాంతం పార్వతీశం చేత కూచిపూడి పతాకావిష్కరణ

1960 కూచిపూడి సశాస్త్రీయమని నిరూపణ.

1986 కూచిపూడిపై డా॥ చింతా రామనాథం మొదటి పరిశోధన.

2002 కూచిపూడి నాటక వికాసంపై డా॥ వేదాంతం రామలింగశాస్త్రి సమగ్ర పరిశోధన.

2008 కాలిఫోర్నియాలో అయిదు తరాలకు చెందిన 320 మంది కళాకారుల ప్రదర్శనతో తొలి గిన్నిస్ బుక్ రికార్డు

2010 హైదరాబాద్‌లో 2800మంది కళాకారుల మహాబృంద నాట్యప్రదర్శనతో రెండో గిన్నిస్‌బుక్ రికార్డు.

2012 హైదరాబాద్‌లో 16 దేశాల 5794మంది కళాకారులు ప్రదర్శనతో మూడో గిన్నిస్‌బుక్ రికార్డు.

నేపథ్యంలోని 'రైతేరాజు', జాతి సమగ్రతను చూపే 'సమైక్యతా భారతి', శాంతిని ఆకాంక్షించే 'అహింసా పరమోధర్మః', మహనీయుల జీవితాల్ని ప్రతిబింబించే 'వివేకానంద'... కూచిపూడి శైలికి నిలువెత్తు తార్కాణాలు. కూచిపూడిలో ఒక విశేష నృత్య అభినయంగా ఆవిర్భవించిన ఏకపాత్ర కేళికలన్నీ... సమాజంలోని ఏదో ఒక సమస్యను ప్రధానంగా తీసుకుని ప్రదర్శించేవే.

కాలక్రమంలో వచ్చిన లెక్కకు మిక్కిలి మార్పులను ఎప్పటికప్పుడు ఆవాహనం చేసుకుంటూ కూచిపూడి సుసంపన్నం అవుతోంది. అయితే, కళకైనా కళాకారులకైనా జనాదరణ ఆయువుపట్టులాంటిదైతే ప్రభుత్వ చేయూత సంజీవని. దేశాంతరాల్లో తెలుగు వారి ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ, అనితరసాధ్యమైన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న కూచిపూడికి ప్రభుత్వ ఆదరణ ఇంకా పెరగాలి. నాట్యాన్నే తపస్సుగా భావించి సాధన చేస్తూ, చేయిస్తూ... భావితరాలకు దాన్ని దగ్గర చేస్తున్న కళాకారులకూ చేయూతనందివ్వాలి. కూచిపూడికే జీవితాలను అంకితం చేసిన మహానుభావులను ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రజల్లో కూచిపూడిపై అభిరుచిని, ఆసక్తిని పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలి. ఆసక్తి ఉన్న చిన్నారులకు పాఠశాల స్థాయిలోనే కూచిపూడిని నేర్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అప్పుడే తెలుగువాడి కూచిపూడి ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుంది.

సాహితీ భాండాగారం

సిద్ధేంద్రయోగి భామాకలాపం ఇతివృత్తం ఏ పురాణాల్లోనూ లేదు. సొంతంగా ఆయనే సృష్టించారు. అప్పటి దాకా తెలుగులో లేని ఛందో ప్రక్రియను సృజించారు. 'లేఖ' ప్రక్రియనూ తీసుకొచ్చారు. నాయకుడు, నాయికను బతిమిలాడే 'సాంత్వన' అనే ప్రక్రియకూ ఆయనే ఆద్యుడు. అద్భుత కథను సృష్టించడం, పాత్రల తీరుతెన్నులను తీర్చిదిద్దడం, ఛందోబద్ధతను తీసుకురావడం లాంటి బహుళ ప్రయోగాలను చేసిన సిద్ధేంద్రయోగి ఆది కవితా పితామహుడు కాదా? కూచిపూడి నాట్య సాహిత్యంలో అద్భుతమైన విలువలున్నాయి. అది కర్ణపేయంగా, పండిత పామర జనరంజకంగా, రసస్ఫోరకంగా, రాగానికనుగుణంగా ఉంటుంది.

- నాట్యాచార్య వేదాంతం రామలింగ శాస్త్రి, ప్రిన్సిపల్, సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠం

కూచిపూడి... ఒక జీవనది

కూచిపూడి జీవనది లాంటిది. స్థల, కాలాలకనుగుణంగా మార్పులను స్వీకరిస్తూ వస్తోంది అది.. దక్షిణ భారతంలో తమిళ, కన్నడ వాగ్గేయకారుల కృతుల్ని స్వీకరించింది. అలాగే ఉత్తర భారతంలో తులసీదాస్, కబీర్‌దాస్, మీరాబాయి లాంటి వారినీ సమాదరించింది.. అంతెందుకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం స్వయంగా రాసిన ఆంగ్ల కృతులకు సైతం పాశ్చాత్య సంగీతంతో బాణీ కట్టి ప్రదర్శనలిచ్చి జయభేరి మోగించింది. ఇలా సాహిత్యంలో, సంగీతంలో ఎన్ని మార్పులను స్వీకరించినా కూచిపూడి మాత్రం తన సహజత్వాన్ని, శాస్త్రీయతను ఏనాడూ కోల్పోలేదు. తెలుగు గ్రామీణుల పౌరాణిక గాథలను ప్రచారం చేసే నేటి దాకా కూచిపూడి ప్రస్థానం అద్వితీయం.

- పద్మభూషణ్ డా॥ రాజారెడ్డి

తెలుగుతోనే వెలుగు

కూచిపూడికి ఆలంబన తెలుగు సాహిత్యమే. విఖ్యాత వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య, త్యాగయ్య రచనలతోనే కూచిపూడి తన మహాప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత కాలంలో భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి, మహాకవి శ్రీశ్రీ సాహితీ పరిమళాలను కూడా అది ప్రదర్శనలకు స్వీకరించింది. తెలుగు భాషామృతాన్ని ఖండాంతరాలకు తీసుకెళ్లింది. తెలుగు వారి వెలుగుగా కూచిపూడి విరాజిల్లుతోంది.

- నాట్యాచార్య మహంకాళి సూర్యనారాయణ శర్మ, ఫౌండర్ డైరెక్టర్, శ్రీతిరుమల ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు

తేనె పలుకులు

పిల్లలు మన ప్రతిబింబాలు. కొంత వయస్సు వచ్చే వరకూ మనమేం చేస్తే వాళ్లూ అదే చేస్తారు. ఈ కిటుకును అర్థం చేసుకోగలిగితే వాళ్లకు అమ్మభాషను సులువుగా నేర్పించవచ్చు. చిన్నారులతో రోజూ తెలుగులో మాట్లాడితే చాలు వారూ గలగలా మాట్లాడేయగలరు. మా అమ్మాయికి తెలుగును అలాగే అలవాటు చేశా. తనకు రెండేళ్లప్పుడు కథలు చెబుతూ, వాటిల్లోని పదాలు, వాక్యాలను అభినయంతో వివరించేదాన్ని. బొమ్మలను చూపించి, వాటి పేర్లను చెబితే...

మేలు కలయిక

కూచిపూడిని కేవలం వినోద మాధ్యమంగా భావిస్తుంటారు. నిజానికి కూచిపూడి కళ విజ్ఞాన భాండాగారం కూడా. అది పురాణాల ప్రాశస్త్యాన్ని కళాత్మకంగా ప్రజల ముందుకు తెచ్చింది. బాల్యవివాహాలు, సతి, వరకట్నం, మద్యపానం లాంటి సామాజిక జాడ్యాలపై కూచిపూడి పోరాడింది. కాలప్రవాహంలో ఆవిష్కృతమైన సాంకేతికతను అందిపుచ్చుకుని అది మరింత సుసంపన్నమైంది. జీవితానికి సాఫల్యతను అందించే కళ కూచిపూడి అని వర్ధమాన కళాకారులు గుర్తెరగాలి. ప్రభుత్వం కూడా మన కళకు, కళాకారులకు చేయూతనిస్తేనే ధరణిపై తెలుగు జాతి ఉన్నంతకాలం కూచిపూడి వైభవోపేతంగా విలసిల్లుతుంది.

- పద్మశ్రీ, నృత్య చూడామణి, డా॥ శోభానాయుడు

అదే లక్ష్యం

కూచిపూడిది ఎంతో పురాతన, అద్వితీయ చరిత్ర. అంతటి గొప్ప శాస్త్రీయ నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి సిలికానాంధ్ర తరపున సంకల్పించాం. అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనాలను నిర్వహిస్తున్నాం. మన పిల్లలకు కూచిపూడి ద్వారా వివేకం, విచక్షణ, విజ్ఞానాన్ని అందించడం కోసమే ఈ ప్రయత్నం.

- కూచిబొట్ల ఆనంద్,
సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు

నాగరాజ్.వై
హైదరాబాద్
93944 89273

చక్కగా గుర్తు పెట్టుకుని చెప్పేది. తనకు కొత్త పదాలను నేర్పించటం కోసం ఇంట్లో ఉన్న ప్రతి వస్తువునూ ఉపయోగించుకున్నా. అలా అలా కథలను చదివే స్థాయికి వచ్చింది. మా అమ్మాయికి ఆ వయసులో రాయడం రాకపోయినా అక్షరాలను గుర్తుపట్టి క్రమేణా కథలను చదవడం కూడా అలవాటైంది. ఆ తర్వాత పాటలను నేర్పించా. వాటిపై తను ఎక్కువ ఆసక్తి చూపుతుండటంతో సంగీతంలో శిక్షణిప్పించా. ఇప్పుడు మా అమ్మాయి 'ఆకాశవాణి'లో 'యువవాణి' కళాకారిణి. మావారికి అమెరికాకు బదిలీ అయింది. మా పాపకు తెలుగు నేర్పిన అనుభవం, దాని ఫలితమిచ్చిన స్ఫూర్తితో సిలికానాంధ్ర 'మనబడి'లో సభ్యురాలిగా చేరా. నవతరానికి తెలుగు నేర్పుతున్నా. చిన్నప్పుడు మా పాపకు చెప్పిన కథలను 'తేనె పలుకులు' పేరిట పుస్తకంగా ప్రచురించా.

- డా॥ నీరజ అమరవాది
లూసియానా (అమెరికా)

చిన్నచెట్టుకు చిన్నగాలి

నెయ్యిపూస, కారప్పొడి, అల్లం పచ్చడితో ఆరు ఇడ్లీలు తిని భుక్తాయాసం తీర్చుకుంటుంటే...

మా ఆవిడ సుందరి తిట్టింది! అలా ఇలా కాదు. సి.పి.బ్రౌన్, శంకరనారాయణ మొదలుకొని బహుజనపల్లి వారి శబ్దరత్నాకరం వరకు ప్రతి నిఘంటువులోని దొరికిన పదాలు, దొరకని పదాలు కనిపెట్టి మరీ తిట్టింది...

భార్య అన్నాక తిట్టకుండా, కొట్టకుండా ఉంటుందా అని సరిపుచ్చుకున్నాను. అయినా మనసు గైపుచ్చుకోవటం లేదు. అకారణంగా తిట్టింది.



"అకాడమీ పురస్కారాన్ని పొందిన వాడిని, అంతలా తిట్టడం భావ్యం కాదేమో ఆలోచించు సుందరీ..." అన్నాను. విన్పించుకోలేదు. సరికదా

"ఆ అవార్డు ఇచ్చిన వాడికి ఎవరూ దొరక్క మీకు ఇచ్చినట్లున్నాడు" అంది నాకు ఏడుపొచ్చింది.

"నెల తక్కువ వెధవ. చెప్పొద్దూ కనీస ఇంగితమూ లేనివాడా అని మీ నాన్న గారు ఎన్నోసార్లు మిమ్మల్ని తిట్టడం నేను విన్నా" అని కూడా అంది.

అమ్మ గుర్తుకొచ్చింది!

ఏడుపొస్తే అమ్మ ఒడిలో దూరి పోయేవాడిని. ఇప్పుడు ఆ అవకాశం లేదు. ఒక వేళ కావాలనుకుంటే నేను కూడా పైకి వెళ్లాలి.

ఏం చెయ్యాలి? ఇది నాకు అలవాటే. ఈసారి కాస్త మోతాదు ఎక్కువైంది. అందుకే వికటిస్తోంది. ఇక ఇంట్లో ఉండటం అంత శ్రేయస్కరం కాదు. ఊరి బయటకు వెళ్లటం మంచిది

సుందరి తిట్ల పురాణం లంకించుకుని ఆనందిస్తూ ఉంటే నేను నెమ్మదిగా తెలుగు కథల పుస్తకం ఒకటి పట్టుకుని ఇంటి నుంచి బయట పడ్డాను.

* * *

వీధులు దాటుకుంటూ, రోడ్డులు దాటుకుంటూ, వాహనాల రద్దీని, పొగని తప్పించుకుంటూ ఊరు చివర ఉన్న చిట్టడవిలో ప్రవేశించాను. అప్పుడప్పుడు అక్కడికి వెళ్లి, ఎక్కడో ఒకచోట కూర్చుని అడవి సొగసు చూసుకుంటూ చదువుకుంటుంటాను.

హాయిగా ఉంది. సంసారం కంటే సన్యాసం మేలు అని అందుకే అన్నారేమో కానీ ఇప్పుడు సన్యాసం కంటే సంసారం సుఖం అంటున్నారు. ఇంటి కంటే గుడి పదిలం, గుడికంటే అడవి మహా పదిలం.

ఎటూ తేల్చుకోలేక పోతున్నాను....

గుబురుగా పెరిగిన ఒక వేపచెట్టు కనిపించింది. దాని మొదలు దగ్గర శుభ్రం చేసుకొని కూర్చున్నాను. చుట్టూ పొదలు, చిన్న చిన్న డొంకలు, ఎక్కడ చూసినా చెట్లు, పుట్టలు, ఎర్రటి మట్టి దిబ్బలు, నీలం ఆకాశం, చల్లటి గాలి... హాయిగా ఉంది వాతావరణం.

నా హృదయంలో బాధ తగ్గింది.

చెట్టు నీడ చల్లగా, హాయిగా ఉండటం వల్ల పుస్తకం చదువుతూనే నిద్రలోకి జారుకున్నాను. కల మొదలైంది....

ఎదురుగా గార్దభం.. అచ్చ తెలుగులో గాడిద ఓండ్ర పెడుతోంది.

"ఎందుకలా గాడిదలా అరుస్తున్నావు"? అన్నాను కోపంగా.

"నేను గాడిదనే" అంది నవ్వుతూ

"ఓ మీరు గాడిదా? చెప్పండి తమరు వేంచేసిన విషయం?"

"ప్రతి ఒక్కడూ ఏ మాత్రం కోపం వచ్చినా ఇంకొకడిని 'గాడిదా!' అని తిడతారు. మేం భరిస్తున్నాం కదా. నువ్వెందుకు మీ ఆవిడ తిట్టిందని బాధపడతావు?" అంది.

"అంటే ఓదార్చడానికి వచ్చావా?"

"అవును"

"సరే. ఇక వెళ్లు. చెప్పింది చాలు" అన్నాను. దాని వెనకే కొండముచ్చు వచ్చింది.

"ఏంటా కొండముచ్చు మొహం" అన్నాను దాన్ని వెక్కిరిస్తూ

"నువ్వు నన్ను తిట్టొచ్చు. మీ ఆవిడ నిన్ను తిడితే తప్పు. అందరికీ తిట్టడం అలవాటయిపోయింది." అంది కోపంగా

"నీ ముఖం అద్దంలో చూసుకో. వెళ్లు నాకు కనపడకు" అన్నాను.

"ఎవరి అందం వాళ్లది. విమర్శించకు మర్యాదగుండదు" అంటూ ఓ హెచ్చరిక జారీ చేసి వెళ్లిపోయింది.

నా నెత్తిమీద చెట్టుకు వేలాడుతూ ఒక కోతి కిచకిచ మంటూ కనిపించింది.

"నీ కోతి చేష్టలు ఆపుతావా?" అన్నా విసుగ్గా.

"ఇంకోసారి కోతి అన్నావా రక్కుతాను." అంది.

"భలేగుంది కోతిని కోతి అనక పులి అనమంటావా?"

"నాకంత దృశ్యం లేదు కాని, మా బుద్ధులన్నీ మీ మనుషులకొస్తున్నాయి. మమ్మల్ని తిట్టకండి"

"మీరే కదా మాకు ప్రారంభం"

"అలా గుర్తెట్టుకుని, ఆవిడ తిట్టినా ఏమనుకోకండి. కిచ. కిచ. కిచ" అంటూ మరో చెట్టు మీదకి వెళ్లిపోయింది.

ఎగురుకుంటూ వచ్చి ఓ కాకి ఎదురు కొమ్మ మీద వాలింది.

"కావ్. కావ్. కావ్. కావ్" అని అరుస్తోంది.

"ఏంటి నీ కాకి గోల" అన్నాను చిరాగ్గా

"నేను కాకినే"

"ఏంటి హంసలాగ ఫోజు కొడుతున్నావు. ఒక సారి నీ రూపం చూసుకో"

"ఎవడుబడితే వాడు, నల్లగా ఉంటే చాలు 'కాకిలా ఉన్నాడు చూడరా' అంటారు. మా కాకులంటే మీకు అంత అలుసా?" అంది కావ్ కావ్ మంటూ...

"లేకపోతే నీకు సన్మానం చెయ్యాలా?" అన్నాను కసురుతూ.

"అంట్లు తోమేటప్పుడు మీ ఆవిడ నన్ను కూడా తిడుతుంది. నేను పట్టించుకున్నానా? నువ్వెందుకు శివాజీగణేషన్‌లా ఫీలై పోతున్నావు?"

"శివాజీని అన్నావా, నిన్ను చంపేస్తాను. ఆయన నా అభిమాన నటుడు" అనేటప్పటికి అది భయపడి తుర్రున ఎగిరి పోయింది.

ఎక్కడి నుంచో బుస్స్స్స్స్... అనే శబ్దం వినపడుతోంది. చూస్తే, ఇంకేంటి? పాము! నాగుపాము! భయంకరంగా ఉంది. ఒళ్లు జలదరించింది. బుస కొడుతూ వచ్చి పడగ విప్పి ఆడుతోంది...

"ఏంటి నీ సంగతి? నువ్వు కనబడితే చంపేస్తారు కదా. ఎందుకు సంతోషంగా మెలికలు తిరుగుతున్నావు? అడిగాను.

విష జంతువునే అయినా నేను నా అంతట ఎవరి జోలికీ రానని మీకు బాగా తెలుసు. 'వాడు పాములాంటి వాడు. పాముకి పాలు పోసి పెంచకు' అని హెచ్చరించి మా పేరు చెడగొడుతుంటారు" అంది వేదనగా

"నాగుల చవితి మర్చిపోయావా" అన్నాను

"పాలు తాగుతామా? అవి పోసి, మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేసి చంపేస్తారు"

"ఇంతకీ నువ్వేం చెప్పబోతున్నావు?"

"మాలాంటి వాళ్లమే ఎన్నో భరిస్తున్నాం. సుందరి నాలుగు తిడితే నువ్వు భరించాలి"

"సర్లే. అది చెప్పడానికి వచ్చావా? వెళ్లు వెళ్లు. ఏ పాముల నర్సయ్య అయినా రాగలడు" అనగానే సర్రున పాక్కుంటూ కనపడకుండా పోయింది.

ఇంతలో భీకరమైన అరుపు! గుండెలు అదిరిపోతున్నాయి. ఒంట్లో వణుకు పుడుతోంది. ఎదురుగుండా పులి. తల రాజసంగా తిప్పుతూ మీసం మేలేసింది.

"ఏంటి మలేరియానా? ఎందుకలా వణుకుతున్నావు?" అడిగింది చాలా ప్రశాంతంగా "నిన్ను చూస్తే మానవ మాత్రుడెవడికయినా వణుకు పుట్టదా? ఒకటేరెండూ ఇక్కడే అయిపోయేటట్టున్నాయి. వెళ్లిపో" అన్నాను దండం పెడుతూ

"మరి ఇంత భయమున్నోళ్లు 'పులిలాంటోడు పిల్లిలా అయిపోయాడు' అని ఎందుకు నన్ను హేళన చేస్తారు? మా మామా అల్లుళ్లకి ఎందుకు తగువులు పెడతారు? ఈసారి నువ్వు గాని నన్ను గాని ఎక్కడైనా తిట్టావంటే గుండె చీల్చి రక్తం తాగుతా" అంటూ వేడి వేడి ఝలక్ ఒకటి ఇచ్చి వెళ్లింది.

దాని మనసులో ఉన్నదేంటో నాకు అర్థమైంది. అదీ మా ఆవిడని వెనకేసుకొస్తోందని నాకు తెలిసి పోయింది.

చెట్టు కొమ్మలు ఫెళ ఫెళ విరిగి పోతున్నాయి. భారీ కాయం నల్లగా ఉంది. పరకాయించి చూస్తే.. ఇంకేముంది? ఏనుగు.

"ఏంటలా ధ్వంసం చేస్తున్నావు?" అన్నాను

"ధ్వంసం కాదు. తింటున్నాను. అయినా మీ కంటే మేం ధ్వంసం చేస్తున్నామా? ప్రకృతిని, పర్యావరణాన్ని ఎవడు నాశనం చేస్తున్నాడు? మీరు కాదూ" అని ఘీంకరించింది.

"సరే ఇప్పుడేమంటావు?"



"నా అంతటి భారీ జంతువుని పోలిక చూపించి 'గున్న ఏనుగులాగున్నావు. ఏం తింటున్నావురా వెధవా? ఒళ్లు తగ్గించుకో' అని తిడుతుంటారు. ఇది మీకు తగునా?"

"మేం ఎవరినయినా తిడతాం. తిట్టడం మా జన్మహక్కు"

"అయితే సుందరి నిన్ను తిట్టకూడదా?"

"ఆ రూట్లో వచ్చావా? వెళ్లు. వెళ్లు" అన్నాను

"నువ్వే వెళ్లు. ఈ అడవి నాది" అంటూ తినడంలో మునిగిపోయింది.

నా చుట్టూ ప్రదక్షిణలు కొడుతోంది ఓ చిన్న ప్రాణి. ఏమిటా అని చూశాను. ఎలుక.

"విఘ్నేశ్వరుడిని వదిలేసి, నా చుట్టూ ఈ తిరగడాలు ఏమిటి?" అని సూటిగా ఎలక పిల్లని ప్రశ్నించాను.

"ఎవరైనా బాగాలేకపోతే 'ఎలక లాగుంది. ఎలక లాగున్నాడు' అని సాధిస్తారు. మేం తలచుకుంటే మీ బట్టలు పేలికలు చేసేస్తాం. మీ ఇల్లు కన్నాలు చేసేస్తాం తెలుసా?" అంది

"ఈమాత్రం చెప్పడానికి ప్రదక్షిణలు చెయ్యాలా? వినాయకుడు ఎదురు చూస్తున్నాడు వెళ్లు" అన్నా ఎకసక్కెంగా.

"మీ ఆవిడ తిడితే భరించలేనివాడివి నువ్వా నాకు చెప్పొచ్చేది. ఫో.." అంటూ బొరియలోకి దూరిపోయింది.

"పీడ విరగడయ్యింది" అనుకుంటుంటే ఎదురుగా వికారంగా ఓ జంతువు

"గుంటనక్క గుంటనక్క" అన్నాను

"ఇంత బాహాటంగా నన్ను తిడుతున్నావే, సుందరి ఏమంత ఎక్కువ తిట్టిందని ఇలా వచ్చేశావు" అంది పాత సినిమాలో రమణారెడ్డి ముఖం తిప్పినట్లు తిప్పి.

"నీ నక్కజిత్తులు నా దగ్గర పనికి రావు" అని, అటువైపు చూస్తే ఒక బీభత్స దృశ్యం. కుక్క, పిల్లి దెబ్బలాడుకుంటున్నాయి...

"మీకేం పోయేకాలం వచ్చిందర్రా కొట్టుకు చస్తున్నారు?" అన్నా.

"చూడు ఈ పిల్లి 'నాది కుక్క బతుకు కుక్క బతుకు' అంటోంది" అంది కుక్క బాధగా

"చూడండి ఈ కుక్క నేను గోడమీద పిల్లినట" అంది పిల్లి ఏడుస్తూ

"అవును అవి రెండూ నిజమే. మేమే కదా అలా మిమ్మల్ని అంటూ ఉంటాం"

"మీ మనుషులకు మేమంటే చులకన"

"అంతే మరి"

"మీ ఆవిడకి నువ్వంటే చులకన హి.హి.హి." నవ్వాయి రెండూ. ఒక కర్ర తీసుకొని వాటివెంట బడ్డా. పరుగు తీసాయవి.

అసలు ఇలా జంతువులన్నీ వచ్చి వాటిని మనుషులు తిట్టే తిట్లు, నిందలు, హేళనలు గురించి నాకు ఎందుకు చెబుతున్నాయి? నన్ను ఓదార్చడానికా? అసలు నేనెవర్ని? మనిషిని కదా!

"నువ్వు మనిషివి. కానీ నువ్వు కూడా ఒక సాంఘిక జంతువువే. అందుకే మేమంతా వచ్చి నీకు బోధ చేశాం" అని మృగరాజు సింహం వచ్చి గర్జించింది.

"నువ్వు మిగిలిపోయావనుకున్నాను. నువ్వు కూడా వచ్చేశావన్నమాట"

"చాలామంది రాలేదు. జంతువులన్నీ వస్తే నీ బుర్రపాడై, నువ్వు మానసిక చికిత్సాలయం చేరాలి. అదృష్టవంతుడివి."

"సరే. నీ ముక్తాయింపు ఏమిటి?"

"సర్కస్‌లో మమ్మల్ని పెట్టి, కొరడాలతో కొట్టి హింసించి, ఆడించి ఆనందిస్తారు. అప్పుడు లేదా? ఇప్పుడు నీ పెళ్లాం తిట్టిందని అంత ఇదైపోతున్నావు?"

"నమస్కారం మహాప్రభో మృగరాజా! మా ఆవిడ తిట్లన్నీ మర్చిపోయాను. మీ జంతువులే మర్చిపోయేటట్లు చేశాయి. మీకు ధన్యవాదాలు" అన్నాను.

సింహం మాయమైపోయింది. ఒక్క జంతువూ కనిపించలేదు. కల ఖాళీ అయిపోయింది. మెరుపులు, ఉరుములతో దృశ్యం మారింది. వర్షం పడుతుందేమోనని అనుకున్నాను.

ఆకాశంలో ఓ దివ్యరూపం... చతుర్భుజాకారం. చక్రగదాధారుడై, కిరీటకుండల మండితుడై, తేజో విరాజమానుడై సప్తర్షి మండలంలో భగవంతుడు ఆకాశం మధ్యలో దర్శనమిచ్చాడు..

"ఆహా నేను ఎంత అదృష్టవంతుడిని. భగవంతుడు దర్శనమిచ్చాడు" అనుకున్నాను... కాదు బయటకు అనేశాను.

"నువ్వు కాదు"

"నేను కాదా? మరెవరు?"

మాటల మూటలు

అ ఆ స్పందన

వంటిల్లు, స్నానాలగదులే పాఠశాలలు. గిన్నెలు, చెంచాలు, నీళ్ల తొట్టి, చెంబు... ఇవే బోధనోపకరణాలు. చెంబుతో అటు నీళ్లు ఇటు పోయిస్తూ మా ప్రార్థన, ఇతిహాస్‌లకు లెక్కలు నేర్పా. వంటింటి సామానుతో అక్షరాలను పేర్చి చూపిస్తూ అక్షరాలను అలవాటు చేశా. కుటుంబ వృక్షం, సంప్రదాయం చెబుతూ పదాలతో పరిచయం పెంచా. దైనందిన జీవితంలో తారసపడే అంశాలను గుర్తించి, వాటికనుగుణంగా మాట్లాడేలా తర్ఫీదునిచ్చా. అంటే, నేను బయటకు వెళ్లినప్పుడు ఫోను వచ్చిందనుకోండి... 'అమ్మ లేదు, ఏమైనా చెప్పమంటారా, మీ పేరేంటండీ' అని అడిగేలా అన్నమాట! ముద్దు ముద్దుగా వాళ్లు అలా మాట్లాడుతుంటే అవతలి వాళ్లు ఎంత మెచ్చుకునే వారో! అలాగే తేట తెలుగుపై అవగాహన పెంచడానికి కథలు, మంచి వ్యాసాలను చదివి వినిపించే దాన్ని. తిరిగి వాళ్ల చేత చదివించే దాన్ని. ఆసక్తి కలిగించే 'ఈనాడు' వార్తా కథనాలనూ పాఠ్యపుస్తకాలుగా ఉపయోగించుకున్నా. ఇంటికెవరొచ్చినా 'మామయ్య, అత్తయ్య, బాబాయి, పిన్ని' వంటి తెలుగు చుట్టరికపు వరుసలతోనే పిలిచేలా చూశా. ఇలా చిన్న చిన్న కృత్యాలతోనే అమ్మభాషతో మా చిన్నారులకు అనుబంధం ఏర్పరిచా.

- గుమ్మా శాంతిప్రియ, నెల్లూరు

"నీ భార్య సుందరి"

"ఆ తిట్ల సుందరియా?"

"అలా అనకు. భగవంతుడినైన నన్నే ఎవడో ఏదో సందర్భంలో, ఈ సృష్టిలో ఇది బాగాలేదనో, అది బాగాలేదనో తిడుతూనే ఉంటారు. తాటి చెట్లకి చిన్న కాయలు పెట్టానని, గుమ్మడి పాదులకు పెద్ద కాయలు పెట్టానని ఎప్పుడో నన్ను విమర్శించారు. ఇప్పుడు కూడా రకరకాలు విమర్శిస్తున్నారు. నేనేం పట్టించుకోవడం లేదు. అది వాళ్ల నైజం. ఇంత సృష్టిని చేసిన నాకే తిట్లు తప్పడం లేదు. దేవతలు పొగుడుతారు. రాక్షసులు తిడతారు. మానవులు అటు ఇటుగాక ఎడా పెడా వాయిస్తుంటారు. నువ్వు తిట్లు కాశావని బాధపడకు. తిట్టేవాళ్లే దీవిస్తారు. దీవించేవాళ్లే తిడతారు."

"ఏంటి సుందరి నన్ను దీవిస్తుందా?"

"అవును. అటు చూడు. పొద్దుననగా బయటకు వచ్చేసిన నువ్వు, చీకటి పడేదాక రాలేదని ఎంత తల్లడిల్లుతోందో, నీ కోసం పులిహోర, పాయసం చేసి ఎదురు చూస్తోంది చూడు..." అంటూ భగవంతుడు ఒక దృశ్యం చూపించాడు.

"ఈ మతిలేని మనిషి ఎక్కడ ఉండి పోయారో, ఏమైపోయారో? అనవసరంగా తిట్టాను. నా నోరు పడిపోను. ఆకలితో ఎక్కడున్నారో? దేవుడా తొందరగా ఆయన్ని ఇంటికి పంపు. నాకేమీ తోచటం లేదు" అంటోంది సుందరి.

"చూడు! ఏమీ తోచటం లేదట! ఇంటికి వెళ్తే వాటితోబాటు నాలుగు వడ్డిస్తుందేమో?" నా భయం నాది.

"భయపడకయ్య వెళ్లు! మాయా స్వరూపిణి అయిన అమ్మవారిని నేను భరించటం లేదూ? నువ్వూ అలాగే. చిన్న చెట్టుకు చిన్నగాలి. పెద్ద చెట్టుకు పెద్దగాలి." అని భగవంతుడు మాయమైపోయాడు.

నాకు మెలకువ వచ్చింది. చూస్తే అడవి... చీకట్లు కమ్ముకుంటున్నాయి! ఇంకేముంది... ఒకటే పరుగు... ఇంటివైపు.

ఆనంద సాయి
హైదరాబాద్
93964 30043



నీ మధుర స్మృతులు

ఏమీ తోచని నేను
జ్ఞాపకాల తోటలో అడుగు పెడితే
ఎన్నెన్నో మధుర స్మృతుల
పరిమళాలు
నన్నుక్కిరిబిక్కిరి చేశాయి
ముళ్లే తప్ప పూలెరుగని నేను
తెల్లబోయి చూస్తుంటే
అల్లరిగా నవ్వుతూ కన్పించేవు
అప్పుడు తెలిసింది నాకు
ఆ పూలచెట్లు నాటింది నువ్వేనని
కురిసే ప్రతి వాన చినుకూ
స్వాతి ముత్యం కా(లే)నట్లే
పూచిన ప్రతి పువ్వూ
భగవంతుని పూజకు నోచనట్లే
చేసుకున్న ప్రతి పరిచయమూ
కాలేదొక కమ్మని స్నేహం
చిక్కని చీకటిలో ఒక్కతినే
చుక్క వెలుగు కోసం
దిక్కులన్నీ వెతుకుతున్న సమయాన
అనుకోని నీ ఆగమనం
మూసిన గుండె తలుపుల్ని తీసింది
నీ స్నేహపు చిరుదివ్వె నా జీవితాన్ని
ఉజ్వల కాంతిభరితం చేసింది
కానీ కలచివేస్తున్నదేమిటంటే
ప్రతి ఆగమనం వెనుకా
నిర్గమనం అనివార్యం
ఆపాలనుకోవటం అవివేకం
మబ్బుల్లో మెరుపునూ జాబిల్లి వెలుగునూ
ఎక్కడ దాచుకోగలం? ఎద లోతుల్లో తప్ప!
ఎట్లా బంధించగలం? వీడని తలపుల్లో కాక!
అందుకే నిన్నాపాలనుకోను
అచ్చంగా నాకే నువ్వు కావాలనుకోను
నువ్వెళ్లిపోయినా
నిరంతరం నాలో వెలిగే
నీ తలపుల దీపాలు చాలు
అందుకే నేస్తం! నాదో చిన్న కోరిక
ముందుగా నేనే చెప్పాలి
ఏమనో తెలుసా?
వెళ్లొస్తాను నేస్తం! వెళ్లొస్తాను!!
తిరిగి రాని తీరాలకు
మరపురాని మధురస్మృతుల్ని
నెమరువేసుకుంటూ, వెళ్లొస్తాను
ఆడియో డియర్
ఆడియో ఫరెవర్.

- రమాదేవి జాస్తి, హైదరాబాద్

ఉగాది 'విజయ'ం

సూర్యుడికి సప్తాశ్వాలతో రథం కట్టినా... చంద్రుడికి పక్షధరుడని బిరుదిచ్చినా... మన పూర్వీకుల లక్ష్యమొక్కటే. కాలగణనం. కరిగిపోయే కాలాన్ని 'లెక్క'లతో అర్థం చేసుకోవడం భారతీయులకు కరతలామలకం. క్షణాల నుంచి కల్పాల వరకూ కాలపురుషుడి వయసును కచ్చితంగా కొలవగల ప్రతిభ మన సొంతం. వసుధపై వసంతం వికసించిన తొలిరోజును స్మరించుకుంటూ మనం చేసుకునే ఉగాది పండుగ... ప్రకృతితో మమేకమైన మన సంస్కృతికి మచ్చుతునక.

వరాహం నుంచి వృషభం వరకూ సృష్టిలోని సమస్త ప్రాణుల్లోనూ భగవంతుణ్నే దర్శించి ఆరాధించే భారతీయులకు కాలమూ భగవత్స్వరూపమే. సవితృమండల మధ్యవర్తి అయిన సూర్యభగవానుణ్ని నిత్యం సంధ్యావందన సమయంలో స్మరించుకోవడం మన అలవాటు. కాలారాధనే ఇందులోని ఆంతర్యం. సంకల్పంలో మాస, తిథి, వార, నక్షత్రాలు చెప్పుకోవడం... అనంత కాలంలో మనం ఎక్కడ ఉన్నామన్నది గుర్తు చేసుకోవడమే. తద్వారా మన అల్పత్వాన్ని అర్థం చేసుకుని, తగిన రీతిలో ప్రవర్తించాలని మనల్ని మనం హెచ్చరించుకోవటమే!

కాలం అనంతమే కాదు... అనాది కూడా. అలాంటి దాన్ని లెక్కించటం ఎలా? దానికి ప్రమాణం ఏమిటి? కొలతలు ఎలా ఉండాలి? ప్రపంచంలోని అన్ని మతాలు, సంప్రదాయాల వారు తమకి తోచినట్టు లెక్కలు వేశారు.

రుతువులను అనుసరించి ప్రకృతిలో వచ్చే మార్పులని బట్టి - ఒక రుతువుతో లెక్కకట్టటం ప్రారంభిస్తే... తిరిగి అదే రుతువు వచ్చేసరికి ఒక ఆవృతం పూర్తవుతుంది. మళ్లీ కొత్త సంవత్సరం మొదలవుతుంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రుతువు నుంచి లెక్కించటం ప్రారంభించారు. అందుకే సంవత్సరానికి అన్ని రుతువుల పేర్లూ పర్యాయపదాలే. నూరు వసంతాలు, వంద శరత్తులు. వేయి వర్షాలు లాంటి వాటిల్లోని 'వసంతం', 'శరత్తు', 'వర్షం'... సంవత్సరానికి మారుపదాలే.

మొదట్లో పాశ్చాత్యులు విషువత్కాలానికి (మార్చి నెల 23) నూతన సంవత్సర ప్రారంభంగా పరిగణించే వారు. వారిది సౌర మానం కదా! కొద్దికాలం తర్వాత... నెల చివరలో ఎందుకని, ఏప్రిల్ ఒకటవ తేదీ

నుంచి కొత్తేడాదిని ప్రారంభించుకున్నారు.. అది సుమారుగా మన ఉగాది సమయమే. ప్రకృతి అంతా పచ్చగా కొత్త చిగుళ్లతో కళకళలాడే కాలమది. ఆ తరువాత సంవత్సర ప్రారంభాన్ని జనవరి ఒకటో తేదీకి మార్చుకుని... వర్షాలను గణించటం మొదలు పెట్టారు. పాత అలవాటుతో ఏప్రిల్ ఒకటో తేదీని కొత్త సంవత్సర ఆరంభంగా అనుకునే వారిని తెలివి తక్కువ వారిగా పరిగణించి వేళాకోళం చేసేవారు. 'ఏప్రిల్ ఫూల్' అని. ఆట పట్టించడం అప్పటి నుంచే వచ్చిందంటారు.

కాల గణనలో రెండు పద్ధతులున్నాయి. చాంద్రమానం.

"ఏటికొక్క ఉగాది ఊరేగుచుండె/ ఆరు రుచులను కలబోసియందజేసి;/ ఐదు రుచులతో మాకు స్నేహమ్ము లేదు/ చేదు విడదీయరానట్టి చెలియ మాకు!"
– కడిమిళ్ల వరప్రసాద్

సౌరమానం. భారతీయులు రెండింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక మాసాలతో రెండింటినీ సమన్వయ పరుస్తారు. సౌరమానాన్ని బట్టి సంక్రాంతి తదితర పండుగలను చేసుకుంటూ... నిత్య వ్యవహారానికి చాంద్రమానాన్ని ఉపయోగించడం తెలిసిందే కదా. దీనికీ ఒక కారణం ఉంది. రాతిరేల ఆకాశంలోని చంద్రుని కళలను చూసి తిథులను గుర్తించవచ్చు. నక్షత్రాలను బట్టి మాసాలను తెలుసుకోవచ్చు. ఇది సులువైన పద్ధతి. సూర్యుణ్ణి చూసి ఇలా గుర్తించటం కష్టం. అంతే కాదు, సూర్యుడున్నప్పుడు నక్షత్రాలు కనిపించవు. నక్షత్ర గమనంతో కాల గణనం దోష రహితంగా ఉంటుంది. మన ఉగాదిలోని 'ఉ' అంటే నక్షత్రం, 'గ' అంటే గమనం. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. ఉగాది అంటే నక్షత్రాల గమనాన్ని లెక్కించటం మొదలు పెట్టిన రోజన్నది కొందరి అభిప్రాయం.

చాంద్రమానాన్ని అనుసరించి నూతన సంవత్సరాదిని చైత్ర శుద్ధ పాడ్యమి నాడు జరుపుకోవడం భారతీయుల అలవాటు. తెలుగువారితో పాటు కన్నడిగులు, మహారాష్ట్రులు దీనిని యుగాది (ఇదే తర్వాత ఉగాది అయిందన్నది ఓ వాదన) అని కూడా అంటారు. ఇది కృతయుగం ప్రారంభమైన రోజుగా చెబుతారు. బ్రహ్మ చరాచర సృష్టిని ప్రారంభించింది ఈ రోజేనని ధర్మ సింధువు, చతుర్వర్గ చింతామణి తదితర గ్రంథాలు చెబుతున్నాయి.

ఉగాదిని సృష్ట్యాదితో ముడిపెట్టి ఉదాహరణ పూర్వకమైన సిద్ధాంతాలను ప్రతిపాదించిన వారు వరాహమిహిరుడు, హేమాద్రి పండితుడు, నిర్ణయ సింధు కారుడు.

భాస్కరాచార్యుడు తన సిద్ధాంత శిరోమణి గ్రంథంలో 'సూర్యుడు చైత్ర శుద్ధ పాడ్యమి నాడు లంకా నగరం (శ్రీలంక కాదు - భూమధ్య రేఖపై సూర్యుడు ఉదయించే ప్రదేశం) నుంచి ఉదయించటం వల్ల ఆనాడే ఉగాది. దిన, మాస, సంవత్సర ప్రారంభం ఒకేసారి సంభవిస్తుంది' అని ప్రతిపాదించాడు.

కాలమానానికి అధినేత ఇంద్రుడు. విష్ణువునే ఇంద్రుడుగా చెప్పారట. అగ్ని అతడికి సహాయకుడు. వేద కాలానికి ముందు ఇంద్రుడు సృష్టి బాధ్యతను బ్రహ్మకు ఇచ్చాడు. మహాభారతంలో ఉగాది నాడు ఇంద్రోత్సవం జరపాలని చెప్పడానికి ఇదే కారణం కావచ్చు.

మండలాకారంలో తిరిగే కాలచక్రం గురించి భారతంలోని ఉదంకోపాఖ్యానంలో కనిపిస్తుంది. గురుపత్ని ఆదేశానుసారం ఉదంకుడు పౌష్య మహారాజు భార్య నుంచి కుండలాలు తెస్తుంటాడు. ఇంతలో వాటిని తక్షకుడు అపహరిస్తాడు. అతన్ని వెదుకుతూ పాతాళ లోకానికి వెళ్తాడు ఉదంకుడు. అక్కడ ఒక దృశ్యం కంటపడుతుంది. ఇద్దరు స్త్రీలు (ధాత, విధాత) తెల్లని నల్లని దారాలతో (పగలు, రాత్రి) ఒక వస్త్రం నేస్తూ ఉంటారు. పన్నెండు ఆకులున్న (నెలలు) చక్రాన్ని ఆరుగురు (ఋతువులు) యువకులు తిప్పుతూ ఉంటారు. వారిని అజమాయిషి చేస్తూ ఉంటాడు చాలా ఎత్తైన దివ్యపురుషుడు (పర్జన్యుడు). ఆయన గుర్రం అగ్ని.

మన గణన

సన్నని రంధ్రం నుంచి సూర్యకిరణం లోపలికి పడుతున్నప్పుడు చూస్తే అందులో చిన్న నలకలు కదులుతూ కనిపిస్తాయి. ఒక నలకలో ఆరో వంతు అన్నింటి కంటే చిన్నదని ఋషులు గుర్తించారు. దానిని

పరమాణువన్నారు. సూర్యరశ్మి దానిలో దూరి ఇటు నుంచి అటు ప్రయాణం చేయటానికి పట్టే కాలాన్ని సూక్ష్మకాలంగా పరిగణించారు. సూర్యుడు పన్నెండు రాశుల్లో ఒక్కసారి తిరిగి రావటానికి పట్టే కాలం సంవత్సరం. దానిని మహత్కాలం అన్నారు. ఈ రెండింటి మధ్యనే కాల విభాగాలుంటాయి.

ప్రస్తుతం మనం వైవస్వత మన్వంతరంలోని 28వ మహాయుగపు కలియుగంలో ఉన్నాం. ఇది ప్రారంభమై 5114 సంవత్సరాలైంది. ఈ కల్పంలో సృష్టి ప్రారంభమై 197,29,49,114 ఏళ్లు జరిగిపోయాయి. ఇప్పుడు మనం ప్రవేశించనున్న విజయ నామ సంవత్సరం ప్రభవాది

షష్ట్యబ్దుల్లో 27వది. ఇది విజయ ఉగాది. అన్నింటిలోనూ విజయాన్ని కలిగిస్తుంది.

సంవత్సరాల పేర్ల వెనక ఓ ఐతిహ్యముంది. శ్రీకృష్ణుడి భార్యలు 16,100 మంది. వారిలో సందీపని అనే రాజ కుమారి ఉంది. ఆమె పుత్రులు 60 మంది. వారి పేర్లే సంవత్సరాలకి పెట్టారంటారు. సంవత్స రాలకున్న పేర్లు నారదుడి సంతానమని మరో కథ కూడా ప్రచారంలో ఉంది.

స్థూల దృష్టికి కాల గణనకి అతి చిన్న ప్రమాణం నిమేషం. కనురెప్ప కిందికి వాలేప్పుడు కదలటానికి చేసే ప్రయత్నానికి పట్టే సమయం అది. దానిని కొలవటానికి మరొక మార్గం కూడా చెప్పారు. అప్పుడే వచ్చిన తామర పూవు రేకులని ఒక దానిపై మరొకటి చొప్పున వంద పేర్చాలి. ఈ దొంతరను వాడి అయిన సూదితో గట్టిగా గుచ్చితే పై నుంచి కింది రేకు వరకు దిగటానికి పట్టే సమయం నిమేషం.

కాలాన్ని లెక్క వేయటానికి విష్ణు పురాణం మరొక కాలమానాన్ని చెబుతోంది. దీన్ననుసరించి 15 నిమేషాలు ఒక కాష్ఠ. 30 కాష్ఠలు ఒక కల. 30 కలలు ఒక ముహూర్తం. 30 ముహూర్తాలు ఒక దినం.

ఇలా అనంతంగా సాగే కాలానికి ఆద్యంతాలెక్కడ! ఎక్కడి నుంచి ప్రారంభిస్తే అదే మొదలు. అంతకు ముందుది చివర. కాలపు కొలతలు అన్నీ వర్తులముగా ఉంటాయి. ఆదివారంతో మొదలైన వార గణనం శనివారంతో పూర్తవుతుంది. మళ్లీ ఆదివారంతో కొత్త వారం మొదలవుతుంది. నెలలు, సంవత్సరాలు, యుగాలు... ఏవైనా అంతే.

ఇంత శాస్త్రీయంగా కాలాన్ని, దాని గమనాన్ని, దాని తత్త్వాన్ని దర్శించిన రుషులు ఆయా సమయాల్లో పాటించాల్సిన విధులను కూడా నిర్దేశించారు. ఉగాది నాడు ఆచరించాల్సిన విధులను తెలియజేశారు. వాటిలో ప్రధానమైనవి.

తైలాభ్యంగనం, నూతన వస్త్రధారణం, సంకల్పం చెప్పుకుని కొత్త సంవత్సర నామాన్ని చెప్పుకోవటం. ఉగాది పచ్చడిని తీసుకోవడం, ధ్వజారోహణం, పంచాంగ శ్రవణం. ఇంకా పిండి వంటలు, బంధు మిత్రాదులతో కలిసి వేడుకలు, దేవాలయానికి వెళ్లి దైవ దర్శనం మొదలైనవి యథాశక్తి.

అభ్యంగన స్నానం, కొత్త బట్టలు, పిండి వంటలు అన్ని పండుగలకీ చేసుకునేవే. ఉగాది ప్రత్యేకం ఉగాది పచ్చడి, ధ్వజారోహణం, పంచాంగ శ్రవణం. అయితే, ఎందుకోగానీ ఇంటిపైన పతాకాన్ని ఎగురవేసే ఆచారం చాలా వరకూ కాలగర్భంలో కలిసిపోయింది. ఉగాది పచ్చడిలో షడ్రుచులు ఉంటాయి. ఇది అన్ని రసాలు నిండిన జీవితానికి ప్రతీక.

'ఋతు సంధిషు వ్యాధిర్జాయతే'... అన్ని రుతు సంధులు అనారోగ్యాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా వసంత, శరదృతువులు యమ దంష్ట్రాలని దేవీ భాగవతం వంటి పురాణాల్లో చెప్పారు. కాబట్టే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాల కోసం ఆహార, విహార నియమాలు, దీక్షలు ఏర్పాటు చేశారు. అవే వసంత నవరాత్రి దీక్షలు. శిశిరం వెళ్లి వసంత రుతువు వచ్చే సమయంలో, ప్రకృతిలో చాలా మార్పు వస్తుంది. దానిని తట్టుకునే శక్తిని శరీరానికి ఇచ్చే పదార్థాలతో ఉగాది పచ్చడి తయారవుతుంది.

పంచాంగ శ్రవణం

"పంచాంగ శ్రవణం శుభ గుణాల నిస్తుంది. శత్రువులని నశింప చేస్తుంది. దుస్స్వప్న ఫలితాలని పోగొడుతుంది. గంగా స్నాన, గోదాన ఫలితాల్నిస్తుంది. ఆయువుని పెంపొంది స్తుంది. సంతానాన్ని ప్రసాదిస్తుంది. వివిధ పనులను తేలికగా సాధిస్తుంది". కనుక పంచాంగాన్ని వినాలి అంటారు. ఈ పంచాంగ శ్రవణంలో మొదటిది ఫలశ్రుతి. అంటే, వినటం వల్ల వచ్చే ఫలితం. సంవత్సర ఫలితాంశం చెప్పటం రెండో అంశం. నవ నాయకుల గురించి చెప్పటం మూడో అంశం. ఆ

సంవత్సరంలో ఏ గ్రహానికి ఏ అధికారం ఉందో తెలుసుకుంటే సంవత్సర ఫలితాలు తెలుస్తాయి.

నవ నాయకులు

1. చాంద్రమానాన్ని అనుసరించి ఏ వారం ఉగాది వచ్చిందో ఆ వారాధిపతి ఆ సంవత్సరానికి రాజు.
2. సౌరమాన సంవత్సరం ప్రారంభమైన రోజు ఏ వారం ఉందో ఆ వారాధిపతి మంత్రి.
3. సూర్యుడు సింహరాశిలో ప్రవేశించే సమయంలో ఉన్న వారాధిపతి ఆ సంవత్సరానికి సేవా నాయకుడు.
4. సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశించేటప్పుడున్న వారానికి అధిపతి సస్యాధిపతి.
5. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించే సమయంలో ఉన్న వారానికి అధిపతి ఆ సంవత్సరానికి ధాన్యాధిపతి.
6. సూర్యుడు మిథున రాశిలో ప్రవేశించే నాటి వారాధిపతి అర్ఘాధిపతి. (ధరలకు, వాణిజ్యానికి అధిపతి)
7. సూర్యుడు ఆర్ద్రా నక్షత్రంలో ప్రవేశించే నాటి వారానికి అధిపతి మేఘాధిపతి.
8. సూర్యుడు తులారాశిలో ప్రవేశించే రోజుకి వారాధిపతి రసాధిపతి.
9. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజున ఉన్న వారానికి అధిపతి నీరసాధిపతి.

నాయకులతో పాటు ఉప నాయకులు 21 మంది ఉన్నారు. వారు పురోహితుడు. పరీక్షకుడు, గణకుడు, గ్రామపాలకుడు, దైవజ్ఞుడు, రాష్ట్రాధిపతి, సర్వదేశోద్యోగపతి, అశ్వాధిపతి, గణాధిపతి, పశువులకధిపతి, నరాధిపతి, గ్రామాధీశుడు, వస్త్రాధిపతి, రత్నాధిపతి, వృక్షాధిపతి, జంగమాధిపతి, సర్వాధిపతి, మృగాధిపతి, శుభాధిపతి, స్త్రీలకధిపతి, దేవాధిపతి. వీటికి అధిపతులు కూడా గ్రహాలే.

పంచాంగ శ్రవణంలో తర్వాతి అంశం మూఢమి, కర్తరి, పుష్కరాల నిర్ణయం. ఆదాయ కందాయ ఫలాలు, రాజపూజ్య, అవమానాల గురించి చెప్పడం. ఆ సంవత్సరమంతా ఏ రాశి వారికి ఎలా ఉందో వివరిస్తారు. వీటితో పాటు సంక్రాంతి పురుషుని పేరు, అతడి ఆయుధాలు, వాహనం మొదలైన విషయాలు కూడా చెబుతారు. వీటిని తెలుసుకోవటం ద్వారా.. ఒక సంవత్సరానికి తగిన ప్రణాళిక వేసుకోవచ్చు.

పంచాంగ శ్రవణ సమయంలో గ్రహాల పేర్లు ఎన్నో సార్లు పలుకుతారు. దానికి అవి సంతోషిస్తాయి. ఫలితంగా పంచాంగ శ్రవణం చేసే వారికి, విన్న వారికి శౌర్యం, తేజస్సు, వైభవం, సర్వ మంగళాలు, బుద్ధి వికాసం, గురు కృప, జ్ఞానం, సుఖం, దుఃఖ రాహిత్యం, ప్రాబల్యం, ప్రాధాన్యం కలుగుతాయన్నది నమ్మకం.

ఒక పండుగను జరుపుకోవటంలో ఎన్ని విశేషాలున్నాయో చూశారా! ప్రాచీనులు తాము సముపార్జించిన విజ్ఞానాన్ని సంప్రదాయాలు, ఆచారాల రూపంలో మనకు అందించారు. ఒక్కొక్క దానిలోనూ ఖగోళ విజ్ఞానం, ఆరోగ్యం, కుటుంబ, సామాజిక శ్రేయస్సు, వ్యక్తి వికాసం, ఆధ్యాత్మిక పురోగతి మొదలైన అంశాలెన్నో ఇమిడి ఉంటాయి. తెలియకుండా ఆచరించినా మేలు కలుగుతుంది. తెలిస్తే ఆనందమూ సొంతమవుతోంది.

ఉగాది పచ్చడిలో ప్రధానంగా ఆరు రుచులకు ఆరు పదార్థాలు చేరుస్తారు.

వేప పువ్వు (చేదు): ఉగాది ఒక్క రోజే కాకుండా కనీసం నెల రోజులు తింటే తరుణ వ్యాధులు రావని ఆయుర్వేదం చెబుతోంది.

బెల్లం (తీపి): ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. కొత్త బెల్లం వాడకం ఇప్పటి నుంచే ఆరంభమవుతుంది.

లవణం (ఉప్పు): వాతాన్ని పోగొడుతుంది.

చింతపండు (పులుపు): ఇది వేయి రోగాలను నయం చేస్తుందట. (అలా అని ఎక్కువగా తింటే అనారోగ్య కారకం).

సహకార (మామిడి): పిందెల రుచి వగరు.

మిరియాలు (కారం): శరీరానికి సమ శీతోష్ణస్థితిని కలిగిస్తాయి.

ఇవి కాక 'జీరక' అంటే జీలకర్రనీ వేస్తారు. అన్నాన్ని జీర్ణం చేస్తుంది కాబట్టి దానికి ఆ పేరు వచ్చింది. ఇంకా అరటి పళ్ళ, చెరకు ముక్కలు, ఎండు ద్రాక్షలు, జీడిపప్పు, బాదంపప్పు లాంటి వాటిని కూడా వేస్తుంటారు. ఆహార ధాన్యాలన్నీ అప్పుడే కొత్తగా వచ్చి ఉంటాయి. ఉగాది పచ్చడిలో వేసిన తర్వాతనే వాటిని వాడుకోవడం తెలుగు వారి ఆచారం.

డా॥ అనంతలక్ష్మి,
అసోసియేట్ ప్రొఫెసర్,
రైల్వే డిగ్రీ కళాశాల, హైదరాబాద్
99491 98141

నేల నలుచెరగులా తెలుగు గుబాళింపే!

మంచి పుస్తకం చదవడం దాచుకోదగిన, అరుదైన, అందమైన అనుభవం. మంచి పుస్తకం జీవిత అంతస్సారాన్ని అలవోకగా బోధపరుస్తుంది. జీవితంలో ఎన్నో అర్థం కాని సమస్యలకు అర్థవంతమైన పరిష్కారాలను అందించేది ఓ మంచి పుస్తకమే. చదివే అలవాటు, చదివిన దాన్ని అర్థం చేసుకొని అన్వయించుకొనే ఆరాటం ఉండాలే కాని జ్ఞానచక్షువులను తెరిపించేది పుస్తకమే. నవల, కవిత్వం, కథ, నాటకం, జీవితచరిత్ర... అది ఏదైనా కావచ్చు జీవన విలువలను, సూత్రాలను అందిస్తుంది.

నవల, కథ, కవిత, నాటకం వంటి సృజనాత్మక రచనలు చదివినప్పుడు కలిగే ఆనందం, ఆత్మీయస్పర్శ జీవిత చరిత్రలు లేదా ఆత్మకథల వంటి పుస్తకాలు చదివేటప్పుడు ఉండకపోవచ్చు. కానీ కొన్ని అందుకు మినహాయింపే. గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' చదివాక ఉత్తేజితుడు కాని పాఠకుడుంటాడా? నెహ్రూగారి 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' చదివినప్పుడు సంపాదించుకునే జ్ఞానం ఎన్ని గ్రంథాలు చదివితే, ఎన్ని సంవత్సరాల జీవనసారం పిండుకుంటే పొందగలుగుతాం?

తెలుగులో వచ్చిన అలాంటి ఆత్మకథల్లో టంగుటూరి ప్రకాశం పంతులు 'నా జీవితయాత్ర', ప్రముఖ విప్లవకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దరిశి చెంచయ్య 'నేనూ నా దేశం', ప్రముఖ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అనుభవాలూ జ్ఞాపకాలూనూ' వంటి సరసన నిలబడే అద్భుతమైన ఆత్మకథాత్మక గ్రంథం 'హంపీ నుంచి నాటి హరప్పా దాకా.' రచయిత తిరుమల రామచంద్ర. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, సంస్కృత, ప్రాకృత, ఆంగ్ల భాషల్లో పాండిత్యమున్న బహుభాషా కోవిదుడు. 'లిపి- పుట్టు పూర్వోత్తరాలు', 'నుడి-నానుడి', 'గాథాసప్తశతిల్లో తెలుగు పదాలు' వంటి ఎన్నో పరిశోధనా గ్రంథాలు రచించారు. వివిధ పత్రికల్లో శీర్షికలు నిర్వహించి సాహితీ, సాంస్కృతిక విషయాలపై సాధికారిక వ్యాసాలు రాశారు. నిన్నమొన్నటి వరకూ మన మధ్యన సంచరించిన ఓ మహాపండితుడి జీవిత చరిత్రలో కొన్ని శకలాలే ఈ పుస్తకం.

1913లో నేటి కర్ణాటక రాష్ట్రంలోని హంపీ దగ్గర ఉన్న కమలాపురంలో సాంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జన్మించి అదే సంప్రదాయ పద్ధతుల్లో సంస్కృత విద్యను అభ్యసించారు. అనేగొంది, నెల్లూరు, తిరుపతి వంటి ఊళ్లల్లో చదువుకొన్నారు. ఉద్యోగం కోసం మద్రాసు నుంచి లక్నో, అలహాబాద్, లాహోర్ వరకు ప్రయాణం చేసి నడివయసులో హైదరాబాద్ చేరుకొని వివిధ పత్రికల్లో పనిచేస్తూ, 1997లో తన 84వ ఏట మరణించారు. ఈ పుస్తకం 'హంపీ నుంచి హరప్పా దాకా' వారి మరణానంతరం 1997లో మొదటిసారి ప్రచురితమైంది. ఆ తరువాత 2002 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుంది.

ఇంత సాంప్రదాయ వాతావరణంలో పుట్టి పెరిగి, చదువుకుని, వివిధ మతసారాలను ఆవాహనం చేసుకొని, గాంధీతత్వాన్ని జీవన విధానంగా స్వీకరించి, బౌద్ధాన్ని అభిమానించి, మహా పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారిని గురువుగా భావించిన తిరుమల రామచంద్ర ఏనాడూ దేవుడికి మొక్కిన సందర్భం లేదని (చిన్నతనంలో మినహా) చెప్పడం కొంచెం ఆశ్చర్యంగానే ఉంటుంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూనే కొంతకాలం పాటు విప్లవ పంథాలో ప్రయాణం చేసి సంవత్సరం పాటు జైలు జీవితం గడిపి, చదువు కోసం కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి తిండి లేకుండా గడిపిన వారి ఆదర్శానికి, జ్ఞానతృష్ణకు జోహార్లు అర్పించకుండా ఉండలేం. ఇలా వైవిధ్య భరితంగా, వైరుధ్యాలతో ఆయన గడిపిన జీవితంలో మూడో వంతు భాగానికి సంబంధించి 61 ప్రకరణాలతో ఈ పుస్తకాన్ని రాశారు. ఒక్కొక్క ప్రకరణం ఒక్కో కథలా సాగిపోతుంది. ప్రతి దానికి మొదలు, చివర ప్రాకృత, సంస్కృత శ్లోకాలను ఉదహరిస్తూ ఆ ప్రకరణాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు.

దాదాపు 500 పేజీలున్న ఈ గ్రంథాన్ని చదివాక తిరుమల రామచంద్ర, వారి మొత్తం జీవితాన్ని ఇలా అందించగలిగితే ఎంత బాగుండేది అనిపిస్తుంది. ఇక ఇప్పుడు ఆ మిగిలిన జీవిత భాగాన్ని తెలుసుకునే అదృష్టం పాఠకులకు లేదు కదా! తలచుకుంటే బాధగానే ఉంటుంది.

రామచంద్ర గారి ఇంట్లో తాతముత్తాతల కాలం నాటి సగం విరిగిన ఇనుపగుండు ఉండేదట. పిండి కొట్టడానికి, నూరడానికి దాన్ని వాడేవారట. అదేమిటో అర్థంకాక వారి తాతగారిని అడిగితే, అదో పెద్ద కథ అంటూ తిరుమల వంశం గురించి వివరించారట. అలా ప్రారంభమవుతుంది ఈ పుస్తకం. మొదటి ప్రకరణం పేరు - గుండ్రాయి చెప్పిన గాథ. దీనికి మొదట్లో-

అహో! శిలే తే సౌభాగ్యం
య దహల్యా కృతేయుగే
సంస్కృతే రితిహాసస్య
సాక్షిభూతా సి సర్వదా

దీని అర్థం ఇది- ఓ రాయీ! కృతయుగంలో నీవు అహల్యగా ఉన్నావు. ఎంత భాగ్యం నీది. సంస్కృతికి, ఇతిహాసానికి కూడా ఎప్పుడూ సాక్షిగానే ఉన్నావు. ఇలా అర్థవంతమైన శ్లోకాలతో ప్రతి ప్రకరణాన్ని ఒక అర్థవంతమైన జీవిత శకలపు కథగా మలిచారు. రామచంద్ర. తాను పుట్టి, పెరిగిన కమలాపుర చరిత్రను, హంపీనగర శిథిల ప్రాభవాన్ని, విజయనగర సామ్రాజ్యపు ప్రారంభ రాజధాని అనేగొంది ప్రాశస్త్యాన్నీ, బళ్లారి పట్టణంలో నిత్యం గుబాళించే తెలుగు సౌరభాన్ని, మద్రాసులో ఉండిన తెలుగు ప్రముఖుల పాండితీ ప్రకర్షనీ- ఇలా వారు సంచరించిన ప్రతి ప్రాంతంలోని పండితులకు సైతం తెలియని విశేషాలను రామచంద్ర ఉదహరించారు. అదే ఈ రచనలోని ప్రత్యేకత.

ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ హృదయం భారమవుతుంది. ఒకనాటి తెలుగు సంప్రదాయాలు, భాష, తెలుగువారు నివసించిన, సంచరించిన ప్రాంతాలు ఇప్పుడేమైపోయాయి? అవన్నీ మనకు కాకుండా ఎలా పోయాయో ఈ రాజకీయ చదరంగ క్రీడలో తెలుగు వారికి కలిగిన అపార నష్టం తలచుకుంటే గుండె తరుక్కుపోతుంది. ఇప్పుడు కర్ణాటకలో ఉన్న అనేగొంది, కమలాపురం, బళ్లారి ప్రాంతాల్లో తెలుగు పండుగలప్పుడు జరుపుకునే సంబరాలను తెలుసుకున్నప్పుడు, మహా తపస్విని కొండమ్మవ్వ ప్రకరణం చదువుతున్నప్పుడు, మద్రాసులో కాశీనాథుని నాగేశ్వరరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి, తెలుగు వారి పేరు ప్రఖ్యాతులను ఖండాంతరాలకు సైతం వ్యాపింపజేసిన సుబామైసిన్ రూపకర్త ఎల్లాప్రగడ సుబ్బారావు వంటి ప్రముఖులతో రామచంద్ర గారికున్న అనుబంధ బాంధవ్యాలను వివరిస్తున్నప్పుడు, యోగదార్శనికుడు మాస్టర్ సి.వి. కుంభకోణంలోని తెలుగు వారని తెలిసినప్పుడు కించిత్ గర్వం కలుగుతుంది. తిరుపతి సంస్కృత కళాశాలలో, 'నాకు తెలుగు రాదు, తమిళ భాగం ఇవ్వమనండి', అన్న తమిళ విద్యార్థితో ప్రిన్సిపల్ సేలం సుబ్బారావు, 'నాయనా, ఇది తెలుగుదేశం. నీవు తెలుగుదేశంలో ఉన్నావు. తెలుగు నేర్చుకోవాలి. లేకపోతే మార్కులు

తిరుమల రామచంద్ర

తగ్గిపోతాయి,' అని విస్పష్టంగా ప్రకటించిన తెలుగు స్ఫూర్తిని అనుభవించిన ఈ నేల ప్రస్తుత తెలుగు పాలనలో తెలుగుకు ఎంత దూరంగా జరిగిపోయిందో తలచుకొని బాధపడాల్సిందే. నేల నాలుగు చెరగులా వ్యాపించిన తెలుగు వైభవం ఇప్పుడెక్కడ? అని ఖేదపడాల్సిందే. 1939లో తిరుమల రామచంద్ర లాహోర్‌లో ఉద్యోగిగా వెళ్లినప్పుడు అక్కడి ఆయుర్వేద కళాశాల నామఫలకం మీద, ఆ కాలేజీ పునాది రాయి వేసిన వైద్యరత్న పండిట్ డి.గోపాలాచార్య పేరు చూసి మురిసిపోయారు. అంతేనా, ఓ సాయంత్రం లాహోర్ వీధుల్లో గుల్జార్‌సింగ్ క్రీడావిన్యాసాలు చూసి అబ్బురపడిన రామచంద్రకి ఆ గుల్జార్‌కి గురువు మన కోడి రామ్మూర్తి గారని తెలుసుకొని కించిత్ గర్వమూ కలిగింది. ఇలా కుంభకోణం మొదలు మద్రాసు, బళ్లారి నుంచి లాహోర్ వరకు పరిమళించిన తెలుగు సౌరభం నేడెక్కడ? ఏవి తల్లీ, నిరుడు కురిసిన హిమసమూహములు.

భారతి పత్రిక సంపాదకులు గన్నవరపు సుబ్బరామయ్య గారింట్లో శ్రాద్ధకర్మలు నిర్వహించడానికి వచ్చిన మారేపల్లి రామచంద్రశాస్త్రి గారి ఉదంతం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన వీరాంధ్రవాది. ఆ తద్దినాన్ని కూడా ఆయన తెలుగులోనే నిర్వహించారు. అంతేకాదు, ప్రతిరోజూ సంధ్యావందనం సైతం తెలుగులోనే చేసేవారట. ఆయన 'తెలుగు గుడి' అనే సంస్థను స్థాపించి, నుడికడలి అనే అచ్చతెలుగు నిఘంటు నిర్మాణం ప్రారంభించారని రామచంద్ర ఈ గ్రంథంలోని ఓ ప్రకరణంలో వివరంగా రాశారు. ఇప్పటికీ అచ్చుకాని మారేపల్లి వారి ఆ తెలుగు నిఘంటువు నుడికడలి రాతప్రతి ఇప్పుడెక్కడుందో? అక్కడా ఇక్కడా ఉందని ఆ నోటా ఈ నోటా వినడమే కాని ఇంకా బయట పడలేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో విషయాలు... ఎంతో అనుభవసారం... ఈ పుస్తకం చదువుతుంటే ఒక ఆత్మీయమైన, మానవీయమైన స్పర్శ మన గుండెల్ని తాకుతుంది. హృదయాన్ని ఆర్ద్రపరుస్తుంది. 'అనాచారం, దొంగతనం', 'అమ్మమాట', 'గొడుగుపాలుడు' వంటి ప్రకరణాలు పాఠకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. తెలుగు నుడికారాలతో, నానుడులతో, పదబంధాలతో నిండిన ఈ పుస్తకం చదవడం ఓ గొప్ప అనుభవం.

'ఎవడు దేశాలు తిరుగుతాడో, ఎవడు పండితులను సేవిస్తాడో వాడి బుద్ధి నీటిలో పడిన నూనెచుక్కలాగా విస్తరిస్తుంది. నాకవి రెండూ ఎంతవరకు అబ్బినాయో బేరీజు వేసుకుంటూ నడిచాను. నూరేళ్లు ఇలా నడవక తప్పదేమో అనిపిస్తుంది.' ఈ వాక్యాలతో నిండిన శ్లోకంతో ఈ గ్రంథం పూర్తవుతుంది. 'ఓల్గా సే గంగా' వంటి అద్భుత గ్రంథాలను రాసిన రాహుల్ సాంకృత్యాయన్‌కు దీటైన మన తెలుగు సాంకృత్యాయన్ తిరుమల రామచంద్ర కళ్ల ముందు కదలాడతారు. ఇంత గొప్ప పుస్తకాన్ని తెలుగు వారికి అందించినందుకు ఆయనకు చేతులెత్తి నమస్కరించాలి.

వాసిరెడ్డి నవీన్
కథా సాహితీ వార్షిక సంకలనాల సహ సంపాదకులు.
హైదరాబాద్. 98493 10560

ఓ కథ చెబుతానర్రా వింటారా!

వెన్నెల్లో నాన్నేరి అంబారీపై షికారు చేస్తున్న గడుగ్గాయికి గోరుముద్దలు పెట్టడానికి విశ్వప్రయత్నం చేస్తోంది ఓ అమ్మ. ఒక్క ముద్ద... ఒక్క ముద్ద అంటూ తినిపించబోతోంది.

బుజ్జోడు మహా పెంకిఘటం. ఊ..ఊ.. అంటూ, తల అడ్డంగా ఊపుతున్నాడు. నువు పా నాన... పా.. అంటున్నాడు తప్ప ముద్దను నోట్లోకి రానివ్వట్లేదు.

అప్పుడు అందుకుంది అమ్మ. 'అదిగదిగో కన్నా... చందమామను చూడు. దానిపై నంట... పెద్దచెట్టు ఉందంట! దాని కిందంట... పెద్దమ్మ ఉందంట! ఒకరోజు తన దగ్గరికి ఓ అల్లరి పిల్లోడు వచ్చాడంట...' అంటూ కథ ప్రారంభించింది.

షికారు సంగతిని మర్చిపోయిన బుడుగు... అమ్మ మాటల్నే వింటున్నాడు. వింటూ... తింటున్నాడు. తింటూ... వింటున్నాడు. మధ్యమధ్యలో కేరింతలు కొడుతున్నాడు.

ఇదీ కథ మహాత్మ్యం!

పిల్లలకు కథలెందుకు చెప్పాలి? సృజనాత్మక శక్తిని పెంచడానికా... ఆలోచనల పరిధిని విస్తరింపజేయడానికా... భాషతో బంధం వేయడానికా... ఇవన్నీ 'కథ' పరమార్థాలే! కానీ, వీటికన్నా ముందు... చిన్నారుల మనస్సులను తేలికపరచడానికి, కేరింతలు కొట్టే వారి బాల్యాన్ని మరింత ఆనందమయం చేయడానికి!

కథ చెప్పడం ఓ కళ. అందులోను చిన్న పిల్లలకు చెప్పడం గొప్ప కళ. ఓర్పు, నేర్పు, ఆసక్తి, అనురక్తి, ఊహాశక్తి మిళితమై ఉన్న వారు మాత్రమే ఈ కళలో రాణించగలరు. లేకుంటే కథ చెప్పేవారు పిల్లల ముందు డీలా పడిపోతారు. అందుకే ఈ తరం వాళ్లు మాకు 'కథలే రావు' అని తప్పించుకుంటూ ఉంటారు. కొందరికి కథలు తెలిసినా చెప్పే తీరు తెలియక చెప్పరు. మరికొందరు కథల పుస్తకాల్లోని వాటిని చదువుతూ వివరించే ప్రయత్నం చేస్తుంటారు. కానీ, కథకుడెప్పుడూ పిల్లలకు ఆసక్తికరమైన శైలిలోనే వినిపించాలి. అప్పుడే చిన్నారుల మనసు ఉత్తేజంతో 'ఊ' గొడుతూ పోతుంది.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో పిల్లల్ని సముదాయించడానికో, మనోల్లాసం కలిగించడానికో, వాళ్ల మధ్య పోట్లాటలు లేకుండా చూడటానికో - ఏదో ఒక సదుద్దేశంతోనే తాతలు, అవ్వలు, మామలు, అక్కలు, అన్నలు కథలు చెప్పడానికి ఉపక్రమించే వాళ్లు. పిల్లలు కూడా కథలంటే చాలా ఇష్టపడే వాళ్లు. అందులోనూ ఓ

ఫొటో: ఘంటసాల వసంత్

వ్యక్తి 'కథలు చెప్పడంలో దిట్ట' అని తెలిస్తే చాలు. అతన్ని వదలిపెట్టే వాళ్లే కాదు. ఈ స్థాయిని సంపాదించుకోడానికి కథకుడు కొంత కృషి చేయాలి.

ప్రస్తుతం పిల్లలకు కథలు చెప్పడమనేది పూర్తిగా దూరమైపోయింది. ఎప్పుడూ పాఠ్యపుస్తకాలతో యుద్ధం చేయించడమే. మరి మన సాహిత్యం, చరిత్ర, ఇతిహాసాలు, పురాణాలు గానీ, తెలుగు ప్రాంతంలో జరిగిన వాస్తవ కథలుగాని మన చిన్నారులకెలా తెలుస్తాయి? కేవలం బడి పాఠాలకు మాత్రమే పరిమితమయ్యే పిల్లల్లో సహజమైన ఆలోచనలు, సృజనశక్తులు, మనోల్లాస చురుకుదనాలు పూర్తిస్థాయిలో వికసిస్తాయా? అందుకే మనం వీలు కలిగించుకుని మరీ పిల్లలకు ఇంట్లోనే మంచి కథలు చెప్పాలి. అంతకుముందు మనం మంచి కథకులుగా మారాలి.

కథలు చెప్పాలనుకునే పెద్దలు ముందు కొన్ని మంచి కథలు చదవాలి. తాము చిన్నప్పుడు విన్న కథలనైనా జ్ఞప్తికి తెచ్చుకుని సంక్షిప్తంగా రాసిపెట్టుకోవాలి. పిల్లలకు చెప్పబోయే కథ ఆ సందర్భానికి అనువైనదిగా ఉండాలి. అప్పుడే పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది. పూర్వం హరిదాసు.. కథ మధ్యలో కొన్ని పిట్టకథలు చెప్పేవారు. అవి సందర్భోచితంగానే ఉంటూ, నవ్వు పుట్టించడమేకాక కథలోని విషయంతో సమన్వయమయ్యేవి. అలాగే, మనమూ సందర్భోచితంగా ఉండే కథలనే చెప్పాలి.

ఉదాహరణకు ఓ పిల్లాడు తన టోపీలో పెట్టుకొన్న జామపండ్లను ఓ కోతి టోపీతో సహా ఎత్తుకెళ్లిందనుకోండి.. వాణ్ని సమాధానపరచడానికి 'కోతి - టోపీల వర్తకుడు' కథ చెబితే సరి. వాడికెంతో ఆనందాన్ని కలిగిస్తుంది టోపీల వర్తకుడికి ఆ పిల్లాడి పేరే పెడితే మరింత రసవత్తరంగా ఉంటుంది. ఈ కథకు మరికొన్ని దినుసులు చేరిస్తే... ఫలితం ఇంకా గొప్పగా వస్తుంది. ఎలాగంటే... చెట్టుదిగిన కోతి - బుట్టలో 'లడ్లున్నాయో, జిలేబీలున్నాయో, అరటిపండ్లున్నాయో, మామిడి పండ్లున్నాయో...' అంటూ వివిధ పదార్థాల పేర్లతో సాగదీస్తూపోవాలి. దాంతో పిల్లలు కూడా మరికొన్ని కొత్త కొత్త పేర్లు జోడించి, గంగా ప్రవాహంలా చెప్పుకుంటూపోతారు. ఇలా వారిని కథలో నిమగ్నం చేస్తే, వారి నోటి నుంచి ఎన్నో విషయాలు వెలికివస్తాయి. అపుడా కథ కంచికి పోదు. పిల్లల నోటి నుంచి కొత్త పదాలను, వాక్యాలను, సంభాషణలను ఆశువుగా చెప్పించాలంటే ఇదే ఉత్తమ మార్గం.



ఒకొక్కసారి కథ మొదలుపెట్టి ఒకటో రెండో వాక్యాలు చెప్పగానే... కొందరు కుర్రాళ్లు గొంతెత్తుతారు. 'మాకీ కథ తెలుసు - ఇదొద్దు - ఇంకోటి చెప్పు' అంటూ ఏదో పెద్ద తెలిసినవాళ్లలా మూతులు తిప్పుతారు. అప్పుడేం చేయాలి? మొదలు పెట్టిన కథలోని రెండు వాక్యాలతోనే మరో కొత్త కథను అల్లుకోవాలి. అదీ అప్పటికప్పుడే. ఆ ఊహాశక్తి కథకుడికి చాలా అవసరం.

ఉదాహరణకు 'కాకి - నక్క' కథే అనుకోండి. ప్రారంభంలోనే దీన్ని పిల్లలు వద్దంటారు. అది సహజం. అప్పుడు కథకుడు దాన్ని 'తెలివైన కాకి' కథగా మార్చాలి. కాకి వల్ల ఆ నక్క ఎలా మోసపోతుందో చమత్కారపూరితంగా చెప్పాలి. దాంతో కొత్త కథ విన్నట్టుగా సంబరపడిపోతారు బుడుగులు.

కథ చెప్పే సమయంలో పిల్లలందర్నీ బాగా గమనిస్తుండాలి. కొందరు కొంటె పిల్లలు కథ వినకుండా చిలిపి పనులు చేస్తుంటారు. కథలో భాగంగానే వారికి 'చురక'లంటించాలి. అలా వారిని కథ వైపు తిప్పుకోవాలి. లేకుంటే కథ 'హుష్‌కాకి' అయిపోతుంది. "పిల్లలూ! మీకు తెలియని కథలు ఎన్నో ఉన్నాయి. జాగ్రత్తగా వింటే గానీ మీకర్థం కాదు సుమా!" అంటూ ఓ గంభీరమైన స్వరంతో కథను ప్రారంభిస్తే - అది ఇంకెంత కొత్తదోనని పిల్లలు చెవులు రిక్కించి వింటారు.

కొన్ని రోజులు వరుసగా చెప్పే కథలే ధారావాహికలు. అల్లావుద్దీన్ అద్భుత దీపం, ఆలీబాబా నలభై దొంగలు, కీలుగుర్రం, మాయా దర్పణం, బాలరాజు కథ, బాలనాగమ్మ కథ లాంటి జానపద, చారిత్రాత్మక కథలు ఈ కోవలోకి వస్తాయి. ఆ కథలను చెప్పేటప్పుడు... మంచి ఉత్కంఠ కలిగించే సన్నివేశాల్లో చెప్పడం ఆపేసి,

"...ఏమయిందో తర్వాత తెలుసుకొందాం" అనాలి. అప్పుడు పిల్లల్లో ఆసక్తి పెరిగి, "ఇప్పుడు చెప్పవూ" అంటూ మరీమరీ అడుగుతారు. అప్పుడు కథకుడు ఏమాత్రం లొంగకుండా "ఈరోజుకింతే. ఇదో పెద్ద కథ. ఇంకా చాలా ఉంది. రేపు చెప్పుకుందా"మని చెప్పాలి. "రేపటిదాకా ఆగాలా" అన్న నిట్టూర్పుల వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది సుమా!

ఇలా పెద్ద కథల విషయంలో కాలాన్ని పెంచుకొంటూ పోవడం వల్ల పిల్లల్లో ఆసక్తి, శ్రవణ, గ్రహణ, జ్ఞాపకశక్తులు బాగా పెరుగుతాయి. అయితే... కథను మళ్లీ ప్రారంభించేటప్పుడు 'జరిగిన కథ'ను పిల్లల చేతే - చిన్నచిన్న వాక్యాల్లో చెప్పించడం మర్చిపోకూడదు.

అప్పుడప్పుడు పిల్లల పాఠ్య పుస్తకాలను గమనించాలి. వాటిలోని కథలను కూడా ఆసక్తికరంగా మార్చి చెప్పాలి. అప్పుడు పిల్లలు 'ఈ కథ మా తెలుగు పుస్తకంలో ఉందని' గంతులేస్తారు. కొందరయితే పుస్తకాన్నే తెచ్చి చూపించి ముచ్చట పడతారు. దాంతో వాళ్లకు ఆ కథ చదవాలనే ఉత్సాహం రేకెత్తుతుంది. దీంతో పుణ్యమూ పురుషార్థమూ సిద్ధించినట్లే కదా!

అలాగే, అప్పుడప్పుడు కొన్ని బొమ్మల కథల

పుస్తకాలు, బాలల పత్రికలను పిల్లల ముందు ఉంచాలి. ఎప్పుడో అప్పుడు వాటిని తిరగేసే ప్రయత్నం చేస్తారు చిన్నారులు. చదవడానికి ప్రయత్నిస్తారు. భవిష్యత్తులో వాళ్లే మంచి పాఠకులవుతారు.

వాళ్లతోనే చెప్పించాలంటే...

పిల్లలెప్పుడూ శ్రోతలుగా ఉండడానికే ఇష్టపడతారు. కథ చెప్పమంటే జంకుతారు. 'నాకురాదు' అని టక్కున అనేస్తారు. అది వారి సహజగుణం. అంతమాత్రాన వదిలేయ కూడదు. తమతోటి పిల్లల మధ్య వాళ్ల మాటల్ని కోటలు దాటిస్తూ ఉంటారు. చూసిన సినిమా కథను పూసగుచ్చినట్లు చక్కగా చెబుతూ ఉంటారు. పెద్దల ముందు మాత్రం బిడియపడతారు. ఆ సిగ్గును పోగొట్టి 'నీకెందుకు నేనున్నానుగా' అంటూ ప్రోత్సహించాలి. మనం కూడా ఒక శ్రోతగా మారిపోవాలి. చప్పట్లుకొట్టి ప్రోత్సహించాలి. దాన్ని ఓ 'బాలానందం' కార్యక్రమంలా మార్చాలి. ఇలా చేస్తే.. కథ చెప్పే తీరును నేర్చుకుంటారు చిన్నారులు. అలాగే, పదసంపదనూ పెంచుకుంటారు.

ఆటల ద్వారా పిల్లల చేత కథలు చెప్పించే పద్ధతి ఒకటుంది. దాన్ని 'కథారైలు' అని అందాం. పిల్లల్లో కథను పూర్తిగా చెప్పలేని వాళ్లుంటారు. అలాంటి వారికి ఈ ఆట చాలా బాగా ఉపయోగపడుతుంది.

మనం ముందుగా ఓ కథ చెప్పాలి. ఆ కథనే పది వాక్యాలుగా విభజించాలి. వాటిని పిల్లలు (పది మంది ఉంటే 'వాక్యాలతో' లెక్క సరిపోతుంది) జ్ఞాపకం పెట్టుకొనేలా నాలుగైదుసార్లు వినిపించాలి. తర్వాత ఆట మొదలుపెట్టించాలి. ఒక్కో పిల్లాణ్ని ఒక్కో వాక్యం చెప్పమనాలి. కథను ప్రారంభించిన వాణ్ణి 'రైల్ ఇంజన్'గా నిలబెట్టాలి. తరువాత వాక్యాల్ని వరుసగా చెప్పిన వాళ్లను పెట్టెలుగా తగిలించాలి. కథను ముగించిన వాణ్ణి 'గార్డుపెట్టె'గా మార్చి పచ్చజెండాను ఊపమనాలి. అప్పుడు 'కథారైలు'ను చుక్‌చుక్ మంటూ గుండ్రంగా తిప్పాలి. దీంతో ప్రతి పిల్లాడూ... తానూ రైలు ఎక్కాలని ఉబలాటపడి కథ చెప్పడానికి ప్రయత్నిస్తాడు.

తరువాత 'చిత్రకథ'. కథ చెప్పుకొంటూ బొమ్మ గీయడం. ఇలాంటి వాటిని పిల్లలు తమ తోటివారి నుంచి నేర్చుకొని మరొకరికి చెబుతుంటారు. పలకల మీద బొమ్మగీసి చూపిస్తుంటారు. ఇలాంటి వాటిని పెద్దలు గమనించాలి. అలాంటి చిత్రకథలను మరికొన్నింటిని వారికి పరిచయం చేయాలి.

చిత్రకథకు ఓ ఉదాహరణ

ఎల్ అనే వాడికి

లెక్కలో సున్నా మార్కులొచ్చాయట

వాళ్ల నాన్న 'ఎన్నిరా?' అని అడిగాడట

దానికి వాడు 'నాకు తలకిందులుగా మూడొచ్చాయి' అన్నాడట

వాళ్ల నాన్న 'నీ తలకాయ్ కొట్టా!' అని అన్నాడట.



దాంతో వాడు మనిషైపోయాడట.. అని కథని ముగించాలి. అప్పుడు పలక మీద చిత్రంగా ఓ మనిషి తల తయారై ఉండటం చూసి బుజ్జోడు ఆశ్చర్యపోతాడు.

ఇక 'కథాచిత్రా'ల విషయం చూద్దాం. ఓ చార్టు మీద కథానుగుణంగా వరుసగా బొమ్మలుంటాయి. వాటిని చూపిస్తూ కథను చెప్పమనాలి. కాకి - నక్క, కాకి - కడవ, సింహం - చిట్టెలుక, బోయవాడు - పావురాలు; నాలుగెద్దులు - సింహం కథలు వీటికి సరిపోతాయి. .

బొమ్మల్లోని కథను... పిల్లల ఆలోచనా పరిధిలో ఎవరికి ఎలా తోస్తే అలా చెప్పనివ్వండి. ఒకవేళ ఎవరైనా తప్పు చెబితే... దాన్ని ఎత్తిచూపకండి. వాళ్లందరూ చెప్పడం అయ్యాక... మీ పద్ధతిలో ఆ కథను ఆసక్తికరంగా చెప్పండి. అలాగే, చిత్రాల్లో కనిపించే ఇతర దృశ్యాలను కూడా వర్ణిస్తూ కథను కొనసాగించండి. మీరు చెప్పే విధానాన్ని గమనిస్తారు పిల్లలు. ముందుముందు వారు కూడా అలాగే చెప్పడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు వాళ్లలో సృజనాత్మకత పెరిగిందనే విశ్వాసం మనకు కలుగుతుంది.

పొడుపు కథలు లాంటి వాటిని

బొమ్మ నేర్పిన పాఠం

బొమ్మలతోనే అక్షరాలు నేర్చుకుంది మా సాయిమనస్విని. బొమ్మలను చూస్తూనే పదసంపదను పెంచుకుంది. పిల్లలకు చిత్రాలంటే చాలా ఇష్టం కదా. అందుకే ప్రతి వస్తువు, జంతువు బొమ్మను చూపించి... వాటి గురించి నాలుగైదు పదాలతో చిన్న పాటను కూర్చి పాడేదాన్ని. ఉదాహరణకు కాకి గురించి, దాని చిత్రాన్ని చూపిస్తూ... 'నల్లనైన కాకి, మన ఇంటికొచ్చింది కాకి, కావ్ కావ్ మన్నది కాకి' అని పాడుతూ చెప్పేదాన్ని. దాంతో పాప ఎంతో ఆసక్తిగా వినేది. తిరిగి తాను పాడటానికి ప్రయత్నించేది. అలా ఏడాదిన్నర వయస్సుకొచ్చేసరికి చాలా పదాలను పలకడం వచ్చేసింది. క్రమంగా బొమ్మలతో ఉండే రామాయణ, భారత, భాగవతాలను చూపిస్తూ కథ చెప్పేదాన్ని. తర్వాత తిరిగి చిన్న చిన్న ప్రశ్నలు అడిగేదాన్ని. స్పష్టంగా సమాధానాలు ఇచ్చేది. ఈ పద్ధతిలోనే జీకేపై కూడా తనకు అవగాహన పెంచా. తర్వాత తను ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి బహుమతులు గెలుచుకుంది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం కూడా తీసుకుంది. పిల్లలకు ఆసక్తికరమైన విధానంలో బోధన చేస్తే కచ్చితంగా ఫలితం ఉంటుందనడానికి మా పాపే నిదర్శనం.

- అచ్యుతుని శ్యామల,

అప్పుడప్పుడు చిన్నారులకు చెబుతుండాలి. వాటితో వారికి వినోదంతో బాటు విజ్ఞానమూ అందుతుంది. ఇవి మెదడుకు మేతగా పనిచేస్తాయి. పోలికలు లాంటి కొత్త విషయాలు తెలుస్తాయి. పిల్లల మధ్య పొడుపు కథల పోటీ కూడా నిర్వహించవచ్చు.

చివరగా 'గొలుసుకథ'లను అల్లాలి... అదెలా అంటే, పిల్లలు అంత్యాక్షరి ఆడుతూ ఉంటారు కదా. ఇదీ అలాంటిదే. ఓ పది మంది పిల్లల్ని పిలిచి వారితో ఓ కట్టుకథ / తెలిసిన కథను ఒకరి తర్వాత ఒకరితో చెప్పించడమే గొలుసు కథ. మొదట కథకుడే కథను ప్రారంభించి మూడు నిమిషాల పాటు చెబుతాడు. మంచి ఉత్కంఠ కలిగించే చోట ఆపడం - వెంటనే పక్కనున్న కుర్రాడు దాన్ని కొనసాగించడం - మూడు నిమిషాల తర్వాత మరో కుర్రాడు అందుకోవడం ఇలా ఆ పదిమంది అరగంటలో కథను ముగించాలి. తెలిసిన కథలతో ప్రారంభించి, కొత్త కథలను సృజించే ప్రయత్నం కూడా చేయవచ్చు. ఈ పద్ధతితో పిల్లల్లో ఆలోచనాశక్తి పెరిగి, కథను ఎలా మలచాలో, ఎలా ముగించాలో నేర్చుకుంటారు. వాళ్లలో ఆ నేర్పు రానురాను అభివృద్ధి చెందుతుంది. తెలుగు పదాలు, జాతీయాలు, నుడికారాలు, వాక్యాలు, సంభాషణలను ఎక్కడ ఎలా వాడాలో అర్థం చేసుకుంటారు. కథను రసపట్టులో నడుపుతూ పక్కవాణ్ని ఆలోచింపజేసేలా చేస్తారు. దీన్ని ఓ 'కథావధానం'గా కూడా మార్చుకోవచ్చు.

కథలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటే భవిష్యత్తులో ఈ పిల్లలే చక్కటి తెలుగు కథా రచయితలుగా ఎదుగుతారు. తెలుగు భాషాభివృద్ధికి 'ఆయువుపట్టు' కథే. దానిపై పట్టు, నవతరానికి దాన్ని దగ్గర చేయాలన్న పట్టుదల మనందరికి సంపూర్ణంగా ఉన్నప్పుడే తెలుగు భాష, తెలుగు కథ ఆచంద్రతారార్కంగా నిలుస్తాయి.

కల్లూరు రాఘవేంద్రరావు
విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు,
హిందూపురం. 94932 71620

శాంతి

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!
ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!
అందరూ ఏక కంఠంతో
నినదిస్తున్న నినాదమిది
కానీ, అదేమిటీ?
తెల్లని పావురాయి రెక్కలు
రక్తంతో తడిసి బరువెక్కాయి
స్వేచ్ఛగా ఎగురలేక
ఒరిగిపోతూంది ఆ
శాంతి కపోతం!
నరమేధాలు
మారణహోమాలు
సత్యాగ్రహాలు
శాంతియాత్రలూ...
దూది పింజెల్లాంటి
తెల్లని, తేలికయిన మంచితనం
ఎక్కడో మనసు మారుమూలల్లోని
ద్వేషాగ్ని కణాలు పడి
రగులుకున్న రాక్షస ఘడియల్లో
మంచితనం మటుమాయమై
మానవత్వం మంటగలిసి
నరమేధం తలపెడుతున్నది
పదవుల ఆరాటాలు
ప్రతిపక్షాల పోరాటాలు
బూజుపట్టిన (బూర్జువా) భావాలు
బురద చల్లుకోవడాలు
ఎత్తులతో జిత్తులతో
ప్రజల్ని పావులుగా చేసే
రాక్షసత్వం పేరుకున్న
రాజకీయ చదరంగం..
మరి ప్రజలు ప్రాణంలేని పావులా..?
లేకపోతే వారిని
శవాలుగానో
జీవచ్ఛవాలుగానో చేస్తారా?
ప్రతి పార్టీ ధ్యేయమూ
ప్రజాక్షేమమే అయితే
ఈ క్షామాలెందుకు?

రాజకీయం గూండాయిజమయితే
గూండాయిజం చేతిలో
ప్రజాస్వామ్యం బందీ అవుతుంది
అవినీతిని అంతం చేయాలని
ధర్మాన్ని, న్యాయాన్ని నిలబెట్టాలని
అందరూ అనుకుంటారు
కానీ,
ఏదీ ధర్మం?, ఏదీ ధర్మం అంటే
ఎవరు చెప్పగలరు?
ద్వంద్వ విరుద్ధమైన
ధర్మాలతో కూడిన
న్యాయశాస్త్రంలో
వాదనకు రెండు వైపులా పదునే...

ప్రజల్ని పాలించాల్సిన
ప్రభుత్వాలే
కులమతాల్ని రెచ్చగొడుతూ
ద్వేషాగ్నులు రగిలిస్తూ
ప్రజాస్వామ్య మనుగడకు
ప్రమాదాలు తెస్తుంటే
రిపబ్లిక్ ఉత్సవాలు
స్వాతంత్ర్య దినోత్సవాలు
ఎలా? ఎలా? చేసుకోము?
తనయుల పోరాటంలో
తల్లడిల్లు తల్లికి
శాంతినెలా ఇవ్వగలము?

రక్తంతో తడిసిన
ఆ పావురాయి రెక్కల్ని
మంచులాంటి మంచితనం
కడిగేసిన రోజునే
గగనంలో ఎగురుతుంది
స్వాతంత్ర్యపు బావుటా!!

జైహింద్

- వి.మంగతాయారు
మధిర, ఖమ్మం

మధుర మధురంబైన మాతృభాష

తెలుగు రాతకు సొగసెక్కువ!
తెలుగు మాటకు శ్రావ్యతెక్కువ!
తెలుగు నుడికి వడెక్కువ!
మొత్తంగా... తెలుగుకు తీపెక్కువ!

పురాణాలు, ఇతిహాసాలు, మహా కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, సంకీర్తనలు, చాటువులు, వచనాలు... ప్రాచీన సాహిత్య ప్రక్రియలన్నీ తెలుగు అక్షరరమ్యతను, నానారుచిరార్థ సూక్తినిధిత్వాన్ని, ప్రసన్న కథాకవితార్థయుక్తిని ప్రపంచానికి చాటి చెప్పాయి. ఆధునిక కాలంలో అద్భుతమైన కవిత్వంతో పాటు కథ, నవల, నాటకం, విమర్శ, స్వీయచరిత్ర, జీవితచరిత్ర, వ్యాసం తదితరాలన్నీ తెలుగు సాహిత్య మాధుర్యానికి, వైవిధ్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఎన్నో సాహిత్య ధోరణులతో, కవితా ఉద్యమాలతో తెలుగుభాష సుసంపన్నమవుతూనే ఉంది. నిత్యనూతనంగా విరాజిల్లుతోంది.

విభిన్న మాండలికాలు, యాసలు మన భాషకున్న విస్తృతికి నిదర్శనాలు. కోడి కూతతో గొంతు కలిపి మేల్కొలుపు పాటలతో లోకాన్ని నిదురలేపే జానపదులు చేసిన వాఙ్మయ విన్యాసాలు... తవ్వినకొద్దీ బయటపడుతున్న తెలుగు జాతి నిధి నిక్షేపాలు. వెన్నెల పదాలు, తుమ్మెద పదాలు, బాలేశు పదాలు, జోల పాటలు, లాలి పాటలు, బతుకమ్మ పాటలు, వీర గాథలు, సామెతలు, పొడుపు కథలు... తెలుగు జానపదుల అపూర్వ సృష్టికి జోహార్లు. లిఖిత సాహిత్యానికి సమాంతరంగా అపారమైన మౌఖిక సాహిత్య సంపదను సృష్టించిన, సృష్టిస్తున్న జ్ఞానపదులకు వందనాలు.

'తెలుగదేలయన్న దేశంబు తెలుగేను' అంటూ 'నేను తెలుగు వల్లభుండ'నని ప్రకటించుకున్నాడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు. రాజరాజనరేంద్రుడి నుంచి రఘునాథ భూపాలుని వరకు ఎందరో రాజులు తెలుగు కవులను పోషించి చరితార్థులయ్యారు. సి.పి.బ్రౌన్, మెకంజీ, కాడ్వెల్ మొదలైన పాశ్చాత్య పండితులు మన అమ్మభాష మాధుర్యానికి ముగ్ధులయ్యారు. మన పలుకులను ప్రేమించారు. మన సాహిత్యాన్ని ఉద్ధరించారు.

వృత్తపద్యం, అవధానం తెలుగుభాషకే ప్రత్యేకమైన సాహిత్య విశేషాలు. కయ్యానికీ, వియ్యానికీ, స్నేహానికీ, విభేదానికీ, ఆత్మీయతకూ, ఆగ్రహానికీ అక్షరాలు తొడిగే విస్తృతీ, వెసులుబాటూ ఉన్న అరుదైన భాషల్లో తెలుగు విశిష్టమైంది. విలక్షణమైంది. నవరసాలనూ ఆవిష్కరించ గల పదసంపద, జీవితంలోని సకల అనుభూతులనూ, అనుభవాలనూ ప్రతిభావంతంగా వ్యక్తీకరించగలిగే పుష్కలమైన అక్షరశక్తి గల భాష మనది.

'నుతజల పూరితంబులగు నూతులు

నూరిటి కంటె ఒక బావి మేలు - మరి ఆ బావులు నూరిటి కంటె ఒక సత్క్రతువు మేలు, తత్క్రతు శతకంబు కంటె సుతుండు మేలు, సుతశతంబు కంటె సూనృత వాక్యము మేలు' అంటూ సత్య వాక్కుకున్న విలువను నన్నయ ఓ పద్యంలో వివరిస్తాడు. 'మమ్మెరుగుదువు, ఎదురెరుగుదువు, నెమ్మినెరనెరుగుదువు, వాక్యమ్ముల పద్ధతినెరుగుదువు, పొమ్మెవ్వడ-నీకు నేను బుద్ధులు సెప్పన్' అంటూ తేట తెలుగులో రాయబార ఘట్టాన్ని ఇంకొక కవి ఆవిష్కరిస్తాడు. నవవిధ భక్తిమార్గాలను తెలుగు సాహిత్యానికి అందమైన ఆభరణాలుగా మరో కవి అందిస్తాడు. ఈ కవన ప్రతిభావంతులందరూ 'తెలుగు నేలపై పుట్టి, తెలుగు వాడిగా పెరుగుతూ, తెలుగు జలామృతాన్ని సేవించి, తెలుగు గాలిని పీలుస్తూ జీవించే అదృష్టం దొరికినందుకు' మురిసిపోయిన వారే.



'నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు - తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల?' అని సూటిగానే ప్రశ్నిస్తాడు వేమన. 'తెలుగు ప్రాంతంలో పుట్టి, తెలుగు భాష రాదని, పరాయి భాషలో సకిలించే ఆంధ్రుడా! చావవెందుకురా?' అని గట్టిగానే మందలించాడు మన ప్రజాకవి కాళోజీ.

దేశమంటే మట్టికాదు... మనిషని యావత్ భారతీయ సాహిత్యంలోనే మొట్టమొదటిసారిగా నూతన నిర్వచనాన్నిచ్చాడు మన గురజాడ. 'ఏ దేశమేగినా - ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా - ఎవ్వరెదురైనా' మాతృభూమినీ, మాతృభాషనూ మరువవద్దన్నాడు రాయప్రోలు.

ఆకులో ఆకై, కొమ్మలో కొమ్మై, నునులేత రెమ్మైన భావకవి అనుభూతికి ఆకృతినిచ్చింది మన తెలుగుభాష. పుష్పవిలాపానికి కావ్యరూపాన్నిచ్చింది. ఎన్నెలంతా మేసి ఏరు నిదురోయిన కమనీయ దృశ్య కావ్యాన్ని అందించింది. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది లేనే లేదని చాటి చెప్పింది. విలాపాగ్నులనూ, విషాదాశ్రులనూ సమానంగానే సహజంగానే ప్రకటించింది. అక్షరాలను దయాపారావతులుగా, విజయ ఐరావతులుగా, వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలుగా మలచడం తెలుగు భాషకే సాధ్యమని నిరూపించింది. కదిలే ఊహలకు కన్నులిచ్చి పగలే వెన్నెలలు కురిపించింది. జగమే ఊయలగా జోకొట్టింది.

'ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని' ఆర్ద్రంగా ప్రశ్నించింది. అలలపై నిఘా, అలలు కనే కలలపై నిఘా వేసిన వ్యవస్థను గురించి హెచ్చరించింది. కన్నీటి కథలను అర్థం చేసుకోవడానికి ఆర్ద్రహృదయం కావాలని సూచించింది.

సూక్తులుగా, సామెతలుగా, నుడులుగా, నానుడులుగా ప్రజల నాలుకలపై నాట్యం చేస్తున్న లక్షలాది కవితా పంక్తులను అనునిత్యం అందిస్తున్న సజీవ చైతన్యస్రవంతి తెలుగు - సహజ సౌందర్య మధురోక్తి తెలుగు.

డా॥ ఎస్వీ సత్యనారాయణ
తెలుగు ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్
96180 32390

వి జ య ఉ గా ది

నవ ఉగాదికి స్వాగతం, మానవ
యుగాదికి స్వాగతం
కోయిలమ్మకు గొంతు దిద్దిన

మావి కొమ్మకు చివురులద్దిన
వేప కొమ్మకు పూలు పూచిన
మలయ మారుత మెలయవచ్చిన
విజయ ఉగాదికి స్వాగతం

రైతు బిడ్డలు హలము నడిపిన
కైత రాయుడు కలము కదిపిన
నవ శకానికి నాంది పలికిన
యువ సమాజము హర్ష మొలికిన
విజయ ఉగాదికి స్వాగతం

నవ వసంత ప్రసూన సౌరభ
మిళిత అళికుల మధుర గీతికి
కిలకిలారవ కీర సమితికి
ప్రియ రసాల రసప్రసూలికి
విజయ ఉగాదికి స్వాగతం

వర్ణ కుల మత ప్రాంత భేదము
వారసత్వపు వేరువాదము
కూటిబాధకు తంత్రభావము
పారద్రోలగ మహికి వచ్చిన
నవ ఉగాదికి స్వాగతం
మానవ యుగాదికి స్వాగతం

- నేతేటి గణేశ్వరరావు
రాజాం, శ్రీకాకుళం
94902 84342



కోరగాని కొడుకు

చిన్న కథ

"ఒరే రాజా.. రెండు వారాలకోసారి శనివారం సాయంత్రాలు ఏదో ఓ ప్రభుత్వాసుపత్రికెళ్లి అక్కడ ఏదిక్కూ లేని అనాథలకి పళ్లు ఇచ్చి, పరామర్శించి వస్తున్నావంటే నువ్వు నిజంగా చాలా గొప్పవాడివిరా. పాపం, చూసుకొనేందుకు నా అనే దిక్కులేక బిక్కుబిక్కుమంటూ గడిపే ఆ అభాగ్యుల పాలిట నువ్వు దేవుడివిరా...! సినిమాల్లో కనిపించే హృదయ విదారకరమైన కథలతో ఆ కాసేపూ మనసుని బరువు చేసుకోవడం తప్ప మేమేం చేయలేం. మానవత్వానికి నిలువెత్తు రూపానివిరా నువ్వు. 'వారాంతంలో ఎలా జల్సా చేయాలా' అని ఆలోచిస్తూ కార్యాలయ సమయమవ్వగానే తుర్రున పారిపోయే నాలాంటి వాళ్ల మధ్య నువ్వుండటం నిజంగా అద్భుతం!" మనస్ఫూర్తిగా రాజారావుని మెచ్చుకున్నాడు మూర్తి.

"చాల్లేరా! నీ పొగడ్తలకి నా కళ్లు నెత్తిమీదకి రాగలవు. సర్లే నేను వెళ్తున్నాను" అని ఉస్మానియా ఆసుపత్రి వైపు స్కూటర్ మీద సాగిపోయాడు రాజా.

ఆసుపత్రి నరకానికి నకలుగా ఉంది. అడుగు పెట్టాలంటేనే రాజారావుకు ఇబ్బందిగా ఉంది. వాంతొచ్చేలా కూడా ఉంది. అలాగే నెమ్మదిగా తనకి కావల్సిన రోగి దగ్గరకెళ్లాడు. ఆయనకు అరవై ఏళ్లుంటాయి. మంచానికి అతుక్కుపోయే ఉన్నాడు. రాజారావుని చూడగానే కళ్లలో మెరుపు. తను తెచ్చిన యాపిల్ అక్కడి టీపాయ్ మీద పెట్టి... "డాక్టరు ఏమంటున్నాడు?" అన్నాడు.

"రెండు మూడు రోజుల్లో ఆసుపత్రి నుంచి విడుదల చేస్తారట."

"అలాగా సరే అయితే" అని ఇంటికి బయలుదేరాడు.

* * *

"మనతో పాటు పనిచేసే రాజారావు పురుషుల్లో పుణ్యపురుషులు వేరయా అన్నట్టు.. గొప్ప మానవతావాది. ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అలాంటిది తనకి సమయం చిక్కినప్పుడల్లా ఆసుపత్రికెళ్లి అక్కడి బాధితుల మంచీచెడులు కనుక్కుంటున్నాడంటే.... ఒహ్! ఏ తోడూ లేనివాళ్లకి భగవంతుడు కల్పించే తోడు రాజారావులాంటి వాళ్లు... వాళ్లల్లో మానవత్వం పచ్చగా పదికాలాల పాటు ఉండాలంటే మనలాంటి వాళ్లు అలాంటి పనులు చేయలేక పోయినా కనీసం ప్రోత్సహించాలి. అందుకే ఈ అభినందన విందు" అని హఠాత్తుగా పైఅధికారి ప్రకటించాడు

రాజారావుకి అర్థమైంది అది మూర్తి పనే అని. మూర్తి వంక కొద్దిగా కోపంగా చూశాడు! తన మూలంగా రాజారావు బయటపడ్డందుకు ఇబ్బంది పడుతున్నాడనుకుని, కళ్లతోటే ఫర్వాలేదన్నట్టు సమాధానపర్చాడు.

ఒక్కొక్కరూ మనుషులు... దేవుళ్లూ... మనుషుల్లో దేవుళ్ల గురించి తమకు తోచిన ఉదాహరణలిస్తూ ఉపన్యసించారు. అధికారి రాజారావుకి జీతాన్ని పెంచమని ప్రధాన కార్యాలయానికి లేఖ రాస్తాననగానే మాత్రం కళ్లు మెరిశాయి.

శనివారం. సాయంత్రం ఆరు గంటలు.

రాజారావు గాంధీ ఆసుపత్రికి వెళ్లాడు.

నెమ్మదిగా తనకి కావలిసిన గది వద్దకెళ్లి నర్సుని అడిగాడు ఆయన పరిస్థితి ఏంటని.

"ఆయన చేరి రెండు వారాలవుతోందని మీకు తెలుసు. ఆయన సమస్య ఏమిటో అర్థం కావడం లేదు. డాక్టరు రెండు రోజుల్లో ఇంటికి పంపిస్తామన్నారు. తర్వాత ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించండి పాపం" అంది జాలిగా. రాజారావు ఆలోచనలో పడ్డాడు.

ఆ రోగి రాజారావు వాళ్ల నాన్న అని ఇంట్లో ఆయన్ని ఉంచుకోవడం ఇబ్బందని.. వృద్ధాశ్రమంలో చేరిస్తే డబ్బు ఖర్చవుతుందని ఇలా ఏదో ఓ రోగం పేరు చెప్పి అనాథగా చేర్పిస్తూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులూ తిప్పుతుంటాడని ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే లోకానికెప్పుడో తన తండ్రి చనిపోయాడని చెప్పి నమ్మించేశాడు.

పి.వి.సుజాతారాయుడు

సికింద్రాబాద్, 92915 56865

మళ్లీ ఒక దీపం

శత సహస్రదళ పద్మమై విప్పారిన ఆత్మ
సంభాషిస్తున్న అనుభూతి సందర్భమిది!

నా నదుల్నీ కొండల్నీ,
తెలుగు జాతి సామగ్రినంతా
కలలుగా మార్చి.. నక్షత్రాలుగా ఎగరేసి
అందమైన ఆకాశాన్ని చిత్రిస్తున్నాను!

తలమీద విదేశీమబ్బులు కమ్ముకుంటున్నా
తల్లిమట్టినే తిలకంలా దిద్దుకుంటున్నాను!

కృష్ణా గోదావరీ తరంగ నర్తనాలకు
తుంగభద్రా పెన్నా ఝరులు
కరాంగుళీయాలై తాళం వేస్తుంటే
తల్లిమట్టి తీగలు సవరించిన
తెలుగు పాటకు తన్మయమైపోతున్నాను!

సూర్యుడి దరహాసాన్ని ఒంపుకొని
సంస్కృతీ ఇతిహాసాన్ని కలుపుకొని
నేల నాలుగు చెరగులా
నా వర్ణమాల వెలుగుల్ని
విరజిమ్ముకుంటున్నాను!

కవిగా పుట్టినందుకు
నా కలం కొసల్లో వణికిపోతున్న
తెలుగు అక్షరాలను గుండెకు హత్తుకొని
అనంత సాహితీ పాదయాత్ర చేస్తున్నాను!

విశ్వ విద్యాలయాలు, రేవుపట్నాలు
గహనారణ్యశ్యామ పర్వతాలు
గద్గద విస్తృత సైకత సాగరతీరాలు
ఆధ్యాత్మిక పులకాంకిత పుణ్యక్షేత్రాలు
తరతరాల వారసత్వ వైభవాన్ని కలంలో
పోసి
జాతి వెన్నెముకగా నిలబెడుతున్నాను!

అన్నమయ్య పదకవితా పరిమళాలు
పాల్కురికి పసిడి పలుకు యక్షగానాలు
తిమ్మక్క దారిలో తెలుగు శారదలు
దేవర కొండ బుర్ర కథా బంగారు నాజర్
ఆదిభొట్లని ఆవాహన చేసే హరిదాసులు

చీకటి చేసేస్తే.. నీ చిరునామా
ఎక్కడంటున్నాను!

అవధానధురీణ పండితవర్యులు
దృశ్య గేయ నాటికా ప్రయోగ ప్రకాండులు
జాతి ఇంధన కర్తలు బాల సాహితీవేత్తలు
హాస్య రచనల వెన్నెల తోరణాలు

సి.పి.బ్రౌన్ మెకంజీల సేవానురక్తి
మహాదేవుని ఆశీఃఫల యోగసాధనాసక్తి
పండగల జోరు ఉద్యమాల హోరు
లలిత గీతానందాలు, నాదస్వరాగానందనలు
సురభి మాయాబజార్లు, పురావస్తుప్రతీకలు
హస్త కళలు, వాస్తు విజ్ఞానాలు

తెలుగు వెలుగులైన గ్రంథాలయాలు
సకల కళా విలసిత మాతృ
విశ్వరూపానికి
నిలువెత్తు అంకితంగా
ప్రణమిల్లుతున్నాను!

తెలుగునేలపై నదులు
పంటల పిల్లకాలువల్ని
కంటున్నంతకాలం
తెలుగు లోగిళ్ళలో ముగ్గులు
ఆ జ్ఞాపకాల్ని
గుసగుసలాడుతున్నంత కాలం
ఆకులెన్నిరాలినా
గుర్తులు మిగుల్చుకుంటున్న
చెట్టులా ఎదుగుతున్నాను.

పబ్బం గడుపుకునే
ప్లాస్టిక్ భాషని తుడిచేసి
జోగుతున్న యువరాత్రుల
ముంగిట్లో
సొంత స్వర సూర్యోదయాన్ని
మళ్ళీ ఒక దీపంలా వెలిగిస్తున్నాను.

అమ్మ ఒడినించి
బంగారు బడి దాకా అడుగులేస్తూ
తెలుగు నుడి ఏలుబడి కావాలనీ
చిరకాలం ప్రాణవాయువు నందించే
చైతన్యపు చిరునవ్వై వెలగాలనీ
ఒక గాథ నినాద కేతనాన్ని ఎగరేస్తున్నాను!

బ్రౌజింగ్ భవనాల్లో దారి తప్పుతున్న
పరాయి కీ బోర్డు బృందాలను
తెలుగు లేఖినితో పెనవేసి
పునాది శ్వాసకు పురుడు పోస్తాను!

ఇకపై పుట్టబోతున్న పాపాయికి కూడా
'అమ్మ'నే విన్పిస్తాను!
'తెలుగమ్మ'నే గుండెనాలుకతో పలికిస్తాను!!

డా॥ సి.భవానీదేవి
హైదరాబాద్.
040 27636172

హరిశ్చంద్రుడు

శారద (ఎస్.నటరాజన్)

విశాలమైన పొలాల మీదగా చంద్రోదయమవుతోంది. సినిమాహాలు గేటు దగ్గర నిలబడి గ్లాస్కో లాల్చీ మీద పడే చక్కని పసుపురంగు వెన్నెలకాంతికి వొళ్ళు జలదరించిందేమో, నాగభూషణం సినిమాకెళ్ళాలనే విషయమే మరిచిపోయి, స్త్రీల గేటువైపు చూస్తూ ఉండిపోయినాడు. సినిమాహాలు జనంతో కిక్కిరిసిపోతోంది. రికార్డుల మోత ఆగింది. వెన్నెలకాంతి తెలుపు రంగులోకి తిరుగుతోంది. తనకి పదిగజాల్లో నుంచుని ఉన్న అమ్మాయి, బుగ్గమీద గాలికి ఊగేజుట్టు ఉంగరాలని చూడకుండా ఉండలేకపోతున్నాడు నాగభూషణం. 'చామనచాయ అయితే మాత్రమే? అందంగానే ఉంది.... హాలులోకి వెళ్ళలేదెందు చేత? టిక్కెట్టు దొరకలేదు కాబోలు?' ఇలా అనుకుంటూ నాగభూషణం ఆమె తనవైపు అకస్మాత్తుగా చూసేటప్పటికి చిరునవ్వు నవ్వేశాడు. ఆ అమ్మాయి తల పక్కకు తిప్పుకుని వెళ్ళటానికి ముందుకు ఒకడుగు వేసింది రోడ్డువైపు.

ఇది మంచి సూచనే ఏమనుకుంటుందో అనుకున్నాడు భావనలో తన్ను తాను ధైర్యపరుచుకుంటూ నాగభూషణం. ఆమె కేసి రెండడుగులు వేస్తూ, తనవైపు చూడగానే కన్ను గీటాడు సరదాగా ఏదైతే అదౌతుందని. ఆమె ముఖంలో ఆమోద సూచకమైన సిగ్గు తెరలాగా ద్యోతకమై మాయమైంది.

ఇద్దరు అపరిచితులూ, సినిమాహాలు ఆవరణ దాటి బుర్రిపాలెం పొయ్యే రోడ్డు మీద నడవసాగారు..

"మీ వాళ్లెవరన్నా సినిమాకొచ్చారా?" అని కనుక్కున్నాడు తను.

"మీ కెందుకా విషయం?" ఆమె గొంతులో తిరస్కారం లేదని నాగభూషణానికి తెలుస్తూనే ఉంది.

'సాహసేలక్ష్మీః అన్నారు పెద్దలు!' అని తనను తాను బలపర్చుకుంటూ, నాగభూషణం ఆమె అడగకుండానే పెద్ద ఉపకారికి మల్లే పోజు పెట్టి "మీకు టిక్కెట్టు కావాలంటే ఇప్పిస్తాను. వెళ్లి పోతున్నారేం? ఉండండి, ఇప్పటికీ మించి పోలేదు. ఆట మొదలెట్టలేదు లెండి!" అన్నాడు.

"అక్కర్లేదులెండి!" విసురుగా అంటూ ఆ యవ్వనవతి ఈ తద్దినం మనవెంట బడ్డదేమా అన్నట్టు ఒక నిమిషం ఆగింది. అయితే యువకత్వమూ, డిసెంబర్ నెల చలీ, మత్తుగొల్పేవెన్నెల, ఇవన్నీ కలిసి నాగభూషణాన్ని కదలనివ్వలేదు.

"రండి, సిగ్గు పడకండి! మిమ్మల్నెక్కడో చూసిన గుర్తు. లేకపోతే అందర్నీ పలకరిస్తూ కూచుంటానా?" సాత్వికంగా మర్యాదతో ఒకరకమైన మగతతో మాట్లాడాడు.

"మాది ఈ ఊరు కాదండి! మా ఆయన సినిమా దగ్గిరకి వస్తానంటే వచ్చానండి - మీరు మంచి వారల్లే కనబడుతున్నారు. మా వారు హాస్పిటల్‌లోనే

"ఎపుడు దీపించునో-
ఈ పేదకనులలో చిమ్మచీకటి
బాపు చిన్నె దివ్వె? /
ఎప్పుడు నిండునో- ఈ పేదడొక్కలో/
క్షుద్బాధ తీర్చెడి కూటి ముద్ద? /..
అప్పుడే సభ్య జగతికి అచ్చమైన/
పచ్చని ఉగాది ఒక మహా
పర్వదినము!/
అప్పుడే విశ్వనరుని
గృహాంగణమున/
నవ వసంతము- ఒక
మహానందవేళ!"

– రసరాజు

ఉండిపోయినారు కాబోలు..." అని ఇంకేదో చెప్పబోతూ నాగభూషణం కేసి ఒక చూపు చూసి ఆగిపోయింది.

"అయితే మీ వారు ఏ హాస్పిటల్‌లో ఉన్నారేమిటి?" అన్నాడు నాగభూషణం.

"జానకి రామయ్యగారి హాస్పిటల్‌లోనండి! దగ్గుకి మందు తింటున్నారు... అక్కడదాకా వచ్చి వదిలిపెట్టండి... మీకు పుణ్యం ఉంటుంది" బతిమాలుతున్నట్టు అడిగిందామె.

ఇద్దరి అడుగులు సాగుతూనే ఉన్నాయి... "అభ్యంతరమా? మా ఇల్లుకూడా అటేలెండి... అయితే ఇటు పోతున్నావేమిటి? పడమటకి తిరగాలి"

అంటూ నాగభూషణం వెనక్కు మరలాడు. ఆమె కూడా అతని వెనకే మదించిన యేనుగుకిమల్లే తలొంచుకుని నడుస్తోంది.

***

"మా యింట్లోకి వొచ్చిపొండి వోసారి" అంటూ తడికల కొంపదగ్గిర ఆగాడు నాగభూషణం.

"మీ యిల్లు ఇదా?" అంటూ ఆమె ఆశ్చర్యంగా చూస్తోంది. ఈ సిల్కులాల్చీ, ఉంగరం... ఈ పూరిల్లు... ఆమెకి అనుమానంగా ఉంది.

"ఆ పక్క మేడ కూడా మాదేనండి -

అది అద్దెకిచ్చి ఇక్కడ ఉంటున్నా" అంటూ తడిక కట్లు విప్పి లోపల అడుగుపెట్టాడు... ఆమె కూడా లోపలికొచ్చింది. ఒక చిరిచాప, రెండు పాత పత్రికలు బెడ్‌రూము లైటు వెలుగులో మసక మసకగా కన్పించిన్నై.

"ఇట్లా కూర్చోండీ!" అంటూ నాగభూషణం ఏదో చటుక్కున జ్ఞాపకం వచ్చిన వాడల్లే "వెధవ చలి...." అని తెరిచిన తడిక బాగా దగ్గిరకేశాడు.

"నేను వెళ్తానండీ!"

అంటూ నిజంగా లేచే ఉద్దేశం ఏకోశానా కన్పించని వైఖరితో తీక్షణంగా నాగభూషణం కళ్లల్లోకి చూస్తూ ఆమె చిరిచాప మీద కూలబడ్డది.

"వెళ్దురుగాని- మీ పేరేమన్నారు..." తనూ ఆమెకి ఒక్క అడుగు దూరంలో కూర్చుని నాగభూషణం జేబులోంచి బీడీ తీశాడు. "నా పేరు చంద్రమతి" ఆమె గొంతు సన్నగా అద్భుతంగా వినిపించింది నాగభూషణానికి. ఆ నిమిషంలో ఆమె పేరుతో ఏమీ అవసరం లేకపోయినా ఏదన్నా మాట్లాడాలని అతని ఆదుర్దా. ఆమె వంక తీవ్రమయిన దృష్టితో చూస్తూ బెడ్‌రూమ్ లైట్‌తో బీడీ వెలిగించే ప్రయత్నంలో దీపం కాస్తా ఆర్పి "అరెరే!" అన్నాడు.

"ఎట్లా ఇప్పుడు?" అన్నదామె ఆ విషయమై ఏమీ విచారపడని గొంతుపెట్టి.

"పరవాలేదు, వెన్నెల చారలున్నాయిగా" అన్నాడు నాగభూషణం తడికల సందుల్లోంచి చిరిచాప మీద పడుతున్న వెన్నెల చారల్ని చూపుతూ.

చంద్రమతి ఒక్కసారి వొళ్ళు విరుచుకుని "అబ్బ వొళ్లంతా నొప్పిగా వుంది" అంటూ చిరిచాప మీద వెల్లికలా పడుకుంది, ఎడం చెయ్యి తలకింద పెట్టుకుని. రెండు మూడు వెన్నెల చారలు ఆమె కళ్ళమీదా ఎర్రటి పెదాల మీదా పడి మెరుస్తున్నాయి. ఆమె వయస్సు యెంతో నిర్ణయించడం నాగభూషణం వశం కాలేదు.

ఆ సమయంలో ఏ విషయం మీదయినా ఒక ఖచ్చితమయిన నిర్ణయానికి రావటం అతనికి చేతకాదేమో కూడాను.

"చంద్రా!" అంటూ అతను ఆమె మీదికి వొరిగాడు. అతనిలో కవిత్వం పొర్లింది. కాని మాటలు మాత్రం గొంతులోనే ఉండిపోయిన్నై.

"ఒకటీ, రెండు" అని దూరంగా తాలూకాలో కొడుతున్న గంటల్ని లెక్క పెట్టింది చంద్రమతి.

"అబ్బ, పడుకుందూ! వెళ్దువుగాని" అంటూ నాగభూషణం ఆమెని తిరిగి ఆక్రమించుకున్నాడు.

"ఉస్! ఎవరన్నా వింటారయ్యా, మెల్లిగా..." అన్నది చంద్రమతి వెచ్చటి పెదాలతో అతని నోరు మూస్తూ. ఆమె కుడి చెయ్యి మెల్లిగా నాగభూషణం జేబులు తడవ నారంభించింది. ఈ దెబ్బతో నాగభూషణం చప్పున స్మృతిలోకి వచ్చి "మెల్లిగా, బీడీలు విరిగిపోగలవు" అన్నాడు మెల్లిగా - కాని, గాఢంగా నవ్వి.

"అబద్ధం!" ఆమె తన ప్రయత్నం మానకుండా ఐదు నిమిషాలు వెతికి, విసుగెత్తింది కాబోలు "ఛీ! దూరంగా ఫో!" అని అతని బలమైన పట్టునుంచి విడివడి దూరంగా జరిగి పడుకుంది.

"నీకేం కావాలి! జేబులు తడువుతున్నావు?"

"నీకు తెలీదా, నాకేం కావాలో?"

"ఎట్లా తెలుస్తుంది?"

"ఇంత దూరం తీసుకొచ్చిన వాడివి...."

"ఓ! డబ్బులా? భలే... హ.... హహ్హ...." నాగభూషణానికి చచ్చేట్టు నవ్వొచ్చింది.

"ఎందుకట్లా నవ్వుతావు?" ఆమె తీవ్రమైన గొంతు పెట్టి అడిగేటప్పటికి నాగభూషణం నవ్వాపేశాడు. "డబ్బులా? వాటికోసం ఆరు రోజులనుంచీ అడగరాని

వారసత్వ సంపదగా...

'శారద' అసలు పేరు ఎస్.నటరాజన్, తమిళనాడులోని పుదుక్కోట్టైలో మే 1924లో పుట్టిన తమిళుడు. పన్నెండేళ్ల ప్రాయంలో 1936లో అక్కతో కలిసి తెనాలికి వచ్చాడు. హోటల్లో సర్వర్‌గా పనిచేస్తూనే తెలుగు అక్షరాలు కూడబలుక్కుని చదవటం, రాయటం నేర్చుకున్నాడు. రాత్రుళ్లు తీరిక వేళల్లో కొవ్వొత్తుల వెలుగులో తన తెలుగు భాషాజ్ఞానానికి పదును పెట్టుకున్నాడు. నెమ్మదిగా రచనలు చేయటం ఆరంభించాడు. 1947 ప్రాంతాల్లో అభ్యుదయ రచయితల సంఘం పట్ల ఆకర్షితుడయ్యాడు. కథలు, నవలలు రాయటం మొదలుపెట్టాడు. అవి ఆనాటి పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 'మంచీ చెడూ', 'ఏది సత్యం?', 'అపస్వరాలు' నవలలు, దాదాపు వంద కథలు రాశాడు. కొన్ని కథలకి, ఒక నవలకి పోటీల్లో బహుమతులూ వచ్చాయి. తెలుగు స్వతంత్ర పత్రికలో శీర్షిక నిర్వహించాడు.

ఇవన్నీ దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతూనే రాశాడు. దానికి తోడు అనారోగ్యం, అరాచకం జీవితం. మూర్ఛ రోగంతో 1955 ఆగస్టు 17న తన 31వ ఏట మరణించాడు. తమిళుడై ఉండి పట్టుదలతో తెలుగు నేర్చుకుని ప్రముఖ తెలుగు రచయితగా పేరు తెచ్చుకుని తన రచనలను వారసత్వ సంపదగా తెలుగు దేశానికిచ్చి వెళ్లిపోయాడు.

వాణ్ణల్లా అడిగాను. తిరగరాని చోటల్లా తిరిగాను, దొరక లేదు. నువ్వు తేలికగా జేబులో చెయ్యి పెట్టి డబ్బులంటే నవ్వురాక ఏం వస్తుంది? ఇంకా నయం! ఏడవనందుకు సంతోషించు" అతని హృదయాంతరాళం నుంచి ఉద్రేకం పొంగి ఈ మాటలు వచ్చినై. ఇంకా సాగేదే కాని ఆమె చప్పున లేచి నిల్చుని బైటకి పోతూ, ఏడ్పు, నిస్పృహ కలిసిన స్వరంతో ఇలా అన్నది. "నీ సిల్కు లాల్చీ, మెరిసే ఉంగరం, తెల్లని పంచా చూసి నీ వెంట వస్తే రెండు మూడు రోజుల తిండికి భయం లేదనుకున్నాను. కాని నువ్వు నాకన్నా దరిద్రుడివన్న సంగతి తెలిసేప్పటికి నాకూ నవ్వొస్తున్నది. అయితే ఆ మేడ నీదన్నావు!"

"అంటాను. తెనాలే నాదంటే మాత్రం నష్టమేమిటి? అందులో నీబోటి దాని ముందు...." నాగభూషణం చటుక్కున ఏదో జ్ఞాపకమొచ్చి "అయితే నువ్వు మామూలు సంసార స్త్రీ అని నేను అనుకున్నది భ్రమ అంటావా ఏమిటి?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

"నువ్వు జమీందారువో, ల్యాండులార్డువో అని నేననుకున్నదెంత నిజమో, నువ్వు నన్ను సంసార స్త్రీ అనుకున్నదీ అంతే నిజం!"

"సరిపోయింది, ఇద్దరం దొరికినందుకు చెప్పాలి" అంటూ నాగభూషణం నీరసంగా తడిక వాకిలి బిగించి ఆమె వెనకాలే రోడ్డు మీదికి వచ్చి నిలబడ్డాడు. ఆమె పోతూ పోతూ "నీ పేరేమిటి?" అని అడిగింది.

"హరిశ్చంద్రుడు.." అతని స్వరంలో ఎగతాళిని గ్రహించుకున్నదల్లే ఉంది ఆమె. "మళ్లీ అబద్ధమా? నీ బతుకు చెడా!" అన్నది శాపం పెడుతున్నట్టు.

"అబద్ధమా! పొరపాటు- నీ పేరు చంద్రమతి ఐనంత వరకు నా పేరు హరిశ్చంద్రుడై ఉండటం న్యాయం అని చెప్పాడు" నాగభూషణం చిలిపి నవ్వు నవ్వుతూ మారీసుపేట కేసి నడిచాడు. ఆమె చీకట్లో ఎటు పోయిందో పోయింది.

అ ఆ స్పందన

పిల్లల నోట తెలుగు పాట

అచ్చులతో ముచ్చటలాడించి... గుణింతాలతో పాటపాడించి... ఒత్తులతో ఉచ్చారణ నేర్పితే... అక్షరాలు పదాలై.. పదాలు వాక్యాలై భావప్రకటనకు మార్గం సుగమమౌతుంది. మా పిల్లలకు తెలుగు ఇలాగే నేర్పించాను. ముందుగా అక్షరాలను మౌఖికంగా చెప్పించి పిల్లల్లో రాయాలనే ఆకాంక్ష పెంచా. పలక మీదే కాకుండా అరచేతిలో, చిన్న చిన్న కాగితాలపై అక్షరాలు రాయించా. అక్షరాలకు సంబంధించిన చిత్రాలతో ఉండే పటాలను వాడుతూ అమ్మభాషను మా చిన్నారులకు దగ్గర చేశా. ప్రారంభంలో గుణింతాలు, ఒత్తులు లేని పదవల్లరిలో పిల్లలతో కూడా నేనూ ఆడుకున్నా. దీనికి పెద్దబాలశిక్ష ఎంతగా ఉపయోగపడిందో. ఒంపుసొంపులున్న గీతలు గుణింతాలుగా, ఆపై తలకట్టులేని అక్షరాలు ఒత్తులుగా నేర్పాను. జంతికల రూపంలో కళాయిలో వేగిన అక్షరాలను పేర్చి పద ప్రయోగాలు చేయించా. కుటుంబ సభ్యులు, గ్రామాల పేర్లను నిత్యం రాయించేదాన్ని. తప్పుల్లేకుండా రాస్తే బహుమతులు ఇచ్చేదాన్ని. చిన్న చిన్న పద్యాలు, శ్లోకాలను నేర్పించా. దాంతో పిల్లల తెలుగు ఉచ్చారణలో స్పష్టత, చక్కటి భాషాపరిజ్ఞానం అలవడ్డాయి. - **ఎన్.చంద్రావతి,** విజయవాడ

మాటకట్టు



1. బలపంతోపాటు, దిద్దడానికి కావాలి (3)
4. రామునికి సాయపడిన బుడత జీవి (3)
6. చంద్రముఖిలో రజనీకాంత్ తరచూ వాడే జంట పదం (4)
8. దీర్ఘం కోల్పోయిన అమ్మమ్మ భర్త (2)
9. వస్త్రాన్ని ఇలా కూడా అంటారు (3)
14. ఇవతల కాదు (4)
15. ఈ మంచం ఎక్కడైనా ఒదిగిపోతుంది (3)
18. ఇంకో గొడవలో మధ్య అక్షరం లుప్తమయ్యింది (2)
19. ఎటు చూసినా నటించడమే (3)
20. వడ్రంగి పరికరం, విడవర్చి రాసిన ఒక దేశం (3)
22. స్త్రీకి, ఓ రచనా ప్రక్రియల్లో మొదటి అక్షరం అదృశ్యం (2)
23. తమిళనాడు భాష (3)
24. అటు నుంచి గొడవ చేసే నాగార్జున సినిమా (3)
26. నీళ్లు తెచ్చుకునే పాత్ర (3)
27. భయం, వణుకు (2)
28. కొందరి అమ్మాయిల పేరు వనం నుంచి పుట్టింది (3)

ఆధారాలు

1. నీటిని దాటించే ప్రయాణ సాధనం (3)
2. వడ్రంగి దానితోనే సామగ్రి చేస్తాడు (3)
3. నలతలాంటి బాధ (3)
4. ఈ చారు ఎంతో రుచి ఎంతో రుచి... (3)
5. ఒక సారి (3)
7. కథ మరోలా (2)
11. పెరుగుతో వడ (3)
12. ఆరోగ్యం దెబ్బతింది... కింద నుంచి (3)
13. ఎండాకాలం తగిలే దెబ్బ, వడ (2)
14. సగం, గూడు (2)
15. ..మంతా ఒక్కటే (2)
16. వాయించే (వాద్యం) సాధనం (3)
17. డబ్బులు దాచుకుంటే, ఖర్చుకు వ్యతిరేకమవుతోంది (2)
21. బాగా వాగితే ఈ పిట్టని కిందనుంచి అంటారు (2)
22. ఇది వస్తే అన్ని కొట్టుకుపోతాయి. (3)
23. రైతు ముఖ్య సాధనం (3)
24. ముఖంలో ఓ భాగం కిందనుంచి పైకి (3)
25. జలం నుంచి పుట్టింది (3)

4

పులిపాటి దుర్గారావు
విజయవాడ,
98486 27711

ఆహ్వానం

భాషాభిమానాన్ని పెంచేలా, తెలుగు మాధుర్యాన్ని పంచేలా గళ్ల నుడి కట్టును మీరూ రూపొందించి పంపవచ్చు. తక్కువ గళ్లతో విభిన్న కోణాల్లో సృజనాత్మకంగా ఉండాలి. బాగున్న వాటిని ప్రచురిస్తాం. తగిన పారితోషికమూ ఉంటుంది.

సమాధానాలు 98లో...

"బూడిదై పోయిన ఆలోచనల అట్టడుగున
ఆశ కల్పించే ఆరని అగ్నికణంలా-
నవ్వే కళ్ల వెనక మండే గుండెలా -
ఇవ్వాళ నా కళ్లముందు నిలిచిందొక కొత్త చిగురు!
ఈ కొత్త చిగురు కోసమే-
ప్రకృతి ఏడాది పాటు తపస్సు చేస్తుంది!
ఈ కొత్త చిగురు కోసమే-
సమాజం తరాల పాటు తపించిపోతుంది!-
చిగుళ్లు వెనక ఒక దేశం ఆయాసం ఉంది.
చిగుళ్ల వెనుక కోటాను కోట్ల జీవుల వేదన ఉంది.
కొత్త చిగుళ్ల కోసం ధ్యానం చేద్దాం!
కొత్త చిగుళ్లని ఆవాహన చేద్దాం!
కొత్త చిగుళ్ల గుండెల పత్రాలమీద
మన ఊపిరులతో సంతకాలు చేద్దాం!!
నవ సమాజపు నందనవనంలో
మట్టి మీద కనీసం-
మన అడుగుల గుర్తులైనా మిగుల్చుకుందాం!!



– అద్దేపల్లి రామమోహనరావు

లెక్కల తల్లీ! లీలావతీ!!

గణిత ప్రపంచానికే తలమానికం... ప్రాచీన భారతం. సున్నాను కనిపెట్టడం నుంచి అద్భుత సిద్ధాంతాలను నిర్వచించడం వరకూ భారతీయ శాస్త్రజ్ఞులకు తిరుగులేదు. అదే సమయంలో, లెక్కల చిక్కుముడులను విప్పడంలో తెలుగు వారి ప్రతిభ అనుపమానం. వ్యాకరణబద్ధమైన, అర్థవంతమైన పద్యాలతో గణిత పాఠాలు చెప్పడంలో మనవారిది అందెవేసిన చేయి.

ప్రాచీన భారతదేశం ఆధ్యాత్మిక అంశాల్లోనే కాదు.. విజ్ఞానశాస్త్ర విషయాల్లోనూ సమకాలీన ప్రపంచం కన్నా ఎంతో ముందుంది. అలనాటి వేదాల నుంచి వర్తమాన సాహిత్యం వరకు ప్రతి అంశాన్ని క్షుణ్నంగా అధ్యయనం చేస్తేనే 'మన' ప్రతిభ ఏంటో మనకు తెలుస్తుంది. అయితే, సంస్కృత భాషా ప్రభావమో, ప్రాంతీయ భాషా రచయితల సామర్థ్య లోపమో కానీ అనేక శతాబ్దాలపాటు... విజ్ఞానశాస్త్రాలపై స్థానిక భాషల్లో సరైన రచనలు రాలేదు. అక్కడక్కడా వచ్చినా అవి ప్రజల్లోకి ఎక్కువగా చొచ్చుకుపోలేదు. కానీ.... సమకాలీన వైజ్ఞానిక పరిశోధనల స్థాయికి తూగగలిగిన సాహిత్యం తెలుగులో వందల ఏళ్ల నాడే పురుడుపోసుకుంది. దురదృష్టవశాత్తు అది పెద్దగా వెలుగులోకి రాలేదు.

తొలి తెలుగు గణిత గ్రంథ రచన 'ఆంధ్ర మహాభారతం'తో పాటే మొదలైంది. తెలుగులో మొదటి వైజ్ఞానిక గ్రంథమైన దాని పేరు 'సారసంగ్రహ గణితం'. పావులూరి మల్లన (క్రీ.శ. 1100) దీని గ్రంథకర్త. పావులూరి గణితంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఊరూవాడా ఆ పద్యాలు వినిపించాయి. తర్వాత కవుల రచనల్లో పావులూరి సాహిత్య ప్రయోగాలు కనిపించాయి. సాధారణ కావ్యరచనలో కవికి ఉండే స్వేచ్ఛ... గణితం వంటి సాంకేతిక విషయాల రచనలో ఉండదు. అందులోనూ పద్యాల రూపంలో రాయడమంటే ఊహకందని విషయం. పావులూరి ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. గణిత శాస్త్రానికి కావ్య మర్యాద ఇచ్చాడు.

విను జొన్న గింజెత్తు వీస మనం జను
రెండు వీసములైన నిండు పరక
పరకలు రెండైన, బాతిక, పాతిక
ద్వయ మడ్డ గడ్డిగ ద్వయము రూక
రూకలు పది మాడ రూఢి మాడలు మూడు
తులము తులములైదు పలము వెలయు
పలములు నాలుగు పరువడి శేరగు
నొనర శేరులు నైదు నొక్క వీసె
వీసె లవి రెండు నొక్కట విస ధటంబు
మహి ధటంబులు నాలుగు మణు గనంగ
బరగు మణుగులు పంద్రెండు బారు వగును
మానుగా నిది తూనికమాన మగును.

కొన్ని శతాబ్దాల నుంచి వచ్చిన తూకాల వివరాలను... ఆ పదకొండో శతాబ్దపు కవి ఎంత సులభంగా చెప్పాడో ఈ పద్యమే చెబుతోంది.

ఈ గణిత గ్రంథాలూ మనవే!

ఆర్యభట్టీయ, సూర్యసిద్ధాంత గ్రంథాలకు తెలుగు టీకాలు రాసిన వారిలో ఆర్యభట్టీయ వ్యాఖ్యానకర్త యల్లయ ప్రసిద్ధుడు. సూర్యదేవ (క్రీ.శ. 1191) రాసిన 'భట్ట ప్రకాశిక' అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని వివరణాత్మకంగా, అనేక ఉదాహరణలతో, సుసంపన్నంగా తెలుగులోకి అనువదించాడు. శ్రీశైలానికి ఆగ్నేయ దిశగా (నేటి కర్నూలు జిల్లా) స్కంధ సోమేశ్వర పట్టణంలో తన రచన చేశాడు.

సాళువ తిప్ప భూపతి (15వ శతాబ్దం) రాసిన 'తాళదీపిక', విజయనగర పాలకుడు శ్రీరంగరాజు రాసిన 'విధాన తిలక', తంజావూరు పాలకుడు (క్రీ.శ. 1729-35) తులరాజు రాసిన 'ఇనకుల తేజోనిధి', 'వాక్యామృత' గ్రంథాలు సంపూర్ణ తెలుగులోనివే. కృష్ణాజిల్లా మధురా(నా)పురం నివాసి భూగోళ వెంకటేశుడు 'సర్వార్థచింతామణి', 'కుట్టకశిరోమణి', తిరుపతి సమీపంలోని నారాయణపురం నివాసి అయిన నృసింహ దైవజ్ఞుడు 'వేంకటాద్రినాథీయం' గ్రంథాలు రాశారు. ఇవన్నీ ఖగోళ గణిత విషయాలతో సాగుతాయి.

ప్రతాపరుద్రుని కాలం నాటి 'సూత్రగణితం' ధాన్యమానాలు, త్రైరాశికాదులను చర్చించింది. దీని రచయిత ఎవరో తెలియలేదు. అచ్యుత దేవరాయల సమకాలీనుడైన వల్లభామాత్యుడు భాస్కరాచార్యుని ప్రసిద్ధ గణిత గ్రంథం 'లీలావతి'ని తెలుగులోకి అనువదించాడు. ఆ కాలం నాటి చారిత్రకాంశాలు కొన్నింటిని తన అనువాదంలో ప్రస్తావించాడు. భాస్కరాచార్యుని (క్రీ.శ.1114) లీలావతి.. గణిత చరిత్రలోనే ఓ సుందరమైన అధ్యాయం. అది వెలువడిన కాలం నుంచి ఇప్పటికీ అనేక భాషల్లోకి అనువాదం అవుతూనే ఉంది. ఏ భారతీయ గణిత గ్రంథం ఇంతగా అంతర్జాతీయ ఖ్యాతి పొందలేదు. మహాకవి కాళిదాసు రచనా విన్యాసాలు భాస్కరుడి లీలావతిలో ఉన్నాయని విశ్లేషకులు ప్రశంసించారు. 'చతురప్రీతి పదాం ప్రస్ఫుటాం, సంక్షిప్తాక్షర కోమలామల పదైర్లాలిత్య లీలావతీమ్' అనే మంగళాచరణ శ్లోకంతో ప్రారంభమయ్యే సంస్కృత లీలావతి, బీజగణితం, గణితాధ్యాయం, గోలాధ్యాయం అనే నాలుగు భాగాలున్నాయి. ఇంతటి విశేష గ్రంథాన్ని తెలుగులోకి తొలిగా అనువదించాడు వల్లభామాత్యుడు.

కృతికర్త పేరు తెలియని మరో గణిత గ్రంథం 'ఆంధ్రలీలావతి'. ఇది భిన్నాలు, క్షేత్రమితి అంశాలను మాత్రమే వివరించే ఒక అసంపూర్ణ రచన. ఇది భాస్కరుని లీలావతికి అనువాదం కాదు. పేరులో మాత్రమే సారూప్యం కనిపిస్తుంది.

అభినవ లీలావతి

చెన్నపురి (నేటి చెన్నై) నివాసి, గోలకొండ వ్యాపారి అయిన తడకమళ్ల వేంకట కృష్ణారావు (క్రీ.శ.1861)... భాస్కరుడి లీలావతికి అనువాదంగా 'అభినవ లీలావతి'ని (ఆంధ్ర లీలావతి) రాశాడు. అనువాదమే అయినా అక్కడక్కడా తెలుగు ప్రాంతీయ సంప్రదాయాలు, ఆచారాలు, ఆ కాలంలో వాడుకలో ఉన్న కొలమానాలు, ద్రవ్య వినిమయ సాధనాలు తదితరాలను తన అభినవ లీలావతిలో తడకమళ్ల చేర్చారు. దీన్ని యథాతథంగా మూలగ్రంథంతో కలిపి వావిళ్ల వారి ప్రచురణ సంస్థ 1863లో ప్రచురించింది.

తెలుగు లిపిలో సంస్కృత శ్లోకం, కిందనే దానికి తెలుగు అనువాద పద్యం ఇస్తూ తొలి కూర్పు వచ్చింది. అనువాదంతో పాటు తెలుగులో ఇచ్చిన స్వతంత్ర విషయాలను కూడా ఏ పద్యానికి ఆ పద్యం కింద ఇచ్చారు. కొంతకాలం తర్వాత వేదం లక్ష్మీనారాయణ శాస్త్రి పరిష్కర్తగా ఈ గ్రంథం ద్వితీయ ముద్రణ వావిళ్ల వారి నుంచే వచ్చింది. పరిష్కర్త రెండు గ్రంథాలను విడదీసి మొదటి దానికి అనుబంధంగా చివరలో ఆంధ్ర లీలావతిని చేర్చారు. తెలుగు పద్యాల పక్కన కుండలీకరణాల్లో ఆయా సంస్కృత మూలశ్లోకాల సంఖ్య, పుట సంఖ్య ఇచ్చారు. తెలుగు లీలావతిలో ఇచ్చిన అదనపు అంశాలను తొలికూర్పు మాదిరిగా కాకుండా తెలుగు విభాగంలోనే ఇచ్చారు. రెండు భాషల్లో విడివిడిగా చదువుకుందామనుకునే వారికి ఈ విభజన సౌలభ్యంగా ఉంటుందని పరిష్కర్త అభిప్రాయం.

ప్రత్యేకతలివి...

సంస్కృత మూలం మాదిరిగానే అభినవ లీలావతి 13 అధ్యాయాల్లో ఉంది. అయితే, స్వేచ్ఛానువాదం, అదనపు విషయాల చేరిక వల్ల ప్రత్యేకత సంతరించుకుంది. కవి తాను 'సకల శాస్త్ర సారంబును బహుజనోపకా రంబుగా నెద్దియేని యొక్క కృతియొనరించు' తలపుతో ఉండగా, ఒక రాత్రి సుఖసుప్తిలో స్వప్నమున గురువు వేంకటార్యుడు కనిపించి గణిత ప్రవృత్తిని ప్రస్తుతించి లీలావతీ గణితాన్ని 'ఆంధ్రమున నీవొనరించు'మని ఆదేశించినట్లు చెప్పాడు.

వేదమునకు చక్షువెన్న జ్యోతిషమంద్రు
దానికాద్యమగుచు దనరునిదియె
గాన గణిత మఖిల కారణంబనుటకు
సంశయంబులేదు జగతియందు -

అనే సంసిద్ధతతో తడకమళ్ల తన రచన ప్రారంభించాడు.

కృత్యాదిలో 'సలలితసంక్షిప్తసరణి దెల్పిన' పూర్వగణిత శాస్త్రజ్ఞులను స్మరించాడు. సాంకేతిక పదాల

కోయిల "కో" అంటే ప్రాణం లేచివస్తుంది!
తీయదనం - చేదు వేపలోనూ దీపిస్తుంది!!
కాలాన్ని కదలకుండా ఆపే వారెవ్వరు?
కాలం బ్రహ్మ స్వరూపమని తెలిసిన వారెందరు?
అఖండ బ్రహ్మాండ కటాహంలో
అమృతం నింపుతోంది వసంత కన్య!
అశేష ప్రజలకు కాలశక్తి
అవగతం చేయ గలిగితే ఆమె ధన్య!
రండి! శాంత - వసంతసైన్యాన్ని నడిపించండి!
అశాంత శేసిర శత్రువుని ఓడించండి!!

– ప్రజాకవి డా॥ దాశరథి

నిఘంటువులు, అంకమానాలతో పాటు ద్రవ్య, తులాదిమానాల్లో సంప్రదాయకంగా వస్తున్న మగధ పద్ధతులతో పాటు స్థానికంగా అలవాటులో ఉన్న వాటిని తన రచనలోకి చేర్చాడు. ఆంధ్ర, చెన్నపురి ప్రాంతాల్లో వివిధ జిల్లాల్లోని వాడుకలో ఉన్న కొలత పద్ధతులను ఉపయోగించాడు.

ఎప్పటిదో ఎక్కడిదో రమారమి 900 ఏళ్లనాటి గ్రంథం, దానికి అనువాదం.. అదీ ఇప్పటికి సుమారు 150 ఏళ్ల నాటిది.. అందులో ఏముందిలే అనిపిస్తుంది. ఆధునిక గణితాంశాల్ని ఇది చెప్పగలదా అని మనసు సంశయిస్తుంది. కానీ, ఈ గ్రంథం స్థాయి ఎప్పటికీ తరగనిది. ఈ ప్రశ్నలు చూడండి...

నవగుణిత నంద రస రామానందలోక
పర్వతాంక ఖ చంద్రుల బరుగునెంత?

అంక నిఘంటువు ప్రకారం నవగుణిత (×9), నంద (9), నంద (9), రస(6), రామ (3), నంద (9), లోక (3), పర్వత (7), అంక (9), ఖ (0), చంద్ర (1). అంకెల స్థానాలు కుడి నుంచి ఎడమకు కాబటి ఇచ్చిన లెక్క/ ప్రశ్న ఏమిటంటే..

$9 \times 109739369 = ?$

వర్గాది పథక దండకం

'ఒకటి మొదలుగా నవాంతాంక వర్గంబులున్నాభ్సిలు..' అంటూ ఓ దండకం అభినవ లీలావతిలో ఉంది. 1 నుంచి 9 వరకు అంకెల వర్గం మొదలు నవమఘాతం వరకు వచ్చే ఫలితాలు (స్క్వేర్ పవర్ నుంచి పవర్ 9 వరకు అంకెల విలువలు) ఈ దండకం చెబుతుంది.

చిలుకలొక కొన్ని దమయందు చెలువమైన
మూలనవకంబుల గూడి పూర్ణజలనిధి
యుగ్మచంద్రులుగా నొప్పి యొప్పిదముగ
వాణిగొలువంగ జనెనాది వనిత నొడుపు

చక్కని తేటగీతిలో ఒదిగిన లెక్కలో చిలుకలు (ఎక్స్), మూలనవకం (నైన్త్ రూట్ ఎక్స్), పూర్ణ (0), జలధి (4), యుగ్మ (2), చంద్ర (1).. అంటే 1240. ఇప్పుడు 'వనిత' చెప్పవలసింది ఏమిటంటే ఎక్స్+ నైన్త్ రూట్ ఎక్స్ = 1240 అయితే ఎక్స్ విలువ ఎంత?

మచ్చుకు కొన్ని మాత్రమే ఇవి. 'వర్డ్ ప్రాబ్లమ్స్', 'స్టోరీ ప్రాబ్లమ్స్', 'రియల్ లైఫ్ సిట్యుయేషన్ ప్రాబ్లమ్స్' లెక్కల పాఠ్య పుస్తకాల్లో ఉండాలని ఆధునిక విద్యావేత్తలు చెబుతున్నారు. 'అభినవ లీలావతి' చెప్పింది ఇది కాదా? చాదస్తపు 'పాతతరం' అంటూ మన విజ్ఞానానికి మనమే కదూ 'పాతర' వేస్తోంది!? అనిపిస్తోంది కదూ?

సూక్ష్మ సమ్మతిన 'వర్గం' చేసేవారు, వేగంబు తేజరిల్ల తెలియబల్కెడి సఖుడు, 'నీ మనమున నిపుడె దెల్పు'మన్న ఘనమూలం చెప్పేవారు (మనోగణనం చేసి క్యూబ్‌రూట్ చెప్పడం), 'వేవేగ' భాగహారాలు చేసే లలనలు, 'ఎటిగింతువేని సంతసింతు నెలమి' అంటే వెంటనే జవాబు చెప్పేవారు, 'ద్రవ్యమింతయని వే సూచింపుమా' గణకా అంటే వేగమే స్పందించేవారు, 'భిన్నం పరికర్మ విధి దెల్పుమన్న మిన్నవేని' అనే సవాలుకు జవాబు చెప్పేవారు, 'కొలుచు దినములెన్నో' లెక్కించు కోమలాంగి అనగానే సమాధానం చెప్పే పడతి, 'టనుకు షిల్లింగులైదు' అనే విదేశీ మారక వివరాలకు లెక్కలు చెప్పగలిగిన తరలనయన, వడ్డీ కట్టి లెక్క వేయగలిగిన కంబుకంఠి, వస్త్రం పొడవు, వెడల్పు దాని ఖరీదు చెప్పి అదే రకపు వస్త్రానికి వేర్వేరు కొలతలిచ్చిన ఖరీదెంతో వేగమే చెప్పగలిగిన వణిజకులాగ్ర్య, ఇచ్చిన అంకెలతో రాయవీలైనన్ని సంఖ్యలు రాసి వాటి మొత్తాలను రకరకాల ప్రస్తారాలతో చెప్పగలిగిన 'గణిత వరాంకపాశవిధి గండడు'.. ఇలా ఎందరో ఆంధ్ర లీలావతిలో కనిపించి పలకరిస్తారు.

ఆంధ్ర లీలావతి అక్కడక్కడ చక్కని వచనాన్ని కూడా ఇచ్చింది. గ్రంథకర్త తడకమళ్ల వేంకట కృష్ణారావు అనుక్రమణికలో ఇలా అన్నారు..

'...బహువిధ విచిత్ర గణిత చమత్కారంబుల కాలవాలంబును, సనాతన విద్వద్గణకోక్తి ప్రాచుర్యంబునకు రాజమార్గంబును, అధునాతన గణక నికాయంబునకు సహాయంబును, విశిష్ట గణక సమూహంబున, కత్యంతాశ్చర్యాపాదకంబును... సరసిక గణ కానందంబగు నభినవ లీలావతీరత్నంబు..' మన ప్రాచీన గణిత ప్రపంచానికి ప్రధానమైన రహదారి, ఆధునిక గణితానికి ఉపయోగపడేది, గణిత మేధావులకు ఆశ్చర్యం కలిగించేది అయిన ఆంధ్రలీలావతి ఎప్పటికీ అభినవ లీలావతియే.

అప్పటి నిత్యజీవిత సందర్భాల్లోని గణితం, సంప్రదాయాలు, అనేక ఛందాలు, అలంకారాలు, అనుప్రాసల ప్రయోగాలతో భాషా విన్యాసాలు ఎన్నో మనకు ఇందులో కనిపిస్తాయి. గొప్పలు చెప్పుకోవడంతో సరిపెట్టుకోకుండా మనదైన ఈ తెలుగు ఘనతను కాపాడుకోవాలి. వారసత్వ సంపదగా భావితరాలను అందించాలి.

డా॥ ప్రఖ్య సత్యనారాయణశర్మ
విజయవాడ, 92901 30568

మానసిక ఆరోగ్యానికి మాతృభాష



చిన్నారుల మానసిక ఆరోగ్యం చక్కగా ఉండాలంటే వారికి మాతృభాషతో అనుబంధం ఉండి తీరాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా మానసిక శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్న విషయమిది. బిడ్డ ఉమ్మనీటిలో ఉన్నప్పుడు వినే మాటలు సాధారణంగా అమ్మభాషవే అయి ఉంటాయి. కాబట్టి... ఆ ధ్వనులు తనపై ప్రభావం చూపుతాయి. ఈ లోకంలోకి వచ్చాక, మానసికంగా ఎదగడం, వ్యక్తిత్వం ఏర్పడటం తదితర సమయాల్లో ఆ ప్రభావ ఫలితాలు కనపడతాయి. అమ్మభాషలో మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం అంత ఎక్కువగా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాతృభాషలో మాట్లాడేటప్పుడు మనస్సు, మెదడు, నాలుక మధ్య ఉండే సమన్వయమే ఎదుగుదలకు కీలకమవుతుందంటున్నారు వారు. (అదే అన్యభాషల విషయంలోనైతే... మెదడు, నాలుక మధ్యే బంధం ఉంటుంది)

నీ జ్ఞాపకాలే లేకపోతే...

ప్రియమైన కమలకి...

'తెలుగు వెలుగు' తిరగేస్తోంటే 'మీరెప్పుడైనా ప్రేమలేఖ రాశారా?' అన్న శీర్షిక కనిపించింది. అక్కడే, నా చూపులు ఆగిపోయాయి. నా ఆలోచనలు నిలిచిపోయాయి. కళ్లజోడు సర్దుకుని మరొక్కసారి జాగ్రత్తగా చదివాను. అయినా, నువ్వు పురిటికి పుట్టింటికెళ్లినప్పుడు నేను వారానికొకటి చొప్పున రాసిన లేఖలన్నీ ప్రేమలేఖలేగా! వాటిలో ఎక్కడైనా 'ప్రేమ' అన్న మాట ఉందోలేదో గుర్తులేదు కానీ, ప్రతి అక్షరంలోనూ కొండంత ప్రేముంది. ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును అంటారే, అలా...నా లేఖ అందిన నాల్రోజులకే నీ నుంచి తిరుగు టపా వచ్చేది. ఆ లేఖ వచ్చేదాకా... ఓ సుదీర్ఘ నిరీక్షణ. పోస్టుమాను కటాక్షవీక్షణాల కోసం పడిగాపులు, గుండెల్లో వడగాల్పులు. నిజం కమలా, మూడుముళ్లు వేసింది లగాయతు... గుమ్మడి పాదులా నా జీవితం నిండా పరిచేసుకున్నావు నువ్వు.

పెళ్లినాటికి నా వయసు పదకొండు. నీకేమో తొమ్మిది. మనిద్దరి మధ్యా నెలతక్కువ రెండేళ్ల తేడా. నీ పక్కన కూర్చుని పెళ్లి పల్లకిలో ఊరేగుతుంటే భలే సంబరంగా అనిపించింది. ఆడుకోడానికి కొత్త నేస్తం దొరికిందన్న సంతోషమొకటి. అప్పటి నుంచి ఇప్పటి దాకా, నువ్వు నా స్నేహితురాలివే. జీవన సహచరివైనా మన పిల్లలకు తల్లివైనా అమ్మానాన్నలకు ముద్దుల కోడలివైనా ఆతర్వాతే. సుదీర్ఘ వైవాహిక జీవితంలో ప్రతి కష్టాన్నీ సుఖంలా స్వీకరించావు. ప్రతి సుఖాన్నీ సంతోషంగా పంచిచ్చావు.

పురిటికో పెళ్లికో బయల్దేరుతూ వంద వంద జాగ్రత్తలు చెప్పేదానివే, రైలుబండి కదిలేదాకా సవాలక్ష అప్పగింతలు చేసేదానివే, అదేంటి కమలా... శాశ్వతంగా నన్నొదిలి వెళ్తున్నప్పుడు మాత్రం, మాటవరసకైనా చెప్పలేదు? ఫోన్లో మాట్లాడుతూ మాట్లాడుతూనే అర్ధంతరంగా సంభాషణ ఆపేసి, వెళ్లిపోయావేం?

అలిసిపోయావా, అలిగి... పోయావా!

కొన్నిసార్లు దూరాలు కూడా మనుషుల్ని చేరువ చేస్తాయంటారు. ఒంటరినైపోయాను కమలా! నీ జ్ఞాపకాలే లేకపోతే, బతికున్నానన్న సంగతి కూడా తెలిసేది కాదు. మూడేళ్లు మూడు యుగాల్లా గడిచిపోయాయి. ఇప్పుడు నేను ఎవరికీ అక్కర్లేదు. ఎవరి మీదా ఆధారపడి బతకలేను. ఒక్కసారి నిన్ను కలవాలనుంది కమలా! నీతో మాట్లాడాలి. ఇన్నేళ్ల సంగతులు పూసగుచ్చినట్టు చెప్పాలి. నువ్వు చెప్పే కమ్మకమ్మని కబుర్లన్నీ వినాలి. కుదిర్తే, ఓ కప్పు ఫిల్టరు కాఫీ... మన పెళ్లిరోజుకని నువ్వుకొన్న పొడుగాటి స్టీలు లోటాలో!

ఇంటర్నెట్టూ ఈమెయిలూ ఆవిష్కరించిన మనిషి...స్వర్గానికి ఉత్తరాలు బట్వాడా చేసే వ్యవస్థని మాత్రం కనిపెట్టలేక పోయాడెందుకో! ఈ చిన్న సాయం చేసిపెట్టమని సర్వాంతర్యామిని ప్రార్థిస్తున్నా. ఏ లోకంలోనో ఉన్న ఆ దేవుడు ఈ నా ప్రేమలేఖను చదివి కరుణిస్తాడేమోనన్న ఆశతోనే...

నీ
కృష్ణ
పశ్చిమగోదావరి



డైట్‌సెట్‌కు దారులివిగో...

ఉద్యోగపరంగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలంటే ఛాత్రోపాధ్యాయులుగా డీఎడ్ లేదా బీఎడ్ చదవాలి. డీఎడ్ చేయాలంటే డైట్‌సెట్ ప్రవేశ పరీక్ష రాయాలి. దానికి హాజరయ్యే అభ్యర్థులు ఏయే అంశాలను చెయ్యాలన్న దానిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) ఉద్యోగాలకు కేవలం డీఎడ్ వాళ్లనే భర్తీ చేస్తుండటం దీనికి ప్రధాన కారణం.

ఇటీవల డైట్ కళాశాలలు విస్తృతంగా.. జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు. త్వరలో డైట్‌సెట్ ప్రకటన వెలువడుతుంది.

డైట్‌సెట్ ప్రవేశ పరీక్ష గత పరీక్షల దృష్ట్యా 100 మార్కులకుంటుంది.

పరీక్షా విధానం	మార్కులు
జనరల్ నాలెడ్జ్, వర్తమాన వ్యవహారాలు (కరెంట్ అఫైర్స్)	05
బోధనా అభిరుచి (టీచింగ్ ఆప్టిట్యూడ్)	05
జనరల్ ఇంగ్లీషు	10
తెలుగు	20
గణితం	20
సామాన్య శాస్త్రం (సైన్స్)	20
సాంఘిక శాస్త్రం (సోషల్)	20
మొత్తం	100

డైట్‌సెట్ ప్రధాన విభాగాల్లో తెలుగు ఒకటి. ఇరవై మార్కులకుగాను 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. పాఠ్యాంశాల్లో భాగంగా సాహిత్యాంశాలతో పాటు వ్యాకరణాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

కవి పరిచయం, జీవిత, రచనా విశేషాలు, ప్రక్రియా పరిజ్ఞానం, కాలవిశేషాలు, బిరుదులు, ఆస్థాన విశేషాలు, కవితా నైపుణ్యం, విమర్శ, కవులు పేర్కొన్న ప్రధాన ఉట్టంకింపులు, అంకిత విశేషాలు, రచనా విశేషాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వ్యాకరణంలో భాగంగా వర్ణసమామ్నాయం, అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి-వికృతులు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు, వాక్యవిజ్ఞానం, విభక్తులు, ఔపవిభక్తులు, క్రియావిభక్తులు, సకర్మక, అకర్మక, సమాపక, అసమాపక క్రియా వివేకం, అర్థవిపరిణామం, పురుష భేదాలు, నామ్నీకరణం, ఆఖ్యాన భేదాలు - నామాఖ్యానం, క్రియాఖ్యానం, వచన భేదాలు, మాండలిక విజ్ఞానం మొదలైన అంశాలపై ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేస్తే విజయం వరిస్తుంది.

తెలుగు సాహిత్యంలో ప్రధానంగా ఇతిహాస కవిత, వర్ణన, ప్రబంధ కవిత, ఆధునిక పద్యం, గేయకవిత, అనువాద కవిత, ఆధునిక పద్యకవిత, వచన కవిత, కథానిక, గల్పిక, కల్పనావ్యాసం, వార్తావ్యాఖ్య, పీఠిక, హాస్యరస ప్రధానమైన వ్యాసం, ఆత్మ కథ, సాహిత్య విమర్శా వ్యాసం, జీవిత చరిత్ర, మొదలగు ప్రక్రియల గురించి పాఠ్యాంశాల్లో భాగంగా ప్రత్యేక అధ్యయనం చేయాలి.

ఇతిహాసం

'ఇతి హా అస్మిన అస్తీతి ఇతిహాసః' అన్నది ఇతిహాస పదానికి వ్యుత్పత్తి. తొల్లిటి కథలే ఇతిహాసం. రామాయణ, భారతాలు ఇతిహాసాలు. ఇవి గ్రంథస్థం కాక పూర్వం ఆశు రూపంలో ఉండేవి. కథాకథనానికి ఇతిహాసంలో ప్రాధాన్యత ఎక్కువ. పదో తరగతిలో 'మాతృవేదన' నన్నయ పాఠ్యభాగం ఇతిహాస కవితకు సంబంధించింది. మాతృవేదన పాఠ్యభాగం ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం అష్టమాశ్వాసంలోనిది.

వర్ణన

ఎర్రన జడివాన పాఠ్యభాగం 'వర్ణన'కు సంబంధించింది. ఆయన రచన భావస్ఫోరకమైంది. హరివంశంలో పల్లె జీవనాన్ని మనోహరంగా వర్ణించాడు. వీరి వర్ణనలు తరువాత ప్రబంధ కవులకు ఆదర్శమయ్యాయి. సమాన కథాభాగాల్లో ఎర్రన రచనను ఆంధ్రమహాభాగవతంలో పోతన అనుసరించాడు.

ప్రబంధం

ప్రకృష్టమైన పదబంధం కలిగింది ప్రబంధం. 16వ శతాబ్దమైన రాయలయుగం ప్రబంధానికి స్వర్ణయుగం. పురాణేతిహాసాల నుంచి చిన్న కథను తీసుకుని వర్ణనలతో పెంచి స్వతంత్ర కావ్యంగా రచిస్తే దాన్ని ప్రబంధం అంటారు.

ఆధునిక పద్యం

తుమ్మల సీతారామమూర్తి 'సందేశం' పాఠ్యభాగం 'ఆధునిక పద్య రచన. తుమ్మల మహాత్ముని 'ఆత్మకథ'ను తెలుగులో పద్యకావ్యంగా అనువదించారు. సందేశం

పాఠ్యభాగం తుమ్మల మహాత్మ కథ లోనిదే.

గేయకవిత

పాడుకోవటానికి వీలైంది గేయకవిత. పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన గేయకావ్యం 'మేఘదూతం' నుంచి గ్రహించిన 'ఓరుగల్లు' పాఠ్యభాగం దీనికి ఉదాహరణ.

అనువాద కవిత

భావం చెడకుండా భాషలోని భావాన్ని లక్ష్య భాషలోకి మార్చడం అనువాదం. అనువాదం అనేది సృజనాత్మక కళావ్యాసంగం. ఆసియాలోనే తొలి నోబెల్ బహుమతి ఠాగూర్ 'గీతాంజలి'కి లభించింది. ఠాగూర్ గీతాంజలిని చలం తెలుగులోకి అనువదించారు.

ఆధునిక పద్య కవిత

దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'అమృతాభిషేకం' నుంచి తీసుకున్న 'తామసి' ఆధునిక పద్యకవితకే సంబంధించింది.

వచన కవిత

వాడుక భాషలో రాసేది వచన కవిత. మహెజబీన్ 1997లో రచించిన 'ఆకురాలు కాలం' నుంచి సేకరించిన 'స్ట్రీట్‌చిల్డ్రన్' వచన కవితకు చెందింది.

కథానిక

వ్యక్తి జీవితంలోని ఒక ముఖ్య సన్నివేశం, సంఘటనల మధ్య సంబంధాన్నీ కళాత్మకంగా చిత్రిస్తుంది కథానిక. ఇది వచన ప్రక్రియ. కథానిక ప్రక్రియ ముఖ్య లక్షణం క్లుప్తత. కథానిక రచనలో పాత్రలూ, నేపథ్యం, కథనం, జీవిత వాస్తవిక చిత్రణ ప్రధాన భాగాలు. చాగంటి సోమయాజులు రచించిన 'బొండుమల్లెలు' కథానిక ప్రక్రియకు చెందింది. కథానిక ప్రక్రియకు ఆ పేరు పెట్టినవాడు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి.

గల్పిక

పరిమాణంలో కథానిక కంటే గల్పిక చిన్నది. గల్పికలో విమర్శ కీలకం. ఒక వ్యక్తి అనుభవంలోని ఒక దశ కాని, ఒక సంస్థ పరిణామ క్రమంలోని ఒక విశేషంగాని గల్పికలో వస్తువు. 'కథానిక' కంటే గల్పికలో 'సంఘటన'కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. గల్పికల్లో అనుభూతి చిత్రణ కంటే అనుభవ ప్రకటనకు, భావదృష్టికి రచయితలు ప్రాముఖ్యతను ఇస్తారు. వ్యక్తిని, వ్యవస్థను గాని విమర్శించడం గల్పికలో సాధారణం. విమర్శ హేళన, వ్యంగ్యం ద్వారా సాధిస్తారు. కొడవటిగంటి కుటుంబరావు 'అంపకాలు' పాఠ్యభాగం 'గల్పిక' ప్రక్రియే!

వైజ్ఞానిక కల్పనా వ్యాసం

విజ్ఞాన శాస్త్ర సంబంధ అంశాలను వ్యక్తం చేసేది వైజ్ఞానిక కల్పనా వ్యాసం. 'రిచీకాల్డర్' రచించిన అయ్యగారి వీరభద్రరావు 'రిప్‌వాన్‌వింకిల్' పేరుతో వైజ్ఞానిక కల్పనా వ్యాసం రాశారు.

వార్తావ్యాఖ్య

ప్రపంచంలోనూ, దేశంలోనూ నిత్యం జరుగుతూ ఉన్న సంఘటనలపై పత్రికలు వ్యాఖ్యానిస్తూ ఉంటాయి. సంపాదకులు, ప్రత్యేక వ్యాసకర్తలు సహజంగా ఈ వార్తావ్యాఖ్యలు చేస్తుంటారు. ఇవి తత్కాలానికి సంబంధించినవే అయినా ఒక్కో సందర్భంలో విభిన్న కాలాలకు వర్తిస్తుంటాయి. గోరాశాస్త్రి రచించిన 'చేనేత దృక్పథం' వార్తావ్యాఖ్యకి ఉదాహరణ.

పీఠిక

గ్రంథాన్ని, గ్రంథ నేపథ్యాన్ని పరిచయం చేస్తూ రచయిత గానీ, మరొకరు గానీ రాసే పరిచయ వాక్యాలు పీఠిక. దీనికి ముందుమాట, ప్రస్తావన, తొలిపలుకు, ఆముఖం, మున్నుడి మొదలైన పేర్లున్నాయి. 1932లో ప్రచురితమైన 'వదరుబోతు'కు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పీఠిక రాశారు.

హాస్యరస ప్రధాన వ్యాసం

హాస్యం ప్రధాన నేపథ్యంగా రాసే వ్యాసం ఇది. స్థానం నరసింహారావు 'రంగస్థలంపై సమయస్ఫూర్తి' అనే హాస్య ప్రధాన వ్యాసాన్ని రచించారు.

'రేపటి మనిషి భవితవ్యానికి/ ఊపిరి పోసేది బిగి తప్పిన పిరికి కండరాల్లో చేతనా జ్యోతులు పొదవడం - ఉగాది'

– సి.నారాయణరెడ్డి

ఆత్మకథ

తాను రాసుకొన్న తన కథ. ఎవరైనా ఆత్మకథను రాసుకోవచ్చు. అవి సమాజ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రముఖులు తమ జీవితాల గురించి రాసుకున్న విషయాలు సమకాలిక సమాజానికి వ్యాఖ్యానాలుగా ఉపయోగపడి తరువాత తరాల వారికి ఆదర్శంగా నిలుస్తాయి. సంగం లక్ష్మీబాయి 'ఆత్మకథ'లోని భాగమే 'నా విషయం' పాఠ్యభాగం.

సాహిత్య విమర్శా వ్యాసం

వ్యాసం వచన రూపంలో ఉంటుంది. దీనిలో చారిత్రక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక, వైజ్ఞానిక, కళ, భాషా సాహిత్యాది అసంఖ్యాక విషయాల్లో దేని గురించైనా చర్చించవచ్చు. తాపీ ధర్మారావు గారి 'ఊతపదాలు - వ్యర్థ పదాలు' సాహిత్య విమర్శా వ్యాసం భాషా సాహిత్యాలపై విమర్శనాత్మక విశ్లేషణ.

జీవిత చరిత్ర

చారిత్రక రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక, కళా, సామాజికాది రంగాల్లో ప్రముఖ పాత్ర నిర్వహించిన వ్యక్తుల జీవితాలను గురించి తెలిపే రచనలు జీవిత చరిత్రలు. సమకాలిక సామాజిక చరిత్ర కూడా 'జీవిత చరిత్ర'ల్లో ప్రతిబింబిస్తుంది. బోయి విజయభారతి 'బాబాసాహెబ్ అంబేద్కర్' నుంచి గ్రహించిన 'అంబేద్కర్ వ్యక్తిత్వం' 'జీవిత చరిత్ర' ప్రక్రియకు చెందిందే.

ఇలాప్రక్రియా పరిజ్ఞానాన్ని రచయితల రచనా విశేషాలను అనుసంధానం చేసుకొని అధ్యయనం సాగించాలి.

- మనస్విని



ఉపాధ్యాయ ఉద్యోగ ప్రాప్తిరస్తు

ఉపాధ్యాయ ఉద్యోగాలు భారీగా భర్తీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉద్యోగార్థులు సహజంగానే వాటిపై ఆశలు పెంచుకుంటున్నారు. అందుకునేందుకు శ్రమిస్తున్నారు. డీఎస్సీ ద్వారా ప్రతి సంవత్సరం అని చెప్పలేం కానీ, రెండు మూడేళ్లకోసారైనా వేలల్లో నియామకాలు జరుగుతున్నాయి. డీఎస్సీ ప్రకటన కోసం మన రాష్ట్రంలో లక్షల మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల డీఎస్సీ, టెట్ రెండూ కలిపి ఒకే పరీక్షగా ఉంటుందన్న వార్తలు ఊపందుకున్నాయి. ప్రభుత్వం 'టెస్ట్' వ్యవహారంపై తీవ్రంగా కసరత్తు ప్రారంభించింది. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఉపాధ్యాయ నియామకాల విధానం గురించి కూడా మన అధికారులు అధ్యయనం చేస్తున్నారు. 'టెస్ట్' రూపంలో ఎదురవబోనున్న పరీక్ష ఒకే పేపరు ఉంటుందా, రెండు పేపర్లు ఉంటాయా అన్న దానిపై కూడా తీవ్ర కసరత్తు జరుగుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. పాఠ్యాంశాల ఎంపికపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. వీటన్నిటి దృష్ట్యా త్వరలో డీఎస్సీ ప్రకటన వెలువడుతుందన్న వార్తల నేపథ్యంలో తెలుగు పండితునిగా ఎంపిక కావటానికి ముందస్తు ప్రణాళికా వ్యూహంలో భాగంగా అధ్యయనం చేయాలి.

గత డీఎస్సీ పాఠ్యాంశాలపై దృష్టిసారిస్తే గ్రేడ్-2 తెలుగు పండిట్ ఉద్యోగానికి పదో తరగతి స్థాయి, తెలుగు పాఠశాల సహాయక ఉద్యోగానికి ఇంటర్మీడియట్ స్థాయి పాఠ్యాంశాలు అంటూ ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించారు. దగ్గరదగ్గర రెండు ఉద్యోగాలకూ పాఠ్యాంశం ఒకటిగానే కనిపిస్తుంది. ఇవే పాఠ్యాంశాలు ఆదర్శ పాఠశాలలకు సంబంధించి టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్), పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్)కూ ఉన్నా పరీక్ష స్థాయిలో తేడా కన్పిస్తుంది. వీటన్నింటి దృష్ట్యా ఇప్పటి నుంచే అభ్యసనంపై ప్రత్యేక దృష్టి సారించి ఏయే అంశాలను ప్రత్యేక కోణంలో అధ్యయనం చేయాలో విశ్లేషించుకోవాలి.

పాఠ్యాంశాల ఎంపిక మారినా, గత సిలబస్ యథాతథంగా కొనసాగినా దాదాపు అన్ని అంశాలూ అవే ఉంటాయి. ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంలో భాగంగా కవులు, రచయితలు, కావ్యాలు, రచనలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ప్రాచీన, ఆధునిక కవిత్వ నేపథ్యంలో భాగంగా ఇతిహాసం, పురాణం, ప్రబంధం, శతకం, నవల, కథ, కథానిక, గల్పిక, సంపాదకీయం, వార్తావ్యాఖ్య, లేఖ, వ్యాసం, పీఠిక, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, విమర్శ, నాటకం, మొదలైన ప్రక్రియపై లోతైన అభ్యసనం కొనసాగించాలి.

ఆధునిక సాహిత్యం- ధోరణులు, ఉద్యమాల్లో భాగంగా భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, మైనార్టీ కవిత్వం, అనుభూతి కవిత్వం, ప్రాంతీయ అస్తిత్వ వాద కవిత్వం అంశాలూ చదవాలి. జానపద సాహిత్యంపై చక్కని పట్టు సాధించాలి.

తెలుగు భాషా సాహిత్యాలపై ఇతర భాషా సాహిత్యాల ప్రభావంలో భాగంగా మన భాషపై అనేక భాషల ప్రభావం కనిపిస్తుంది. ప్రధానంగా సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ, పారశీకం, ఒరియా, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠి మొదలైన భాషా పదాలు తెలుగులో ప్రవేశించి చెలామణి అవుతున్న రూపాలను ఏయే భాషలకు చెందినవో అధ్యయనం చేయాలి.

భాషా శాస్త్రంలో భాగంగా భాషా రూపాలైన శాసనభాష, గ్రాంథిక భాష, వ్యవహారిక భాష, మాండలిక భాష, ఆధునిక ప్రామాణిక భాష, ప్రసార మాధ్యమాల భాషల్లో చోటు చేసుకున్న పరిణామాలు చారిత్రక దృష్టితో అధ్యయనం చేయాలి.

సాహిత్య విమర్శలో భాగంగా 'కవి' అంటే ఎవరు? కావ్యానికి ప్రాచ్యుల, పాశ్చాత్యుల నిర్వచనాలు, కావ్య ప్రయోజనం, శైలి, అలంకారాలను దృష్టిలో పెట్టుకుని అలంకార శాస్త్ర అంశాలను, విమర్శలో భాగంగా అధ్యయనం చేయాలి.

భాష, వ్యాకరణాంశాల్లో భాగంగా ఉచ్చారణ - ధ్వని - ధ్వన్యుత్పత్తి స్థానాలు - పదం, ప్రాతిపదిక, ప్రత్యయం, భాషాభాగాలు - పదం - అర్థాలు - నానార్థాలు - పర్యాయపదాలు - వ్యుత్పత్త్యర్థాలు - పదం - పరిణామం - ప్రకృతి వికృతులు - అర్థపరిణామం - పదభేదాలైన తత్సమం, తద్భవం, దేశ్యం, గ్రామ్యం, అన్యదేశ్యం సంబంధించి ఆయా రూపాలను విశ్లేషించాలి. వాక్య విజ్ఞానంలో భాగంగా వాక్య భేదాలైన సామాన్య, సంక్లిష్ట, సంయుక్త వాక్యాలు, వాక్య

నిర్మాణ భేదాలు అధ్యయనం చేయాలి. సంధులు, సమాసాలు, ఛందస్సుతో పాటు బాల, ప్రౌఢ వ్యాకరణాల్లో భాగంగా పారిభాషిక పదాలను ప్రత్యేక దృష్టితో అధ్యయనం కొనసాగించాలి.

భాష - సమాజం - సంస్కృతి పరస్పర ప్రభావం, అనువాదం - ఆవశ్యకత - రీతులు, పఠనావగాహనంపై నిర్దిష్టమైన అవగాహన పెంపొందించుకోవాలి. పై అంశాలను దృష్టిలో ఉంచుకొని మనం ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు, భాషాశాస్త్రం, అలంకార శాస్త్రం, సాహిత్య విమర్శ, వ్యాకరణాంశాలు, ఆదాన ప్రదానాలు, అనువాదం, పఠనావగాహన అనే అంశాలతోపాటు ఇంటర్మీడియట్ స్థాయి పాఠ్యాంశాలను క్షుణ్ణ అధ్యయనం చేయాలి.

ప్రాచీన సాహిత్యం – కవులు – రచయితలు – కావ్యాలు – రచనలు – ప్రక్రియలు

తెలుగు భాషకు శాసనాలు 6వ శతాబ్దం నుంచి, సాహిత్యం 11వ శతాబ్దం నుంచి ప్రారంభమైంది. తొలి తెలుగు పదం 'నాగబు' అని అమరావతీ స్థూపం రాతి పలకలపై 'బ్రాహ్మీ' లిపిలో కనిపించింది. 'నాగబు' అనేది తొలి తెలుగు పదమని వేటూరి ప్రభాకరశాస్త్రి తెలియజేశారు.

- తొలి తెలుగు శాసనం ధనుంజయుని కళమళ్ల శాసనం (క్రీ.శ. 575)
- తొలి గద్య శాసనం రేనాటి చోళరాజు 'ఎరికల్ ముత్తురాజు' ఎర్రగుడిపాడు శాసనం (క్రీ.శ. 575)
- తొలి పద్యశాసనం పండరంగని అద్దంకి శాసనం (క్రీ.శ. 848)

ఆయా శాసనాలు – లభిస్తున్న పద్యం

- పండరంగని అద్దంకి శాసనం - తరువోజ (లభించిన తొలి తెలుగు పద్యం, ద్విపదకు రెట్టింపు)
- సాతులూరు శాసనం - చంపకమాల
- విరియాల కామసాని గూడూరు శాసనం - 3 చంపకమాలలు, 2 ఉత్పలమాలలు
- కందుకూరు, ధర్మవరం శాసనాలు - సీసం
- యుద్ధమల్లుని బెజవాడ శాసనం - మధ్యాక్కర
- బాదకమహారాజు ఆరుంబాక శాసనం - కందం

ఇలా ప్రాఙ్నన్నయ యుగంలో భాగంగా భాష సాహిత్యాలను క్షుణ్ణ పఠనం చేయాలి. ప్రాచీన సాహిత్యంలో భాగంగా యుగ విభజన కవుల పరంగా, ప్రక్రియా పరంగా రాజవంశాల ఆధారంగా కూడా ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి. ఆయా యుగాలకు ఏ ప్రక్రియ

కవిపరంగా యుగ విభజన	ప్రక్రియా వివేకం
1. నన్నయ	ఇతిహాస యుగం
2. తిక్కన	ఇతిహాస యుగం
3. ఎర్రన	పురాణ యుగం
4. శ్రీనాథుడు	కావ్యయుగం
5. శ్రీకృష్ణదేవరాయలు	ప్రబంధం
6. దక్షిణాంధ్రయుగం	యక్షగానం

ప్రధానంగా భాసించింది అన్న దృష్టితో కూడా అధ్యయనం చేయాలి.

ఆ ప్రక్రియా వికాసంలో భాగంగా కవులు - రచనలు - పాత్రలు - స్వభావాన్నీ అధ్యయనం చేయాలి. ప్రక్రియా లక్షణాలు చాలా కీలకం అని అభ్యర్థులు గమనించాలి.

కవులు వారి రచనలే కాకుండా వారిని గురించి విమర్శ ప్రధానంగా చదవాలి. విమర్శ పరమైన ప్రశ్నలే ఎక్కువగా నిపుణులు సంధిస్తున్నారు. ఉదాహరణకు విశ్వనాథ ప్రాచీన కవులను గురించి ఇలా పేర్కొన్నారు.

- ఋషి వంటి నన్నయ రెండవ వాల్మీకి — విశ్వనాథ
- తిక్కన శిల్పంపు తెనుగుతోట — విశ్వనాథ
- ఎర్రన సర్వమార్గేచ్ఛా విధాత్రుండు — విశ్వనాథ
- ఒకడు నాచన సోమన ఉక్కి ఉండు — విశ్వనాథ
- శ్రీనాథుడు రసప్రసిద్ధ ధారాధుని — విశ్వనాథ
- పోతన్న తెలుగుల పుణ్యపేటి — విశ్వనాథ

ఇలా ఒక కవిని గురించి విమర్శకులు పేర్కొన్న విశేషాలను అధ్యయనం చేయాలి. అలాగే శ్రీనాథుడు కాశీఖండంలో పూర్వకవుల కవితా విశేషాలను ఈ విధంగా పేర్కొన్నారు.

కవి	కవితా లక్షణం	పేర్కొన్న కవి
నన్నయ	ఉభయవాక్ప్రౌఢి	శ్రీనాథుడు
తిక్కన	రసాభ్యుచిత పదబంధం	శ్రీనాథుడు
ఎర్రన	సూక్తివైచిత్రి	శ్రీనాథుడు

ఈ కోణంలో 2012 డీఎస్సీలో అడిగిన ప్రశ్న విశ్లేషిస్తే...

- **ఉభయవాక్ప్రౌఢి అని శ్రీనాథుడు ప్రశంసించిన కవి (అ)**

అ. తిక్కన **ఆ.** నన్నయ **ఇ.** ఎర్రన **ఈ.** భాస్కరుడు

కవుల మధ్య తారతమ్య విశేషాల్ని కూడా ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేయాలి.

కవి	భారత రచనాపరంగా	ధ్వనికి ప్రాధాన్యం	రచనా విశిష్టత	గుణ ప్రాధాన్యత
నన్నయ	ధాత	వస్తుధ్వని	శబ్దం	ప్రసాదం
తిక్కన	విధాత	రసధ్వని	అర్థం	మాధుర్యం
ఎర్రన	సంధాత	అలంకారం	వర్ణన	ఓజస్సు

- **ఎర్రనలో విశేషంగా కనిపించే లక్షణం? (ఇ)**

అ. శబ్దం **ఆ.** అర్థం **ఇ.** వర్ణన **ఈ.** శబ్దార్థం

- **పురాణయుగం అని ఎవరి యుగానికి పేరు (ఇ)**

అ. తిక్కన **ఆ.**నన్నయ **ఇ.** ఎర్రన **ఈ.** శ్రీనాథుడు

ఈ కోణంలో ప్రశ్నలు అడుగుతున్నందుకు విమర్శ కోణంలోనే అధ్యయనం చేస్తే విజయం సులభతరమవుతుంది. ప్రాచీన కవుల గురించి కవితా లక్షణాలు, విమర్శకులు అనేక కోణాల్లో విమర్శా గ్రంథాలు రచించారు. విమర్శకులు ఏ కోణంలో విమర్శించారు అనే దానిపై ప్రత్యేక దృష్టితో అభ్యసనం కొనసాగించాలి.

- మనూష

వాడేవీడూ నాడూనేడూ!

ఆ రచనల్లో ఉత్కంఠ పతాకస్థాయికి చేరేకొద్దీ... ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గతితప్పుతాయి. రోమాలు నిక్కబొడుచుకుంటాయి. అక్షరాల వెంట కళ్లు కళ్లెం లేకుండా పరిగెడుతుంటాయి. ఊహాతీతమైన మలుపులతో సాగే కథనంలో 'తర్వాత ఏంటో' తెలుసుకోవడానికి మది తొందరపెడుతుంటుంది.. చదవడం మొత్తం పూర్తయ్యేసరికి పాఠకుడి మోము సంభ్రమాశ్చర్యాల చందమామ అవుతుంది. అపరాధ పరిశోధక నవలల ప్రత్యేకతే ఇది. అచ్చతెలుగులో అలాంటి నవలా ప్రక్రియకు ఆద్యులు...దేవరాజు వెంకట కృష్ణారావు పంతులు.

ఈ ప్రపంచం ఎవరికైనా రుణపడి ఉందంటే కచ్చితంగా అపరాధ పరిశోధక నవలా రచయితలకే. సాధారణ దృష్టికి కొత్తకోణాన్నిచ్చి, లోకాన్ని ఇంకోలా చూసే అలవాటు చేశారు వారు. కథలంటే 'అనగనగా ఒక రాజు' అని వినీవినీ, చదివి చదివి మొహమ్మొత్తినప్పుడు 'సరిగ్గా ఇరవై నాలుగ్గంటల్లో ఇరవై ఆరో హత్య చేయబోతున్నా'మంటూ ఊడిపడ్డ ప్రతి నాయకుడి హెచ్చరికలకు పాఠకుడి ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఎత్తుకు పై ఎత్తులతో ప్రతినాయకుడి పరివారాన్ని చిత్తు చేసే కథానాయకులు చదువరులకు ఆరాధ్యులై పోతారు. మొదటి తరం నవలా నాయకుడు అరిందమ్ కావచ్చు, మొన్నటి యుగంధర్ కావచ్చు, నిన్నటి షాడో కావచ్చు... శతాబ్ద కాలంగా కథానాయకులు మారుతూ వస్తున్నా వారికి ఆదరణ మాత్రం తగ్గట్లేదు.

నిజానికి మొదట్లో మనకు అపరాధ పరిశోధక నవలలు విదేశాలనుంచి 'దిగుమతి' అయ్యేవి. ఆ వాతావరణం తెలుగుకు సంబంధం లేకుండా ఉండి మనది కాదన్న భావనను రేకెత్తించేది. అలాంటి సమయంలో తెలుగులో వచ్చిన తొలి అపరాధ పరిశోధక నవల 'వాడేవీడు'. 1912లో దేవరాజు వెంకట కృష్ణారావు పంతులు రాసిన ఈ నవల అప్పట్లో పెనుసంచలనం. ఆ పేరే ఎన్నో చర్చోపచర్చలకు దారి తీసింది. ఎంతగా అంటే 'ఆ పని చేసింది వాడే, ఈ పని చేసింది వీడే - వాడేవీడు, వీడేవాడు' అంటూ సామాన్య పాఠక జనం చమత్కరిస్తూ, ఛలోక్తులు విసురుకునేవారట ఆ రోజుల్లో. 'ఏమిటీ వాడేవీడు చదవలేదా, వెంటనే పరుగెత్తుకెళ్లి కొని, చదువు' అని కూడా అనుకునేవారట. నూరేళ్ల కిందటి మాట కదా, గ్రాంథికంలోనే గ్రంథాలొచ్చే సమయంలో వ్యవహారికంగా ఉండే నవల పేరు ఇదే. ఒక తరం పాఠకులను ఉర్రూతలూపేసింది ఈ నవల. ఈ తుపాను ఏకంగా మహాకవి శ్రీశ్రీని కూడా కుదిపేసింది. 1948, నవంబరు 'తెలుగు స్వతంత్ర' పత్రికలో శ్రీశ్రీ 'వాడేవీడు' అనే వ్యాసం రాశారు. అందులో 'వాడేవీడు స్ఫూర్తితో నేనూ ఒక అపరాధ పరిశోధన నవల రాశా. అయితే, దాన్ని వెలుగులోకి తెచ్చే సాహసం చేయలేదు. రవీంద్రుడి 'గీతాంజలి' కన్నా వాడేవీడు నవలే నాకు బాగా నచ్చింది' అన్నారు శ్రీశ్రీ. ఆ నవల ఎంత పాఠకాదరణ చూరగొన్నదో చెప్పటానికి ఈ ఉదంతమొక్కటి చాలు.

సాహితీ కుటుంబం నుంచి...

సంగమవలస జమీందారు వద్ద దివాన్‌గా ఉండే వెంకటరావు కుమారుడు కృష్ణారావు. వెంకటరావు పంచభాషా నిఘంటుకర్త (తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ) నిరంతరం అక్షర సేద్యం సాగే కుటుంబంలో సెప్టెంబరు 23, 1886న కృష్ణారావు జన్మించారు. బాల్యం నుంచే ఆయనకు బహుభాషా పుస్తక పఠనం, సాహిత్యంలో సరికొత్త పోకడలు

అలవాటయ్యాయి. ప్రముఖుల సాంగత్యం, సహజంగానే వంశానుగతంగా వచ్చిన విషయ విశ్లేషణ, ఒక విషయాన్ని అనేక కోణాల్లోంచి పరిశీలించడం, ఇవన్నీ రచనా వ్యాసంగం వైపు నడిపించాయి కృష్ణారావుని. ఆ తర్వాత బరంపురంలో రైల్వే ఉద్యోగం రావటం, గాదెవారి అమ్మాయి రత్తమ్మతో పెళ్లి, అల్లుడి ఆసక్తిని గమనించి మామగారొక ముద్రణాలయాన్ని ఏర్పాటు చేయటం చకచకా జరిగాయి. ఇవన్నీ కూడా కృష్ణారావుని సాహిత్యానికి మరింత చేరువ చేశాయి. 'వేగుచుక్క ముద్రణాలయం', తాపీ ధర్మారావు సహకారంతో కృష్ణారావు అపురూపమైన సాహితీ సేవ చేశారు. 1911లో వేగుచుక్క గ్రంథమాల వెలువడింది. 1912లో వాడేవీడు నవలా సృష్టి జరిగింది. వేగుచుక్క ముద్రణాలయం కింద పుస్తకాల ప్రచురణతో పాటు... వేగుచుక్క కథావళి,

విశాలాంధ్రవాణి అనే మాస, వారపత్రికలను కూడా ప్రచురించే వారు కృష్ణారావు. ఎనిమిది పదుల వయసులో సాహితీలోకం నుంచి అంతిమ వీడ్కోలు తీసుకున్నారు.

బెంగాలీలో పాంచ్‌కడీ దేవ్ రాసిన అపరాధ పరిశోధన సాహిత్యాన్ని చదివాక, తానూ తెలుగులో ఈ తరహా నవలలు రాయాలనిపించిందట కృష్ణారావుకు. ఆ తర్వాత తనదైన శైలిలో 'వాడేవీడు'ను సృజించారు. అంత వరకూ ఉన్న సంప్రదాయ పాఠకులను తనవైపు తిప్పుకున్నారు. తెలుగులోనూ అపరాధ పరిశోధక నవలలు రాయగలిగిన సత్తాగల రచయితలున్నారని విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు.

ఇదీ కథ

'వాడేవీడు' కథానాయకుడు అరీందమ్. అపరాధ పరిశోధకుడు, సాహసవంతుడు, సునిశిత బుద్ధి. గొప్ప గ్రాహ్యశక్తి ఉన్నవాడు. అతని అనుచరుడు యోగీంద్రనాథ్. ఒక తెల్లవారుజామున యోగీంద్రనాథ్, అరీందమ్ ఇంటికి హడావుడిగా వచ్చి, వెంటనే ఠాణాకు రమ్మంటాడు. 'ఎందుకు?' అని ప్రశ్నించకుండా, అరీందమ్ బయల్దేరతాడు. అక్కడ ఒక పెద్ద కర్రపెట్టె ఉంటుంది. తాళం తీయమంటాడు అరీందమ్. తాళం తీసి పెట్టె తెరుస్తాడు యోగీంద్రనాథ్. అంతా తుళ్లిపడతారు. అవాక్కవుతారు. పెట్టెలో ఒక యువతి శవం. అంతా రక్తసిక్తం. అందులో ఒక విరిగిన చేతికర్ర. చిరిగిన దుస్తులు. రక్తంతో తడిసిన ఒక లేఖ. దాన్ని చదివి వినిపిస్తాడు యోగీంద్రనాథ్. "ప్రస్తుతానికి పాతిక వరకూ హత్యలు చేశాను. దీని తర్వాత అరీందమ్‌నీ హత్య చేస్తాను. నా టార్గెట్ నువ్వే" అని ఉంటుంది అందులో. "అనుకున్న హత్యలు ఇంకా పూర్తి చేయలేదు. కేవలం పాతికే చేశాను. ఈ లోగా నిన్ను లేపేయాలి" అని కూడా చెబుతాడు ప్రతినాయకుడు. చివరికి అరిందమ్ తన తెలివితేటలతో ఆ హంతకుడిని పట్టుకుంటాడు. 'ఫలానా హత్య చేసిన వాడే - వీడు' అంటూ హతుల వివరాలు చెప్తాడు. ప్రతినాయకుడు తన నేరాన్ని తానే అంగీకరిస్తాడు. 242 పేజీలున్న ఈ నవలలో ప్రతి సంఘటనా పాఠకులకు సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తుంది. కుట్రల్లో చిక్కి, సాహసోపేతంగా ముందడుగు వేసిన యువతుల జీవితం, హంతకుడి విశృంఖలత - కాషాయం, భక్తి భజనల వెనుకనుండే మేకవన్నె పులుల ప్రవర్తన... అన్నింటినీ అద్భుతంగా రక్తికట్టించారు రచయిత. నూటొక్క ఏళ్ల కిందట వచ్చిన ఈ తొలి అపరాధ పరిశోధక నవల ఇవాళ చదివినా... సినిమా చూస్తున్న అనుభూతే కలుగుతుంది.

జాతిపిత ప్రశంసలు

'వాడేవీడు'తో ఓ సాహితీ ప్రక్రియకు ఆద్యుడై, అజరామర కీర్తి శిఖరాలకు చేరిన కృష్ణారావు... ఆ తర్వాత 'నేనే', 'కాలూరాయి' నవలలను రాశారు. వీటి కథాంశాలూ అపరాధ పరిశోధనలే. మహాభారత అంతర్గత ముఖ్యవిషయాలను నేపథ్యంగా తీసుకుని 1933లో కృష్ణారావు... 'సంజయ రాయబారం', 'శ్రీకృష్ణ రాయబారం' గ్రంథాలను రచించారు. ఈ రెండూ తెలుగు పాఠకులను విశేషంగా అలరించాయి. అంతేకాదు.. వీటిని ఇంటర్మీడియట్, బీఏ తెలుగు పాఠ్యాంశాలుగా విశ్వవిద్యాలయాలు నిర్ణయించాయి. భాషాభిమానులు ఈ గ్రంథాలను పదేపదే చదివి ఆనందించేవారు. ఈ సందర్భంలోనే మహాత్మాగాంధీ నుంచి కృష్ణారావుకు ఒక లేఖ వచ్చింది. 'డియర్ గురూజీ' అని సంబోధిస్తూ జాతిపిత ఆ లేఖ రాశారు. 'మీ సంజయ, శ్రీకృష్ణ రాయబారాల గురించి విన్నాను. అవి మీ మాతృభాషలో ఉన్నాయి. నాకూ వాటిని చదవాలని ఉంది. వాటిని ఆంగ్లంలోకి అనువదించండి. చదివి ఆనందిస్తాను' అని చెప్పారు గాంధీజీ. రచయితకు అంతకుమించిన ప్రశంస ఇంకేముంది!

దేవరాజు రవి
హైదరాబాద్, 91608 96463
(దేవరాజు వెంకట కృష్ణారావు గారి కుమారుడు)

సుమధుర 'కావ్యం'

అ ఆ స్పందన



శుక్లాం బలబలం... ఆశ్చర్యపోకండి! మా శ్రీకావ్య ఏడాదిన్నర పిల్లగా ఉన్నప్పటి పలుకులివి. నన్ను అనుకరిస్తూ ఇలా పాడుతూనే తను మాటల మూట అయింది. తనకు అక్షరాలను నేర్పడానికి 'అక్షరమాల' అనే చార్టును తెచ్చా. దానిలోని ఒక్కో అక్షరాన్ని వేలు పెట్టి చూపిస్తూ చదివించే దాన్ని. తిరిగి అడిగితే ఒక క్రమంలో అక్షరాలను చెప్పలేకపోయేది. అందుకని, తనకు వీలైన రీతిలోనే చెప్పనిచ్చా. ఆ తర్వాత అ.. ఆ... ఇలా అన్నింటినీ ఒక పాటగా మార్చి, దాన్ని నేర్పించా. ఆడుకునేటప్పుడు కూడా ఆ పాటను పాడుకుంటూ ఉండేది కావ్య. దాంతో అక్షరమాల... అకారాది క్రమంలో వచ్చేసింది. కొద్దిరోజులకు... రంగు పెన్సిళ్లతో కార్డుల మీద అక్షరాలు రాసి, తిరిగి తనతో రాయించే దాన్ని. ఆ తర్వాత పుస్తకం ఇచ్చి సొంతంగా రాయమంటే చకచకగా రాసేసేది. ఇలా అక్షరాల మీద పట్టు వచ్చాక తెలుగువాచకం తెచ్చి పదాలను అలవాటు చేశా. బయటకు వెళ్లినప్పుడు దుకాణాల నామఫలకాలను చదివించే దాన్ని. చిన్నగా వేమన పద్యాలనూ అలవాటు చేశా. ఆ తర్వాత అమెరికా వెళ్లాం. పాప ఆరో తరగతిలోకి వచ్చే వరకూ అక్కడే ఉన్నాం. అయితే, అక్కడా ఉన్నా తను తెలుగు మర్చిపోకూడదని... నిత్యం కథలు, పాటలు నేర్పించేదాన్ని. రాత అభ్యాసాలను ఇచ్చేదాన్ని. తిరిగి ఇక్కడకు వచ్చాక మన పురాణాలపై అవగాహన కల్పించా. ఒకరోజు 'ఈనాడు' హాయ్‌బుజ్జీలో బలి చక్రవర్తి కూతురు పేరేంటని అడుగుతూ మూడు ఆధారాలు ఇచ్చారు. ఆ ప్రశ్నను చూసిన వెంటనే మా అమ్మాయి 'ద్వాపరయుగంలో పూతన' అని చెప్పింది. ఎంత ఆనందమేసిందో! నేను నేర్పిన అంశాలను తనెంతగా అర్థం చేసుకుందో నాకు ఆ క్షణంలో తెలిసింది.

- చావలి వేంకట రమాదేవి, సికింద్రాబాద్

మనస్తత్వ, అంతరార్థ కథల సంపుటి 'అమ్మచెట్టు'



మనిషిని, సమాజాన్ని, జీవితాన్ని సత్యదృష్టితో అర్థం చేసుకోవటానికి సత్సాహిత్యం ఉపకరిస్తుందనడానికి ఒక మంచి ఉదాహరణ 'అమ్మచెట్టు'. రచయిత ముప్పిడి ప్రభాకర రావు మొదటి కథా సంపుటి 'లోకం చూశాక' దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 'అమ్మచెట్టు' కథల్ని సంపుటిగా తీసుకువచ్చారు. కథలతో బాటు పాఠకుల్ని తప్పకుండా ఆకర్షించగలిగే రెండు అదనపు బహుమతులు ఈ కథా సంపుటిలో ఉన్నాయి. కథల్ని ఎట్లా చదవాలి? ఎట్లా అర్థంచేసుకోవాలి? అసలు కథలు ఎట్లా రాయాలి? అనే ముఖ్యమైన మూడు ప్రశ్నలకు సంబంధించిన రెండు విలువైన వ్యాసాలు చాలా ముఖ్యమైనవి. 'సత్యం ఒక్కటే' శీర్షికతో రాసిన కథా నేపథ్యం రచయిత వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. 'ఒక సత్యావిష్కరణ ప్రయత్నంలో' శీర్షికతో ఎకె.ప్రభాకర్ కథల్ని పరిశీలించిన తీరు పాఠకులనే కాదు, రచయితలను కూడా ఆకట్టుకుంటుంది.

మనిషితనం పట్లా, మానవ సంబంధాల పట్లా గౌరవంతో పాఠకులకు కాస్తంత ధ్యానమూ, మౌనమూ కలిగేలా రాసిన కథలివి. అమ్మచెట్టు కథ పర్యావరణానికి, మానవ ప్రవృత్తికి మాత్రమే సంబంధించిన కథ కానట్లే, ఈ సంపుటంలోని చాలా కథలు ఒకే విషయానికి సంబంధించినవి కావు. బహుముఖాల కథలివి. తప్పు చేసే మనిషి అల్పత్వాన్ని ఎన్నడూ వేలెత్తి చూపని, ఎన్నడూ దగా చెయ్యని చెట్టు మనిషికి ఏం చెపుతుందో అదే 'అమ్మచెట్టు' కథాంశం. 'అక్షరంఅక్షరం', 'బోదీఆవు', 'స్వరాజ్యం', 'నడిచి వచ్చినదారి' వంటి కథలెన్నో చదవడానికి ఆసక్తి కలిగిస్తాయి. తనలోపలి సృజనను బతికించుకోవటానికి మనిషికి అవసరమైన

రచయిత: ముప్పిడి ప్రభాకరరావు, పుటలు: 160, వెల: 70,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాల్లో

కొత్త ఊపిరిని అందించే ఇలాంటి కథల్ని రాయాలంటే - మనిషిని నిర్మోహమాటంగా అర్థంచేసుకుని క్షమించి, దీవించి మళ్లీ మనిషిని మరమ్మత్తు చేసుకోగలిగిన నైపుణ్యం, నేర్పు, ఓర్పు, ప్రేమ కలిగిన మంచి మనిషికి మాత్రమే సాధ్యపడుతుందని, ఈ కథల్ని చదివితే అర్థమవుతుంది. **- పలమనేరు బాలాజి**

నిజాలకు, కల్పితాలకు నేపథ్యాలివే!

జీవితానుభవాల్లోంచి వచ్చిన కథలు జీవితమంతా సజీవంగా ఉంటాయనడానికి సాక్ష్యం ఈ సంపుటంలోని కథలు. ఇవన్నీ ఎప్పుడో ప్రచురితమైనవే. ఆయా రచయితలకి గొప్ప పేరు సంపాదించి పెట్టినవే. కానీ ఆ కథలకు ఆ రచయితలే రాసిన నేపథ్యాలతో ప్రచురించిన సంకలనమిది. బహుశా ఇది తెలుగులో తొలి ప్రయత్నం. ఈ నేపథ్యాలన్నీ నిజాలే. ఆ నిజాల మీద అల్లిన కల్పితమైన కథలకి సైతం అవే నిజాలు

సంపాదకులు: అర్.ఎం.ఉమామహేశ్వరరావు, జంపాల చౌదరి, వాసిరెడ్డి నవీన్; పుటలు: 390, వెల: 195, ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాల్లో

మూలధాతువులుగా నిలిచి కథలకి ఒక ఆసక్తికరమైన వాస్తవికతను సంతరించి పెట్టాయి. ఈ కథల్లోనూ, వాటి నేపథ్యంలోనూ కొంత సామాన్యత ఎంతో వైవిధ్యత ఉన్నాయి. అన్నీ సాంప్రదాయ శిల్పంలో రాసినవే. ఎక్కడో ఒకటీ, అరా తప్ప. ఆ ఒకటీ, అరాల్లో వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారి కథ 'రానున్న శిశిరం', ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి 'కాలేరా' కథలు వస్తాయి.

భార్య గొప్పదనాన్ని తట్టుకోలేక, ఆమె అస్తిత్వాన్ని లేకుండా చేయడానికి ఓ భర్త తన మేధస్సును ఎలా వాడతాడో - అత్యంత నేర్పుగా బహిరంగపరచే కథ అబ్బూరి ఛాయాదేవి గారి 'సతి'.

ఒక భావజాలాన్ని చాలా మామూలుగా అయినా అత్యంత శక్తిమంతంగా చెప్పగలిగే 'కారా' మాష్టారి 'జీవధార' - 'అసమానతలున్నంత కాలం లేని వాళ్ళ కలవారిని ఇబ్బంది పెట్టక వల్లకాదు... వాళ్ళు గేటు తియ్యరు... వీళ్ళు గేటు వదల్రు". పాఠకుడికి సమస్య స్వరూపం వెంటనే అర్థమైపోతుంది.

శాడిస్టు అధికారి అవహేళనని తట్టుకోలేక, ఆత్మగౌరవం గల ఒకప్పటి మొనగాడు, హతాశుడై పరుగుతో ఇల్లు చేరి ఎలా కుప్పకూలిపోయాడో పెద్దిభొట్ల సుబ్బారామయ్య గారి 'ఏస్ రన్నర్' కథలో చదివితే గుండె ఆర్ద్రమైపోతుంది.

ఆడెపు లక్ష్మీపతి 'ముసల్దాని ముల్లె' తెలంగాణ ప్రాంత నేపథ్యంలో నడుస్తుంది. చదువుకున్న పట్నవాసం మనుషుల దృష్టిలో మానవత్వం పట్ల పరిధులు దాటని అవగాహన, విలువల పట్ల కేవలం భాషాడంబరంతో కూడిన ప్రకటనలకే పరిమితమయ్యే వారి దృష్టి - వీటన్నిటినీ ఒక శస్త్రచికిత్సకారుడిలా కత్తితో కోసి, ఆప్యాయతా, మమతానురాగాల గుండెని బహిర్గతం చేస్తారు రచయిత. ఆ గుండెకాయే 'ముసల్దానిముల్లె'

'భారతదేశంలోని రైతు అప్పుల్లో పుడతాడు. అప్పుల్లో బతుకుతాడు, అప్పుల్లోనే మరణిస్తాడు' అన్న కాల్డార్ నివేదికలోని అంశం చూసి బాధపడి రాయలసీమ నేపథ్యాన్ని హృద్యంగా తన 'నమ్ముకున్న నేల'లో చిత్రించారు కేతు విశ్వనాథరెడ్డి.

ఈ కథలన్నింటికీ మనోవిశ్లేషణ అనే పునాది ఉంది. చదివి అనుభవించిన వారు తెలుసుకోవలసిందే. **- నడిమింటి జగ్గారావు**

గోదావరి బతుకుచిత్రం

తెలుగు ప్రపంచ మహాసభల నేపథ్యంలో రచయిత గజరావు వెంకటేశ్వరరావు సంకలనం చేసిన పుస్తకం 'గోదావరి కలాలు'. ఇరవై రెండు మంది రచయితలు రాసిన కథలను సంపుటిగా తీసురావాలనుకోవడం మంచి ఆలోచన. ఒక్కో కథా ఒక్కో ఆణిముత్యం. కథ చివర్లో రాసిన వాళ్ల పేరు మాత్రమే కాదు వారి సంక్షిప్త పరిచయం ఇవ్వడమూ బాగుంది.

రచయితల శైలి కూడా చక్కగా ఉంది. ఈ కథలన్నీ ఇంతకు ముందు పత్రికల్లో ధారావాహికలుగా ప్రచురితమైనా సంపుటిగా తీసుకు రావడం అభినందనీయం. రచనల్లో ఆంగ్ల పదాల వాడకాన్ని సాధ్యమైనంత వరకూ పక్కన పెట్టి అచ్చ తెలుగు నుడికారాలతో తీర్చిదిద్దారు. అంతేకాదు వాడుకలో లేక మరుగున పడ్డ కొన్ని పదాలు, గోదావరి మాండలికాలు కనిపిస్తాయి. ఈ పుస్తకంలో కేవలం భాషా సౌందర్యమే కాదు భావ సౌందర్యమూ ఉట్టిపడుతుంది. అచ్చతెలుగు పల్లె సంప్రదాయాలూ, అనుబంధాలు పరిమళాలు మనసును తాకుతాయి. చదువుతున్నంత సేపూ నిజజీవితంలో జరిగిన సంఘటనలను రచయిత మనకు చెబుతున్నట్టే ఉంటుంది.

> సంకలనం: గజరావు వెంకటేశ్వరరావు, పుటలు: 160, వెల: 60,
> ప్రతులకు: శ్రీహరి చందన పబ్లికేషన్స్, బైపాస్ రోడ్, రాజమండ్రి

ఉగాది పండుగ నాడు కూడా సెలవు దొరకని ఓ బడుగు ఉద్యోగి వేదనకు అక్షరరూపం 'ఒకానొక ఉగాది' కథ. నిత్యజీవితంలో సాధారణమనుకునే సమస్యలే నిజానికి ఆవేదనాభరితాలనే విషయం ఈ కథతో అర్థమవుతుంది.

'వందనోటు'లో రెక్కాడితేగానీ డొక్కాడని జీవితాలు, వాళ్ల మధ్య ఉండే ఆప్యాయతలూ, త్యాగాలూ.. 'కొమ్మ దాసరి' కథలో సంప్రదాయ పండుగల సందర్భంగా కనిపించే సంచార జాతులు.. 'తాత ముత్తాతల ఊరు'లో కనీస సౌకర్యాలు లేక మన్యం ప్రజలు పడే అవస్థలు.. ఇలా ఒక్కటి కాదు ఎన్నో విషయాలు తారసపడతాయి. తూర్పుగోదావరి జిల్లా వాస్తవ పరిస్థితులు ఈ కథల్లో కళ్లకు కడతాయి. అక్కడి ప్రజల నిత్యజీవిత అనుభవాలు పాఠకులకు తారసపడతాయి. కథలు ఎక్కువగా ఉన్నా తక్కువ నిడివితో.. తక్కువ పేజీలు ఉండటం వల్ల చదవడానికి సమయం కూడా ఎక్కువ తీసుకోవు. కొన్ని కథలైతే కవితాత్మకంగా కూడా చదువరులను ఆకర్షిస్తాయి. అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటుందీ సంకలనం..

- పద్మ వడ్డె

తెర వెనక పరిజ్ఞానం



సినిమా రెండున్నర గంటల వినోద సాధనమే అయినా... దాని వెనక ఎంతో కృషి ఉంటుంది. 24 విభాగాలు కలిసి సమష్టిగా పనిచేస్తేనే ఓ సినిమా ఆవిష్కృతమవుతుంది. రంగుల లోకంపై ఆసక్తి చూపే ప్రతి ఒక్కరూ తెరవెనక విశేషాలు తెలుసుకోవడం అవసరం. అప్పుడే సరైన ఫలితం దక్కుతుంది. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే రచయిత నాగేంద్రకుమార్ వేపూరి అమూల్యమైన రచనలు చేశారు. అద్భుత సినీరంగం (విశ్లేషణ, విజ్ఞాన గ్రంథం), సినిమా నిర్మాణం (అవగాహనా గ్రంథం), సినిమా స్క్రిప్ట్ (రచనా కళ), సినిమా దర్శకత్వం (ప్రాథమిక సూత్రాలు) - మొత్తం నాలుగు పుస్తకాల్ని రచించారు. సినిమా రంగంలోకి అడుగుపెట్టేవాళ్లకు ఇవి ఎంతో పరిజ్ఞానాన్ని ఇస్తాయి.

నాటికీ, నేటికీ తెలుగు సినీ రంగంలో కనిపిస్తున్న మార్పులతో మొదలుపెట్టి... చిన్న నిర్మాతల సమస్యలు-పరిష్కార సూత్రాలు, సినిమా నిర్మాణం- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు, సెన్సార్ విధానం, ఔత్సాహికులకు జాతీయ సినిమా అభివృద్ధి సంస్థ (ఎన్.ఎఫ్.డి.సి) అవకాశాలు- తెలుగు సినిమా రంగంపై వివక్ష, సినీ వీక్షణలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు... ఇలా ఎన్నో విషయాల్ని 'అద్భుత సినీ రంగం'లో పొందుపరిచారు రచయిత.

సినిమా పూర్వ నిర్మాణపనులు, నిర్మాణం, నిర్మాణానంతర

> రచయిత: నాగేంద్రకుమార్ వేపూరి, పుటలు: 162, వెల: 150
> ప్రతులకు: విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు

పనులు... ఈ మూడు దశల్లో ప్రస్తావిస్తూ/ నిర్మాత హక్కులు, నిర్మాతల మండలి మార్గదర్శకాలు, లొకేషన్ల అనుమతులు... లాంటి విషయాల్ని 'సినిమా నిర్మాణం'లో ప్రస్తావించారు. సినిమాకి అనుగుణంగా కథను ఎలా మలచుకోవాలి? స్టోరీ బోర్డ్ అంటే ఏంటి? కథ చౌర్యం కాకుండా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? కథను ఎక్కడ నమోదు చేయించాలి? తదితర విషయాల్ని 'సినిమా స్క్రిప్ట్' గ్రంథంలో చక్కగా పొందుపరిచారు రచయిత.

నటన తర్వాత ఎక్కువమంది ఆసక్తి చూపే విభాగం దర్శకత్వమే. అసలు దర్శకుడికి ఏయే విషయాలు తెలియాలో ఈ పుస్తకంలో వివరించారు. ఎంతో లోతుగా పరిశీలించి, పరిశోధించి ఈ పుస్తకాల్ని రచించారు నాగేంద్రకుమార్ వేపూరి. దర్శకుడిగా, నిర్మాతగా అనుభవం ఉండటంతో నాగేంద్రకుమార్ సినిమాకి సంబంధించిన ప్రతి విషయాన్నీ లోతుగా చర్చించి సమాచారం అందించే ప్రయత్నం చేశారు. సినిమా రంగంలోకి అడుగుపెట్టాలను కొనే వారికే కాకుండా, పరిశోధనా విద్యార్థులకు ఈ గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- నర్సిమ్

కొండ అద్దమందు...



'చందనపు బొమ్మ'లాంటి కథలు

రచయిత: అరుణ పప్పు, పుటలు: 104, వెల: 120, ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాల్లో

అరుణ పప్పు రాసిన పది కథలతో వెలువడిన సంకలనం 'చందనపు బొమ్మ'. గణితంలో పట్టభద్రురాలైనా సాహిత్యమంటే ఇష్టంతో పాత్రికేయ వృత్తిని ఎంచుకున్నారు ఈమె. వృత్తి జీవితంలోని అనుభవాలలో మానవీయ కోణాల్ని ఆవిష్కరిస్తూ తనదైన శైలిలో కథలు రాస్తున్నారు. అలా వివిధ సందర్భాలలో ప్రచురితం అయిన పదికథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. విడాకులని ఎంచుకునే జంటల మనస్తత్వాన్ని మథిస్తూ సాగే 'ఎవరికి తెలియని కథలివిలే', మనిషి లోపలి వెలితిని గుర్తుకు తెచ్చే 'లోపలి ఖాళీలు'... ప్రతి కథా వైవిధ్యమైన వస్తువుతో సాగుతుంది. పాఠకుడిలోని ప్రతి పార్శ్వాన్నీ తాకుతుంది. తప్పక చదవదగ్గ సంకలనమిది.

- కొమ్మూరు సుభద్రాదేవి



ప్రవచనీయం

రచయిత: డా॥ చింతలపూడి వేంకటేశ్వర్లు గుప్త, పుటలు: 618, వెల: 350, ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాల్లో

కవి కలం నుంచి ఒక ఉత్తమ రచన జనించాలన్నా, అందులో రసధారలు జాలువారాలన్నా పురాకృత సుకృతం ఉండి తీరాలంటారు పెద్దలు. అంతటి పుణ్యఫలం "శ్రీవాసవీ పురాణము". ఇది పవిత్ర ప్రశాంత గృహ వాతావరణంలో భక్తులు నిత్యపారాయణం చేసుకొనేందుకు వీలైంది. దేవాలయాల్లో ప్రత్యేకించి వాసవీమాత సన్నిధిలో పురాణ ప్రవచనానికి అనువైంది. అలతిఅలతి పదాలతో తేటతెలుగులో అలరారే ఛందోబద్ధమైన ఈ రచన చదవగానే భక్తి భావ వీచికల్లో మనస్సు తేలియాడుతుంది.

డాక్టర్ చింతలపూడి వెంకటేశ్వర్లు గుప్తా చేయి తిరిగిన కవి. ఆయన కలాన్ని ఛందస్సు అనుసరించింది. అలవోకగా శబ్దార్థాలు గ్రంథం అంతటా గుబాళించాయి. కావ్య లక్షణాలు సంతరించుకున్న పురాణం ఇది. భక్తి సాహిత్యాభిలాషులు చదవదగినది.

- లవళి

తేట (తెలుగు) గీతి-సుందర కాండ

రచయిత: పి.సీతాపతిరావు, పుటలు: 359; వెల: రూ.150 ప్రతులకు: రచయిత, మేఘనా ఎన్‌క్లేవ్, విశాలాక్షినగర్, విశాఖపట్నం.

ఎవరు రచించినా రామాయణం మానవత్వాన్ని, దివ్యత్వాన్ని సిద్ధింపజేస్తుంది. గణిత, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడైన సీతాపతిరావు... సంస్కృత శ్లోకాల సుందర కాండను 'తేటగీతి' పద్యాలతో మూలానికి దగ్గరగా ఆంధ్రీకరించారు. సుందరకాండ ప్రాశస్త్యాన్ని తెలుపుతూ... "సుందర సుందరుండు గుణ/ సుందర రాముని భ్రాతృసేవయున్/ సుందర సుందరీ వదన / సుందర మొప్పెడి సీత శీలతన్/ సుందర బాహు దేహుడగు/ సుందర మారుతి మాతృ ప్రేమయున్/ సుందర ప్రకృతీ మయపు/ సుందర వర్ణన శోభి తంబులే' అంటారు ఒకచోట. కవితా పటిమ ప్రస్ఫుటించే ఈ గ్రంథ రచనలో సంస్కృత పదాడంబరత, అర్థకాఠిన్యం, అన్వయక్లేశం కన్పించవు. ఆధ్యాత్మిక పాఠకులకు ఆసక్తి కలిగించే గ్రంథం.

- రామకీర్తన

స్వచ్ఛమైన గాలి

రచయిత: డా॥వి.ఆర్.రాసాని, పుటలు: 119, వెల: రూ.60, ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాల్లో..

పల్లె పచ్చదనంలో అందం... పల్లెగాలుల్లో సుగంధం... పల్లె అనుబంధాల్లో ఆత్మీయత... పల్లె పిలుపుల్లో ఆర్ద్రత... ఇవన్నీ అనుభవిస్తే గానీ అర్థంకాని మధురానుభూతులు. పల్లె యాసలో ఉండే అందమూ అలాంటిదే. ఈ రోజుల్లో చాలామందికి ఆ మాధుర్యం తెలియదు. ఆ సుగంధాలను మరోసారి వెదజల్లేలా చేశారు డా॥ వి.ఆర్. రాసాని. ఆయన రాసిన 'మా వూరి కతలు'లో కథలన్నీ పల్లె అందాలనూ బంధాల్లోని స్వచ్ఛతను మరోసారి రుచి చూపాయి. విడివిడి కథలను కలిపి ప్రచురించిన పుస్తకం అనేకంటే.. ఒక మనిషి జీవితంలోని కొన్ని అందమైన క్షణాలనూ అనుభూతులనూ వరుసగా పేర్చినట్టున్నాయి అనడం సబబు. కథలన్నీ మాండలికంలో సాగుతాయి. కానీ, అన్ని ప్రాంతాల వారూ చదివించేవిగా సాగుతాయి. ప్రాదేశిక సంభాషణలతో పాటూ అవసరమైన చోట తిట్లూ, శాపనార్థాలూ ఉన్నవి ఉన్నట్టుగా మాండలికంలోనే గుప్పించారు రాసాని. 'బొక్కమింద కొడతాను'... లాంటి వాటిని కూడా వదల్లేదు. కథలను కథలుగా రాస్తే కల్పనగానే ఉంటాయి. జీవితాన్నీ ఒక ప్రాంత జీవనాన్నీ చెప్పినపుడే వాటిల్లోని జీవం సాక్షాత్కరిస్తుంది.

- లహరి

చెట్టు చెప్పే నీతులు

నీతి సూత్రాలను వృక్షాలకు అన్వయిస్తూ పిల్లలకి అర్థమయ్యేరీతిలో, చక్కటి బొమ్మలతో 30 కథలుగా అందించారు చొక్కాపు వెంకటరమణ. ఈయన బాలసాహిత్య రచయితగా ప్రసిద్ధులు. 'గాలిలో గమ్మత్తు' కథలో.. సూరి సగం విని సగం వినక భంగపడిన విధానంలో సైన్సు విషయాలను వివరించిన తీరు ఆసక్తికరం. పని పట్ల శ్రద్ధ, అవగాహన ఉన్నవారే జీవితంలో ఎదుగుతారని 'బతుకు నిచ్చెన' కథలో రచయిత చెబుతారు. తుపాన్‌కు తలవంచని మర్రిచెట్టు నేలకూలడం, తలవంచిన కరివేపాకు చెట్టు చెక్కుచెదరని వైనాన్ని వ్యక్తుల గుణగణాలతో పోల్చిచెప్పే 'విర్రవీగే మర్రిచెట్టు' ఆసక్తదాయకమే. 'చెట్టు నీడ' కథలో... పిసినారి వర్తకుడు నీడను సైతం అమ్ముకుని తర్వాత తన తప్పును తాను తెలుసుకున్న ఉదంతాన్ని ప్రభావవంతంగా చెబుతారు రచయిత. మిగిలిన కథలన్నీ కూడా అర్థవంతంగా, ఆసక్తికరంగా ఉంటాయి. పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతూ, వారు మంచి మనుషులుగా ఎదగడానికి దోహదపడే అంశాలను ఈ కథల్లో గుదిగుచ్చారు రచయిత. బాలసాహిత్యానికి పూర్వవైభవం తెచ్చే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలి.

- డీఎస్

రచయిత: చొక్కాపు వెంకటరమణ పుటలు: 60 వెల: రూ.45 ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని శాఖలలో



సంస్కారానికి ప్రథమ 'శిక్షణ'

తెలుగు నవతరం చదువుకుంటోంది కానీ జ్ఞానాభివృద్ధికి దూరంగా ఉండిపోతోంది. మార్కుల కోసం పాఠాలను బట్టీ వేయించే విద్యావ్యవస్థ... చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి దోహద పడట్లేదు. దాంతో పిల్లలు ఎన్ని ఉన్నత చదువులు చదివినా... వాటి సారం మాత్రం సంస్కారంలోకి ఇంకట్లేదు.

అందుకే రచయిత భాగవతుల శ్రీనివాసరావు... చిన్నారులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడే పుస్తకాన్ని తీసుకొచ్చారు. వేమన పద్యాల నేపథ్యంలో భారతీయ విలువలను బోధించే రచన ఇది. తల్లిదండ్రులు, పెద్దలు, గురువు, ధర్మం, ఏకత్వం... వంటి 27 గుణాలను వివరించే 150 సూక్తి సుధామృతాల్ని మనకందించారు.

తల్లిదండ్రులు తమ చిన్నారులకు రోజుకో పద్యం నేర్పించినా చాలు... పసివారి వ్యక్తిత్వం వికసిస్తుంది. ఆలోచనల పరిధి పెరుగుతుంది. మంచి, చెడుల మధ్య భేదాన్ని విశ్లేషించుకోగల శక్తి ఇనుమడిస్తుంది. అదే సమయంలో పెద్దల ఆలోచనల్లోనూ మంచి మార్పు వస్తుంది.

- గణపతి

రచయిత: భాగవతుల శ్రీనివాసరావు, పుటలు: 104, వెల 40, ప్రతులకు: 23-23-52, శివరావు వీధి, సత్యనారాయణపురం, విజయవాడ.

కొత్త పొత్తాలు

తెలుగులోగిలి: ర: యన్.వి.రత్నశర్మ; **పు:** 50, ₹: 50, **ప్ర:** రచయిత, 4-239, గీతానగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్

ఆమె వేకువ - **ర:** డా॥ ఎ.వి.వీర భద్రచారి, **పు:** 120, ₹: 100, **ప్ర:** అన్నీ విశాలాంధ్ర పుస్తకశాలల్లో

మైత్రీవనం - **ర:** బాలాజీ, రమేష్, సుబ్రమణ్యం, **పు:**140, ₹:75 **ప్ర:** అన్నీ ప్రముఖ పుస్తకశాలల్లో

స్వాతి కిరణాలు, **ర:** మొహమ్మద్ ఖాన్, **పు:** 68, ₹: 25, **ప్ర:** ప్రముఖ పుస్తక కేంద్రాలు, విజయవాడ.

నాగిశెట్టి నానీలు, **ర:** నాగిశెట్టి తాతయ్యనాయుడు, **పు:** 41, ₹: 50, **ప్ర:** రచయిత, లాలుపురం, గుంటూరు రూరల్.

ప్రభాకరోదాహరణము, **ర:** జి.సుబ్రహ్మణ్యశాస్త్రి, **పు:** 21, ₹: 20, **ప్ర:** రచయిత, సూరన సారస్వత సంఘం, 21/375-బి, కోట, నంద్యాల

హిందూ వివాహ వ్యవస్థ విశిష్టత, **ర:** యానాల, **పు:** 76, ₹: 69, **ప్ర:** రచయిత, 1-6-141/25/1, బైపాస్ రోడ్, సూర్యపేట, నల్లగొండ

హరివిల్లు: **ర:** కె.యస్వీ రవణమ్మ; **పు:**56; ₹: 60; **ప్ర:** రచయిత్రి, శివనారాయణి నిలయం; 7-1-67/3, చినవాల్తేరు, విశాఖపట్నం.

ఆనలేకా వస్తేగానీ...

హైదరాబాదులో ఒక మూలనుంచి మరో మూలకి వెళ్లడమంటే ఒకప్పటి కాశీ యాత్రతో సమానం. వెళ్లినవాడు తిరిగి వస్తాడో లేక తిరుగుతూనే ఉండిపోతాడో చెప్పలేం. అపరాత్రి వేళ ఎవరన్నా బిత్తరచూపులు చూస్తూ మన వాకిట నిలబడ్డాడే అనుకోండి. పరాయివాడనుకుని అతడిని తొందరపడి తరిమెయ్యకండి. మన కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉన్నారా లేదా అని ఓసారి చూసుకోండి. అప్పటికీ ఒక్కోసారి మొహం మట్టికొట్టుకుపోవడం వల్ల పోలికలు కష్టం కావచ్చు, అటువంటప్పుడు వీధి కుక్కలు అతని వంక సానుకూల దృక్పథంతో (తోక ఆడించడం, ఆనందంతో మూల్గడం, బొచ్చు విదల్చడం, నేలమీద పడి దొర్లడం...) ఉన్నాయా లేదా అని పరిశీలించాలి.

ఈ ప్రహసనం నుంచి తప్పించుకోవడానికి నేనూ మా ఆవిడా కొన్ని రహస్య సంకేతాలను ఏర్పాటు చేసుకున్నాం. నేను ఇంటికి తిరిగి వచ్చి తలుపు కొట్టగానే మా ఆవిడ తలుపుని ఓరగా తీసి నా వంక చిరాగ్గా చూస్తుంది. అప్పుడు నేను 'తాబేలు చిప్పా తాజ్‌మహల్ డొప్పా తెరుచుకో ససేం!' అని ఆలీబాబాలాగా ఆర్తనాదం చేయగానే ఆవిడ నిర్భయంగా తలుపు తీస్తుందన్నమాట. అలాంటి ఓ రోజున ఈ కథ మొదలైంది.

ఆ రోజు మా ఆవిడ తలుపు తీస్తుండగానే సుడిగాలిలా ఆవిడని తోసుకుంటూ స్నానాలగది వైపుకి పరుగుతీశాను. ఓ గంట పాటు జలకాలాడి బయటకి వచ్చేసరికి కడుపులో ఎలుకలూ, వాటి వెనకాల పిల్లులూ కుక్కలూ కూడా పరిగెత్తసాగాయి. "ఏమోయ్ భోజనం చేద్దాం రా!" అంటూ మా ఆవిడ కోసం కేకపెట్టాను. "ఒక్క ఐదు నిముషాలు ఆగండి, రాఘవ కూడా వచ్చేస్తాడు" అంటూ మా ఆవిడ బదులు కేక..

ఆకలి మనిషి విచక్షణని కుంగతీస్తుంది, కడుపులో ఎలుకలూ, పిల్లులూ పరిగెడుతుంటే మనిషి మనిషిలా ఎందుకు ప్రవర్తిస్తాడు? అందుకే మా ఆవిడ జవాబు వినగానే శివాలెత్తిపోయాను... "ఆ చెవిటి వెధవ కోసం నేను ఆకలితో మాడాలా, నీకు నీ మొగుడు ముఖ్యమా చెవిటి తమ్ముడు ముఖ్యమా!" అంటూ బల్లమీద ఉన్న కంచాన్ని ముందుగదిలోకి గిరాటేసి, చరచరా పోయి మంచమ్మీద వాలిపోయాను. నా వెనకాలే పరిగెత్తుకుంటూ వచ్చిన మా ఆవిడ ఎంత బతిమలాడినా నేను అలక మానలేదు.

రాఘవ మా ఆవిడకి తమ్ముడి వరస, చిన్నప్పుడే ఏదో బలమైన గాయం వల్ల అతనికి ఓ చెవి వినిపించదు. నా ఇంట్లో ఉండి తింటున్నాడన్న ఆధిపత్యభావన వల్ల ఎప్పుడు అతని మీద కోపం వచ్చినా 'చెవిటి వెధవ' అనే సంబోధిస్తూ ఉంటాను. అతని వైకల్యాన్ని ఎత్తిచూపి చులకన చేయడం ద్వారా తృప్తిని పొందుతూ ఉంటాను.

ఆకలికీ అహానికీ మధ్య జరిగే యుద్ధంలో ఆకలిదే పైచేయి అని చరిత్రే చెప్పనక్కరలేదు. రాత్రి గడిచే కొద్దీ ఆకలికి తాళడం కష్టమైపోయింది, పక్కకి చూస్తే మా ఆవిడ మంచి నిద్రలో ఉంది. లేచి వెళ్ళి భోజనం చేసేద్దామా అంటే మా ఆవిడ పసిగట్టేస్తుందేమోనన్న అనుమానం. అందుకని దొంగలా అడుగులో అడుగు వేసుకుంటూ బయల్దేరా. అంతకు ముందు రోజు ఫ్రిజ్‌లో ఉంచిన ఐస్‌క్రీం డబ్బా తప్పించి ఘనపదార్థమేదీ కనిపించలేదు. ఏం చేస్తాం... దాంతోనే నా ఆకలి మంటలను చల్లార్చుకున్నాను.

"ఏ(హాచ్)మోయ్(హాచ్), ఎక్క(హాచ్)డవు(హాచ్) న్నావు(హాచ్)" అంటూ ఉదయాన్నే తుమ్ములతో మా ఆవిడను కేకేశా. ఉరుముల తర్వాత చినుకులు మొదలైనట్లుగా తుమ్ముల తర్వాత జలుబు మొదలు. రెండ్రోజులు జాగ్రత్తగా మందులు వేసుకుంటే జలుబూ గిలుబూ తగ్గిపోయేదేమో. కానీ మా స్నేహితుడికి స్నేహితుడి చుట్టం తాలూకు స్నేహితుడి పెళ్ళి ఉందంటేనూ వెళ్లి అక్కడ ఆబగా మళ్ళీ ఐస్‌క్రీంలు తిన్నాను. ఇహ అప్పట్నుంచీ నా కథ శ్లేష్మంలో పడింది.

ఫలానా రోగం భరించడం కష్టం అంటారేగానీ తేడా వస్తే ఏ రోగమైనా విరహబాధని సైతం మరపిస్తుంది, అలా నాకు పడిశం వల్ల మొదలైన చెవిపోటు భరింపశక్యం కాకుండా పోయింది. పైగా పప్పుండ బుగ్గన పెట్టుకున్నట్టుగా దవడ వాచిపోయింది. ఇహ ఈ బాధని భరించలేక ఆ రాత్రికి రాత్రే మా ఆవిడని తోడు తీసుకుని దగ్గర్లోని ముక్కు చెవుల వైద్యుడి వద్దకి బయల్దేరాను. ఇదివరకెప్పుడు ఆ ఆసుపత్రి వంక చూసినా ఈ

ముక్కూ చెవులూ చూసుకుంటూ గడపడమేవిటో అనుకునేవాడిని. ఇప్పుడు మాత్రం శూర్పణఖ కాలం నుంచే వారి అవసరం ఉంది సుమీ అనుకుని లెంపలేసుకుంటూ కుడికాలు ఆసుపత్రిలో పెట్టా.

ఆసుపత్రి ముందుగదిలో ఉన్న కుర్రవాడి దగ్గర నా పేరు నమోదు చేయించుకుని బిక్కుబిక్కుమంటూ ఓ మూల కూర్చున్నా. కాలం ఎంతో భారంగా గడవడంవల్ల అలా ఎంతసేపు కూర్చున్నానో చెప్పలేను. ఇంతలో న్యాయస్థానంలో అమీనుకిమల్లే ఎవరో నా పేరు బిగ్గరగా పిలవడంతో లేచి నిల్చున్నా. గతంలో నా పేరు విన్నప్పుడు ఎప్పుడూ నేను ఇంతగా భయపడలేదు. ఓ పక్క కళ్లు తిరుగుతుండగా వణుకుతున్న శరీరంతో వైద్యుడి గదిలోకి అడుగుపెట్టా.

ఆ గదిలో వేళ్లాడ తీసిన వివిధ అవయవాల పటాలనీ, ఆయన బల్లమీద ఉన్న పరికరాలనీ చూసేసరికి అసంకల్పితంగానే ఆంజనేయ దండకం నోటికొచ్చింది. వైద్యుడి ఆహ్వానం మేరకు ఆయన పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని దీనంగా "రెండు రోజుల నుంచీ ఎడం చెవి పోటుగా ఉందండీ, పైగా ఏమీ వినబడ్డం లేదు కూడా" అన్నాను కళ్లొత్తుకుంటూ. దానికాయన మరేం ఫర్వాలేదు అన్నట్లుగా చిరునవ్వొక్కటి రాల్చారు.

ముందుగా కమండలం లాంటి ఓ పరికరాన్ని చేతపట్టుకుని దానితో ఆశీర్వదిస్తున్నట్లుగా నా నుదుటిపై తాటించారు, "మీ ఎడం చెవిలో ఇప్పుడు గుయ్‌మన్న శబ్దమేమన్నా వినిపిస్తోందా !" అని ఆయన కుతూహలంగా అడగ్గానే "హా! వినిపిస్తోంది, వినిపిస్తోంది" అంటూ లేచి వెళ్ళబోయాను.

"మీ మొహం! అలా వినిపిస్తేనే ఏదో దోషం ఉన్నట్టు లెక్క" అంటూ ఆయన నన్ను కుర్చీలో కుదేశారు. తర్వాత ఓ సన్నటి గొట్టంలా ఉన్న ఓ కెమెరాని నా కుడి చెవిలోకి పంపి ఎదురుగుండా ఉన్న తెరని చూపుతూ 'ఇది ఆరోగ్యంగా ఉన్న గూబ, చూడండి ఎంత చక్కగా ఉందో' అన్నారు మురిపెంగా. నాకైతే అందులో చక్కదనం ఏమీ కనబడలేదు!

"ఇప్పుడు రోగం సోకిన గూబను చూడండి, పాపం ఎలా వాచిపోయిందో" అన్నారు కెమెరాని నా ఎడం చెవిలోకి పోనిస్తూ.

'చ్చు చ్చు చ్చు' అంటూ నాపై నేనే సానుభూతిని వ్యక్తపరుచుకుని, 'ఇప్పుడేం చేద్దామండీ?' అని వ్యూహారచన కోసం వేచి ఉన్న సైనికుడిలా ఆయన వంక చూశాను.



"మరేం ఫర్వాలేదు, మనం దానికి చిల్లు పెట్టి లోపల పేరుకుపోయిన శ్లేష్మాన్ని బయటకి తీద్దాం" అన్నారు చేతిలో ఉన్న ఓ పదునైన పరికరాన్ని నా కళ్లముందు ఆడిస్తూ.

దాన్ని చూసేసరికి పై ప్రాణాలు పైనే పోయాయి. "దాంతో పొడిస్తే నెప్పెడుతుందేమో!" అనుమానంగా అడిగా.

"అబ్బే, అదేం ఉండదు. ఒకవేళ ఉంటే.."

"ఆ, ఉంటే!" అంటూ ఆతృతగా అడిగా.

"ఓర్చుకో" అంటూ తాపీగా బదులిచ్చారు.

వైద్యులవారు నా గూబకి చిల్లు పెట్టేటప్పుడు పెద్దగా నెప్పైతే కలగలేదుగానీ ఇలాంటి సందర్భాల్లో కళ్లు తిరిగే అలవాటు వల్ల ఆయన బల్లమీద పడిపోయా.

ఇంటికి ఎలాగోలా చేరుకుని మంచంపై కూలబడుతూనే "అందరికీ కబురు చేశావా నాగూ" అంటూ మా ఆవిడని అడిగాను.

"ఇందులో కబురు చేయడానికి ఏముందండీ" అని మా ఆవిడ అందో లేదో ఇంతెత్తున ఎగిరా.

"నేనో పక్క శస్త్రచికిత్స చేయించుకుని వస్తే ఏముందంటావా? అదే మీ పుట్టింటివాళ్లకైతే దోమ కుట్టినా వెళ్లి చూసొస్తావు" అని గయ్‌మన్నా. నేనే స్వయంగా ఫోన్ అందుకుని నలుగురికీ నా వార్తని తెలియపరచుకున్నా.

జీవితంలో నాబోటి వారికి సానుభూతీ, దానివల్ల లభించే 'ఓదార్పు' పొందే సందర్భాలు తక్కువ. అప్పటికీ మాపై అధికారుల దగ్గరకు వెళ్లేటప్పుడు మాసిన గడ్డం, బాగా నలిగి, బొత్తాలు ఊడిన చొక్కాతోనూ తయారయ్యేవాడిని. ఉహూ... ఫలితం శూన్యం!.

ఇప్పుడు నాకు శస్త్రచికిత్స జరిగిన విషయాన్ని పదిమందికీ తెలియచేస్తే నలుగురి నోళ్లలోనూ నానతానని ఆశ. 'ఫలానా సూరిబాబుకి శస్త్రచికిత్స చేశారట, పాపం' అని అందరూ అనుకుంటే అదో తృప్తి. కానీ ఓదార్పులు ఎక్కువైతే ఓర్పు నశింపక తప్పదని

నాకు మర్నాటికే అర్థమైపోయింది.

నా కోసం వచ్చే సానుభూతిపరులకు లోటాలకొద్దీ తేనీరూ, పళ్లేల కొద్దీ తినుబండారాలూ అందించడం పెద్దగా బాధ కలిగించలేదు గానీ, వారి మాటలు వినబడకపోవడం వల్ల ఎప్పుడు ఏ భావాన్ని వ్యక్తపరచాలో తెలియక బిత్తర చూపులు చూడటం చాలా ఇబ్బందికరంగా మారింది. ఒకోసారి వారు 'మా కుక్కపిల్ల పారిపోయిందండీ' లాంటి విషాద వార్తలు చెబితే... హాస్యోక్తి అనుకుని పగలబడి నవ్విన సందర్భాలు ఉన్నాయి.

మరో రెండు రోజులు గడిచేసరికి నా పరిస్థితి దుర్భరంగా తయారయ్యింది. గతంలో ఎప్పుడన్నా నా చెవి మూసుకుపోతే దాన్ని గిల్లీ గిచ్చీ, వేళ్ళూ పుల్లలూ పెట్టి, నూనెలూ గట్రా పోసి... ఆకు రాలినా విని పించేంతటి పరిపూర్ణత కలిగేవరకూ ఊరుకునేవాడిని కాదు. కానీ ఇప్పుడలా కాదే! అడుగు నుంచి పిడుగు వరకు నా శబ్ద ప్రపంచం అంతా సద్దుమణిగిపోయింది.

ఇక లాభం లేదనుకుంటూ మర్నాడు మా ఆవిడని కూర్చోబెట్టుకుని ఇలా అభ్యర్థించా... "చూడు నాగూ! మొన్న అక్షయ తృతీయకి రూపు కొనిపెట్టలేదని మనసులో పెట్టుకోకు. ప్రస్తుతం నా వినికిడి ఏమంత బాగోలేదని నీకు తెలుసు కదా! అందుకని ఓ పది రోజులపాటు నాతో కాసింత ఓపికగా మెలుగు" అంటూ కొన్ని సూచనలు చేశాను.

"నువ్వు ఏం మాట్లాడాలన్నా నా కుడి చెవికి దగ్గరగా వచ్చి మాట్లాడు, ఇంటికి ఎవరన్నా వస్తే నువ్వు వారి వెనకాలే ఉండి వారి మాటలకు నేను ఏ భావం వ్యక్తపరచాలో అభినయిస్తూ ఉండు, అలాగే నాకిష్టమైన 'పాపిష్టి కోడలు' ధారావాహికలోని ముఖ్యమైన సంభాషణలు నాకు చెబుతూ ఉండు" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నా.

రోజులు గడుస్తున్న కొద్దీ నా వినికిడిలో వింత వింత మార్పులు వస్తున్నాయి. ఓసారి పక్కనుంచి విమానం దూసుకుపోతున్నట్టుగా గుయ్‌మంటుంది. మరోమారు ఎవరో తలుపులు బాదుతున్నట్టుగా టకటకా శబ్దాలు వస్తాయి. అంతా సవ్యంగా ఉందనుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటుండగా కీచురాళ్ల బృందగానం మొదలు. మరో ప్రపంచమేదో నా గూబలో గూడుకట్టుకున్నట్టుంది నా పరిస్థితి.

వైద్యులిచ్చిన మందులు ఒక్కోటీ కడుపులో కరుగుతున్న కొద్దీ ఓ పక్క అలసటగా ఉన్నా నొప్పి మాత్రం తగ్గుతోంది. అంతేకాదు అకస్మాత్తుగా ఏదో మెరుపు మెరిసినట్టు అప్పుడప్పుడూ వినికిడి రాసాగింది. ఆ సమయంలో నా మనఃస్థితి వర్ణనాతీతం. ఒంటరి జింకని చూసిన సింహంలాగా నా మేను పులకరించేది. అయితే ఆ ఆనందం క్షణభంగురమే! 'వినబడుతోందీ, వినబడుతోందీ' అని నేను వంటింట్లోకి అరిచేలోపే మళ్ళీ చెవి దిబ్బడేసుకుపోయేది. నా మొహమ్మీదే ఎవరో ఈ ప్రపంచపు తలుపులని మూసివేసినట్లుగా బుర్రలో నిశ్శబ్దం అలుముకొనేది.

ఓ వారం గడిచేసరికి నా పరిస్థితి కాస్త మెరుగయ్యింది. ఇదివరకు మెరుపులా వచ్చే

పోయే వినికిడి కాస్తా ఇప్పుడు ధారావాహిక ల్లోని ప్రకటనలకి మల్లే మాటిమాటికీ వస్తోంది. అంతేకాదు ఎప్పుడు కావాలంటే అప్పుడు వినికిడిని పొందగల సులువులు కొన్ని తెలుసుకున్నాను. ఉదాహరణకు ముక్కు మూసుకుని లోపల ఉన్న గాలిని అటూ ఇటూ ఆడించడం ద్వారా లేక ఘాటైన ఆవకాయ బద్దని చప్పరిస్తూ ముక్కు చీదడం ద్వారా కాసేపు వినికిడి జ్ఞానాన్ని పొందేవాడిని. ఇప్పటికి ఈ సంఘటన జరిగి పక్షం రోజులయ్యింది, నా చెవి పూర్తిగా నయమైందని చెప్పలేను గానీ పర్వాలేదు. మా ఆవిడ గొణుక్కునే తిట్లూ, మా పక్క వీధిలోని గొడవలూ తప్ప మిగిలినవన్నీ వినబడుతున్నాయి. కాకపోతే నా చెవిని ఎదుటివారి నోటికి కాసింత దగ్గరగా ఉంచవలసి వస్తోంది. అలాంటప్పుడు ప్రసంగకర్త నా చెవిని కొరకబోయిన సందర్భాలు లేకపోలేదు.

క్రమక్రమంగా నాకు వినికిడి జ్ఞానం కలగడంతోపాటుగా మరో జ్ఞానమూ మొదలయింది. అయితే అది సంస్కారానికి సంబంధించింది. కొద్ది రోజులపాటు చెవి పనిచేయకపోతేనే నేను ఇంతగా తపించిపోయానే, మరి బాల్యం నుంచీ వినికిడి తక్కువగా ఉన్న రాఘవ ఎలాంటి వ్యథని అనుభవిస్తున్నాడో కదా! అలాంటి వారి పట్ల జాలి చూపనప్పటికీ, చేయూతని ఇవ్వనప్పటికీ, వారిని తక్కువగా చూస్తూ నా అహంతృప్తి కోసం వారిని చులకన చేయడం ఎంతటి కుసంస్కారమో బోధపడింది.

ఆ సాయంత్రం నా కార్యాలయం నుంచి తిరిగి వచ్చా. 'త్వరగా స్నానం చేసి రండి, భోజనం వడ్డిస్తాను' అంది మా ఆవిడ. "రాఘవని కూడా రానియ్యి, కలిసి భోజనం చేద్దాం" అంటూ స్నానానికి బయల్దేరాను.

కె.ఎల్.సూర్య
హైదరాబాద్
93934 72410

అమ్మ కాదు... నేనే

అ ఆ స్పందన



మా అమ్మాయికి అమ్మభాష నేర్పడంలో తల్లి పాత్ర పోషించి... నాన్న నుంచి అమ్మనయ్యా. నేను పుట్టి పెరిగింది చెన్నైలో. అక్కడి 'కేసరి బడి' చలువతో నాకు చక్కటి తెలుగు ఒంటబట్టింది. నా కూతుర్ని కూడా తెలుగు బడిలో చదివించాలనుకున్నా. కానీ, వీలుపడలేదు. అమ్మాయి బడిలో ఆంగ్లం, హిందీ మాత్రమే నేర్పించేవారు. ఇంట్లో మేమంతా తెలుగులోనే మాట్లాడుకుంటాం కాబట్టి పాప కూడా తెలుగు బాగా మాట్లాడుతుంది. పద్యాలు నేర్పిస్తే ముద్దు ముద్దుగా ఒప్పచెప్పేది. కానీ చిక్కంతా చదవటం, రాయటంతోనే! తను మూడవ తరగతిలోకి వచ్చినప్పుడు అక్షరాలు నేర్పించటం మొదలుపెట్టా. అందరిలా దిద్దించకుండా బొమ్మల పుస్తకాలు తీసుకుని, వాటిలో బొమ్మల పక్కన రాసిన మాటల్ని చదువుతూ అక్షరాలు గుర్తుపెట్టుకునేలా చేశా. బాపు బొమ్మలతో ఉన్న అ, ఆల పుస్తకం దీనికెంతో ఉపయోగపడింది. ఆ బొమ్మలను చూసే తెలుగును చదవటం నేర్చుకుంది మా అమ్మాయి. రాత అలవడటానికి చిన్న చిన్న పదాల ఉక్తలేఖనం సాధన చేయించా. కుటుంబ సభ్యుల పేర్లు, మేం తిరిగిన ఊర్లు, తినే పళ్లూ...ఇలా తనకు ఆసక్తి ఉన్న పదాలనే రాయించేవాణ్ని. ఈ సాధనతో తర్వాత పద్యాలు రాయటం తేలికయింది. పాప పెరిగేకొద్దీ తెలుగు అభ్యాసంలో పదబంధాలు పూరించటం లాంటి వాటిని జత చేశా. ఈ శిక్షణతో పాప తెలుగు మాధ్యమంలో చదవకపోయినా తెలుగులో మంచి ప్రజ్ఞ సాధించింది. ఇప్పుడు తను ఎమ్మెస్ చేసి అమెరికాలో స్థిరపడింది. ఇప్పటికీ మేమిద్దరం తెలుగులోనే ఉత్తరాలు రాసుకుంటాం. నా మనవళ్లకు, మనవరాళ్లకు కూడా తెలుగు నేర్పించాలన్నది ఇప్పటి నా లక్ష్యం.

- డా॥ఎ.ఎస్.రామశాస్త్రి, ముంబయి

కవితా పారిజాతం

దాక్కుని వుంటాయి

దాక్కుని వుంటాయి - దారంట - గడ్డి - ని
రుక్కుని వుంటాయి -
తలపగరాని పూలు
పిలువగబోని పూలు
నిలుపగలేని పూలు
దాక్కుని వుంటాయి - దారంట - గడ్డి - ని
రుక్కునివుంటాయి -

గ్రుక్కెడు వాననీళ్ళకు
ఫక్కుననవ్వుతాయి;
ఉక్కగకాసంతుంటే
త్రొక్కటపడతాయి.
దాక్కుని వుంటాయి - దారంట - గడ్డి - ని
రుక్కుని వుంటాయి -

లెక్కకురా, వోలక్ష !
చిక్కవు మాలనుగ్రుచ్చ,
ఇక్కడ నక్కడబచ్చ
జక్కనబూస్తాయి.
దాక్కుని చూస్తాయి - దారంట - గడ్డి - ని
రుక్కుని కూస్తాయి -

ఒక్కడనడుస్తూవుంటే,
చుక్కలు పొడుస్తూవుంటే,
మక్కువ కూర్చొమంటాయి
ఎక్కడో యెందుకో చెప్పవు:
దాక్కుని వుంటాయి - దారంట - గడ్డి - ని
రుక్కుని వుంటాయి -

మంచుబిందువు పడిన,
ఎంచిబాష్పము విడిన,
అంచులగాస్తాయి;
వంచకమోస్తాయి;
దాక్కుని వుంటాయి - దారంట - గడ్డి - ని
రుక్కుని వుంటాయి -

కవి కొండల వారు తనకు కవితా ప్రేరకమైన ప్రకృతిని మనసారా ప్రేమించెను. కావునే "దారంట గడ్డి నిరుక్కొని" యున్న పూలను గూడ ప్రేమించినారు.

- కవికొండల వేంకటరావు

(శ్రీశ్రీపై సైతం ప్రభావం చూపిన కవికొండలను 'ఆంధ్రా వర్డ్స్‌వర్త్' అనేవారు. 'కొండ కొలను వికసితోత్పలకవి' అని కూడా అనేవారు. విలాసినీ వైనతేయము' గేయ సంపుటి నుంచీ)

తెలుగులో తెలుగుదనం

పెనంలో నుంచి పొయ్యిలోకి పడినట్లుంది తెలుగు పరిస్థితి. ఆంగ్ల పదాలకు తెలుగు పదాలను సృష్టించాలన్న యావలో సంస్కృత పదబంధాల మధ్య ఇరుక్కుపోతున్న పండితులే దీనికి కారణం.

తమిళనాడులో చాలా తిరిగాను. వచ్చీరాని తమిళంతో తమిళులతో ఏకంగా రాజకీయాలే మాట్లాడాను. నా తమిళం నాకే నవ్వు తెప్పించేది. అయినా వాళ్ల ఏమాత్రం నవ్వేవారు కాదు. మెచ్చుకోలుగా చూసేవారు. కానీ, మన తెలుగువాళ్లు మాత్రం కొత్త 'తెలుగు' పదం (గమనించగలరు - 'తెలుగు' పదం) వింటే ముందు నవ్వుతారు. ఆ పదం వాడుకకుగాక నవ్వుతాలికే అన్నట్లు చూస్తారు. అది సంస్కృత పదబంధం అయితే మాత్రం నవ్వు రాదు. ఆలోచిస్తారు. వాడుకకు కుదరకపోయినా సంస్కృత పదాలే ఇంపు అనే వారితోనే పెద్ద చిక్కు.

జనులకు అవసరపడని బాషగా గ్రాంథికాన్ని గమనించి పక్కనబెట్టేశాం. అలాంటప్పుడు దినసరి వాడుక పదాలకు సంస్కృత పద ప్రయోగాన్ని ఆదరించడం సబబేనా? ఈ పదాలతో భాష ఎట్లా బతుకుతుంది? సంస్కృత పదాలలో తెలుగులోని కమ్మదనం ఉండదు. గాంభీర్యం ఉంటుంది. గాంభీర్యం తెలుగువాడి నైజం కాదు.

నవతరానికి కావల్సింది చిట్టిపొట్టి పదాలు. ఉండి కూడా వదిలేసుకున్న చిట్టిచిట్టి తెలుగు పదాలు! 'ఒజ్జ' వంటి పదాన్ని ఎందుకో వదిలేశాం. ఉపన్యాసాల్లోనో, రాతలోనో తప్ప, నలుగురితోటి బజార్లోనో/ ఇంట్లోనో మాట్లాడేటప్పుడు ఏ ఉపాధ్యాయుడూ ఒజ్జ అని పలకడు, ఒజ్జలవొజ్జలను (బీఈడీ కళాశాల అధ్యాపకులను) 'ఛాత్రోపాధ్యాయు'లని చదివితే నివ్వెరపోమా? మన తీరు 'ఇంట్లో వాచీలు, వీధిలో సమయ సూచికలా' ఉంది.

కొత్త పదాలను వాడటమంటే కాగితాల మీద రాసుకోవడమే కాదు. అలవోకగా పలకగలగడం. జనుల నోళ్లలో నానని సంస్కృత సమాసం... కాగితం మీద - అదీ కొన్ని ఏళ్లపాటే బతుకుతుంది. ఎలాగో ఒకలాగ ఇంగ్లీషుని కనిపించనీయకుండా చేయడానికి సంస్కృతం వాడరాదు. ఒక చెరని వీడేది పాత చెరలోకి వెళ్లడానికి కాదు.

కొత్త పదాలు తీయగా, తేలికగా ఉంటే నోట్లో నలుగుతాయి. గులకరాళ్లు పోస్తే నలగవు. 'తెలుగు తీయనిది' అంటాం. ఇది తెలుగు వాళ్ల నమ్మకమా? ఎవడు మాత్రం వాడి భాష తీయనిది కాదంటాడు? తెలుగులో తీయదనం ఉందని చెప్పడానికి గల కారణాలను వెలికితీయాలి. ఇందుకుగానూ ఎవరైనా పండితులు ఇంతకు ముందు చేసిన వెలిదీత (పరిశోధన)లను జనులందరికీ వెల్లడి చేయాలి. తెలుగు

తెలుగు వెలుగు యజ్ఞంలో భాగంగా జన వ్యవహారంలోని [illegible] చేస్తున్నాం. ఇందులో భాషాభిమానులందరూ భాగస్వాములు కావాలన్నదే మా ఆకాంక్ష, విన్నపం. తరచూ ప్రసార సాధనాల్లో వస్తున్న పదాలను ఇక్కడ ఇస్తున్నాం. ఇవే కాదు. మీ దృష్టిలో ఉన్న ఇతర ఆంగ్ల పదాలకూ తెలుగు సమానార్థకాలను పంపవచ్చు.

మీ సౌకర్యం కోసం వాటికి నిఘంటు అర్థాలనూ జోడించాం. [illegible] వివరణ కూడా రాస్తే ఎంపికకు తేలిగ్గా ఉంటుంది. ఒకప్పుడు [illegible] పదం వీనులవిందుగా ఉండాలి తేలిగ్గా పలకగలగాలి [illegible] మక్కీకి మక్కీ అనువాదం కూడదు. కఠిన సంస్కృత శబ్దాలు సామాన్య జనంలోకి త్వరగా చొచ్చుకుపోలేవు అందువల్ల తేటతెలుగు మాటలే పంపండి. ఇతర ద్రావిడ భాషల్లోని [illegible] మంచి ప్రయత్నమే అవుతుంది. మీ పదాలను teluguvelugu@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

పద పంచాయతీ

- **Advocate general:** any of a number of officers assisting the judges in the European Court of Justice ప్రధాన న్యాయవాది / ముఖ్య న్యాయవాది
- **Aerobic:** relating to or denoting exercise taken to improve the efficiency of the body's cardiovascular system in absorbing and transporting oxygen: లయబద్ధ వ్యాయామం

'సుందర తెలుగు' కావడానికి కారణాలు రెండు. ఒకటి, అచ్చుతుది (అజంత) భాష. రెండు, ఒక హల్లుకు అదే హల్లు మాత్రమే ఒత్తుగా హత్తుకుండే భాష. తెలుగువాడితో బాటే వేలాది ఏళ్లకిందట పుట్టిన ఈ నియమానికి కొన్ని మినహాయింపులున్నా (ఉదా: క్రా రావడితో కూడిన హల్లులు) ఇవి కూడా తీయదనం పెంచేవే. ఇలాంటి మరికొన్ని నియమాలు ఉండే ఉంటాయి. కొత్త పదాల పుట్టింతలో వీలైనంత వరకూ ఈ నియమాలను అనుసరించాలి. అప్పుడే అవి తీయగా, తేలిగ్గా, తెలుగ్గా ఉంటాయి.

కొత్త వస్తువులు కుప్పలు తెప్పలుగా కురుస్తున్న ఈ యుగంలో కొత్త పదాల పుట్టింత వేగం సరిపోదు. కనుక పరాయి పదాలను కొన్నింటిని ఒద్దికగా మన తెలుగు బుట్టలో నింపుకోవాలి. 'సోప్' సబ్బుగా తెలుగులో ఎంతో సబబుగా, సొబగుగా ఒదిగిందో అందరికీ తెలుసు. బుడతకీచుల 'టవల్' కాస్తా తువ్వాలుగా మారింది. ఎంత 'కాన్వెంట్' పిల్లాడైనా అలవోకగా 'మమ్మీ సబ్బుతే' అంటాడు. 'దేహ శుభ్రకారిణి' అని పదాన్ని పుట్టిస్తే, ఆ పదం సబ్బు అరిగేలోగా గిట్టుతుంది.

పరాయి పదాలను మన నాలుకకు తగ్గట్టుగా మార్చుకోవడానికి జంకరాదు. మునుపు సంస్కృత ప్రకృత పదాలకు వికృతులు వాడేవారు. వికృతులను ఆదరించి, పద్యాలలో మహాకవులే వాడారు. తిక్కన్న 'సింగంబాకటితోడ...' అన్నారు కదా! వికృతి అంటే ఒక పరాయి పదానికి మన భాషలో ఇచ్చే 'ఆకృతి'. సింహమనే సంస్కృత పదానికి 'సింగం' తెలుగు ఆకృతి. 'వికృతి' అనడం కంటే 'ఆకృతి' అనడం సరిగా ఉంటుంది. తమిళంలో బ్యాంకును 'వంగి'గా మలుచుకున్నారు. హిందీవాళ్లు 'బాటిల్'ని 'బోతల్' అంటారు. ఇంగ్లీషు వాళ్లైనా హిందీ, తెలుగు, తమిళ, మళయాళాది భాషల పదాలను తమ నాలుకలకు అనువుగా తమ భాషలోకి దింపుకోలేదా? తెలుగువాళ్లు మాత్రం ఇంగ్లీషు 'బ్యాంకు'ని 'యా' వత్తుతో సహా అలాగే వాడుతూ, అయ్యో వాడేస్తున్నానే అనుకుంటూ నలుగుతున్నారు. నేనొకసారి ఒక సింహళీయుడిని 'నీళ్లను సింహళంలో ఏమంటార'ని అడిగితే 'వాతర్' అన్నాడు! నేను ఊహించిన జవాబు వేరే! మనం ఇంగ్లీషు పదాలకు వికృతులు ఎందుకు పుట్టించలేకపోతున్నాం? 'కాల్క్యులేటర్' లాంటి పదాలకు ఎందుకు ఒక ఆకృతి (అదే, వికృతి)ని ఇవ్వలేకపోతున్నాం? కలికేతరు, కలికులెతరు, కాలికులెతరు లేదా కలికులెత్రు ఇలాగ ఆకృతులను ఏర్పర్చలేమా? ఇవే అచ్చ తెలుగు లచ్చల మూటలు. పండితులూ, పత్రికల వాళ్లూ పరాయి పదాలకు తెలుగు ఆకృతులనిచ్చి వాడగలగాలి. పాఠశాలల్లో ప్రకృతులకు తెలుగు వికృతులను బట్టీ వేయించకుండా, వికృతులు ఏర్పడే

- **Anchor:** (N):a heavy object attached to a cable or chain and used to moor a ship to the sea bottom, typically having a metal shank with a pair of curved, barbed flukes at one end:.., a person or thing which provides stability or confidence in an otherwise uncertain situation: ప్రయోక్త, కార్యక్రమ నిర్వాహ సంధానకర్త, దృఢంగా బంధించి ఉంచు
- **Articulation:** the formation of clear and distinct sounds in speech:.., the action of putting into words an idea or feeling:..,Music clarity in the production of successive notes:.., the state of being jointed: ఉచ్చారణ, స్పష్టత
- **Aspiration:** (usually aspirations) a hope or ambition of achieving something: ఆశయం, ఆకాంక్ష
- **Associate :** connect (someone or something) with something else in one's mind:.., connect (something) with something else because they occur together or one produces the other:.., (be associated with) be involved with:.., (associate oneself with) allow oneself to be connected with or seen to be supportive of:..సహకారి, సహచార, సహచరిత, సహవాసి, సహకరించు, తోడ్పడు
- **Assurance** : a positive declaration intended to give confidence; a promise:[with clause] :.., [mass noun] confidence or certainty in one's own abilities:.., certainty about something .., ఒప్పుదల, హామీ, నమ్మిక, బీమా, పూచి, అభయం
- **Atlas :**...a book of maps or charts., ...one of the Titans, who was punished for his part in their revolt against Zeus by being made to support the heavens. He became identified with the Atlas Mountains... భూగోళపటం, ప్రపంచ పటం
- **Attestation** : [with object] provide or serve as clear evidence of:.., declare that something exists or is the case:.., witness or certify formally:.., [no object] historical enrol as ready for military service:.., recruit (someone) for military service by putting them on oath to serve if called upon: ఆమోదం, సాక్షి సంతకందారు, ధ్రువీకరణ సంతకం
- **Baking Powder:** a mixture of sodium bicarbonate and cream of tartar, used instead of yeast in baking. పచన భస్మం / వంట పొడి
- **Balcony :** (the balcony) the highest tier of seats in a theatre, above the dress or upper circle. ..,a platform enclosed by a wall or balustrade on the outside of a building, with access from an upper-floor window or door. వాతాయనం, మేలుకట్టు

నియమాలను తెలియజేయాలి.

కొన్ని ఇంగ్లిషు పదాలకు ఎనలేని గిరాకీ (వ్యాప్తి) ఉంది. ఫోను అనే పదం వాటిల్లో ఒకటి. దీనికి వేరే పదం వెదకడం దండగ. ఇందులోని 'ఫ'కారం తెలుగులో ఎట్లా ఇముడుతుందని ప్రశ్న రావచ్చు. కాఫీని మొదట్లో కాపీ అన్న తెలుగువాడు ఇప్పుడు 'కాఫీ'కి అలవాటు పడ్డాడు. అయితే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోనును 'చేఫోను' అని ఎందుకనలేకున్నాం? ఈ పదం తెలుగువాళ్ల నోళ్ల లోనించి 'ఆటమేటిగ్గా' ఎందుకు రావడం లేదో! దీనికి వేరే పదాలు ఎందుకు వెతుక్కుంటున్నాం? చేఫోనుతో మాట్లాడే సామాన్యుల నోటిలో 'చరవాణి' అన్న పదం ఆడుతుందా? అతనే 'చరవాణి' అనలేక మొబైల్ అంటుంటే ఇంగ్లిషు చదువుకున్న కుర్రవాడు 'చరవాణి' అనలేడు. చివరకు మన ప్రయత్నమంతా 'మొబైలుకు తెలుగుపదం లేదా?' అని అడిగేవాళ్లకు 'ఉందిగా' అని చెప్పడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఇలాంటి పదాల వాడుకతో మరొక కొత్త గ్రాంథిక భాష తయారవుతుందంతే.

అయితే, అన్ని పదాలకూ తెలుగు ఆకృతులిచ్చి వాడటం కుదరదు. అది కోరదగ్గది కాదు కూడా. ఇందుకు 'ఫ్లై ఓవర్' ఒక ఉదాహరణ అనుకుందాం. "ఈటీవీ2"లో ఫ్లైఓవర్ అనడానికి "పై వంతెన" అని వాడుతున్నారు. ఎంత కమ్మగా ఉంది! ఇంకా తేలికగా "పైదారి" అనవచ్చు. ("అరే! రారా, పైదారెంబడి పోదాం!") అయితే, తెలుగు పదాలతో కలిసిపోయిన పదాలకు (రయ్యిమను రయిలు, బలే ఎర్రబస్సు) కొత్తపదం వెతకక్కర్లేదు.

ఆంగ్ల పదాలకు తెలుగు సమానార్థక పదసృష్టిపై మీ సూచనలకు ఆహ్వానం. సూటిగా, క్లుప్తంగా, ఆలోచింపజేసేలా, మార్గదర్శకంగా నిలిచేలా ఉండే వాటిని ఎంపిక చేసి ప్రచురిస్తాం.

అవసరమై పుట్టించే పదం చిన్నదిగా, లలితంగా ఉండాలి. ఒక వస్తువు లేదా విషయాన్ని తెలిపే పదంలో ఆ వస్తువు ఏమేం చేయగలదో/ ఆ విషయం ఏంటో మొత్తం పొంగి పొర్లాల్సిన అవసరం లేదు. పదాన్ని పుట్టించేవారు ఈ విషయాన్ని గట్టిగా నమ్మాలి. 'ఫ్లాపీ' అనే ఇంగ్లిషు పదం అది చేసే పనిని పిసరంత కూడా తెలియజేయదు కదా! అలాగే, తెలుగులో కంప్యూటర్ డిస్కులను చక్రాలంటే సరిపోతుంది. 'బ్లూరే డిస్క్'లను 'నీలాలచక్రం' అనవచ్చు కాలక్రమంలో అది 'నీలం'గా స్థి(తి)రపడవచ్చు.

ఒక పదం పుట్టించేప్పుడు అది మిగతా పదాలతో వినికిడిపరంగా తెలుగులో ఇమడటమేగాక, ఆ పదానికి ముందు వెనుకల విశేషణాలతో ఒద్దికను కూడా పట్టి చూడాలి. తెలుగు పదాల నడుమ 'కంప్యూటరు' లాంటి పదం పడుగు పేకలాగ కలవదు. అంతేగాక, ఇది నాలుగచ్చరాల పెద్దపదం. దీని తెలుగు వికృతి మరింత పెద్దది కావచ్చు. వికారంగానూ ఉండవచ్చు. (కంపేతరు?). కనుక, దీనికి చిన్న అచ్చ తెలుగుపదం వెదకాలి. లెక్కించే దాన్ని ఏమంటాం? లెక్కించునది అనే. నిజమే.

- **Bifurcation :** the division of something into two branches or parts:.., [count noun] either of two branches into which something divides.రెండుగా విభజించడం, సమద్వి ఖండనం
- **Blank Cheque:** a signed cheque with the amount left for the payee to fill in…, an unlimited freedom of action: ద్రవ్యానుమతి పత్రం, వివరాలు రాయకుండా సంతకం చేసి ఇచ్చే చెక్కు
- **Boat house:** a shed at the edge of a river or lake used for housing boats. పడవ యిల్లు/ నౌకా గృహం
- **Body Builder** :a person who strengthens and enlarges the muscles of their body through strenuous exercise… కండలయోధుడు
- **Body Language** :the conscious and unconscious movements and postures by which attitudes and feelings are communicated: ఒంటి కదలికలు, శారీరక భాష
- **Break:** :…separate into pieces as a result of a blow, shock, or strain…,విరామం, భంగం, ఆపుదల, అంతరాయం, పగులు, విరుపు, తేగటం, భంగం చేయు
- **Breed :** [with object] rear and train (someone) to behave in a particular way:.., [with object] develop (a variety of animal or plant) for a particular purpose or quality:.., [with object] cause (an animal) to produce offspring, especially in a controlled and organized way: తెగ, జాతి, వంశం, పుట్టించు, పెంచు
- **Cardio Vascular :** relating to the heart and blood vessels. హృదయనాళిక, గుండె రక్తనాళాలకు సంబంధించిన, హృదయ నాళికామయ
- **Carriage:** a means of conveyance, in particular:, [mass noun] British the conveying of goods or passengers from one place to another వాహనం, బండి
- **Casting Vote :** an extra vote given by a chairperson to decide an issue when the votes on each side are equal. నిర్ణాయక ఓటు
- **Cellar:** a room below ground level in a house, often used for storing wine or coal:.., a stock of wine: నేలమాళిగ, పాతర, నేలకొట్టు
- **censor:** (N.) an official who examines books, films, news, etc. that are about to be published and suppresses any parts that are considered obscene, politically unacceptable, or a threat to security:.., (in ancient Rome) either of two magistrates who held censuses and supervised public morals. కట్టడి, కట్టుబాటు, నియమ పర్యవేక్షణ, దోష నిర్ణేత, రచనలు మొదలగువాటి పరిశీలన
- **Chronic :** (of an illness) persisting for a long time or constantly recurring:.., (of a person) having a chronic illness:.., (of a problem) long-lasting:.., (of a person) having a bad habit:.., British informal of a very poor

అయితే, టక్కు అంటే మోసం. టక్కు చేసేవాడు టక్కరి. మరి లెక్క చేయుదానికి 'లెక్కరి' అనే రూపం సాధ్యమా? కాకపోవచ్చు గానీ, అసలు తెలుగులో అటువంటి విధానమే లేదంటే కష్టమే! లెక్కించునది 'లెక్కి' అవగలిగితే బాగుంటుంది. అప్పుడు 'పామ్‌టాప్ పీసీ'ని 'చేతిలెక్కి' అనగలం. టాబ్లెట్ పీసీని 'పలకలెక్కి' అనవచ్చు. లేదా దీన్నే తిరగేసి మరింత తెలుగుగా 'లెక్కిపలక' అనొచ్చు. ఇంగ్లిషు సమాన మాట పిసినితనంతో 'టాబ్లెట్'ని 'పలక' అనొచ్చు (టాబ్లెట్ అంటే శిలాఫలకం; అదే, రాతి పలక) ఇదంతా వెర్రి లాగా తోచవచ్చు. కానీ కంప్యూటరును 'విగణకం' లేదా 'సంగణకం' అంటే పలకబుద్ధి కాదు. ఒకవేళ సంగణకమని అందాంలే అనుకుంటే కూడా, రకరకాల సంగణకాలకు మరింత పొడవైన సంస్కృత పదబంధాలని కనుక్కోవాలి.

పది మందిని ఏర్చి కూర్చి ఒక ప్రయోగం చేయండి. అయిదుగురిని రోజుకు పదిసార్లు కంప్యూటర్‌ని సంగణకం అని పిలుచుకోమనండి. మరో అయిదుగురిని లెక్కి అనమనండి. పది రోజుల్లోగా ముందుగా ఏ గుంపులో వారికి కలలో కంప్యూటరుకు బదులు ఏ పదం మెదులుతుందో గమనించండి. పోనీ, 'కంప్యూటరు' అనే అంటామా అంటే అది మన మాట పాటల్లో, పద్యాల్లో ఇట్టే కలిసిపోదు. 'లెక్కి' అనేందుకు ఒప్పుకోదగని సకారణాలు ఏవైనా ఉంటే, 'లెక్క' అనేది వస్తు విశేషాన్ని తెలిపే నామవాచకంగా భావించి, కంప్యూటరును 'లెక్క' అనే చెప్పొచ్చు. అప్పుడు చేతిలెక్క, బల్లలెక్క, బారులెక్క... ఇవన్నీ రూపొందుతాయి.

కొత్త పదాలను దింపుకున్నప్పుడు దానితోటి మాటల కూర్పు కూడా సరళంగా ఉండాలి. రెక్కీ కొత్తగా తెలుగులోకి దిగుతున్న పదం. 'తెలుగు అకాడమీ' వారిలాగ చివరి దీర్ఘం తీసేసి రెక్కి అంటే తెలుగ్గా, తేలిగ్గా ఉంటుంది. పదాన్ని వాడేటప్పుడు 'రెక్కీని నిర్వహించాడు' అని కొందరు రాస్తున్నారు. 'రెక్కీ చేశాడు' అంటే సరిపోలేదా? కాలక్రమంలో ఇది 'రెక్కించడ'మైతే ఎంత బాగుంటుంది!

సరళత్వం, పూర్వ, పర విశేషణాలతో కలివిడితనం, పొట్టితనం, ముఖ్యంగా తెలుగుదనం - ఇవి కావాలి పదసృష్టికి గీటురాళ్లు. పత్రికల వాళ్లు, పండితులు 'సంక్లిష్టం'గా కాకుండా సామాన్యంగా, జంకు లేకుండా, ముఖ్యంగా యువత అవసరాలపరంగా ఆలోచిస్తేనే తెలుగును బలంగా ముందుకు తీసుకెళ్లగలం. ఇప్పుడు మాండలికాల్లో మంచి సాహిత్యం వస్తోంది. అయితే మాండలికాల మణిప్రవాళాలు రావట్లేదు. ఇలాంటి చేతని (ప్రక్రియని) పత్రికలు ఆదరిస్తే తెలుగు వాడుక పదాల లిబ్బి పెరుగుతుంది. తెలుగునాట కూరిమి కూడా పెరుగుతుంది. 'తెలుగు' ఊహకు బలమే తెలుగు తల్లికి జయం!

భట్టారం రవీంద్రబాబు
గూడూరు, నెల్లూరు
99481 99416

quality: మళ్ళీ మళ్ళీ సంభవించే, ఎడతెగని, దీర్ఘకాలిక

- **Chronological :** (of a record of events) following the order in which they occurred:.., calculated in terms of the passage of time:.., relating to the establishment of dates of past events: కాలానుగత, కాలక్రమానుసారం (చారిత్రక)
- **Cloning :** informal (within gay culture) a homosexual man who adopts an exaggeratedly macho appearance and style of dress. .., an organism or cell, or group of organisms or cells, produced asexually from one ancestor or stock , to which they are genetically identical: రూపాంకురకల్పన
- **Commutation :** the action or process of commuting a judicial sentence:.., the conversion of a legal obligation or entitlement into another form , e.g. the replacement of an annuity or series of payments by a single payment:.., the process of commutating an electric current. ప్రసారం, మార్పిడి, శిక్ష తగ్గించడం
- **Compilation:** a thing , especially a book, record, or broadcast programme, that is put together by assembling previously separate items:., [mass noun] the action or process of producing something, especially a list or book, by assembling information collected from other sources: కూర్పు
- **Confession:** …a formal statement admitting that one is guilty of a crime…., ఒప్పుకోలు, అపరాధాంగీకారం
- **Conflict :** a serious disagreement or argument, typically a protracted one:.., a prolonged armed struggle:.., [mass noun] a state of mind in which a person experiences a clash of opposing feelings or needs:.., a serious incompatibility between two or more opinions, principles, or interests: వైరుధ్యం / పొసగనితనం, సంఘర్షణ, విరోధం, విప్రతిపత్తి, విభేదం, పోరాటం
- **Consolation:** (N.) the comfort received by a person after a loss or disappointment.., [count noun] a person or thing providing consolation: ఓదార్పు, ఊరడింపు
- **Contemporary :** living or occurring at the same time:.., dating from the same time:.., belonging to or occurring in the present:.., following modern ideas in style or design: సమకాలిక, సమకాలీన
- **Dealership :** a person who buys and sells goods:.., a person who buys and sells shares, securities, or other financial assets as a principal (rather than as a broker or agent):.., nformal a person who buys and sells drugs: వస్తు విక్రయాధికారం
- **Engine :** (N.) a machine with moving parts that converts power into motion:.., a thing that is the agent or instrument of a particular process: యంత్రం, సాధనం

అన్నీ నీవే...



నా ప్రతి పా(ప)దం మత్తకోకిలే
నీ సౌందర్యాతిశయాలను శ్రావ్యంగా
కీర్తించేవే...
నా ప్రతి పాదం శార్దూలమే...
ప్రతి పదంలో కనిపిస్తూ చూపుల్తో
నను వేటాడేస్తూ...
నా ప్రతి పాదం చాటువే...
నీ మీదున్న ప్రేమను లోకానికి చాటుతూ...
నా ప్రతి కవనం మత్తేభమే...
పదాలలో నీ మందగమనం చూపుతూ...
నా ప్రతి పాదం నీ అందాల'కందమే' (అందాలకు అందమే)
నా డెందములో ఆనందాన్ని నింపుతూ.
నే రాసే ప్రతీ పాదం తేటగీతే!..
నీ సౌందర్యాన్ని ఆలపించే భావగీతికలా.

- ఆర్‌వీఎస్‌ఎస్ శ్రీనివాస్, భోపాల్ (మధ్యప్రదేశ్)

మాటకట్టు–4 సమాధానం

1 ప	ల	2 క		3 క			4 ఉ	డు	5 త
డ		6 ల	క	ల	7 క		ల		డ
వ		ప		8 త	త		9 వ	10 లు	వ
	11 ఆ		12 త			13 వ			
14 అ	వ	త	ల		15 మ	డ	16 త		17 జ
18 ర	డ		19 న	ట	న		20 బ	ర	మ
		21 స				22 వ	ల		
23 అ	ర	వ		24 డ	గ	ర			25 జ
ర				వ		ద			ల
26 క	డ	వ		27 ద	డ		28 వ	న	జ

ఆంగ్లానికి చీకటిరోజులు

ఆంగ్లం ధాటికి తెలుగు తల్లడిల్లిపోతోందని బెంగపడుతున్నాం కదా. మనమే కాదు ప్రపంచంలోని చాలా భాషలది ఇదే పరిస్థితి. ప్రపంచ భాషగా ఆంగ్లం చేస్తున్న దాడికి అవన్నీ కుదేలవుతున్నాయి. అయితే, ప్రస్తుతం ఇంతటి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న ఆంగ్లం... మరో భాష దెబ్బకు 150 ఏళ్లకు పైగా తన సొంతగడ్డ నుంచే మాయమైంది! ఇది నిజం. క్రీ.శ.1066లో ఇంగ్లాండ్‌పై నార్మన్లు దాడి చేశారు. బ్రిటీష్ రాజును ఓడించి దేశాన్ని హస్తగతం చేసుకున్నారు. ఈ నార్మన్ల మాతృభాష ఫ్రెంచి. తమ ఆధీనంలోకి వచ్చిన ఇంగ్లాండ్‌లో ఫ్రెంచిని అధికార భాషగా అమలు చేయడం ప్రారంభించారు. ఎంతగా అంటే ఆ కాలంలో చర్చి దస్త్రాల నుంచి రచయితల సృజనల వరకూ అన్నీ ఫ్రెంచిలోనే ఉండేవి. క్రీ.శ.1250 వచ్చే వరకూ ఆంగ్ల రాతలు ఎక్కడా కనపడలేదు. తర్వాత అధికార స్థానాల్లో మార్పులు జరగడంతో ఆంగ్లం బతికి బట్టకట్టింది.

అష్టనాగబంధం సమాధానం

ఆ॥ వె॥ జయకర, హరి, శార్ఙ్గి, శౌరి, చక్రీ, గిరి
ధారి, వారిజాక్ష, దైత్యవైరి
భయ విదూర, నిత్య పాయ, హరావర
దక్ష, నీరదాభ, రక్ష నీవె...

FORM IV (See Rule 8)

statement about ownership and other particulars of TELUGUVELUGU

1. Place of Publication	:	Ramoji Film City Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh - 501512
2. Periodicity of its Publication	:	Monthly
3. Printer's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
foreigner, state the country of origin		–
Address	:	Ramoji Film City Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh - 501512
4. Publisher's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin		–
Address	:	Ramoji Film City Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh - 501512
5. Editor's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin		–
Address	:	Ramoji Film City Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh - 501512
6. Name and address of individuals Who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	:	**RAMOJI RAO** Ramoji Foundation Ramoji Film City Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh - 501512

I, RAMOJI RAO, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

for **RAMOJI FOUNDATION**
Sd/-RAMOJI RAO
Publisher

15th March 2013

www.kalanjali.com

RAMOJI
GROUP

ఫర్నీచర్‌కి సెలవు...
మీ గృహం కళాకృతుల కొలువు...

అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి అపురూపమైన తార్కాణాలు - కళాంజలిలో కొలువు దీరిన ఈ కళాకృతుల సముదాయాలు! చందనం, పాలరాయి, రంగురాళ్ళు, కంచు, ఇంకా వెండితో రూపొందిన కళాత్మక వస్తు శ్రేణి కేవలం కళాంజలిలో మాత్రమే మీకు లభిస్తుంది. కళాంజలి- భారతీయ సంప్రదాయాలకు సంకేతం... కళాత్మక నైపుణ్యానికి నిలువెత్తు సంతకం...

R K SWAMY BBDO 0628

365 రోజులూ తెరిచే ఉంటుంది

*షరతులు వర్తిస్తాయి

- కొయ్య వగిషీలు
- రాతి వగిషీలు
- పాలరాతి కళాకృతులు
- చందన కళాకృతులు
- వర్ణచిత్రాలు
- నగలు
- తోలు వస్తువులు
- ఆట బొమ్మలు
- డైనింగ్ టేబుళ్ళు
- ఊయలలు
- మందిరాలు
- దివాన్లు... ఇంకా ఎన్నో... ఎన్నెన్నో...

KALANJALI®
Arts ✤ Crafts
India you'll treasure!!

- 25 కి.మీ. వరకు ఉచిత డెలివరీ*
- రోజ్‌వుడ్ డైనింగ్ టేబుల్స్‌కు 1 ఉచిత సర్వీస్*
- మీ ఫర్నిచర్‌ను డిజైన్ చేసుకోండి... అదనపు డిస్కౌంట్ పొందండి*
- ఫర్నిచర్ శ్రేణి ₹30,000 నుంచి ఆరంభం*

- హైదరాబాదు: సైఫాబాద్: డోర్ నం.5-10-194/195, హిల్ ఫోర్ట్ రోడ్, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, ఫోన్: 040 23231147 / 23423440,
కూకట్‌పల్లి: నం.487 & 488, హెచ్.ఐ.జి., జె.ఎన్.టి.యు. రోడ్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్, ఫోన్: 040 23056813 / 14
- విజయవాడ: డోర్ నం.39-3-51, ఎమ్.జి. రోడ్, లబ్బీపేట్, ఫోన్: 0866 2496464


3 టన్నుకన్న ఎక్కువ లాగె శక్తి కలదు
Link LOCKS
0 1 2 3
TONS
Link
Hi-Tech-67
12-PINS
Stainless Steel
మీరు మీ యొక్క లక్షల విలువైన వస్తువులు
ఎవరి బాధ్యత పై వదలి వెళ్ళతారు
HARDENED
Double Locking
Link
Hi-Tech-67
12-PINS
Stainless Steel
Link
E-mail: sales@linklocks.com
For Business Query in Greater Hyderabad :- 040-2474 5536, 098481 28650
VICHAR